తేనెపలుకుల అన్నమయ్య



డా॥ దేవగుప్తాపు సూర్యగణపతిరావు

తేనెపలుకుల అన్నమయ్య

డా. దేవగుప్తాపు సూర్యగణపతిరావు

తేనెపలుకుల అన్నమయ్య

వ్యాఖ్యానం : డా.డి.యస్. గణపతి రావు

First Edition : November 2019

Dr. D.S. Ganapati Rao
Flat No. 202, Vietla Vantage
Pedawaltair Junction,
Vijaya Nagar Palace Layout
VISAKHAPATNAM - AP - 530 017
Cell : 98491 29917
e-mail : drdsganapatirao@gmail.com

E-book is prepared by
K. Prakash,
Cell : 9652275487
e-mail : kpkonathalaprakash@gmail.com

వెల : అమూల్యము

డా॥ దేవగుప్తాపు సూర్య గణపతిరావు



అంతరంగం

శ్రీ అలమేల్మంగా సహిత వేంకటేశ్వరునికి ప్రణతులు.

ఆలోచనామృతమైన సాహిత్యం గానీ, ఆపాత మధురమైన సంగీతం గానీ – దేనికదే రసానందం కలిగించడానికి సమర్థమైనవి. మరి ఈరెండూ సమపాళ్ళలో మేళవిస్తే రసానందం ద్విగుణీకృతం అవుతుందనడంలో సందేహమేమున్నది?

ఇలా సంగీతసాహిత్యాలను రంగరించి వేనవేల కీర్తనలు చేసి వేంకటేశ్వరునికీ అలమేలుమంగమ్మకూ సమర్పించి అజరామరుడైనాడు అన్నమయ్య. ఆ కీర్తనలు తేనెపెరలలాంటి తీపి పదాలతో, పాలమీగడలాంటి మృదుమధురమైన భావాలతో, కస్తూరి తట్టుపునుగు వంటి సురభిళ సౌరభాలతో భగవత్ప్రసాదముగా మన తెలుగువారికి అందించాడు అన్నమాచార్యుడు.

నేను సగటు తెలుగువాణ్ణి. నాకూ మామిడిపళ్ళన్నా, పనసతొనలన్నా, ఆవకాయన్నా, గడ్డ పెరుగన్నా, పూతరేకులన్నా, పెద్దన పద్యమన్నా, అన్నమాచార్య కీర్తనలన్నా యిష్టం.

ఇవి ఎన్నిసార్లు విన్నా తనివితీరేది కాదు. కానీ విన్నపుడు ఈ కీర్తనలలోని పదాలకు చాలాచోట్ల అర్థాలు తెలిసేవి కావు. అరే అర్థం తెలిస్తే ఇంకా బాగుండేదే అనుకునేవాణ్ణి. ఈ కీర్తనలలోని పదాలు నిఘంటువులలో దొరికేవి కావు.

గత రెండు మూడు దశాబ్దాలుగా వీటికి అర్థాలెవరైనా చెబుతారేమో, వ్యాఖ్యానాలు చేస్తారేమో అని ఎదురుచూపులతోనే గడిపాను. అప్పుడపుడు ఒక్కొక్క కీర్తనకు ఎవరో వ్రాసిన అర్థాలు నెట్ లో కనబడేవి కానీ అవి సమగ్రంగానూ,

సంతృప్తికరంగానూ ఉండేవికావు. అన్నమయ్య మాండలిక పదకోశం (శ్రీ రవ్వా శ్రీహరి గారి సంకలనం) వెలువడిన తరువాత కొన్ని పదాలకు అర్థాలు తెలిసే సౌలభ్యం కలిగింది. ఇంకా కొన్ని పదాలు పరిష్కారానికి నోచుకోనేలేదు.

ఇక ఇంతకు ముందు అక్కడక్కడ దొరికే తాత్పర్యాలు, టీకలూ కీర్తనలలోని central idea ను ప్రతిపాదించేవే కాని క్లిష్ట పదాలూ వాటి అన్వయాలూ దాటవేసేవి. వెనకటికి విశ్వనాథ వారన్నట్టు పాఠకునికి ఎక్కడ అనుమానమో వ్యాఖ్యాతకూ అక్కడే అనుమానము అన్న రీతిలోనే సాగేవి.

ఎన్నాళ్ళ నుంచో అన్నమాచార్య కీర్తనలకు సులభంగా అర్థమయ్యే రీతిలో వ్యాఖ్యలు వ్రాయాలనుకుంటూ ఉండేవాడిని. వింటున్నపుడు కొన్ని విచిత్రార్థాలు స్ఫురించేవి. కానీ సమగ్రంగా కీర్తనను వివరించడానికి మాత్రం అది సరిపోదనిపించేది. ఈ లోగా మా పెద్దన్న గారి కుమారుడు చి. సునీల్ అన్నమాచార్య కీర్తనలకు వివరణలు వ్రాయమని అడుగుతూ ఉండేవాడు. 'అలాగే' అనడమే కానీ విషయం దాటవేస్తూ వచ్చాను. చివరికి సరే ప్రయతిద్దామనిపించింది. దిగితేనే కాని లోతు తెలియలేదు.

ఈ వ్యాఖ్యలు రాసే విషయంలో నేను కొన్ని నియమాలు పెట్టుకున్నాను. అవి

1. కీర్తనలకు వివరణ సమగ్రంగా ఉండాలి. అన్ని పదాలకూ అర్థ సమన్వయం చేయాలి.

2. పదాలకు అర్థాలు చెప్పేటపుడు తెలియని పదాలను దాటవేయ కూడదు. తెలిసిన చోట్ల చెబుతూనే తెలియనివి తెలియలేదని నిజాయితీగా చెప్పాలి.

3. వేరే వారు అప్పటికే చేసిన వ్యాఖ్యలోని మంచిచెడ్డల జోలికి పోకూడదు. ఎవరిపైనా విమర్శలు చేయకూడదు.

4. రకరకాల అన్వయాలకు వీలున్నపుడు - అలా అన్వయించడానికి

వీలున్నదనీ, నేను చెప్పినదే నిశ్చయింపదగిన అర్థము కాదనీ వివరించి చెప్పాలి.

5. మాండలిక పదాలకు అర్థాలు చెప్పేముందు ఒకటికి రెండుసార్లు నిర్ధారణ చేసుకుని మాత్రమే వ్రాయాలి.

6. కొరుకుడు పడని పాదముల/పదముల భావాలు తోచిన విధంగా చెప్పి ఆయా తావులలో ఇంకా పెద్దల పరిష్కారం అవసరము తెలియ జేయాలి.

పదాలకు అర్థాలు తెలియక పోతే ఎలాగో కష్టపడి నిఘంటువులలో వెతుక్కోవచ్చు. ఒక్కొక్కసారి పదబంధాలకు అర్థాలు తెలిసేవి కావు. ఉదాహరణకు "గాలినే పోయా కలకాలము" అనే కీర్తనలో గాలినే పోయా అనేదానికి అర్థం ఏమిటో చాలారోజులు ఆలోచించాను. గాలి/నే/పోయా అనే మూడు పదాలూ తెలిసినవే. కానీ ఆ పదబంధానికి అర్థమేమిటి? గాలిని అసలు పోయడమేమిటి? నిఘంటువులు కేవలం పదాలకే అర్థాలిస్తాయి. సమాసాలకూ, సంధిరూపాలకూ అర్థాలు ఇయ్యవు. అందుచేత నిఘంటువులలో దానికోసం చూడలేదు. కానీ దేనికోసమో వెదుకుతూంటే రవ్వా వారి పదకోశంలో 'గాలినే పోవు = వ్యర్థముగా తిరుగు అని వ్రాశారు. మామూలు భాషలో వాడు గాలికి తిరుగుతున్నాడంటామే - అదన్నమాట. ఇలా చాలా సార్లు ఇబ్బందిపడ్డ విషయాలు వాటంతటవే యాదృచ్ఛికంగా ఇతర విషయాన్వేషణలో విడిపోయేవి.

ముఖ్యంగా అన్నమాచార్యుని వైరాగ్య కీర్తనలు వివరించేటపుడు వైష్ణవ సంప్రదాయాలు, విశిష్టాద్వైత సంప్రదాయాలూ తెలిసి ఉండడం అవసరం. ఇవి పుస్తకాల్లో ఒక చోట దొరకవు. పెద్దల ద్వారా తెలుసుకోవాలి. ఈ విషయంలో నాకు పెద్ద అవగాహన లేదు. అందుచేత వాటిని నేను సమగ్రంగా వివరించలేక పోయాను. వీటికి నా శక్తి మేరకు వివరించడానికి ప్రయత్నించేను. అయితే నాకు తృప్తి కలుగలేదు. కావున వీటిని చదివేటపుడు పాఠకులు మరిన్ని

విషయాలు వారికి తెలిసిన పెద్దల ద్వారా గ్రహించవలసినదని విన్నపము.

ఇంకొక విషయం చెప్పాలి. నాకు సంగీతంలో ప్రాథమిక ప్రవేశం కూడా లేదు. అందుచేత అన్నమాచార్య కీర్తనలలోని సంగీత పార్శ్వాన్ని స్పృశించలేను. కేవలం సాహిత్య విషయాలు మాత్రమే విశదపరచగలను.

ఈ విషయాలు చదవడం వల్ల సాహిత్యాభిలాషులకు ఆనందం కలుగవచ్చు. మరి సంగీతజ్ఞులకేమి లాభం అంటారేమో? కీర్తనలోని భావరమ్యత పద ప్రాముఖ్యం తెలుసుకుంటే కేవలం సంగీతాభిలాషతో పాడే వారికి ఆ భావమును పలికించే విధంగా పాడడానికి వీలవుతుంది. తద్వారా వారి సంగీతాభివ్యక్తి మెరుగౌతుంది.

నేనివి వ్రాయడం మొదలుపెట్టి ఫేస్‌బుక్ లో ఆడియో లింకుతో సహా ప్రకటించేవాడిని. కొంత మంది శ్రేయోభిలాషులతో వాట్సాపులో పంచుకునే వాడిని. అవి చూచి స్నేహితులు కొంతమంది కొన్ని అప్పటికే కొంతమంది ప్రముఖులు చేసిన వ్యాఖ్యలు నాకు వాట్సాపులో పంపుతూ ఉండేవారు. వాటిలో శ్రీ అమరవాది సుబ్రహ్మణ్యదీక్షితులు గారు, శ్రీ తాడేపల్లి పతంజలి గారు వ్రాసినవి ఎక్కుగా వచ్చేవి. కొన్ని ఎవరు చేసిన వ్యాఖ్యలో తెలియకుండా ఉండేవి. కానీ అవి చదివే వాడిని కాదు. ఎందుకంటే అవి చదివితే bias అయిపోతానేమోనని భయం. వాటి ఛాయలలోనికి పోయి వ్యాఖ్యలో ఒరిజినాలిటీ పోతుందని అవి చదవకుండానే వ్రాసేను.

దాదాపు గత కొన్ని దశకాల నుండి అన్నమాచార్య కీర్తనలు విరివిగా ప్రచారం చేయబడుచున్నవి. కచేరీలలో సభలలో ఆలపించబడుచున్నవి. ఇంకా కొత్త కీర్తనలను స్వరపరచడం, ఆలపించడం లోనే శక్తియుక్తులు వెచ్చింప బడుచున్నవి. మరియొక పక్క కీర్తనల భావములు సరళమైన తెలుగులో తెలియజేయడానికి తగ్గ కృషి జరగలేదనే అనిపిస్తున్నది. ఔత్సాహికులు పూనుకొని ఈ కీర్తనలకు అర్థములు, వివరణలు వ్రాయించడం, వ్రాయడం భవిష్యత్తులో విరివిగా జరుగ గలవని ఆకాంక్షిస్తున్నాను.

నా మటుకు నాకు అన్నమాచార్య సాహిత్యాధ్యయనంలో ఇంకా నేను తొలిమెట్టైనా ఎక్కలేదనే అనిపిస్తున్నది. అప్పటికప్పుడు పదాలకు అర్థాలు నిఘంటువులు చూసి వ్రాసినానే కానీ - ఎవరైనా నేను అర్థంచెప్పిన కీర్తన గురించి అడిగితే మరలా చదివి చెప్పాల్సిందే. ఆ పదాలు వాడుకలో లేకపోవడం వల్ల ఆ పదములను జ్ఞప్తిలో ఉంచుకోవడం కష్టం. ఈ ప్రయత్నం వల్ల అన్నమాచార్య కీర్తనలపై నాకు ప్రాథమికమైన అవగాహన మాత్రము కలిగినది.

ఈ పుస్తకాన్ని శ్రీ అలమేల్మంగా సహిత వేంకటేశ్వరుల పదపద్మముల కడ నివేదించి చదువరుకు తత్ప్రసాదముగా అందిస్తున్నాను. చదివి ఆస్వాదించి ఆనందింతురుగాక.

విశాఖపట్టణం భవదీయుడు

6-11-2019 **డా॥ దేవగుప్తాపు సూర్య గణపతిరావు**

విషయసూచిక

1. అనరాదు వినరాదు అతనిమాయలు నేడు

అనరాదు వినరాదు అతనిమాయలు నేడు
దినదిన క్రొత్తలాయె ద్రిష్టమిదే మాకు

ఆడెడి బాలుర హరి అంగిలి చూపుమని
తోడనే వారినోండ్ల దుమ్ములు చల్లి
ఈడమాతో జెప్పగాను ఇందరమూ గూడి పోయి
చూడబోతే పంచదారై చోద్యమాయెనమ్మా ॥అనరాదు॥

తీటతీగెలుసొమ్మంటా దేహము నిండాగట్టి
తీటకు బాలురు తెగి వాపోగా
పాటించి ఈసుద్దివిని పారితెంచి చూచితేను
కోటి కోటి సొమ్ములాయ కొత్తలోయమ్మా ॥అనరాదు॥

కాకిజున్ను జున్నులంటా గంపెడేసి తినిపించి
వాకొలిపి బాలులెల్ల వాపోవగ
ఆకడ శ్రీవేంకటేశుడా బాలల కంటినీరు
జోకగ ముత్యాలు పేవె జూడగానే మేము ॥అనరాదు॥

ఈ కీర్తనలో బాలకృష్ణుని అల్లరి వర్ణిస్తున్నాడు.

అనరాదు వినరాదు అతని మాయలు....... ఇదీ ఎత్తుగడ. కలవారి బిడ్డడి అల్లరాయె. గట్టిగా అనలేరు. చెవులు కొరుక్కోకుండా ఉండలేరు. ఇలాంటి విషయాలు చెప్పవలసి వచ్చినప్పుడు మనం సాధారణంగా 'అనకూడదు గానీ వాడి ఆల్లరి రోజుకొక కొత్తరకంగా కనిపిస్తోందనుకో' అనడం పరిపాటి. అదీ ఈ ఎత్తుగడ. "అనరాదు వినరాదు వానిమాయలు దినదిన క్రొత్తలాయె దృష్టమాయె మాకు" (దృష్టము = కనబడు, చూడబడు). అనకూడదంటూనే అన్నీ చెప్పుకోవడం తెలుగు వారి అలవాటు!

1. ఆడుకునే తోటి పిల్లలను నోరు చూపించ మనడం (అంగిలి = నోటి లోపలి భాగం). వాళ్ళు నోరు తెరవగానే నోట్లో దుమ్ము కొట్టడం. వాళ్ళు పోయి పెద్దలకు చెప్పడం. వాళ్ళందరూ కూడి వచ్చి చూస్తే పిల్లల నోళ్ళలో మట్టి కాదు. పంచదారకనబడినది. ఏమి చోద్యం.

2. దూలగుండాకు తీగలు (తీట తీగలు) ఆభరణాలురా (సొమ్మంటా) అని పిల్లల శరీరాలకు చుట్టడం. దానితో దురదవేసి పిల్లలు ఏడవడం (వాపోవు = బాధతో ఏడ్చు). ఈవార్త (సుద్దు) విని పెద్దలు పరిగెత్తిరావడం. ఆ తీగలు వాళ్ళకు కొత్తకొత్త ఆభరణాలలాగా కనిపించినవి. ఏంచెప్పాలి?

3. ఒరేయ్ జున్ను తీసుకోండిరా అని కాకిజున్న గంపెడేసి (గంప = బుట్ట) తినిపించడం. పిల్లలు కూడబలుక్కొని (వాకొలిపి) అది జున్నుకాదని ఏవగించుకుని ఏడవడం. అది విని పెద్దలు వెడితే ఆ బాలకృష్ణుని లీల వల్ల – వారు చూచేటప్పడికి పిల్లల కన్నీళ్ళు ముత్యాలై కనిపించేవి. ఇదీ వరస.

కాకి జున్ను అంటే బూజు పట్టిన పొదల ఆకులపై మంచుపడి తయారైన తెల్లని పదార్థమట (అన్నమయ్య మాండలిక పదకోశం – రవ్వా వారు)

2. అన్ని సింగారాలు నీకె అమరె గాక

అన్ని సింగారాలు నీకే అమరె గాక
అన్నిట దేవతలు నిన్నిందుకే మెచ్చేరు

చంద్రుని వంటి మోము జలజాలే కన్నులట
ఇందిర నీకే తగు నీ కొత్తలు
గొంది నొక్కటొకటికి గూడవందురిది నీకు
పొందై పాలవెల్లి తోబుట్లే కదా ॥అన్ని సింగారాలు॥

ముక్కు సంపెంగ వంటిది ముంగురులు తేంట్లట
ఇక్కువలు నీకేతగు నీ కొత్తలు
అక్కున వరలక్ష్మివి హరి వసంత మాధవు
డెక్కడ మీకిద్దరికీ యెనయికే కదా ॥అన్ని సింగారాలు॥

ధర నడుము సింహము తగు గజగమనాలు
తిరమై శ్రీవేంకటేశు దేవి నీకే పో
నరసింహుడై యుండి కరిగాచి నట్టివాని
సురతమందితివి గాన చుట్టములే కావా ॥అన్ని సింగారాలు॥

ఈ కీర్తనలో అలమేలుమంగ అందాన్ని వర్ణిస్తున్నాడు అన్నమయ్య. ప్రతిపాదంలోనూ ఆమె రూపంలోని రెండు విరుద్ధమైన అంశాలు చెబుతాడు. మరల అది ఎలా సమంజసమో చెప్పి సమర్థిస్తాడు.

అన్ని అందాలూ నీకే అమరినవి. అందుకే నిన్ను దేవతలు పొగుడుతారు. దేవతలు అందమైన వారు. వారి పొగడ్తలు అందుకునే లావణ్యం అమ్మవారిదనడం.

1. నీ ముఖము చంద్రుడట. పద్మాలు (జలజాలు) కన్నులట. సూక్ష్మంగా చూస్తే (కొంది = చిన్న చిన్న ముక్కలు చేయడం) వీటికి ఒకదాని కొకటి

కుదరదు అంటారు. కానీ ఓ ఇందిరా! ఇలాంటివి నీకే చెల్లును (నీకే తగునీ కొత్తలు). చంద్రుని రాకతో పద్మాలు ముడుచుకుపోతాయి. కలువలు విచ్చుకుంటాయి కదా. మరి నీ మోములో ఈ రెండూ ఎలా కలిసినవి?

అవును ఈ రెండూ (చంద్రుడూ, పద్మాలూ) పాలసముద్రంలో పుట్టినవి. అందుచేత నీకు తోబుట్టువులు. కనుక నీ మోములో అవి కలిసిమెలిసి ఉండడం సాధ్యపడింది. చక్కని సమర్థన.

2. నీ ముక్కు సంపెంగ యట. ముంగురులు తుమ్మెదలట (తేంట్లు = తుమ్మెదలు). ఇలాంటి కొత్త సామ్యాలు (ఇక్కువలు) నీకే తగును. తుమ్మెదలు సంపంగి పై వాలవు. మరి ముంగురులు (ముందునున్న తల వెంట్రుకలు) ముక్కు మీద పడుతూనే ఉంటాయి.

దీనికి సమర్థన చెబుతున్నాడు.

నీవు హరికి ఇల్లాలివి. (వర లక్ష్మివి) అందుచే ఆయన మాధవుడు (మా = లక్ష్మి. లక్ష్మి భర్త మాధవుడు) మాధవుడు అంటే మరియొక అర్థం వసంతుడు. మీ ఇరువురి కూడికయే (ఎనయుక) వసంతము అని తేలినది. వసంతంలో సంపెంగలూ తుమ్మెదలూ పక్కపక్కనే ఉండి తమతమ ఉనికి చాటుతాయి కదా. అలానే నీ మోములోనూనూ.

3. నీ నడుము సింహమునడుము. ఇచట ధర అను పదము ప్రాస కొరకే చేర్చబడినది. నీ నడకలకు కరినడకలు (గజగమనములు) తగును. సింహమునకూ ఏనుగుకూ గల వైరుధ్యము మనకు తెలిసినదే.

ఇలాంటి వైరుధ్యము శ్రీవేంకటేశ్వరుని దేవేరి వైన నీకే చెల్లును (నీకే పో). తాను నరసింహుడై (సింహము) యుండి కరిని (ఏనుగు) కాచిన వానితో నీవు క్రీడింతువు కనుక నీలో సింహము (నడుము), ఏనుగు (గజ గమనము) చుట్టరికము కలుపుకొన్నవి (చుట్టములే కావా).

చక్కని చమత్కారములు కల కీర్తన.

3. అప్పుడుండే కొండలోన

1. అప్పుడుండే కొండలోన
ఇప్పపూల ఏరబోతే
ఇప్పపూలు కప్పలాయెరా – ఓ వేంకటేశ
అప్పులుగల వాని వలనే – ఓ వేంకటేశ

2. ఆకశాన పోయ్యేకాకి
మూకజూచి కేకవేసే
మూక మూడు విధములాయెరా – ఓ వెంకటేశ
దీని భావము నీకే తెలుసురా – ఓ వెంకటేశ

3. అహోబిలయ్య గుంటలోన
వొల్వలు ఉదుకపోతే
వొల్వలెల్ల మల్లెలాయరా – ఓ వెంకటేశ
దీని భావము నీకే తెలుసురా – ఓ వెంకటేశ

4. అహోబిలాన చెట్టుబుట్టే
భూమి యెల్ల తీగపారే
కంచిలోన కాయకాచెరా – ఓ వేంకటేశా
శ్రీరంగాన పండుపండేరా – ఓ వెంకటేశా

5. పుట్టమీద చెట్టు బుట్టే
భూమియెల్ల తీగపారే
పర్వతాన పండు పండేరా – ఓ వేంకటేశా
అందవచ్చు కోయరాదురా – ఓ వేంకటేశా

6. చేయిలేనివాడు కోసే
నెత్తిలేనివాడు మేసే
కాళ్ళులేనివాడు నడచే – ఓవేంకటేశా
పెదవిలేని చిలుక తినేరా – ఓ వేంకటేశా

7. గుంటయెండి పండు పండే
పండుకోసి కుప్పవేసే
కుప్పకాలి యప్పు తీరెరా – ఓ వేంకటేశ
దీని భావమునీకే తెలుసురా – ఓ వేంకటేశా

8. సందెకాడ తలవ్రాలు
సంధిదీరి వేంకటరాయా
తెల్లవారనాయనీడరా – ఓ వేంకటేశ
దీనిభావము నీకే తెలుసురా – ఓ వేంకటేశ

9. ముత్యాల పందిటిలోన
ముగ్గురు వేంచేసిరాగ
ముక్కంటి దేవుని జూచేరు – ఓ వేంకటేశ
దీనిభావము నీకే తెలుసురా – ఓ వేంకటేశ

10. ఏటిలోన వలవేసే
తాటిమాను నీడలాయె
దూరపోతే చోటులేదురా – ఓ వేంకటేశ
దీనిభావము నీకే తెలుసురా – ఓ వేంకటేశ

11. ముందు కూతురాలు
ఆమె ఆలుకూతురాయె
పొందుగా పెండ్లాము తానాయె – ఓ వేంకటేశ
దీనిభావము నీకే తెలుసురా – ఓ వేంకటేశ

12. ఆకులేని అడవి లోన
మూడుతోకల పెద్దపులిని
మేక యొకటిఎత్తి మింగెరా – ఓ వేంకటేశ
దీనిభావము నీకే తెలుసురా – ఓ వేంకటేశ

13. పున్నమ వెన్నెలలోన
వన్నెలాడితోనుగూడి
కిన్నెర మీటుచు పొయ్యేవు – ఓ వేంకటేశ
దీనిభావము నీకే తెలుసురా – ఓ వేంకటేశ

14. అర్ధరాత్రి వేళలోని
రుద్రవీణనెత్తుకుని
నిద్రించిన నిన్ను పొగడ – ఓ వేంకటేశ
దీనిభావము నీకే తెలుసురా – ఓ వేంకటేశ

తాత్త్వికచింతన అధికమైన వారు తరచు తాత్త్విక పరిభాషలో మాట్లాడడం చూస్తూ ఉంటాం. ఆ పారిభాషిక పదజాలం చాలా జటిలంగా ఉంటుంది. చాలా సులువైన భాషలో పద్యాలు చెప్పిన వేమన్న కూడా తాత్త్విక పరిభాషలో ప్రహేళికల వంటి పద్యాలు వ్రాసేడు. ఈ అన్నమయ్య పదం కూడా అలాంటిదే. దీనిలో 14 చరణాలున్నాయి. అన్నీ పొడుపుకథల మాదిరి ఉన్నాయి. దీనికి ఎవరి ఊహ ననుసరించి వారు విడుపులు చెప్పవచ్చు. అయితే అన్నమయ్య అనుకున్న అర్థమేమిటో ఆయనకూ, ఆ పెరుమాళ్ళకూ మాత్రమే యెరుక. పైగా చాలా చరణాల్లో దీని భావము నీకే తెలుసురా అంటాడన్నమయ్య వేంకటేశ్వర స్వామిని ఉద్దేశించి.

నాకు తోచిన అన్వయాలు నేను చెబుతున్నాను. ఇవే స్వీకరింపదగినవి అని మాత్రం అనను. ఎవరు చెప్పినా అలా అనలేరు.

ఇక కీర్తన లోకి..........

1. **అప్పుడుండే కొండలోన ఇప్పపూల ఏరబోతే ఇప్పపూలు కప్పలాయెరా ఓ వేంకటేశ అప్పులుగల వాని వలనే ఓ వేంకటేశ**

అప్పుడు = దైవము వేంకటేశ్వరుడు.

అప్పుడుండే కోట ఈ దేహము. ఈ దేహమును నడిపేవి ఇంద్రియాలు. ఇవి మానవుని భ్రమింపజేస్తాయి. మనసును దైవచింతన నుండి ప్రక్కతోవలు పట్టిస్తాయి. ఇప్పపూలు దైవసంబంధమైన విభూతులకు ప్రతీకలు. వాటిని ఏరుకుందామంటే ఏరుకోనీయవు. కప్పలవలే చంచలత్వం కలిగిన భోగాలను చూపి ప్రలోభపెడతాయి.

ఇది అప్పుచేసి పప్పుకూడు తింటున్న వాని చలవే! వేంకటేశ్వరుడు వివాహార్థం చేసిన అప్పు తీర్చడం కోసం వడ్డీకాసులు వసూలు చేస్తున్నాడు కదా. ఆయనపై విసురు,

2. **ఆకశాన పోయ్యేకాకి మూకజూచి కేకవేశే మూక మూడు విధములాయెరా ఓ వెంకటేశ దీని భావము నీకే తెలుసురా ఓ వెంకటేశ**

ఆకాశ మార్గాన పోయేవారు సిద్ధులు. అలా మామూలు వారికి అంద నంత ఉన్నతమైన మార్గంలో వెళ్ళే సిద్ధపురుషుడు (కాకి) శంకరాచార్యుడు. ఆయన కా, కా అని కేకవేశాడు. శంకరుని కాకి అనడమేమిటి? ఆయన కా కా అని కేకవేయడమేమిటి? కొంచెం వివరిస్తాను. కాకికి ఆత్మఘోషము అనే పర్యాయపదం ఉంది . ఆయన ఆత్మ నిత్యము అని ఘోషణ చేసినాడు. కా అనేది నిశ్చయార్థకము. అదియెకా అంటే అదే అని నిశ్చయంగా చెప్పడం. ఆయన ఆత్మయే నిత్యమైనదని ఘోషణ చేసి 'అద్వైతము' బోధించినాడు.

ఎవరికి? క్రిందనున్న మూకకి. మూక అన్నపుడు శ్లేష. సమూహము అని ఒక అర్థం. మూగ అని ఒక అర్థం. ఆయన అవతరించేటప్పుడికి

సనాతన ధర్మం లుప్తమై పోయే స్థితిలో నిర్వీర్యమై జాతి మూగబోయింది. ఇట్టి "మూకకు" శంకరులు "ఆత్మఘోష" "నిశ్చయార్థమున" కా కా యని వినిపించిరి.

ఆ తరువాత మరలా ద్వైతము, అద్వైతము, విశిష్టాద్వైతము అని మూక మూడుగా విడిపోయింది.

3. **అహోబిలయ్య గుంటలోన వొల్వలు ఉదుకపోతే వొల్వలెల్ల మల్లెలాయే ఓ వెంకటేశ దీని భావము నీకే తెలుసురా ఓ వెంకటేశ**

ఆ కాలములోనే శంకరులు అద్వైతమనే జ్ఞాన మార్గం బోధిస్తూనే భక్తిమార్గమును నిరసించకుండా దానిని కూడా ప్రబోధిస్తూ వచ్చేరు.

అహోబిలములో భవనాశినీ నది (దీనినే గుంట అంటున్నాడిక్కడ) ఉన్నది. ఈ శరీరాలు బట్టల వంటివనీ, వీటిని జీవాత్మలు ధరించి మనుగడ సాగిస్తాయనీ, జీవుడు ఒక శరీరం వదిలి వేరొక శరీరం లోనికి మారడమే మరొక జన్మ అనీ వేదాంత పరిభాష. అందుచేత ఈ శరీరములనే వలువలను అహోబిలంలోని భవనాశిని అనే గుంటలో ఉతికితే అవి శుద్ధమై మల్లపూలవలే అవుతాయని దీనిలోని భావము.

4. **అహోబిలాన చెట్టుబుట్టే భూమి యెల్ల తీగపారే కంచిలోన కాయకాచెరా ఓ వేంకటేశా శ్రీరంగాన పండుపండేరా ఓ వెంకటేశా**

అహోబిలములో నృసింహస్వామి కల్పవృక్షమై అవతరించాడు. ఆ విష్ణుతత్త్వమే భూమి అంతా అలముకొన్నది (తీగపారె). ఆ తత్త్వమే కంచిలో వరదరాజ పెరుమాళ్ళు అనే కాయ, శ్రీరంగమున రంగనాథుడనే పండు అయినవి. ఇవన్నీ వైష్ణవ మతమునకు ఉత్కృష్టమైన క్షేత్రాలు.

5. **పుట్టమీద చెట్టు బుట్టే భూమియెల్ల తీగపారే పర్వతాన పండు పండేరా ఓ వేంకటేశా అందవచ్చు కోయరాదురా ఓ వేంకటేశా**

ఇక తిరుపతి క్షేత్రము ప్రస్తావిస్తున్నాడు. విష్ణువు లక్ష్మీదేవిని వెదుకుతూ వచ్చి ఒక పుట్టలో విశ్రమించాడు. దానిలోనుంచి పశులకాపరి కొట్టడంతో అచటినుండి వెలువడి తిరుపతి కొండపై చివరకు కల్పతరువై వెలిశాడు. ఈ వేంకటేశ తత్త్వము లోకమెల్ల వ్యాపించింది (తీగ పారె). అదే తిరుపతి కొండపై పండిన పండైనది. అది భక్తితో అందుకొనవచ్చు. కాని కోయలేము. అంటే అది శాశ్వతమైనదని అనడం.

6. **చేయిలేనివాడు కోసే నెత్తిలేనివాడు మేసే కాళ్ళులేనివాడు నడచే ఓవేంకటేశా పెదవిలేని చిలుక తినేరా ఓ వేంకటేశా.**

ఇక మనస్సును గురించి చెబుతున్నాడు. ఈ మనస్సు చిత్రమైనది. ఇంద్రియముల ద్వారా సమాచారం గ్రహించి నిలవచేసుకుంటుంది. ఇంద్రియాలను నిగ్రహించ గలిగే సాధన ద్వారా మనసును అదుపు చేయడం యోగసాధన. ఇంద్రియ నిగ్రహం చేకూరినా మనసు శాంతించదు. అదే దీనిలో చెప్పే విషయం. ఇది వరకూ తాను ఇంద్రియముల ద్వారా గ్రహించి దాచిన సమచారంతో మనసు కళ్ళుమూసుకున్నా అన్నీ "చూపిస్తుంది". కర్మేంద్రియాలను నిశ్చలం చేసినా ఊహలలో అవిచేసే వన్నీ చేయించిన అనుభూతి కలిగిస్తుంది (చేయి లేని వాడు కొయ్యడం ఇది). నోటిని కట్టేసినా తిన్న అనుభూతి అనుభవింపజేస్తుంది (నోరు లేనివాడు మెయ్యడమిది). అలాగే కాలులే వాడు తిరుగడమూ, పెదవి లేనివాడు తినడమూనూ.

మనోనిగ్రహం సులువు కాదని నిరూపించాడీ చరణంలో.

7. **గుంటయెండి పండు పండే పండుకోసి కుప్పవేశే కుప్పకాలి యప్పు తీరెరా ఓ వేంకటేశ దీని భావమునీకే తెలుసురా ఓ వేంకటేశా**

మానవ జీవన పరిణామం వివరిస్తున్నా డిందులో. జీవుడు జీవితమనే బురదగుంటలో చిక్కుకుంటాడు. ఆ బురద లోనే ఏదో కొంచెం సాధన

వలన బురద ఇంకించుకుని కొద్ది పుణ్యాన్ని ఫలంగా సంపాదించు కుంటాడు (అదే పండిన పంట). అదికోసి తీరా కుప్పవేసేటప్పటికి వీడి పూర్వ పాపాలకు ఈ పుణ్యం చెల్లు. అదే కుప్ప కాలిపోవడం. ఋణం చెల్లువేసేడే తప్ప కావలసినదానిని చేరుకోలేదు. మరల మరొక జన్మం తయారు. ఇదే జీవన మరణ చక్రం.

8. **సందెకాడ తలవ్రాలు సంధిదీరి వేంకటరాయా తెల్లవారనాయనీడరా ఓ వేంకటేశ దీనిభావము నీకే తెలుసురా ఓ వేంకటేశ**

పైన చెప్పినదానినే మరియొక దృష్టాంతంతో నొక్కిచెబుతున్నాడు. నీ పాపపుణ్యాలు నీడలా నీవెన్నంటి వస్తాయి. సాయంకాలం అయ్యింది. (ఒక జన్మ ముగిసింది) నీడ తలవాల్చేసింది. చీకటిలో కలిసిపోయింది అనుకుంటున్నావు. మళ్ళీ ఉదయమైంది. (వేరొక జన్మ వచ్చింది). ఉదయంతో పాటే నీ నీడ నీ వెనుక తయారు. (తెల్లవారె నాయ నీడరా).

9. **ముత్యాల పందిటిలోన ముగ్గురు వేంచేసిరాగ ముక్కంటి దేవుని జూచేరు ఓ వేంకటేశ దీనిభావము నీకే తెలుసురా ఓ వేంకటేశ**

ముత్యాల పందిరి కింద శ్రీనివాసుడు బ్రహ్మోత్సవాలలో శ్రీదేవి భూదేవి సమేతంగా వేంచేస్తాడు. ఆ దృశ్యం ముక్కంటి దేవుని (ముక్కంటి = మూడుకన్నుల శివుడు) చూసినట్లున్నదట. ఏమిటి దీనర్థం?

కొంచెం వివరిస్తాను. జగత్తుకు నక్షత్రాలతో కూడిన ఆకాశమే ముత్యాల పందిరి. ఆ ఆకాశమే శివజటాజూటం. అ జటాజూటము క్రింద మూడుకన్నుల మోము ఊహించుకుంటే శివస్వరూపం పొడగడుతుంది. దానికి ప్రతీకగా ముత్యాల పందిరి క్రింద మూడుమూర్తులూ (శ్రీ భూ సమేత మలయప్ప స్వామి) మూడుకన్నులై ఆ శివస్వరూపము కదిలి వచ్చుచున్నట్లున్నది.

10. **ఏటిలోన వలవేశే తాటిమాను నీడలాయె దూరపోతే చోటులేదురా ఓ వేంకటేశ దీనిభావము నీకే తెలుసురా ఓ వేంకటేశ**

మానవుడు తాటిమాను నీడలో కూర్చున్నాడు. తాటిమాను నీడ సన్నంగా ఉండి ఎంతోసేపు నిలువదు. అశాశ్వతమైనది అనిఅర్థం. మానవుడు వెలుగు నీడలనే సన్నని దారాలతో కట్టిన వలలో బందీ. వెలుగు పగలు, నీడ చీకటి. ఈ రెండూ కలిసి కాలం. ఈ కాలంలో మానవుడు బందీ. దానిలో నుంచి వీడు తప్పించుకోలేడు. వీడిని బందీ చేసిన బెస్తవాడు ఆ వలలో నుంచి వీడిని పైనపడేసే దాకానే వీడి నాటకం. అది తెలీక అదేదో పెద్ద సత్యం అనుకుంటూ జీవితం గడుపుతూ ఉంటాడీ మానవుడు.

అంతేకాదు తాను ఈ వలలోనుంచి తప్పించుకోలేడు (దూరబోతే చోటు లేదు). కానీ చిత్రమేమిటో తెలుసా? ఈ తాటిమాను నీడల వలలో ఉండి తాను వేరే జీవుల కోసం యేటిలో వలవేస్తాడు. ఇదే చోద్యం.

11. **ముందు కూతురాలు ఆమె ఆలుకూతురాయె పొందుగా పెండ్లాము తానాయె ఓ వేంకటేశ దీనిభావము నీకే తెలుసురా ఓ వేంకటేశ**

ముందు విష్ణువు కూతురు గంగ సముద్రునికి ఆలైంది (ముందు కూతురాలు).

ఆమెకు (గంగకు) తన ఆలు (లక్ష్మి) కూతురైనది. సముద్రునికి గంగకూ లక్ష్మి కూతురైంది.

తరువాత ఆమె (లక్ష్మి) చక్కగా విష్ణువుకు పెండ్లామైంది.

12. **ఆకులేని అడవి లోన మూడుతోకల పెద్దపులిని మేక యొకటిఎత్తి మింగెరా ఓ వేంకటేశ దీనిభావము నీకే తెలుసురా ఓ వేంకటేశ**

మూడుతోకల పెద్దపులి మానవుడు. వీడు సత్త్వ రజస్తమోగుణాల సమ్మేళనం. ఈ గుణాలే మూడు తోకలు. రజస్తమో గుణాల ప్రకోపమే మానవుడిలో

ఎక్కువ. సత్త్వగుణం తక్కువ (సత్త్వగుణ ప్రాభవమే ఎక్కువైతే వీడు ఋషి అయ్యేవాడే). అందుచేత వీడు జీవనమంతా దర్పంతో విర్రవీగుతూ సాగుతాడు. వీడి వెనకాలే మృత్యువు మేకలాగ కొంచెం దూరంలో వస్తూ ఉంటుంది. దాని ఉనికే వీడికి తెలీదు. ఆఖరుకు వీడి జవసత్వాలుడుగుతాయి. ఆ వార్ధక్యన్నే శిశిరంతో పోలుస్తారు. అంటే ఆకులు రాలు కాలం. దీన్నే ఆకుల రాలిన అడవి అంటున్నాడు. అప్పుడు వెనకాల మేక అనే మృత్యువు శక్తి ఉడిగిన మూడుతోకల పులిని కబళిస్తుంది.

13. **పున్నమ వెన్నెలలోన వన్నెలాడితోనుగూడి కిన్నెర మీటుచు పొయ్యేవు ఓ వేంకటేశ దీనిభావము నీకే తెలుసురా ఓ వేంకటేశ**

కొంత మంది పుణ్యాత్ములుంటారు. వారు హరినామస్మరణ చేస్తూ హరిని వీడి ఉండలేరు. అలాంటి వారిని హరి కిన్నెర మీటి ఆకర్షించుకుంటాడు. అపుడా జీవుడు హరిని కూడిన వన్నెలాడి ఔతాడు. (సృష్టిలో కృష్ణుడొకడే పురుషుడు. మిగిలిన వారంతా స్త్రీలే యని అన్వయం) ఆ వన్నెలాడి విష్ణుసాయుజ్యం పొంది మోక్షం పొందినదని భావం. ఇదే కృష్ణరాసలీలా రహస్యం.

14. **అర్ధరాత్రి వేళలోని రుద్రవీణనెత్తుకుని నిద్రించిన నిన్ను పొగడ ఓ వేంకటేశ దీనిభావము నీకే తెలుసురా ఓ వేంకటేశ**

అర్ధరాత్రి అంటే ప్రళయం వచ్చి జగత్తు జలమయమైన రాత్రి. అపుడు లయకారుడు వీణవాయిస్తూ ఆనంద పరవశుడౌతాడు. అదే రుద్రవీణావాదనం. ఆ జలముపై వటపత్రశయానుడై విష్ణువు శిశు రూపంలో ఆవిర్భవిస్తాడు. అలా నిద్రించే బాలునికి ఈ రుద్రవీణా గానం మేలుకొలుపౌతుంది. అదే తిరిగి సృష్టికి మేలుకొలుపు పాట కూడా.

4. అమ్మమ్మ యేమమ్మ అలమేల్మంగా నాంచారమ్మా!

అమ్మమ్మ యేమమ్మ అలమేల్మంగా నాంచారమ్మా!
తమ్మి యింట నలరు కొమ్మా! ఓయమ్మా!

నీరిలోనా తల్లడించి నీకే తలవంచీ
నీరికిందా పులకించి నీరమణుండూ
కోరీ కొన చెమరించీ కోపమే పచరించీ
సారెకు నీ అలక ఇటే చాలించవమ్మా! ॥అమ్మమ్మ యేమమ్మా॥

నీకుగానే చేయి సాచీ నిండా కోపము రేచీ
మేకొని నీ విరహానా మేనూ బెంచేనీ
ఆకడాకడీ సతులా హృదయమే పెరదీసి
ఆకూ మడిచీయనైన ఆనతీయవమ్మా! ॥అమ్మమ్మ యేమమ్మా॥

చక్కదనములె పెంచీ సకలము కాలదంచి
నిక్కపూ వెంకటేశుడూ నీకే పొంచీని
మక్కువతో అలమేల్మంగా నాంచారమ్మా
అక్కున నాతని నిట్టే అలరించవమ్మా! ॥అమ్మమ్మ యేమమ్మా॥

ఈ కీర్తన ఒక అద్భుతమైన సృష్టి. దీనిలో భాషాపరమైన భావనాపరమైన కొన్ని నాజూకైన అంశాలున్నాయి. అవి తెలుసుకుని కీర్తన లోనికి ప్రవేశిద్దాం.

సాధారణంగా భూతకాలంలోని సమాపకక్రియలు 'ఎను' అని ముగుస్తాయి. అంటే జరిగిపోయిన విషయాలు చేసెను, వచ్చెను, పోయెను అని చెప్పుకుంటాము. అన్నమాచార్యుల వారు ఈ క్రియలను ఒక్కొక్కసారి భూతకాలం లో అసమాపక క్రియల (వీటికి భాషాపరంగా క్త్వార్థకములు అని వ్యవహారం) మాదిరిగా వాడతారు. అంటే చేసెను అనడానికి చేసి అనడం. ఈ కీర్తనలోని క్రియలన్నీ ఇలావాడినవే – తలవంచి (తలవంచెను) పులకించి (పులకించెను) ఇలా. ఒక్కొక్క సారి ఈ

రూపాలకు దీర్ఘము కానీ, 'ఏని' 'ఈని' అనికూడా చేరుస్తారు. పచరించెను అనడానికి బదులు పచరించీ అనడం. పెంచెను అనడానికి పెంచేని, పెంచీని అనడం గమనింపవచ్చును. ఈ పలుకుబడులు ఒక వింత అందం తీసుకువస్తాయి.

ఇక భావనాపరమైన అంశం. అన్నమాచార్యుల వారు దశావతారాలపై చాలా కీర్తనలు చేశారు. కానీ ఈ కీర్తనలో ఈ అవతారాలన్నీ స్వామివారు అలమేల్మంగమ్మ కోసమే ఎత్తినారని ఒక చమత్కారమైన నిరూపణ చేసినారు. పాండురంగ మహాత్మ్యము కావ్యంలో తెనాలి రామకృష్ణుడు దశావతారాలను ఒక నావలో అద్భుతంగా పొదిగినాడు. అల్లాంటివి కావ్యాల్లో తారసపడతాయి. కానీ ఒక వాగ్గేయకారుడు తన కీర్తనలలో ఇట్టి సాహితీపరిణితి కనబరుచుట అబ్బురపాటు కలిగిస్తుంది.

ఇక కీర్తన లోకి ప్రవేశిద్దాం.

అమ్మవారు అయ్యవారిని ప్రణయ కలహం వలన ఉపేక్షిస్తున్నారు. అది కూడదని ఒక చెలికత్తె అమ్మను హెచ్చరిస్తున్నది. ఆ చెలికత్తె రూపంలో నిజానికి అన్నమాచార్యులే ఈ మాటలు చెబుతున్నట్టు భావించాలి.

అమ్మమ్మ, ఏమమ్మా, అలమేల్మంగా, నాంచారమ్మా! ఇది అమ్మవారికి సంబోధన. వెంటవెంటనే అన్ని సంబోధనలు ఆతృతను తెలియజేస్తాయి. అమ్మమ్మ అనడంలో రెండర్థాలు. అమ్మా, అమ్మా అని రెండుసార్లు సంబోధించడం ఒకటి. అమ్మమ్మా (అయ్యయ్యో) అనడంలో విచారం, సానుభూతి కనబరచడం. అమ్మమ్మా ఎంతపనిచేశావు తల్లీ! అని మరొక అర్థం.

తమ్మి యింటా నలరు కొమ్మా –

నీవు మాత్రం ఒడలు కందకుండా పద్మంలో కూర్చున్నావు.

నీరిలోనా తల్లడించి నీకే తలవంచి నీరికింద పులకించి –

ఇవి మత్స్య, వరాహ, కూర్మావతారములు. నీటిలో నీకోసం

తల్లడిల్లిపోయినాడమ్మా. నిజానికి ఆయన మత్స్యావతారం వేదాలు వెతకడానికి ఎత్తినాడనుకుంటున్నావేమో. వేదం నీ స్వరూపమే కదా. అందుకే నిన్ను వెదకడానికే మత్స్యమై నీటిలో తల్లడిల్లినాడు!

నీకే తలవంచినాడమ్మా! భూమి నీ స్వరూపమే కదా (భూదేవి) అది నీటిలో మునిగిపోతే తన తలవంచి కొమ్ముతో నిన్ను పైకెత్తినాడు. ఈ అవతారమూ నీ కొరకే నమ్మా!

నీరికిందా పులకించీ – స్వామి వారు కూర్మమై నీటిలో మునిగి యుండి మంథరగిరి ఎత్తినాడు. ఈ అవతారం అమృతోత్పాదనం కోసం ఎత్తినాడనుకోకు. పాలకడలి తరచినప్పుడు దానిలోనుండి నీవు (లక్ష్మీదేవి) ఉద్భవింతువని ఆయనకు తెలియును. అందుకే ఆయన పులకరింపు. ఈ అవతారమూ నీకోసమే ఎత్తినాడు!

కొన చెమరించి కోపము పచరించీ –

ఇది నృసింహావతారం. కొన అనగా జూలు. జూలు అంతా చెమటతో తడిసిపోయినది(చెమరించి). ఉగ్రుడై కోపము కనబరిచేడు (పచరించి). ఈ అవతారం ప్రహ్లాదరక్షణకై ఎత్తినాడని అందరూ అనుకుంటారు. కాదు ఆ నెపంతో చెంచెతవై యున్న నిన్ను (చెంచులక్ష్మి) పెండ్లియాడుటకు ఎత్తినాడమ్మా!

అమ్మా స్వామివారు ఇంత కష్టపడి ఇన్ని అవతారములు నీ కొరకు ఎత్తి కష్టపడుతున్నాడమ్మా. ఇక ఈ అలక ఇప్పటికైనా (సారెకు = ఈమాటికి) చాలించవమ్మా!

నీకుగానే చేయి సాచి – మేకొని నీవిరహానా మేను బెంచేని –

నీ కోసం ఆయన పరుని వద్ద చేయిసాచినాడు తల్లీ. బలివద్దకు పోయి చేయి సాచి మూడడుగుల నేల అడుగుకున్నాడమ్మా. భూమి (భూదేవి) నీ రూపమే కదా. నీ విరహము వలననే మేను పెంచినాడు (మేకొని = పూని)

నిండా కోపమె రేచీ –

నీవు కనబడక ఉగ్రుడైపోయినాడు (ఇది పరశురాముడైనా కావచ్చు, నృసింహుడైనా కావచ్చు)

ఆకడీకడీ సతుల హృదయమే పెరదీసి –

బుద్ధావతారం ఎత్తి త్రిపురాసురుల సతుల వద్దకు పోయి వారి పాతివ్రత్యము తగ్గించుటకు వారిని ఆకర్షించి మోహమును కలిగించెను. (వారి పాతివ్రత్య బలము వలన శివమహాదేవుడు త్రిపురాసురులను వధింపజాలమిచే దేవతలీ ఉపాయము పన్నిరి) నీవు దగ్గర లేకుండుట వలన ఆయన పరసతుల హృదయములు పెరదీయుచున్నాడు (పెరదీయు = వేరు మార్గములకు త్రిప్పు). ఇది మరీ ప్రమాదమని చెలికత్తె హెచ్చరించుచున్నది.

ఇప్పటికైనా ఆతని చేరదీయుము. కనీసం ఒక ఆకైనా మడిచి ఆయనకీయమని ఆనతీయుము. తమలపాకు మడిచి ఇచ్చుట ప్రేమకు చిహ్నము. నీవియ్యక పోతే పోయె. కనీసం ఇయ్యమని నాకు ఆనతియ్యి అని అంటున్నది చెలికత్తె.

ఒక్కసారి చూడు. చక్కదనములు పెంచుకున్నాడు. నీవు పలకరించక పోయేసరికి ఈ విశ్వమంతా కాలితో తన్నివేశాడు (త్రివిక్రమరూపం). త్రివిక్రమత్వాన్ని ఇలా సందర్భానుసారంగా వాడినాడు అన్నమయ్య.

ఆ చక్కని వేంకటేశ్వరుడు నీకొరకే పొంచియున్నాడు (పొంచీని). ఇక ఉపేక్ష వలదు. ఇక ప్రీతితో (మక్కువతో) ఆతనిని అలరించవమ్మా!

ఇది ఎంతో సారస్యం కలిగిన కీర్తన. చెలికత్తె హెచ్చరికగా దశావతారములు స్వామి వారు అలమేల్మంగ కొరకే ఎత్తినారని నిరూపణ చేసిన అన్నమాచార్యుని అపూర్వ ప్రతిభ. ఈ కీర్తన నాపై ఎంతటి ముద్ర వేసినదంటే స్వామి అవతారములు అలమేల్మంగమ్మ కొరకేనని చెబుతూ ఒక 'అలమేల్మంగ శతకము' నాచే చెప్పించినది.

5. అలమేలుమంగ నీ అభినవ రూపము

అలమేలుమంగ నీ అభినవ రూపము
జలజాక్షు కన్నులకు చవులిచ్చేవమ్మా

గరుడాచలాధీశు ఘన వక్షమున నుండి
పరమానంద సంభరితవై
నెఱతనములు చూపి నిరంతరము నాథుని
హరుషింపగ జేసితి గదవమ్మా ॥అలమేలుమంగా॥

శశి కిరణములకు చలువల చూపులు
విశదముగా మీద వెదజల్లుచు
రసికత పెంపున కరగించి యెపుడు నీ
వశము జేసుకొంటి వల్లభునోయమ్మా ॥అలమేలుమంగా॥

రట్టడి శ్రీవేంకటరాయనికి నీవు
పట్టపు రాణివై పరగుచూ
వట్టిమాటు తిగిరింపు వలపుమాటల
జట్టిగొని ఉరమున చట్టమైతి వోయమ్మా! ॥అలమేలుమంగా॥

అన్నమాచార్యునికి వేంకటపతి తోనూ, అలమేలుమంగమ్మతోనూ భక్తితో కూడిన చనవు యెక్కువ. ఈ కీర్తనలో అమ్మవారిపై ఒక నిష్ఠూరపు విసురు విసురుతున్నాడు. స్వామి వారిని ఆమె మాయచేసి వలలో వేసుకొన్నదని అభియోగం మోపుతున్నాడు. ఆమె యెంత చెబితే అంతయిపోయిందట స్వామివారికి.

ఓ అలమేలుమంగా! నీ ఆకర్షణీయమూ నవీనమూ (అభినవము) అయిన రూపముతో జలజాక్షుడైన ఆయన కన్నులకు ముత్యపుకాంతి (చౌలు, చవులు) ఇచ్చినావమ్మా! అనగా అయ్యవారికి ఈమె ఆకర్షణీయమైన రూపమును చూచి

కన్నులలో కొత్తమెరుపు వచ్చిందని భావం. ఆమె వైపు చూచిన స్వామివారికి మరి యెవరి పైకి ధ్యాస పోవడం లేదని నిష్ఠూరం!

1. ఆ గరుడాచలాధీశుని వక్షముపైన చేరి ఆనందపడుచున్నావు. నీ నెరజాణ తనముతో స్వామిని నిరంతరము సంతోషపెట్టుచున్నావు (హరుషింపగ జేసితివి)

2. వెన్నెల విహార వేళలో చంద్రకిరణములకు నీ చలువచూపులు జోడించుచున్నావు. వెన్నెల కిరణములే చల్లనివి. వానికి ఆమె చలవ చూపులు మరింత స్పష్టతా, తెలుపుదనమూ కూరుస్తున్నవట. (అమ్మ చూపులు వెన్నెలకు వన్నెపెట్టుచున్నవని అనడం). దానిని తోడు నీ రసికత ప్రదర్శించి స్వామిని వశపరచుకొన్నావు.

3. శ్రీవేంకటరాయనికి నీవు పట్టపు రాణివై సంచరిస్తూ (పరగుచూ) కొంత గోప్యత (రట్టడి) పాటిస్తున్నావు. ఈ రట్టడి అన్న పదానికి కొంచెం negative అర్థం ఉంది. గుట్టు రట్టు అంటాము. గుట్టుగా అవతలివారికి తెలియకూడని సమాచారం దాచినారనుకోండి. అది వెల్లడి కావడం రట్టు. ఇక్కడ అమ్మవారు వేంకటపతికి పట్టపు రాణియై ఏదో గోప్యత పాటించు ఉన్నదని చూచాయగా తెలుస్తున్నదని భావము.

ఎందుకు ఇలా భావించవలసి వచ్చుచున్నదో క్రింద కొనసాగింపుగా చెబుతున్నాడు అన్నమయ్య.

వ్యర్థమైన, పోసికోలు (వట్టిమాటు) ఆకర్షించే (తిగిరించు , తిగియు = ఆకర్షించు) వలపు మాటలు చెప్పి ఆయనను వశపరచుకొని (జట్టిగొని) ఆయన వక్షముపై తిష్ట వేసి చట్టమైనావు. నీవు చెప్పినదే ఆయన అమలు చేయును. కనుక నీమాటే శాసనము. నీవే చట్టము.

ఎంత నిష్ఠూరమైన విసుర్లో. ఇవి వింటే అన్నమయ్య ఆ దేవునికి, దేవేరికి ఎంత సామీప్యము సంపాదించెనో, ఎంత చేరువదనము ఉంటే అటువంటి

నిష్ఠూరపు మాటలనగలడో మనమూహింపగలము

ఇది నిందా స్తుతి. అన్నమాచార్యుడు ఆంతరమున అలమేలుమంగమ్మ అభినవ రూపలావణ్యవతియనీ, ఆమె శ్రీవారి వక్షమున పరమానందముతో కాపురము చేయుననీ, ఆమె నెరజాణ తనము స్వామికి ప్రీతిపాత్రమనీ, అమ్మ చూపులు వెన్నెలకు చల్లదనమునూ స్వచ్ఛతనూ నేర్పుజాలుననీ, ఆమె రసికత స్వామిని వశము చేసుకొనజాలుననీ, ఆమె సంసారము గుట్టు కాపాడుననీ, ఆమె తీయని మాటలు చట్టములనీ, శాసన ప్రాయములనీ కీర్తించుచున్నాడు. ఇది అంతరార్థము.

6. అలమేలు మంగా! హరి యంతరంగా!

అలమేలు మంగా! హరి యంతరంగా!
కలిత నాట్యరంగా! కరుణాపాంగా!

ఆలి నీలవేణీ! అంబుజపాణీ!
వెలయగ జగదేక విభుని రాణీ! ॥అలమేలుమంగా॥

సితచంద్ర వదనా! శృంగార సదనా!
చతుర దాడిమ బీజ చయ రదనా! ॥అలమేలుమంగా॥

హితవైన శ్రీవేంకటేశుడిదే నినుగూడె
సతి తలపోతల సమకూడె కూడె! ॥అలమేలుమంగా॥

అన్నమయ్య వైవిధ్య భరితమైనసాహిత్య సృష్టి చేసాడు. ఇతని రచనలు చాలామటుకు సంభాషణాత్మకాలు. వేంకటపతి, అలమేలుమంగ, చెలికత్తెలు ప్రధానపాత్రధారులు. వీరు ఒకరితో ఒకరు చెప్పేమాటలుగా చాలా కీర్తనలుంటాయి. కొన్ని మానసబోధలు, కొన్ని జీవ/పరమాత్మ సంవాదాలూ, కొన్ని ఏలలు, కొన్ని జోలలు, కొన్ని చెంచెత సంవాదాలూ, కొన్ని దేవతా స్తుతులు ..... ఇలా వైవిధ్యభరితమైన సాహిత్యం సృష్టించాడు అన్నమయ్య.

పైన చూపిన కీర్తన అన్నమయ్య సాహిత్యంలో మరియొక కోణము. దానిని తెలుసుకుందాం.

ఓ అలమేలు మంగా! హరి మనసు నిండినదానా! నాట్యరంగ జ్ఞానము కలదానా! కరుణా భరితమైన అపాంగవీక్షణము కలదానా!

1. తుమ్మెదల వంటి నల్లని జడకలిగిన దానా!
పద్మము చేత పట్టుకున్నదానా! ఆ జగదేక విభుని రాణీ!

2. తెల్లని చంద్రుని వంటి మోముదానా! శృంగార స్వరూపమైనదానా! దానిమ్మ గింజల వంటి (దాడిమ బీజ) దంతములదానా!

3. నీ తలపులలోని (సతి తలపోతలు) నీకిట్లు సమకూడి నీకు హితుడైన వేంకటేశ్వరుడు నిను కూడినాడమ్మా!

దీనిలో పెద్ద సాహిత్య విశేషాలు లేవు. కేవలం సంబోధనలు వరుసగా కూర్చినాడు. అయితే అన్నమయ్య కీర్తనలలో చరణానికి నాలుగు పాదాలుంటాయి. కానీ పై కీర్తనలో చరణాలలో రెండేసి పాదములే చెప్పబడ్డాయి. ఈ లక్షణాలను ఇలా అర్థం చేసుకోవాలి. ఇలాంటి కీర్తనలు భావప్రాధాన్యం కంటే ఆభినయ ప్రాధాన్యం కలిగినవి. ఇవి శాస్త్రీయ నాట్యకళాకారులు అభినయించి ప్రదర్శించడానికి వీలుగా ఉంటాయి.

కలిత నాట్యరంగ ! (కలిత = ఎరుక గలిగిన) అన్న సంబోధనలో ఈ విషయం వాచ్యంగా కూడా అన్నమయ్య చెప్పాడు. అసలు లోపల గుప్తపరచిన విషయం ఇలా వాచ్యంగా చెప్పడం అంత శ్రేష్ఠమైన పద్ధతి కాదని శాస్త్రనిపుణుల వచనం.

నీలవేణీ అనునప్పుడు జడ సొగసు, పద్మపాణీ అనునపుడు పద్మముద్రా, జదేకవిభుని రాణీ అన్నపుడు రాజసం,సితచంద్ర వదనా అన్నపుడు మోములో విలాసం, శృంగార సదనా అనునపుడు లావణ్యమూ, దాడిమబీజ రదనా అనునపుడు నగవుల హొయలూ, ఆఖరున పతి నిను కూడె అన్నపుడు సమాగమాలింగనాదులూ నాట్యమున ప్రదర్శించుటకు వీలుగా ఈ కీర్తన కూర్చబడినది.

సంగీత నాట్యాభినయ కళాకౌశల ప్రదర్శనా విధేయమైన కొన్ని ఇట్టి కీర్తనలు అన్నమయ్య వ్రాసినాడు.

7. అలర చంచలమైన ఆత్మలందుండ

అలర చంచలమైన ఆత్మలందుండ నీ
అలవాటు జేసెనీ వుయ్యాల
పలుమారు ఉచ్ఛ్వాస పవనమందుండు నీ
భావంబు దెలిపెనీ వుయ్యాల

ఉదయాస్త శైలంబు లొనర కంబములైన
వుడుమండలము మోచెనుయ్యాల
ఆదన ఆకాశపద మడ్డదూలంబైన
అఖిలంబు నిండెనీ వుయ్యాల
పదిలముగ వేదములు బంగారు చేరులై
పట్టి వెరపై దోచె వుయ్యాల
వదలకిటు ధర్మదేవత పీఠమై మిగుల
వర్ణింపనరుదాయ వుయ్యాల ॥అలర॥

మేలుకట్టై మీకు మేఘమండలమెల్ల
మెరుగులకు మెరుగాయ వుయ్యాల
నీలశైలము వంటి నీమేని కాంతికి
నిజమైన తొడవాయె వుయ్యాల
పాలిండ్లు కదలగా పయ్యెదలు రాపాడ
భామినులు వడినూచు వుయ్యాల
వోలి బ్రహ్మాండములు వొరుగువోయని భీతి
నొయ్యనొయ్యన నూచిరుయ్యాల ॥అలర॥

కమలకునుభూసతికి కదలుకదలునమిమ్ము
కౌగిలింపగ జేసె నుయ్యాల

అమరాంగనలకు నీ హాసభావవిలాస
మందంద జూపెనీ వుయ్యాల
కమలాసనాదులకు కన్నుల పండువై
గణుతింప నరుదాయె నుయ్యాల
కమనీయమూర్తి వేంకటశైలపతి నీకు
కడువేడుకై వుండె వుయ్యాల ॥అలర॥

ఇది బాగా ప్రసిద్ధి వహించిన అన్నమయ్య ఉయ్యాల కీర్తన. ఆతని భావుకతకు నిలువుటద్దం.

చంచలమైన ఆత్మలలో నుండుట నీకు అలవాటు చేయుచున్నదా అన్నట్లు ఉయ్యాల ఊగుతున్నది.

నీవే ప్రాణస్వరూపుడవై ప్రతిజీవి ఉచ్ఛ్వాసములో పైకి నిశ్వాసములో క్రిందికి సంచరించుచున్న నీ స్వభావము తెలుపుతున్నట్లుగా ఉయ్యాల ఊగుచున్నది.

అద్భుతమైన ఎత్తుగడ.

కానీ దీనిలో చిన్న చిక్కున్నది. మాటలలో ఈ చిక్కు గురించి చెప్పి దానిలోని వైరుధ్యము ఎట్లు తొలగించవచ్చునో నాకు చెప్పినవారు శ్రీ పేరి రవికుమార్ గారు. విషయమేమిటంటే చిత్తమునకు చాంచల్యముండును కాని, ఆత్మకు చాంచల్యముండదు. ఆత్మ నిత్యమైనది , చలించనిదీను. మరి అన్నమయ్య చంచలమైన ఆత్మయనుచున్నాడేమి?. పరమాత్మ జీవాత్మ ఒక్కటే యైననూ – జీవాత్మ శరీరములలో ప్రవేశించుట, ప్రయాణించుట, శరీరము నుండి విడువడుట నిరంతరము జరుగుచున్నది. దీనినే అన్నమయ్య చంచలత్వముగా పేర్కొనినాడని వారు చెప్పిన సమాధానము.

1. ఉదయ పర్వతమూ, పశ్చిమ పర్వతమూ స్తంభములుగా అమరి నక్షత్ర మండలమును యీ ఊయేల మోయుచున్నట్లున్నది.

ఊయేలకు వినువీధి అడ్డుదూలమైనది. సకలమునూ దానిలోనిండినది

నాలుగు వేదములూ నాలుగువైపుల బంగారు గొలుసులు (చేరులు) గా అమరి ఆశ్చర్యము గొలుపుచున్నవి (వెరపై దోచె).

ధర్మదేవత ఊయేల వద్ద స్థిరమైన (వదలక) పాదపీఠమై వర్ణింపనలవిగాని యటుల నున్నది (వర్ణింప నరుదాయ).

2. మేఘమండలము ఆ ఊయేలకు మెట్లుగా (మేలుకట్టె) అమరి తళతళలాడుచున్నది (మెరుగులకు మెరుగాయ)

నల్లని కొండవంటి నీరూపమునకు ఆ ఊయేల ఆభరణముగా కనిపించుచున్నది (తొడవాయ). ఇది చక్కని మాట. బ్రహ్మాండములోని తక్కినవన్నియు ఊయేలకు భూషణములో అంగములో అగుచుండ ఆ ఉయ్యాలయే స్వామికి భూషణమైనది.

పాలిండ్లు కదలగా పయ్యెదలు రాసుకొనగా లలనామణులు వడివడిగా ఆ ఉయ్యలనూచుచున్నారు (వడినూచు).

అకస్మాత్తుగా వారికి ఒక విషయము స్ఫురించినది. స్వామివారి ఉదరములోని లోకములు యీ ఊపులకు ఒరిగిపోవు నేమోనని భయపడి మెల్లమెల్లగా (ఒయ్యనొయ్యన) ఊచుచున్నారు.

3. స్వామివారికి యీ ఊయలలూగుటలో మరియొక సౌలభ్యము కలిగినదట. ఊపుఊపునకు ఒకసారి శ్రీదేవిని ఒకసారి భూదేవిని కౌగిలింపగ జేసినదీ డోల.

దేవకాంతలకు స్వామి హావభావ విలాసములు దూరమగుచు దగ్గరగుచు పంచిపెట్టినదీ ఊయ్యాల.

బ్రహ్మాదులకు (కమలాసనాదులకు) కన్నుల పండువై గణింప శక్యము కాకుండా వెలుగొందినది.

ఓ వేంకటాద్రీశ్వరా! ఆనందస్వరూపా! (కమనీయమూర్తి) నీకు యీ

ఉయ్యాల మిక్కిలివేడుక కలిగించుచున్నది.

రచనలోని ఒక సాంకేతికాంశము చూపెదను. తన కీర్తనలలో అన్నమయ్య విధిగా ప్రాస, యతి పాటించును. ఇది అక్కరలేక పోయినా ఆయన పెట్టుకున్న నియమము. ఈ కీర్తనలోని పాదములు ఎక్కువ నిడివి కలిగినవి. ఛందోబద్ధమైన పద్యములలో పాదముల నిడివి ఎక్కువగల వృత్తములున్నవి (స్రగ్ధర/మహాస్రగ్ధరల వంటివి). ఆ పద్యములలో పాదానికి రెండుచోట్ల యతి పాటించు నియమముండును. అందుకే కాబోలు ఈ కీర్తన పాదములలో అన్నమయ్య రెండేసి చోట్ల యతి పాటించినాడు.

(అ)లర చంచలమైన (ఆ)త్మలందుండ నీ (అ)లవాటు జేసెనీ వుయ్యాల. ఇట్లే అన్ని పాదములలోనూ యతి పాటింబబడినదని గమనించవలెను.

8. అలరులు కురియగ నాడెనదే

అలరులు కురియగ నాడెనదే
అలకల కులుకుల అలమేల్మంగ

అరవిరి సొబగుల అతివలు మెచ్చగ
అరతెర మరుగున నాడెనదే
వరుస పూర్వ దువాళపు తిరుపుల
హరి గరగింపుచు నలమేల్మంగ ॥అలరులు కురియగ॥

మట్టపు మలపుల మట్టెల కెలపుల
తట్టెడి నడపుల దాటెనదే
పెట్టిన వజ్రపు పెండెపు తళుకులు
నట్టిటు చిమ్ముచు నలమేల్మంగ ॥అలరులు కురియగ॥

చిందుల పాటల సిరి పొలయాటల
అందెల మోతల నాడెనదే
కందువ తిరువేంకటపతి మెచ్చగ
అందపు తిరుపుల నలమేల్మంగ ॥అలరులు కురియగ॥

ఈ కీర్తనలో అలమేలుమంగ విభుని ముందు చేసే నాట్యము వర్ణిస్తున్నాడు అన్నమయ్య.

విరుల వాన (అలరులు = పువ్వులు) కురుస్తున్నది. ఆ పూలవానలో అలమేలుమంగమ్మ నృత్యం చేస్తున్నది. అమ్మ నృత్యం చేస్తుంటే ఆమె ముడుచుకున్న పూలు జల్లుగా జారి పడుతున్నాయనీ అర్థం చెప్పుకోవచ్చు. ఆ అభినయములో అలుకలూ (కోపాలు), కులుకులూ (సంతోషాలు) చూపుతున్నది.

1. చుట్టూ సహనాట్యం చేస్తున్న చెలికత్తెలు మెప్పుదలతో చూస్తున్నారు (అతివలు మెచ్చగ). అరవిరిసిన మొగ్గవంటి సొగసుతో అర తెరచాటుగా

ఆమె నాట్యం చేస్తున్నది.

దువాళపుతిరుపు అంటే వేగముగా గెంతుతూ తిరగడం ఇది అశ్వపు నడకలలో ఒక బేధం. అలా ముందు ప్రదర్శించే పాద విన్యాసంతో (పూర్వ దువాళపు తిరుపులతో) హరి మనసు కరుగునట్లుగా (హరి గరగించుచు) నాట్యం ప్రారంభించినది.

2. సరిపడు (మట్టపు) విజృంభణము (మలయు = విజృంభించు)లతో, మట్టెల (కాళ్ళకు పెట్టుకునే ఆభరణాలు) మోతల రాజసము (కెలయు = విర్రవీగు, గర్వించు) తో, పాదాలు తాటించే (తట్టు = తాటించు) అడుగులతో (నడపు = నడక) దాట్లు వేస్తూ నర్తిస్తున్నది. ఆ దాటులలో కాలికి పెట్టుకున్న వజ్రపు గండపెండారపు (వజ్రపు పెండెపు) తళుకులు అటూ ఇటూ చిందుతున్నవి.

3. నాట్యములో వేయు చిందులు, దానిలో సరిపడు నట్టువాంగపు పాటలు, దానికి సరిపడు గజ్జెల మోతలు, అందమైన నడకల (తిరుపులు)తో ప్రణయ క్రీడను (పొలయాటను) నేర్పరి (కందువ) యైన శ్రీవేంకటేశుడు మెచ్చగా అలమేలుమంగ అభినయించుచూ నాట్యము చేసినది.

ఈ కీర్తనలో నాట్యమును వర్ణించుటకు ఎన్ని అచ్చ తెలుగు పదాలు వాడినాడో చూడండి.

దువాళము, తిరుపులు, మట్టపు మలపులు, మట్టెల కెలపులు, తట్టెడి నడపులు, దాటులు, పొలయాటలు. ఓహో ఇలాంటి ఎన్ని పదములు వాడుకలో లేకుండా కాలగర్భములో కలిసిపోయినవో. ఒక్కొక్క విన్యాసమును చక్కగా ప్రకటింపగల పదములు ఎన్ని మనము పోగొట్టుకున్నమో?

అన్నమయ్య పదకోశం - రవ్వా శ్రీహరి.

మరియొక మెరుపు - అన్నమయ్య సంకీర్తనలు వెలుగు చూసేకా మొట్టమొదట రాళ్ళపల్లి వారు స్వపరచిన కీర్తన ఇదేనని వినికిడి.

9. ఆరగించి కూర్చున్నాడల్లవాడే

ఆరగించి కూర్చున్నాడల్లవాడే
చేరువనే చూడరె లక్ష్మీనారసింహుడు

ఇందిరను తొడమీద నిడుకొని కొలువిచ్చీ
అందపు నవ్వుల చల్లీ నల్లవాడే
నిండిన మాణికముల శేషుని పడగమీద
చెంది వరాలిచ్చీ లక్ష్మీనారసింహుడు ॥ఆరగించి॥

బంగారు మేడలోన పచ్చల గద్దియలమీద
అంగనల ఆట చూచి ఆల్లవాడే
రంగగు సొమ్ముల తోడ రాజసపు విభవాల
చెంగట నున్నాడు లక్ష్మీనారసింహుడు ॥ఆరగించి॥

పెండెపు పాదము చాచి పెనచి ఒకపాదము
అండనే పూజగొనీ నల్లవాడే
కొండల శ్రీవేంకటాద్రి కోరి అహోబలమున
మెండుగాను మెరసీ లక్ష్మీ నారసింహుడు ॥ఆరగించి॥

కవితీ్వకరణం ఒక కళ. ఇది చాలా అరుదుగా కనబడే దినుసు. అన్నమాచార్యునికి ఇది చాలా పుష్కలంగా ఉన్న ఆస్తి. ఈయన చాలా కాలం అహోబిలంలో నివాసమున్నాడు. అచ్చటి నృసింహునిపై చక్కని కీర్తనలు చేశాడు.

అన్నమాచార్యుడు నరసింహస్వామి దర్శనానికి వేళ్ళేడు. తెరవేసి అర్చకస్వాములు స్వామికి నివేదనం అర్పించారు. అలంకరించి తెరతీసారు. అదీ దృశ్యం. ఎంత చక్కగా వర్ణిస్తున్నాడో ఆ స్వామిని.

అప్పుడే నైవేద్యం స్వీకరించిన స్వామిని – ఆరగించి కూర్చున్నాడల్లవాడే

అన్నాడు. ఎల్లా తోచిందో అలా అనాలని. అల్లవాడే అంటే స్వామి దూరమైనట్లు అనిపించింది కాబోలు. ఈ దగ్గరగా ఉన్న ఈయనే (చేరువనే) చూడండి అని కొంచెం సద్దుకున్నాడు.

లక్ష్మీదేవిని అంకముపై కూర్చుండబెట్టుకుని కొలువు తీరి అందంగా నవ్వుతున్నాడు స్వామి. శేషవాహనం మాణిక్యాలతో కూడిన పడగలపై ఆసీనుడై (చెంది) వరములియ్యడానికే ప్రసన్నుడై కూర్చున్నాడు. లక్ష్మీ సహితుడైన స్వామిఎప్పుడూ ప్రసన్నంగానే ఉంటాడని ప్రతీతి.

పచ్చలు పొదిగన సింహాసనం (పచ్చల గద్దియ) కూర్చుని అంగనామణుల నృత్యం తిలకించి యున్నవాడడిగో. ఆభరణాలు ధరించి రాజసంతో విరాజిల్లుతున్న మూర్తిని చూడండి.

పెండెము అంటే కాలికి ధరించే గండపెండేరము. అది తొడుక్కున్న కాలిని ముందుకు చాచినాడు. రెండవ కాలిని మడిచి (పెనిచి) దానిపై వేసి దర్జాగా కూర్చున్నాడు. అలా విలాసంగా కూర్చుని పూజలందుకుంటున్నాడు.

తూర్పు కనుమలలో ఉన్న శేషనిరూపంగా వేంకటాద్రి గిరి సమూహాన్ని భావిస్తారు. ఆ శేషాద్రి గిరుల తలవైపున తిరుమల, తోక వైపున శ్రీశైలము క్షేత్రాలు విరాజిల్లుతున్నాయి. ఆ కొండల నడిమి ప్రదేశంలో అహోబిలము ఉంటుంది. కనుక ఈదేవుడు కూడా వేంకటాద్రి వాసుడే.

ఒకసారి మరలా స్మరిస్తే – ఆరగింపు అయినది కనుక స్వామి స్తిమితంగా కూర్చున్నడని ధ్వని. భోజన విరామానికి లేచిపోయే హడావిడి లేదు. దేవేరిని అంకమందు దాల్చినాడు కావున ప్రసన్నుడై ఉన్నాడనవచ్చు. అంగనల నృత్యం తిలకించి వినోదాసక్తుడై యున్నాడు. కాలుపై కాలు వేసుకుని నిదానంగా కూర్చున్నాడు. ఇవన్నీ ఆయన ప్రసన్నతను తెలుపుచున్నవి. అందుకే అందరినీ చూడమని (చూడరె) అన్నమయ్య ప్రబోధం. అంత ప్రసన్న చిత్తుడైనవాడు ఏమి కోరుకుంటే అదే ఇయ్యగలడు.

10. ఇట్టి ముద్దులాడి బాలుడేడ వాడు

ఇట్టి ముద్దులాడి బాలుడేడ వాడు – వాని
బట్టి తెచ్చి పొట్టనిండ బాలువోయరే

గామిడై పారితెంచి కాగెడి వెన్నలలోన
చేమపూవు కడియాల చేయి పెట్టి
చీమ కుట్టెనని తన చెక్కిట కన్నీరు జార
వేమరు వాపోయేవాని వెడ్డు వెట్టరే ॥ఇట్టి ముద్దు॥

ముచ్చువలె వచ్చి తన ముంగమురువుల చేయి
తచ్చెడి పెరుగు లోన తగ బెట్టి
నొచ్చెనని చేయిదీసి నోరనెల్ల జొల్లుగార
వొచ్చెలి వాపోవువాని నూరడించరే ॥ఇట్టి ముద్దు॥

ఎప్పుడు వచ్చెనో మాయిల్లుచొచ్చి పెట్టెలోన
చెప్పరాని వుంగరాల చేయిపెట్టి
అప్పడైన వేంకటాద్రి అసవాలకుడు గాన
తప్పకుండ బెట్టె వాని తలకెత్తరే ॥ఇట్టి ముద్దు॥

ఇంత ముద్దులొలికే బాలుడు (ఇట్టి ముద్దులాడి బాలుడు) ఎక్కడి నుండి వచ్చేడో? (యేడవాడో). వాడిని పట్టుకోండి. పట్టేసుకుని పొట్ట నిండా పాలుపోసెయ్యండి.

సరిగ్గా ముద్దొచ్చే చిన్ని పిల్లలను పట్టుకోండి పట్టుకోండి అని వెనుక పరిగెత్తి పట్టుకోవడం ప్రతీ తెలుగింట సామాన్యమే. పైగా పట్టుకుని దొంగ దొరికాడనడం సాధారణం. పైగా ఈ "దొంగ" కు శిక్షకూడా ఖరారు చేసినాడు అన్నమయ్య. పొట్టనిండా పాలు పోయడమే శిక్ష. పక్కా తెలుగింటి పసికూన ఈ అల్లరి కిష్టప్ప.

ఇక చరణాలలో బాలకృష్ణుని ఆల్లరి పనులు యేకరవు పెడుతున్నాడు.

1. ముందు మొదటి చరణంలో వాడిన రెండు చిత్రమైన పదాలు చూద్దాం.

గామిడి = దుష్టత్వము, శ్రేష్టత్వము.

వెడ్డు పెట్టు = వంచించు, మోసగించు, బుజ్జగించు.

సరిగ్గా వ్యతిరేకమైన అర్థాలూ ఉన్నాయీ పదాలకు.

అల్లరివాడై (గామిడై) పరిగెత్తుకు వచ్చి పట్టుకునేలోపునే కాగే వెన్నలో చేమపూల కడియాల చేయిపెట్టినాడు. కలవారి కన్నయ్య కనుక చిన్నచేతులకు చేమపూల డిజైను ఉన్న చిన్నచిన్న మురుగులు పెట్టుకున్నాడు. కలవారి కొడుకని ధ్వనింపజేశాడీ మాటతో. పైగా చెయ్యి కాలగానే బయటకు తీసివేసి దెబ్బలాడతారని చీమకుట్టిందీ అని మాటిమాటికీ (వేమరు) ఏడుస్తున్నట్టు నటిస్తున్నాడు. వీడిని దగ్గరకు తీసి బుజ్జగించండి (వెడ్డు వెట్టరే?)

గామిడి కి ఆల్లరి (దుష్టత్వం కన్నా కొంచెం క్రిందిస్థాయి) అని అర్థం చెప్పి వెడ్డుకు మాత్రం బుజ్జగించడం అనే అర్థం చెప్పాలి. ఎందుకంటే శిక్ష పొట్టనిండా పాలుపొయ్యడమని ముందే చెప్పాడు అన్నమయ్య. ఎంత అతడి అల్లరితో పక్కలవారు విసిగిపోయినా వారికి బాలకిష్టప్ప అంటే చెప్పలేని ముద్దు.

2. దొంగ (ముచ్చు) వలె వచ్చి తన ముంగమురుగులు వేసుకున్న చేతిని వెన్నచిలికే గిన్నెలో పెట్టి (తచ్చెదు వెన్నల లోన) వెన్నతీసుకోబోయి పట్టుబడి చెయ్యి తీసివేసి కవ్వం తగిలి నెప్పి పుట్టినదని కపటంగా (ఒచ్చిలి) ఏడిచేవానిని ఊరుకోబెట్టరే? దొంగఏడుపైనా ఊరుకోబెట్టవలసినదే.

ముంగ మురుగు లేదా ముంగామురారి అంటే చేతికి ధరించే ఒకవిధమైన కడియం. ఈ ముంగామురారి తో పెద్దనగారు మనుచరిత్రలో ఒక మంచి

పద్యం వ్రాసేరు. ముంగమురుగు మరల ఈ బాలుడు కలవారి కన్నయ్య అని సూచిస్తుంది. అంతేకాదు. చిన్ని కృష్ణుని వేషధారణ కళ్ళకు కట్టిస్తుంది కూడా.

3. ఆఖరి చరణంలో చిన్నికృష్ణుని మీద చిన్నవెటకారం ఉంది.

ఎప్పుడు వచ్చేడో చూడనే లేదు. తీరా చూసే సరికి తన ఉంగరాల చెయ్యి మా పెట్టెలో పెట్టి దానిలోని వస్తువులను సవరిస్తున్నాడు. అవునవును ఈ వేంకటాద్రి అప్పుడు (చిన్నికృష్ణుడే ఈ వెంకప్ప) చాలా బలమున్నవాడు (అసవాలకుడు). ఆ పెట్టె ఎత్తి వాడి నెత్తిమీద పెట్టండి! ఇదీ మనం చిన్నపిల్లలతో చేసే వెటకారమే.

అసవాలకుడు అన్న పదం ఎక్కడి నుండి పట్టుకుని వచ్చేడో సరిగ్గా యతి దగ్గర వేశాడు. ఇది అన్నమయ్యకు భాషపై గల పట్టు తెలియజేస్తుంది. ఇలా కీర్తనకొక్క కొత్త పదం నేర్చుకోవచ్చు. (ఇది వరకు చెప్పుకున్నామో లేదో గుర్తు లేదు. అన్నమయ్య కీర్తనలలో ప్రతి చరణానికీ ప్రాస, ప్రతి పాదంలోను యతిగాని, ప్రాసయతి గాని తప్పనిసరిగా వాడతాడు).

చివరిగా ఒకమాట. ఈ చేమపూవు కడియాలూ, ముంగమురుగులూ, చెప్పరాని ఉంగరాలూ ధరించిన ఈ చేయి భువనాలను శాసించే చెయ్యి. చిన్నపుడు ఎన్ని అల్లరిపనులు చేసిందో ఇది. ఆచేయే ఇందరికీ అభయంబులిచ్చు చేయి.

11. ఇట్టి సంసారికేదియు లేదాయ

ఇట్టి సంసారికేదియు లేదాయ
తట్టువడుటే కాని దరిచేర లేదు

ములిగి భారపు మోపు మోచేటివాడు
అలసి దించుకొను నాడాదను
అలరి సంసారికి నదియు లేదాయ
తొలగని భారమెందును దించ లేదు ॥ఇట్టి సంసారికి॥

తడవి వేపచేదు త్రావెడి వాడు
ఎడయెడ దిను తీపేమైనను
అడరు సంసారికి నదియు లేదాయ
కడు జేదె గాని యెక్కడ తీపిలేదు ॥ఇట్టి సంసారికి॥

దొరకొని హేయమే తోడేటివాడు
పరిఢవించును మేన పరిమళము
అరిది సంసారికి నదియు లేదాయ
ఇరవు శ్రీవేంకటపతి నెరుగలేదు ॥ఇట్టి సంసారికి॥

సంసారం సాగరం అంటారు. ఈ కీర్తనలో సంసారి కష్టాలు స్వామికి విన్నవిస్తున్నాడు అన్నమయ్య.

స్వామీ! ఈ సంసారికి కష్టపడటమే కాని గమ్యం చేరడం కానీ, గట్టెక్కడము కానీ కనరాదు (తట్టువడుటయె కాని దరిచేర లేదు).

1. పెద్ద భారమైన మోపు మోసేవాడు అలసినపుడు ఎక్కడైనా (ఆడ + ఆడ = ఆడాడ) దింపుకోవచ్చు. కానీ సంసారికు అలా కుదరదు. ఎత్తుకున్న బరువు మోసి తీరవలసినదే. దించడానికి వీలులేదు.

2. అవసరార్థం (తడవి) వేపకషాయం (వేప చేదు) తాగేవాడు మధ్యమధ్యలో (ఎడనెడ) తీపి పదార్థమేదైనా తింటాడు. కానీ సంసారానికి పూనుకొన్నవాడికి (అడరు = పూను) అలాంటి సౌలభ్యము లేదు. వీని జీవితంలో చేదే కాని తీపిలేదు (కడు చేదె కాని యెక్కడ తీపిలేదు).

3. మురుగు ఎత్తిపోయుటకు సిద్ధపడ్డవాడు ఎప్పుడైనా శరీరానికి పరిమళద్రవ్యం అలదుకో గలుగుతాడు. ఈ సంసారికి ఆ సౌలభ్యము లేదు. సంసారము అనే మురికి కూపంలో పడి పరమాత్మ తత్త్వము తెలుసుకోవడానికి వీలుపడదు.

సంసారులపై సానుభూతి చూపి వారిని దరిచేర్చమని స్వామికి మనవి చేస్తున్నాడు.

12. ఇదిగో నాభాగ్యము ఏమిచెప్పేనే

ఇదిగో నాభాగ్యము ఏమిచెప్పేనే
ముదముతో తనకిట్టే మొక్కితి నేననవే

చుట్టమైన యట్టివాడు సులభుడైనట్టివాడు
దట్టమై నాకన్నిటానూ తానే కాదే
పొట్టపొరుగున నుండి పొరచి వెట్టింపె నేడు
గట్టిగా నింత కరుణ గలదుగా నాకు ॥ఇదిగో॥

అంతరంగమైనవాడు ఆయమైనవాడు
చెంతల తానేయని చెప్పేగాదే
వంతుల వాసులెంచక వాకిటికి వచ్చేనేడు
యింత మన్నించ దాగాక యికనెవ్వరే ॥ఇదిగో॥

వహించుకునే వాడు వద్దనిట్టె నుండేవాడు
విహరించ నాకన్నిటా వెలసే తానే
వహికెక్క శ్రీవేంకటవల్లభు డితడే నన్ను
తహతహ తీరగూడె తగవరి యౌగాదే ॥ఇదిగో॥

ఈ కీర్తనకు కొంచెం నేపథ్యం చెబుతాను. సాహిత్య విద్యార్థులకు అష్టవిధ శృంగారనాయికలు పరిచితమే. ఆ నాయికలలో ఏ అభిసారికనో, విరహోత్కంఠితనో వర్ణించమంటే కవులకు పట్ట పగ్గాలుండవు. ఉత్ప్రేక్షలూ ఉపమలూ గుప్పించేస్తారు. అయితే ఈ కీర్తనలో చెప్పిన నాయిక సూక్ష్మపరిశీలన చేస్తే ఆ ఎనిమిది కోవలలో చేరదనిపిస్తుంది. ఈమె నాయకుని పట్ల గౌరవము కలిగి ఆయన సుగుణాలను మాత్రమే గ్రహిస్తుంది. నాయకునికి కృతజ్ఞురాలుగా కనబడుతుంది. ఇలాంటి నాయికలను కవులు అంతగా ఇష్టపడరు. కవిత్వం అంతగా పండించడానికి కుదరదు కనుక. కానీ అన్నమయ్య అలాంటి నాయికపై

కీర్తన చేశాడు. తనదైన శైలిలో కవిత్వం పండించాడు. అందుకని ఈ కీర్తన సమర్పిస్తున్నాను.

తనకూ తననాథునికీ తెలిసిన చెలికత్తెతో నాయిక ఆ వేంకటాద్రి శ్రీకృష్ణుని గురించి చెబుతున్నది.

ఇదిగో చెలియా! నా భాగ్యము యేమని చెప్పను (నా భాగ్యము యేమి చెప్పేదే). ఎంతో సంతోషముతో నేను స్వామికి మొక్కినానని చెప్పు. (ముదముతో తనకిట్టే మొక్కితి ననవే)

1. నాకు ఆయన చుట్టము. సులభంగా అందుబాటులో ఉంటాడు. నాకన్నిటికీ తానే. నా దగ్గరలో పొరుగునే ఉంటాడు. (పొరుగు + పొరుగు = పొట్టపొరుగు. పొరుగునే ఉంటాడని నొక్కి చెప్పడం). ఈ రోజు ఏమైనదో చెప్పనా?

   పొరచి = చేబదులుకు తెచ్చుకున్న ధనము.

   వెట్టింపు = అన్నపానాదులకు ఖర్చు.

   తాను చేబదులు తీసుకున్న సొమ్ము నా సాదరు ఖర్చులకని పంపించాడు! ఇంత గొప్ప కరుణ నాపై ఆతనికున్నది.

   ఇక్కడ రెండుమాటలు చెప్పాలి. స్వామి కుబేరుని దగ్గర పెళ్ళికి అప్పు చేశాడు. అప్పు తీర్చడానికి వారివద్దా వీరి వద్దా డబ్బు తీసుకునే పరిస్థితి. దానిలో నాకు ఖర్చులకని ధనం పంపాడని సారస్యము.

   రెండవది. ఈ పొరచి, వెట్టంపి అన్న పదాలు ఎంతగా సందర్భానుసారమైన అర్థం ఇచ్చే పదాలో? ఇప్పుడు నిఘంటులలో మాత్రం మిగిలిపోయాయి. ఇలా ఎంత భాషా సంపద కోల్పోయామో. తలుచుకుంటే బాధ కలుగుతుంది.

2. నా మనసంతా తానే (అంతరంగమైన వాడు). నా జీవనాధారము (ఆయము

= ఆదాయము) తానే. తానెప్పుడూ నాచెంతనే ఉంటాడు. వంతులూ తారతమ్యాలు (వాసులు) లేకుండా ఈరోజు నా యింటికి వచ్చేడు. ఇంత నన్ను మన్నించే వాడు తానుగాక ఇంకెవరున్నారు? (తా గాక యికనెవ్వరే)

3. పిలవగానే వస్తాడు (వద్దనిట్టె ఉండేవాడు). అన్నీ తానై చూసుకుంటాడు (వహించుకునే వాడు). ఎక్కడ విహారమైనా ఆతనిదే బాధ్యత. శ్రీవేంకట వల్లభుడు విధానకర్తయై (వహి = విధము, లెక్క) తహతహదీర నన్ను కూడియున్నాడు.

ఇదీ నా భాగ్యము.

దీనిలోని అంతరార్థము :

సృష్టిలో భగవానుడొక్కడే పురుషుడు. మిగిలిన జీవులన్నియునూ స్త్రీలే. అన్ని జీవులు ఆయనలో పర్యవసించవలసినదే. మనము ఆయనపై భారము వేసి ఆయనయే మన భాగ్యమని నమ్మినచో – ఆయన మన పొరుగుననున్న చుట్టమై అందుబాటులో నుండును. అవసరమైన ధన మొసగును. మన దినవెచ్చములు ఆయన వహించును. మన జీవనాధారమూ అదాయమూనై మన్నించును. పిలువగనే వచ్చి మన తోడై యుండును.

చక్కని కీర్తన.

13. ఇద్దరి తమకము యిటువలెనే

ఇద్దరి తమకము యిటువలెనే
పొద్దున యేమని బొంకుదమయ్యా

లలి నాకధరము లంచమీయగా
పలు సోకులయీ పరగెనవే
పిలువగ రాగా బెరసి నిందపడె
పొలతికి నేమని బొంకుదమయ్యా ॥ఇద్దరి తమకము॥

అడుగుకొనుచు నిన్నంటి పెనగగా
తడయక నఖములు తాకెనవే
తొడుకొని రాగా దూరు మీదబడె
పొదవుగ నేమని బొంకుదమయ్యా ॥ఇద్దరి తమకము॥

పెక్కులు ప్రియములు చెవిలో చెప్పగ
ముక్కున జవ్వాది మోచెనిదే
ఇక్కడ శ్రీవేంకటేశుడా సడివడె
పుక్కటి నేమని బొంకుదమయ్యా ॥ఇద్దరి తమకము॥

రాత్రి వేంకటాద్రి శ్రీకృష్ణుడు ఒక గోపికతో కూడి యున్నాడు. ఆ గోపిక అంతరంగం ఆవిష్కృతమగుచున్నది.

స్వామీ! మన ఇరువురి తమకము మిక్కిలి పెచ్చుమీరినది (ఇద్దరి తమకము యిటువలెనే). రేపు ప్రొద్దుటే ఎన్ని అబద్ధాలాడాలో? (పొద్దున యేమని బొంకుదమయ్యా)

1. నీవు నాకు ప్రేమతో (లలిన్) అధరము లంచమొసగితివి. అధరము లంచమీయడమట. ఇది అన్నమయ్య మాత్రమే అనగలిగిన మాట.

దానివలన దంతక్షతములు (పలు సోకులు. సోకు = తాకు, వ్యాపించు) ఐనవి (పరగెనవే).

నీవు పిలువగానే వచ్చినందుకు (పిలువగ రాగా) నాకు మొత్తంమీద (వెరసి/బెరసి) నింద దక్కినది (నిందవడె). రేపు మీ ఆవిడ అడిగితే ఏమని బొంకాలి? (పొలతికి యేమని బొంకుదమయ్యా)

2. మన పరస్పరాన్యోన్యమైన మాటలతో కూడిన (అడుగుకొనుచు) కలయికల తొందరలో (తడయక) నీ గోళ్ళు నాకు తాకినవి. నఖక్షతములైనవి. ఇవి నేను వెంట తీసుకుని పోయినానా (తొడుకొని రాగా) నింద/అపకీర్తి (దూరు) మీదపడుతుంది.

ఇక్కడ క్రియలు భూతకాలంలో వాడేడు (తొడుకొని రాగా దూరు మీదపడె అన్నాడు. నిజానికి ఆమె రేపటి పొద్దున మాట చెబుతున్నది. నిజానికి ఏమనాలి? "ఇవి తోడుకుని పోగా నింద (దూరు) మీదపడు " అనాలి. ఏమి చెప్పాలో అనే కంగారులో తడబాటు వలన భవిష్యదర్థకానికి బదులు భూతకాల క్రియ వాడడమన్నమాట.

ఇదిగో దీనిగురించి (నఖక్షతాల గురించి) పొడవుగా ఏమని అబద్ధం ఆడాలి. పొడవైన బొంకు చక్కని ప్రయోగం. అంత పొడవైన బొంకు అవసరమైందంటే నఖక్షతములు ఎంత ఎక్కువైనవో అనే సందేహం పాఠకునికి కలగాలన్నమాట. ఇలాంటి చమత్కారములు ప్రబంధ కవులలోకనిపిస్తాయి. వారికేమాత్రం తీసిపోడన్నమయ్య.

3. నీవెన్నో ప్రియమైన మాటలు చెవిలో చెప్పినావు. అప్పుడు నీ ముక్కుకున్న జవ్వాజి నా చెవికి అంటినది. ఇక్కడ కూడా అనగా ఈ విషయంలో కూడా ఓ స్వామీ నాపై నింద పడింది (ఇక్కడ శ్రీవేంకటేశుడ సడివడె. సడి = నింద). నింద పడుతుంది అనడానికి నింద పడినది అనడం గమనించాలి.

దీనికేమి పుక్కిటి పురాణం చెప్పాలో.

ఈ కీర్తనలో భవిష్యదర్థకములుగా వాడవలసిన క్రియలను భూతకాలంలో వాడడాన్ని మరియొక విధముగా సమర్థించవచ్చు.

ఇలాంటి సమయాల్లో "ఈ దంతక్షతాలూ, ఈ నఖక్షతాలూ కనిపిస్తే రేపు నా పనయింది. నా పనయిపోయింది" ఇలా కంగారుగా చెప్పడం లోకంలో ఉన్నదే. చిత్రమైన ఈ వ్యక్తీకరణలను చక్కగా కీర్తనలలోకి తెచ్చుకుంటాడన్నమయ్య. అది శైలికి సంబంధించిన ఒక అందం.

14. ఇన్ని రాశుల యునికి ఇంతి చెలువపురాశి

ఇన్ని రాశుల యునికి ఇంతి చెలువపురాశి
కన్నె నీరాశి కూటమి గలిగిన రాశి

కలికి బొమవిండ్లు గల కాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికిని మీనరాశి
కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభ రాశి
చెలగు హరిమధ్యకును సింహరాశి ॥ఇన్ని॥

చిన్ని మకరాంకపు పయ్యెద చేడియకు మకర రాశి
కన్నెప్రాయపు సతికి కన్నెరాశి
వన్నె మైపైడి తులతూగు వనితకును తులా రాశి
తిన్నని వాడిగోళ్ళ సతికి వృశ్చికరాశి ॥ఇన్ని॥

ఆముకొను నొరపుల మెరయు నతివకును వృషభరాశి
గామిడి గుట్టు మాటల సతికి కర్కటకరాశి
కోమలపు చిగురుమోవి కోమలికి మేషరాశి
ప్రేమ వేంకటవిభు గలిసే ప్రియ మిథునరాశి ॥ఇన్ని॥

అమ్మ అలమేలుమంగలో అన్ని నక్షత్ర రాశులు ఉన్నవని చూపించే కీర్తన యిది.

మేషం నుండి మీనం వరకూ గల గ్రహరాశులు ఈమెలో ఉండడం వలన (ఇన్ని రాశుల యునికి) ఈ లేమ అందాలరాశి (చెలువపురాశి). ఈ కన్య నీ రాశికి సరిపడు గ్రహరాశులు కలది (కన్నె నీ రాశి కూటమి కలిగిన రాశి)

1. మనోజ్ఞమైన కనుబొమ విండ్లు (కలికి బొమవిండ్లు) కలవు కనుక అది ధనురాశి. కనుబొమ్మలకు వింటికి పోలిక.

2. మీనాక్షి కనుక మీనరాశి (మెలయు = ప్రవర్తిల్లు)

3. కులుకు లొలుకు కుచకుంభములు కలది కనుక ఆమెలో కుంభరాశి యున్నది.

4. హరిమధ్య (సింహమునడుము వంటి సన్నని నడుము) అమరునది (చెలగు) కనుక సింహరాశి యున్నది.

5. చిన్ని మకరాంకపు పయ్యెద చేడియకు మకరరాశి:

ఆవెం చీరపమిటపై మకరాంకము (మొసలి బొమ్మ) ముద్రింపబడినది. అందుచేత మకర రాశి ఆమెలో ఉన్నది. మన్మధుని జెండా మీద మకరము లాంఛనముగా ఉంటుంది. అందుచే ఆమె నడిచినపుడు ఆమె పైటచెంగు ఎగిరితే మన్మధుడు రథముపై వస్తున్నట్లుంటుందని సారస్యము.

చాలామంది చెక్కిళ్ళమీద కల మకరపత్రాలు (ఈనాడు టాటూలు వేసుకున్నట్లు పురాణకాలంలో చెక్కిళ్ళపై మొసలి బొమ్మలు వేసుకున్నట్లు వర్ణించడం సాధారణం). దానిని మకర రాశిగా చూపవచ్చు. కానీ అన్నమయ్య మకర రాశికి కల్పించిన కల్పన చాల సముచితమైనది.

6. ఆమె కన్నెప్రాయములో ఉన్నది కనుక ఆమెలో కన్యారాశి యున్నది.

7. ఆమె శరీరపు రంగులో (మై వన్నె) బంగారమునకు (పైడి) తులతూగును. కనుక ఆమెలో తులారాశి కలదు. తులా రాశి కోసం అన్నమాట ఇది. ఆమెయే బంగారము (లక్ష్మి). బంగారముతో తులతూగునను ప్రసక్తి లేదు.

8. తిన్నని వాడియైన గోళ్ళు కలవు గాన ఆమెలో వృశ్చికరాశి కలదు.

9. ఆముకొను ఒరపుల మెరయు నతివకును వృషభరాశి.

దీనికి కొంత వివరణము అవసరము. గాఢమైన (ఆముకొను = గాఢమైన, అతిశయించిన) ఒరిపిడితో (ఒరపు) ఒప్పునది ఎద్దు (వృషభము).

వృషభములు వృక్షములతో కాని, రాటలతో కాని గాఢముగా ఒరసుకొనును.

దీనిలో ఒరపు అన్నపుడు శ్లేష. ఒరపు అనగా ఒరిపిడి అనే కాదు. సౌందర్యము అని కూడా అర్థము ఉన్నది. అమ్మవారి పరంగా గాఢమగు సౌందర్యము కలది అని అర్థము చెప్పవచ్చు

శ్లేషతో వృషభసామ్యం తీసుకువచ్చాడు. ఇదీ వృషభరాశి ఆమెలో ఉన్నట్టు చేసిన కల్పన.

10. గామిడి గుట్టుమాటల సతికి కర్కటక రాశి.

కర్కటకము అంటే పీత. ఇది కనబడకుండా దాగి ఉంటుంది. అవసరమైనపుడు పైకి వస్తుంది. ఈమె మాటలు గుట్టుమాటలట. అలా గుట్టుదనం పోలిక వల్ల ఈమెలో కర్కటకరాశి యున్నదట.

ఇంకొక విషయం. ఆకాశంలో కూడా కర్కటక రాశి నక్షత్రాలు కనీకనబడకుండా ఉండి గుర్తించడానికి కష్టబడాలట. అసలు ఆ రాశియే గుట్టైన రాశి.

(గామిడి = శ్రేష్ఠత్వం, దుష్టత్వం)

11. కోమలపు చిగురుమోవి కోమలికి మేషరాశి.

మేషమునకు వ్యుత్పత్తి " మిషతి స్పర్థత ఇతి మేషః" ఎదుటి పొట్టేలుతో పోట్లాడునది మేషము అని. కాబట్టే మేషానికీ పెదవికీ పోలిక. శృంగారం పరంగా పెదవులు పెదవులతోనే తలపడతాయి. ఈ విషయము సూచించుటకే కోమలపు..... కోమలికి – అని యతివద్ద అదే పదము వాడినాడు అన్నమయ్య. ఇది సాధారణంగా ఆతడు చేసే పనికాదు.

మరింత సుకరమైన అన్వయమేదైనా దొరుకుతుందేమో పెద్దలు సూచింతురు గాక.

12. ప్రేమతో వేంకటవిభుని ఆమె కలసినది కావున ఆమెలో మిథునరాశి యున్నది. మిథునము అనగా జంట.

అమ్మవారిలో ఇలా ద్వాదశరాశులు ఉన్నాయని నిరూపించడంలో ఒక తాత్త్వికార్థము ఉన్నది. ఆమె ప్రకృతి స్వరూపిణి. ఈ రోదసి ఆమె రూపమే. సూర్యుడు ఆయారాశులలో ప్రవేశించుటను సంక్రమణమని అంటారు. సూర్యునిలో ఉండేది నారాయణుడే. ఆ దంపతుల కలయిక వలననే కాలములోని మార్పులు, ఋతువులూ ఏర్పడడం, వర్షాలు కురవడం, పంటలు పండడం లాంటివన్నీ జరుగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అదే మానవ మనుగడకు ఆధారం.

15. ఇంతులాలాచూడరమ్మయిద్దరుజాణలేవీరు

ఇంతులాలాచూదరమ్మయిద్దరుజాణలేవీరు
చెంత రమాదేవి గూడె శ్రీనరసింహుడు

సరిగొండ లెక్కుకుని సరసము లాడుకొంటా
సొరిది మోముల తొంగి చూచుకొంటాను
విరులచెండులగొని వేటులాడుకొంటాను
సిరితోడ విహరించీ శ్రీనరసింహుడు

భవనాశిలో నీరు పైజల్లు లాడుకొంటాను
నవకపు సిరులను నవ్వుకొంటాను
జవళి కెమ్మోవులు సన్నల జూపుకొంటాను
చివన నిందిరనంటె శ్రీనరసింహుడు

వేమరు దొడలెక్కుక వీడుదోడులాడుకొంటా
ప్రేమమున కౌగిళ్ళ బెనగుకొంటా
ఆముక శ్రీవేంకటాద్రి నౌభళాన నిలిచిరి
శ్రీమహాలక్ష్మి తోడ శ్రీనరసింహుడు

చెలికత్తెలు నృసింహ స్వామి, చెంచులక్ష్మి అమ్మవారికి గురించి అనుకుంటున్న మాటలు.

ఓ యింతులారా! చూడండి. ఈ నృసింహుడు, చెంచులక్ష్మి కదు జాణలు. వారిరువురూ జతగూడినారు. చూడండి.

1. కొండచరియలెక్కి సరసము లాడుకుంటా, క్రమముగా (సొరిది) ఒకరి మొగములోనికి ఒకరు తొంగిచూసుకుంటా, పూలచెందులతో ఒకరినొకరు కొట్టుకుంటా (వేటులాడుకుంటా) సిరితో నరసింహుడు విహరించు చున్నాడు.

2. భవనాశినీ నదిలో నీరు పైన చల్లుకుంటా, మృదువైన (నవకపు) శోభలకు (సిరులకు) నవ్వుకొంటాను. దీనికి మరియొక అర్థమూ చెప్పుకోవచ్చు. నవకము అంటే తొమ్మిది. నవనిధులను (నవకపు సిరులు) చూచి నవ్వుకొంటాను,

ఎర్రని పెదవులు రెండూ (జవళి) సైగలతో (సన్నల) ఒకరికొకరు చూపుకుంటానూ (ముద్దు పెట్టినట్టు అభినయించడమన్న మాట. (ఆధునికులు దీనిని flying kiss అంటున్నారు. దీనిని అన్నమాచార్యుడానాడే వ్రాసినాడు)

శీఘ్రముగా (చివన = చివ్వన) నరసింహుడు ఇందిరను చేరెను.

3. ఒకరి ఒడిలో ఒకరు కూర్చుని (వేమరు దొడ లెక్కుక) సమఉజ్జీలుగా (వీడుదోడు = ఈడుదోడు) ఆటలాడుకుంటా, ప్రేమతో ఒకరికొకరు కౌగిలించుకుంటాను, పైకొని (ఆముక = ఆముకొని) శ్రీవేంకటగిరి కొండలలోని అహోబలమున (ఔభళాన) శ్రీనరసింహుడు శ్రీలక్ష్మితో నిలిచినారు.

16. ఇందరికీ అభయంబు లిచ్చు చేయీ

ఇందరికీ అభయంబు లిచ్చు చేయీ
కందువగు మంచి బంగారు చేయీ

వెలలేని వేదములు వెదకి తెచ్చినచేయి – 1
చిలుకు గుబ్బలి క్రింద చేర్చు చేయి – 2
కలికియగు భూకాంత కౌగిలించిన చేయి– 3
బలమైన కొనగోళ్ళ వాడిచేయి –4

తనివోక బలిచేతి దాన మడిగినచేయి –5
ఒనరంగ భూదాన మొసగు చేయి –6
మొనసి జలనిధి అమ్ము మొనకు తెచ్చిన చేయి –7
ఎనయ నాగేలు ధరియించు చేయి –8

పురసతుల మానములు పొల్లచేసినచేయి–9
తురగమ్ము బరపెడి దొడ్డ చేయి –10
తిరువేంకటాచలాద్రీశుడై మోక్షమ్ము
తిరుగు ప్రాణులకెల్ల తెలిపెడీ చేయి

ఈ నేర్పుగల (కందువగు) బంగారు చేయి ఇందరికీ మోక్షము నిచ్చును. ఇందరికీ అనడం ఒక ఒడుపు. ఈ కనిపించే అందరికీ అని అర్థం. ఇందరికీ అనకుండా అందరికీ అనవచ్చు. ఇంకొకళ్ళైతే అలాగే మొదలు పెట్టేవారు. కానీ ఈ అందం దానితో రాదనేది నిర్వివాదం. అందుకే ఎత్తుగడలోనే ఈ కీర్తన అంత ఎత్తులో నిలబడుతుంది.

చక్కగా పది అవతారాలూ చెప్పబడ్డాయి యీ కీర్తనలో

అవి –

1. వెల కట్టలేని వేదములను వెదికి తెచ్చిన చేయి – మత్స్యావతారం.

2. చిలుకు గుబ్బలి (కవ్వపు కొండ) క్రింద చేర్చిన చేయి – కూర్మావతారం.

3. మనోజ్ఞురాలు (కలికి) అగు భూదేవిని కౌగిలించిన చేయి. లేదా భూదేవి కౌగిలించిన చేయి. రెండు విధాలుగానూ చెప్పవచ్చు – వరహావతారము.

4. బలమైన వాడియైన కొనగోళ్ళు కలిగిన చేయి. కొనగోళ్ళ వాడి చేయి అన్నాడు తమాషాగా. వాడి కొనగోళ్ళ చేయి అనాలి. ఇది లావుపాటి పక్కింటి పిన్నగారు వంటి ప్రయోగం – నృసింహావతారం.

5. తృప్తిలేక (తనివోక) బలి చేతి దానము నడిగినచేయి – వామనావతారము

6. సొగసుగా (ఒనరంగ) భూదానము ఇచ్చిన చేయి – పరశురామావతారము.

   పరశురాముడు తాను రాజులను సంహరించి గెలిచిన భూమినంతటినీ మునులకూ బ్రాహ్మణులకూ దానమిచ్చిన వృత్తాంతం చెప్పబడింది.

7. పూని (మొనసి) సముద్రమును బాణపు (అమ్ము) మొనకు తెచ్చిన చేయి – రామావతారం.

   సొగసైన మాట ఇది. రాముడు – సముద్రుడు తనకు త్రోవ ఇవ్వడం లేదని బాణం ఎక్కుపెట్టేడు. అంతే అంతటి సముద్రుడూ లొంగిపోయి త్రోవ యిచ్చాడు. అంత పెద్ద జలనిధిని అమ్ము మొనకు తీసుకువచ్చాడట. అమ్ము అన్న పదానికి బాణము, నీరు అని రెండర్థాలు. ముల్లును ముల్లుతో తీసినట్లు జలమును (అమ్ము) ఒక చిన్న అమ్ము (బాణము) మొనకు తెచ్చాడు. అనగా అంతటి జలరాశిని ఒక చిన్న బిందువుగా (అమ్ముమొన) మార్చివేసినట్లు లొంగదీసుకున్నాడు.

8. నాగేలు (నాగలి) ధరియించు చేయి – బలరామావతారము.

9. పురసతుల మానధనమును పొల్లు చేసిన చేయి. (పొల్ల = పొల్లు = వ్యర్థము) – కృష్ణావతారము, బుద్ధావతారము.

(i) శ్రీకృష్ణావతారంలో వ్రేపల్లెలోని గొల్లెతల మానములను కృష్ణుడు హరించాడు.

(ii) త్రిపురాసురులను జయించడానికి శివమహాదేవుడు యుద్ధం చెయ్యడం మొదలుపెట్టేడు. కానీ వారి భార్యల పాతివ్రత్య మహిమ వారిని కాపాడుతుండడం వల్ల వారిని జయించడం కష్టమైంది. అప్పుడు విష్ణువు బుద్ధావతారం ఎత్తి వారి వద్దకు బిక్షకు వెళ్ళాడట. ఈ యతిరాజు అందానికి పురసతులు మోహములో పడినారట. అట్లా వారి పాతివ్రత్యభంగమైంది. అక్కడ త్రిపురాసులను శివమహాదేవుడు వధించాడు. ఇదీ దీని వెనుక గాథ.

10. గుఱ్ఱమును నడుపు (పరపు) చేయి – కలికి అవతారము

ఇన్ని రూపములు ఎత్తిన వాడు ఈ తిరువేంకటాద్రీశుడై "ఇందరికీ" అభయమూ మోక్షమూ ఇచ్చుటకై వెలసియున్నాడు.

17. ఉగ్గు వెట్టరే ఓయమ్మా

ఉగ్గు వెట్టరే ఓయమ్మా
చెయ్యొగ్గీనిదె శిశువోయమ్మా

కడుపులోని లోకమ్ములు గదలీ
నొడలూచకురే ఓయమ్మా
తొడికెడి తరగల దొలగ దీయరే
యుడికెడి పాలివె వోయమ్మా ॥ఉగ్గువెట్టరే॥

చప్పలు పట్టుక సన్నపు బాలుని
ఉప్పరమెత్తకు రోయమ్మా
అప్పుడె సకలము నదిమీ నోరనె
వొప్పదు తియ్యరె వోయమ్మా ॥ఉగ్గువెట్టరే॥

తొయ్యలులిట చేతుల నలగించక
నుయ్యల నిడరే వోయమ్మా
కొయ్యమాటలను కొండల తిమ్మని
వొయ్యన తిట్టకు రోయమ్మా ॥ఉగ్గువెట్టరే॥

ఈ కీర్తనలో యశోద చిన్నికృష్ణుని ఆలనా పాలనా చూసే గోపికలను అజమాయిషీ చేస్తున్నది. కాదు కాదు యశోద నెపమున అన్నమయ్యయే ఆ పని చేయుచున్నాడు.

ఓ వనితలారా! చిన్నిపాపడు చేయి చాచి మరీ అడుగుతున్నాడు (చెయ్యి ఒగ్గీని. ఒగ్గు = చాచు) ఉగ్గు కావాలని. ఉగ్గు పట్టండి.

చనుబాలలోనో, నెయ్యిలోనో ఆముదంకలిపి చిన్నపిల్లలకు పట్టేవారు. దానికి ఉగ్గు అని పేరు. అది పట్టడానికి ఉగ్గుగిన్నెలుండేవి ఇదివరలో ప్రతీ యింట్లోనూ.

1. ఏదైనా పట్టేకా చిన్నిపిల్లలను భుజం మీద వేసుకుని మెల్లగా ఊపుతూ వెన్ను నిమరడం సామాన్యం. అయ్యయ్యో అలా ఊపెయ్యకండి. పిల్లాడి కడుపులోని లోకాలు కదిలిపోతాయి. ఈ హెచ్చరికయే ఆ అజమాయిషీ యశోదది కాదనీ, అన్నమయ్యదనీ పట్టి యిస్తుంది. పాపం ఆ అమాయకపు గొల్ల యిల్లాలికి కృష్ణుని బొజ్జలో లోకాలున్నాయని ఏమి తెలుసు? ఇది అన్నమయ్య అన్న మాటే.

ఈలోగా అక్కడ పాలు కాగి తరకలు కడుతున్నవి. పాలు మరిగిపోతున్నవి (పాలు ఉడికెడి). పైన కట్టిన తరకలు తీసి పక్కన పళ్ళెంలో వెయ్యండి (తరగ/క ల తొలగదీయరే). ఆ పాల తరకలతో ఏవో మధుర పదార్థాలు చేస్తారన్నమాట.

2. తొడలు (చప్పలు) పట్టుకుని ఆ పసివాడిని అలా ఆకాశంలో కెత్తెయ్యకండి. (ఉప్పరము = ఆకాశము). ఇది కూడా మన యిళ్ళలో పిల్లలనాడించేటపుడు చెసే పనే. అలా ఎత్తితే భయపడతాడని వద్దనడం.

అదిగో ఇప్పుడే కదా ఉగ్గు తాగేడు. వాడి నోట్లో అన్నీ పెట్టేసుకుంటున్నాడు (అప్పుడె సకలము నదిమీ నోరనె). చూస్తారేం? మంచిది కాదు (ఒప్పదు). తీసెయ్యండి.

3. ఓ వనితలారా! (తొయ్యలులు) ముద్దు బాగానే ఉంది కానీ అలా కిష్టప్పని చేతుల్లో నలిపెయ్యకండి (ఇదె చేతుల నలగించక). ఉయ్యాలలో పడుకోబెట్టండి.

అదిగో ఆ పెడసరం మాటలొద్దు (కొయ్యమాటలు) మా కొండల తిమ్మన్నను తిట్టొద్దు. చిన్న పిల్లలకు చెయ్యి కొట్టేటట్టు చూపించి "వీడిని కొట్టండి, రెండు వెయ్యండి" అనడం సామాన్యం. అవే అన్నమయ్య కొయ్యమాటలు అన్నాడు. చిన్నపిల్లలకు ముద్దుగా మారుపేర్లు పెట్టడం కూడా తెలుగిళ్ళ ముచ్చటే. అందుకే చిన్నికృష్ణుని కొండల తిమ్మడు అన్నాడు. పెద్దయ్యాకా దానినే కొండలరాయడు అని మార్చాడు.

మొత్తం మీద ఎంత హడావిడి పడ్డాడో చిన్ని కృష్ణునితో అన్నమయ్య యశోదలో పరకాయ ప్రవేశం చేసి.

18. ఉన్నమాట లికనేల వోదేవా

ఉన్నమాట లికనేల వోదేవా
యెన్నటి కిదేమాట ఇంకానింకాను

కొంత నా కర్మఫలము కొంత నీ రక్షకత్వము
యింతలూ రెండు గలవా యేమో దేవా
అంతర్యామివి నీవు ఆడేటి బొమ్మనునేను
చెంతగాచుట నీపని సేవజేయుట నాపని ॥ఉన్నమాట॥

నేనపరాధి నయ్యేదీ నీవు వహించుకొనేదీ
యీ నెపాలు రెండూనేల యేమో దేవా
మానక యిట్టైతే నీమహిమకు గురుతేది
అని చింతించే నందుల కపకీర్తి యనుచు ॥ఉన్నమాట॥

మెదలే నాయధమము నీఘనతనెంచికావు
ఇదియే నా విన్నపము యేమో దేవా
యెదట శ్రీవేంకటేశ యిన్నిట నీబంటుబంట
పదివేలు నానేరాలు పట్టకుమీ యికను ॥ఉన్నమాట॥

యదార్థము (ఉన్నమాట) మరల చెప్పగానేల? (ఇకనేల?)

ఓదేవా! ఎప్పటికైనా ఈ మాటలే మరీమరీ (ఇంకానింకా) చెబుతాను/ చెప్పుకోవాలి.

1. మానవ జీవన విధానమిట్లు జరుగుచున్న దనిన కారణమేమిటో? కొంత జీవుల పూర్వజన్మ కర్మఫలములూ, కొంత నీ వలన పొందే రక్షణ (నీ రక్షకత్వము) కలిసి ఈరీతి సాగుచున్నది కాబోలునేమో!

కాదు స్వామీ! కాదు. నీవు అంతర్యామివి. నేను ఆడేటి బొమ్మను.

నీవాడించునట్లాడుటయే నిజము . అప్పుడు కర్మములు వాని ఫలములపై నాకు నియంత్రణ లేదనడం. సేవజేయుట నాపని. నన్ను గాచుట నీపని.

2. నేనపరాధములు చేయుచుందును. నీవా అపరాధముల నుండి నన్ను రక్షించెదవు (నీవు వహించుకునేది). ఈ రెండు కారణముల(నెపాలు రెండూ) వలన ఈ జీవనయానము జరుగుచున్నదేమో?

కాదు స్వామీ! కాదు.

అలాగే అయితే నా మనుగడలో నాపాత్ర కూడా ఉన్నదని భావమేర్పడుచున్నది. అపుడు నీ మహత్వము తగ్గుచున్నది. దాని వలన నీవు సర్వశక్తిమంతుడ వను మాటకు అపకీర్తి వచ్చుచున్నది. కనుక నేను నాకై అపరాధములూ, మంచి పనులూ చేయలేను. అవి అన్నీ నీవే చేయించుచున్నావని నమ్ముచున్నాను.

3. స్వామీ కాబట్టి నీవే నా నైచ్యమును కనిపెట్టి నీ ఘనత నిలబెట్టుకొనుటకై నన్ను రక్షించవలయును. ఇదే నావిన్నపము.

ఓ వేంకటేశ్వరా! నేను నీ దాసులకు దాసుడను (బంటబంట). నేను చేసిన అగణితమైన (పదివేలు = లెక్కకు మిక్కిలి అనడం) నేరాలు గణింపక నన్ను రక్షింపుము.

పూర్ణ శరణాగతి ఈ కీర్తనలో ప్రతిపాదించాడు అన్నమయ్య. దీనినే వైష్ణవ పరిభాషలో నైచ్యానుసంధానము అంటారు.

19. ఊరులేని పొలిమేర పేరుపెంపు లేనిబ్రతుకు

ఊరులేని పొలిమేర పేరుపెంపు లేనిబ్రతుకు
గారవంబు లేని ప్రియము కదియనేటికే

ఉండరాని విరహవేదన ఉండని సురత సుఖమేల
ఎండలేని నాటి నీడ ఏమిసేయనే
దండి గలుగు తమకమనెడి దండలేని తాలిమేల
రెండు నొకటి కాని రచన ప్రియమిలేటికే ||ఊరులేని||

మెచ్చులేని చోట మంచి మేలుకలిగీ నేమి ఫలము
మచ్చిక లేనిచోట మంచిమాట లేటికే
పెచ్చుపెరగలేని చోట ప్రియము గలిగి యేమి ఫలము
ఇచ్చలేని నాటి సొబగు లేమి సేయనే ||ఊరులేని||

బొంకులేని చెలిమిగాని పొందులేల మనసు లోన
శంకలేక కదియలేని చనవు లేటికే
కొంకు కొసరులేని మంచి కూటమలర నిట్లు గూడి
వేంకటాద్రి విభుడులేని వేడుకేటికే ||ఊరులేని||

జీవితంలో పరస్పర విరుద్ధమైన ఘటనలు జరుగుతాయి. ఒక్కొక్కసారి మన మనసుకు నచ్చని పరిస్థితులతో రాజీ పడవలసీ రావచ్చు. ఈ కీర్తనలో అలా రాజీ పడవద్దని అన్నమయ్య హెచ్చరిస్తున్నాడు.

ఊరు లేని పొలిమేర, మనకు పేరు కానీ పెరుగుదల లేని బ్రతుకు, లోపల గౌరవము లేకుండా పైపై మెచ్చుకోళ్ళూ ఇలాంటి వాటి దరిచేరడమెందుకు? (కదియనేటికి?) ఏమీ ప్రయోజనం లేదనడం.

1. చెప్పలేని విరహవేదన ననుభవించి సుఖమివ్వని రతిక్రీడ వలన ఒరిగేదేమిటి? ఎండ లేని నాడు నీడ ఏమి చేసుకుంటావు?

దండిగా కలిగిన మోహం ఉండీ తోడులేక ఒరిమి వహించాల్సి వస్తే ఉపయోగమేమి? ఇక్కడ కొంచెం అన్వయక్లేశం ఉంది. "దండి గలుగు మోహమనెడు దండలేని తాలిమి" అని రూపకం చేసేడు అన్నమయ్య. ఇంతకంటె మంచి అన్వయం చేయగలమేమో ఆలోచించాలి.

రెండు నొకటి కాని రచన ప్రియము లేటికే?

"రెండు ఒకటి యగుట" అనగా ఏకోన్ముఖమగుట అని. ఏకోన్ముఖము గా రచన సాగాలి కానీ సన్నివేశాల్లో సమన్వయం లేక అన్నీ తలోదారీ పడితే ప్రయోజనమేమిటి?

2. మెప్పుదలలు లేనిచోట ఒకింత మేలు కలిగితే యేమిటి?

స్నేహం (మచ్చిక) లేని చోట మంచిమాట లెందుకు?

ఉన్నతి కలగనిచోట (పెచ్చుపెరగ లేనిచోట) కొద్దిపాటి ప్రియములకు ప్రయోజనమేమిటి?

కోరికలు (ఇచ్చ) లేని సౌందర్యాలెందుకు ? (సొబగులేల)

3. కల్మషంలేని ప్రేమ మనసులో లేకుండా (బొంకులేని చెలిమి కాని) పైపైన నటించే ప్రేమల వల్ల ఒరిగేదేమిటి?

ఆదమరచి (శంకలేని) చేరువకాలేని చనవు వల్ల ఒనగూడేదేమిటి?

సందేహం, జంకు (కొంకుకొసరు) లేకుండా ఇలా ఇందరంకలిసే సందర్భంలో శ్రీవేంకటాద్రి విభుడు లేకపోతే వేడుకేమిటి?

సామెతలు కుప్పలు పోశాడన్నమయ్య ఈ కీర్తనలో.

౨౦. ఎవ్వడెరుగును మీ యెత్తులు

ఎవ్వడెరుగును మీ యెత్తులు
మువ్వంక మెరిసే మీ మురిపమేమయ్య

సొలపుల నిన్నాపె చూచీని
నలుగడ నీవేల నవ్వేవు
తెలియవు మాకు మీ తెరగులు
బలిమిని యెట్టైన బతుకరయ్యా ॥ఎవ్వడెరుగును॥

విరుల నాపె నిన్ను వేసీనీ
కెరలి బొమ్మల జంకించేవు
సరిగానము మీ చందములు
పరిపరి విధముల బ్రతుకరయ్యా ॥ఎవ్వడెరుగును॥

పెనగి ఆపె నిన్ను పిలిచీనీ
ఎనసితివి శ్రీవేంకటేశ్వరుడా
నను నేలితివిటు నయముననూ
పనివడి యిట్లానె బ్రతుకరయ్యా ॥ఎవ్వడెరుగును॥

అన్నమాచార్యులు మనసులో వేంకటేశ్వరుని, అలమేలుమంగనూ తలచినంతనే భావాంబర వీధిలో విహరిస్తాడు. ఆతని ఊహలు ఒక మధురమైన కీర్తనగా రూపు దిద్దుకుంటాయి. అల్లంటిదే పై కీర్తన. అలమేల్మంగా వేంకటేశ్వరుల చిరు ప్రణయ సంకేతాలను చూసినట్టు వర్ణిస్తున్నాడిందులో.

మీరు వేసే ఎత్తులు ఎవ్వడెరుగును? మీ మురిపెములు మూడు వంకలా మెరయుచున్నవి. నాలుగు దిశలా అనడం రివాజు. కానీ ఆదంపతులను అన్నమయ్య ముందు నుండి దర్శిస్తున్నాడు. వారి వెనుక వైపు కనబడదు కదా. అందుకు మూడువంకలా అన్నాడు. ఇలాంటి ప్రయోగాలు భలే చేస్తాడు

అన్నమయ్య.

1. ఆమె నిన్ను సొలపులతో చూచును. సొలపు అను పదమునకు రెండర్థాలు. పరవశము, విముఖత అని. నీ వైపు ఆమె పరవశముగానూ చూస్తుంది. అప్పుడపుడు - అందరూ ఉన్నారు - ఏమిటా చేష్టలు? అన్నట్లు విముఖముగానూ చూస్తుంది. నీవు దానికి నలుదిశల నవ్వుతావు. ముప్వంక ముందు వాడేసేడు, అందుకని ఈమాటు నలుగడల అన్నాడు. మాకు మీ పద్ధతులు (తెరగులు) తెలియవు. మేము మీ సైగలు తెలుసుకోలేము అని అనడమన్నమాట. మీరిలా అతిశయముతో (బలిమిని) పదికాలాల పాటు వర్ధిల్లండి (బ్రతుకరయ్య) అని దేవునీ, దేవేరినీ దీవిస్తున్నాడు అన్నమయ్య.

   ఈ చరణంలో నాయిక చూపూ, దానికి ప్రతిక్రియ నాయకుని నవ్వూ చెప్పాడు.

2. ఆమె నిన్ను విరులతో కొట్టును (వేసీని). దానికి ప్రతిగా నీవు కవ్వించునట్టుగా (కెరలి) కనుబొమలు భయపడుతున్నట్టు (జంకించు) వంచుదువు. ఇలాంటి చందములు మేమెక్కడా చూడము (సరి గానము). అవి వింతైన సంకేతములనడం. మీరెపుడూ ఇలానే వర్ధిల్లండి! దీనిలో నాయిక మృదువుగా కొడితే నాయకుడు భయం నటించడం. ఇవి సున్నితమైన శృంగార చేష్టలు.

3. ప్రయత్నించి (పెనగి) ఆమె నిన్ను పిలచినది. నీవామెను పొదువుకొంటివి (ఎనసితివి). మీరిరువురు ఒకటై నన్ను ఏలుకొంటిరి. మీరిరువురూ మమ్మేలుచూ (పనిగొని) ఇలా వర్ధిల్లుదురు గాక!

   శృంగారం లోనుంచి “ననునేలితివి” అని భక్తిలోనికి భావాన్ని ఒక్కమాటలో తీసుకుని వచ్చేడు చివరకు.

21. ఎవ్వారూ లేరో హితవు చెప్పగ

ఎవ్వారూ లేరో హితవు చెప్పగ వట్టి
నొవ్వుల బడి నేము నొగిలేమయ్యా

అడవి బడినవాడు వెడల జోటు లేక
తొడరి కంపల క్రిందు దూరినట్లు
నడుమ దురిత కాననముల తరిబడి
వెడల లేక మేము విసిగేమయ్యా ॥ఎవ్వారూ లేరో॥

తెవులు పడినవాడు తినబోయి మధురము
చవిగాక పులుసులు చవిగోరినట్లు
భవరోగములబడి పరమామృతము నోర
చవిగాక భవములు చవులాయేనయ్యా ॥ఎవ్వారూ లేరో॥

తనవారి విడిచి ఇతరమైన వారి
వెనుక దిరిగి తా వెఱ్ఱైనట్లు
అనయము తిరువేంకటాధీశు గొలువక
మనసులోని వాని మరచేమయ్యా ॥ఎవ్వారూ లేరో॥

అన్నమయ్య ఈ కీర్తనలో సామాన్య మానవుల వేదన స్వామికి విన్నవిస్తున్నాడు.

ఎవ్వరూ మాకు హితవు చెప్పి సరియైన మార్గంలో నడిపించువారు లేరా? మేము వేదనలలో (నొవ్వుల) చిక్కి బాధపడుతున్నము (నొగిలేము)

1. మా పరిస్థితి అడవిలో పడినవాడు బయటపడు దారి తెలియక ముళ్ళకంపల క్రిందదూరినట్లున్నది. మేము ఈ జీవనయానము మధ్యలో (నడుమ) పాపపుటడవిలో (దురిత కాననము) పడి బయటపడే దారి

తెన్నూ తెలియక విసిగిపోయినాము.

2. రోగగ్రస్తుడు తీపిపదార్థము తినవలెనను ఆశ యున్ననూ నోటికి హితవు గాక పుల్లని పులుసులు రుచిచూచినట్లున్నది మా స్థితి. ఈ సంసారమను రోగమున చిక్కుకుని (భగవన్నామమను) పరమామృతము మా నోటికి రుచించక ఈ సంసారమే రుచిగా యున్నట్లనిపించుచున్నది.

3. మా స్థితి తనవారిని విడిచి వెర్రులవలె పరవారి వెనుక తిరుగుచున్నట్లున్నది. మా మనసులోని పరమాత్మ యగు శ్రీ వేంకటాధీశుని సేవింపలేక పోవుచున్నాము.

చక్కని ఉపమానములతో జీవుల పరిస్థితి వివరించినాడు.

22. ఎందు నీకు ప్రియమో యీ తెప్పతిరుణాళ్ళు

ఎందు నీకు ప్రియమో యీ తెప్పతిరుణాళ్ళు
దిందువడె సిరులతో యీ తెప్పతిరుణాళ్ళు

పాలజలనిధిలోఁ పవ్వళించీని పాముతెప్పఁ
తేలుచున్నది అదె తెప్పతిరుణాళ్ళు
వోలి నేకోదకమై వొక్క మఱ్ఱియాకుమీఁద
తేలుచున్నదదియే ఈ తెప్పతిరుణాళ్ళు

అమృతము దచ్చునాఁడు అంబుధిలో మంధరము
తేమలఁ తేలించు యీ తెప్పతిరుణాళ్ళు
యమునలో కాళింగుని అంగపుపడిగెమీఁద
తిమిరి తొక్కినది ఈ తెప్పతిరుణాళ్ళు

అప్పుడు పదహారువేలు అంగనల చెమటల-
తెప్పలఁ తేలినది అదె తెప్పతిరుణాళ్ళు
ఒప్పుగ శ్రీవేంకటాద్రి ఉన్నతిఁ కోనేటిలోన
తెప్పిరిల్లె ఏట ఏట ఈ తెప్పతిరుణాళ్ళు

స్వామి వారికి తెప్పపైన విహరింపజేసే ఉత్సవము అంటే చాలా యిష్టమట. అది ఎందుకు ఇష్టమో వరుసగా చెబుతున్నాడు ఈ కీర్తనలో. ఆ ఉత్సవాన్ని తెప్పతిరుణాళ్ళు గా పేర్కొంటున్నాడిక్కడ.

స్వామీ నీకెందుకు యీ తెప్పతిరుణాళ్ళు అంటే ఇంత ప్రియమో. సిరులతో ఆ తెప్పతిరుణాళ్ళు ఇక్కడికి దిగివచ్చినది. (దిందువడె = క్రింద పడు)

1. పాలసముద్రము మీద ఆదిశేషునిపై (పాము తెప్ప) తేలు ఆయలవాటే ఈ తెప్ప తిరుణాళ్ళు

సృష్టి క్రమముగా (ఓలిన్) జలమయ మైనపుడు (ఏక + ఉదకము = ఏకోదకము) ఒక మఱ్ఱాకుపై తేలితివి కదా. అదే ఇచట తెప్ప తిరుణాళ్ళైనది.

2. అమృతము కోసరం పాలజలధి త్రచ్చు నపుడు మంధర పర్వతముతో పాటు తేమలో తేలినావు కదా. అదే ఇచట తెప్ప తిరుణాళ్లుగా అమరినది.

యమునలో కాళింగుని పడగలపై ఉద్రేకించి (తిమిరి) తొక్కుచూ తేలిన అలవాటే ఇచట తెప్ప తిరుణాళ్ళైనది.

3. పదహారు వేల అంగనల మై చమ్మటలలో దొప్పదోగిన అనుభవమే ఇపుడిచట తెప్ప తిరుణాళ్ళైనది.

ఈ అనుభవముల అలవాటు వలన తిరుమల లోని యీ గొప్ప (ఉన్నతి) కోనేటిలో యేటికొకమారు (యేటయేట) తెప్పతిరుణాళ్ళ నెపముతో అలసట నుండి తెప్పిరిల్లెదవు.

23. ఏడ వలపేడ మచ్చికేడ సుద్దులు

ఏడ వలపేడ మచ్చికేడ సుద్దులు
ఆడుకొన్న మాటలెల్ల నవి నిజాలా

తొలుకారు మెరుపులు తోచిపోవుగాక
నెలకొని మింట నవి నిలిచీన
పొలతులవలపులు పొలసిపోవుగాక
కలకాలం బవి కడతేరీనా

యెండమావులు చూడనేరులైపారుగాక
అందకుబోవ దాహ మణగీనా
నిండినట్టిమోహము నెలతలమది జూడ
వుండినట్టేవుండుగాక వూతయ్యీనా

కలలోని సిరులెల్ల కనుకూర్కులేకాక
మెలకువ జూడ నవి మెరసీనా
అలివేణులమేలు ఆసపాటేకాక
తలపు వేంకటపతి దగిలీనా

సంసార బంధంలో చిక్కుకున్న మానవుడు యీ వలపులు, మచ్చికలు, తీపిసుద్దులు, ఆడుకునే మాటలు శాశ్వతములని భావిస్తాడు. వయసుతో వీటిలోని ఆభాస తెలుకునేసరికి జీవితము ముగింపుకు వచ్చేస్తుంది. ఈ విషయంలో హెచ్చరికలు చేస్తున్నాడన్నమయ్య.

ఎక్కడి వలపు, ఎక్కడి మోహము (మచ్చిక), ఎక్కడి సుద్దులు? ఈమాటలు నిజములని నమ్మకు.

చరణాలలో దృష్టాంతాలు, పోలికలూ చెప్పి తత్త్వం విశదీకరిస్తున్నాడు.

1. తొలుకారు అంటే వర్షాకాలం. ఆ కాలంలో వచ్చే మెరుపులు ఒక్కసారి

కనిపించి (తోచి) మాయమైపోతాయి. అవి స్థిరంగా (నెలకొని) ఆకాశంలో నిలుస్తాయా? (నిలిచీనా?)

అలాగే స్త్రీల వలపులు ప్రసరించి (పొలసి – పొలయు యొక్క క్త్వార్థక రూపము) మరుగైపోతాయి (పోవు). అవేమీ శాశ్వతమైనవి కావు. కలకాలమూ కడతేరవు.

స్త్రీల వలపులు క్షణికమైన మెరుపులవంటివి.

2. ఎండమావులు దూరంనుంచి నిండుగా పారుతున్న యేటివలె కనిపిస్తాయి. దగ్గరకు పోతే ఏమీ ఉండదు. ఎండమావులు దాహం తీర్చగలవా? తీర్చలేవనడం.

చూడగా (చూడ) స్త్రీల మనస్సులో (నెలతల మది) మోహము నిండా ఉన్నట్టుగా కనిపిస్తుంది (ఉండినట్టే ఉండు) కానీ దానిని ఊతంగా చేసుకుని తరించడానికి వీలుపడుతుందా (వూతమయ్యీనా?) . కాదనడం.

3. కంటినిండా నిదురించేటపుడు (కనుకూర్కు. కూర్కు = నిద్ర) కలలో కనబడిన సిరి కన్నులు తెరిచిన వెనుక (మెలుకువ జూడ) కనిపిస్తుందా?. కనిపించదు.

అలివేణుల వలపు (మేలు) కోసం ఆసపడడమే మిగులుతుంది కాని అది మనసును పరమాత్మ వైపు తిప్పుతుందా? పరమాత్మ చింతనకు మగువల వలపు అవరోధం అని బోధ.

24. ఏమని పొగడుమే యికనిను

ఏమని పొగడుమే యికనిను
ఆమని సొబగుల అలమేల్మంగా

తెలికన్నుల నీ తేటలే కదవే
వెలయగ విభునికి వెన్నెలలు
పులకల మొలకల పొదులివి కదవే
పలుమరు పువ్వుల పానుపులు ॥ఏమని॥

తియ్యని నీమోవి తేనెలే కదవే
వియ్యపు రమణుని విందులివి
ముయ్యక మూసిన మొలకనవ్వు గదె
నెయ్యపు కప్పురపు నెరిబాగాలు ॥ఏమని॥

కైవసమగు నీ కౌగిలే కదవే
శ్రీవేంకటేశుని సిరినగరు
తావుకొన్న మీ తమకములే కదె
కావించిన మీ కల్యాణములు ॥ఏమని॥

అమ్మవారు ప్రకృతి స్వరూపిణి. ఆమెలో వసంత కాలపు సొగసులు పురుషస్వరూపుడైన స్వామికి సంపదలైనవని చమత్కరిస్తున్నాడు అన్నమయ్య ఈ కీర్తనలో.

ఓ అలమేలుమంగమ్మా! నీలోని వసంతశోభను (ఆమని సొబగుల) ఏమని పొగడగలము?

1. నీ తెల్లని కన్నుల తేటవెలుగులే ప్రభునికి వెన్నెలగుచున్నవి.

నీ మేన మొలచిన పులకల దొంతులు నీ స్వామికి పూల పానుపులు.

2 నీ తీపి పెదవుల తేనెలే నీ రమణునికి తేనె విందులు.

నీ మూసీ మూయని (దాచీ దాయని) మొలక నవ్వులే స్వామికి స్నేహపూర్వకమగు (నెయ్యపు) కర్పూరమూ, చక్కని వక్కలూనూ (నెరి బాగాలు). మొలక నవ్వే తాంబూలమనడం.

3. ఆధీనమగు (క్రైవసము) నీ కౌగిలి స్వామివారికి శోభాయమానమైన నివాసస్థానము (సిరి నగరు) లేదా అంతఃపురము.

మీ ఇరువురి నడుమ నెలకొనిన (తావుకొన్న) తమకములే మీకు జరిపించిన కల్యాణములు.

ప్రకృతి పురుషుల సంగమమే వసంతహేల. వసంత కాలములోని వెన్నెల, కుసుమ సంపద, పూలతేనియలు, కర్పూరాది సుగంధ భరితమగు బాగాల విడియములు, ప్రకృతి స్వరూపిణి జగదేక విభునికి సిద్ధపరచుట అందముగా కీర్తనలో అన్నమయ్య నిరూపించినాడు.

25. ఏమొకో చిగురుటధరమున

ఏమొకో చిగురుటధరమున యెడనెడ కస్తూరి నిండెను
భామిని ప్రియునకు వ్రాసిన పత్రిక కాదుకదా

కలికి చకోరాక్షికి కడకన్నులు కెంపై తోచె నీ
చెలువంబిప్పుడిదేమో చింతించరే చెలులు
నలువున ప్రాణేశ్వరుపై నాటిన యా కొనచూపులు
నిలువుగ పెరుకగనంటిన నెత్తురు కాదుకదా ॥ఏమొకో॥

పడతికి చనుగవ మెరుగులు పైపై పయ్యెద వెలుపల
కడు మించిన విధమేమో కనుగొనరేచెలులు
ఉడుగని వేడుకతో ప్రియుడొత్తిన నఖ శశిరేఖలు
వెడలగ వేసవికాలపు వెన్నెల కాదుకదా ॥ఏమొకో॥

ముద్దియ చెక్కుల కెలకుల ముత్యపు జల్లుల చేర్పులు
ఒద్దిక బాగులివేమో ఊహించరే చెలులు
గద్దరి తిరువేంకటపతి కౌగిటి అధరామృతముల
అద్దిన సురతపు చెమటల అందము కాదుకదా ॥ఏమొకో॥

అన్నమయ్య భావుకతకు ఉదాహరణంగా నిలిచే కీర్తనలలో ఇది తలమానికమైనది.

శయనాగారము నుండి వెలుపలకు వచ్చుచున్న అలమేలుమంగ శరీరముపైన గల శృంగారచిహ్నములను చూచి చెలికత్తెలు గుసగుసలతో ఆమెను ఆటపట్టించుట ఇందులోని అంశము.

అలమేలుమంగ చిగురాకు వంటి పెదవులపై (చిగురుటధరమున) అక్కడక్కడ కస్తూరి అంటినదెందుకో? (ఏమి ఒకో – ఏమొకో). అది ఆమె

(భామిని) తన విభుడైన వేంకట పతికి వ్రాసిన ప్రేమలేఖ కాదుకదా!

స్వామిని ముద్దాడుటచే అలమేలుమంగ పెదవులపై స్వామి శరీరమునకు వ్రాసుకొనిన కస్తూరి (నల్లని పరిమళ ద్రవ్యము) అంటినది. దానిని విభునకు వ్రాసిన ప్రేమలేఖ (పత్రిక = లేఖ) కాదుకదా అంటున్నారు చెలులు.

దీనిలోని సారస్యమిది – పెదవులు చిగురాకులు. కస్తూరి నల్లని మచ్చలవలె అంటినది. ఆ రోజులలో వ్రాతలన్నీ (తాటి)ఆకులపై వ్రాయుట ఆచారము. అన్నమయ్య కూడ తన కీర్తనలు ఆకులపైననే వ్రాసెడివాడు. అందుచే దానిని ప్రేమలేఖగా ఉత్ప్రేక్షించుట. ఇట్టి ఉపమానము తెలుగు సాహిత్యమున నాకు తెలిసినంత వరకూ ఎచ్చటనూ లేదు. ఈ భావుకత విషయమున నీతడు శ్రీకృష్ణదేవరాయల, తెనాలి రామకృష్ణుల సరసన నిలువదగినవాడు.

1. మనోజ్ఞమైన (కలికి) ఈ చకోరాక్షి కనుగొనలు (కడకన్నులు) ఎరుపెక్కినవి (కెంపు = ఎరుపు). ఆ సొగసు (చెలువము) ఏమిటో ఓ చెలులారా! ఆలోచించండి. ఇక్కడ చకోరాక్షి అనడం చాలా అందం తెచ్చింది. చకోర పక్షులు వెన్నెలకోసం అలా కనులు తెరుచుకొని కాచుకుని ఉంటాయని ప్రతీతి. ఈమె కూడా రాత్రి నిదురించక పతి కలయికలో జాగరము చేసినదని చమత్కారము.

   ఆ కడకన్నుల ఎరుపుకు ఒక చక్కని కారణము చూపిస్తున్నాడు. ఎంతో అందముగా (నలువు = సౌందర్యము) తన ప్రాణేశ్వరునిపై ఈమె తన కొనచూపులు అను బాణములు నాటినది. కొనచూపులు అన్నపుడు శ్లేష. కడకంటి చూపులు అని ఒక అర్థం. వాడి (కొన)యైన చూపులు అని ఒక అర్థం. ఆచూపుతూపులను మోము తిప్పుకొనునపుడు బలవంతముగా పెరికినది. ఆ పెరుకుటలో విభుని నెత్తురు అంటుకుని ఆమె కడకన్నులు ఎరుపెక్కినవట. ఈ పోలిక కూడా ఇంకెక్కడా వినినదీ కనినదీ కాదు.

2. అలమేలుమంగ చనుగవ యొక్క మెరుపులు ఆమె పైట (పయ్యెద) వెలుపల

కూడా తళతళలాడుచున్నవి (కడు మించినవి). అలా అగుటకు కారణమేమిటో ఓ చెలులారా కనిపెట్టండి చూద్దాం.

ఆమె ప్రియుడు తీరని వేడుకతో (ఉడుగని వేడుక) ఆమె కుచములపై ఒత్తిన శశిరేఖలు (గోటి ముద్రలు) వెన్నెలలు వెలార్చుటచే ఆ వేసవి వెన్నెలకాంతి ఆ తళతళకు కారణము.

3. నాయిక చెక్కిళ్ళ పార్శ్వములలో (కెలకుల) ముత్యాలు కురిసి చేరిన (జల్లుల చేర్పులు) ముత్యాలప్రోవుల అందం ఏమిటో ఓ చెలులారా! ఊహించగలరా?

నిపుణుడైన (గద్దరి = దీనిలో కొంచెం నెగటివ్ అర్థం ఉంది. చెడ్డ పనులలో నేర్పరి అని అర్థం చెప్పుకోవాలి) ఆ వేంకటపతి కౌగిలిలో నున్నపుడు అధరామృతము, సురతపు చెమట అంటి ఆ బిందువులు ముత్యముల వలె ఆమె చెక్కిళ్ళ పార్శ్వముల యందు మెరుస్తున్నవట.

ఈ భావుకత అన్నమాచార్యుని కారాగారములో పడవేసినది. ఈ కీర్తన వినిన సాళువ నరసింహరాయలు తనపై కూడ ఇట్టి కీర్తన చేయమన్నాడట. నారాయణుని నుతించు నాల్కతో నరుని నుతించనని నిరాకరించిన అన్నమయ్యను కారాగారమున బంధించి హింసించెనని కథ.

26. ఏమంటి వేమంటి వెరుగ నేను

ఏమంటి వేమంటి వెరుగ నేను – ఓ
కామిని నీకిప్పుడైన కానవచ్చెగా

వేల తలుపు మీటిన విటుడెవ్వడే – ఓ
తాలిమి నేనే మాధవుడను
వాలిన మాధవుడవంటే వసంతుడవా–కాదే
గాలింపు చక్రము చేత కలవాడనే ॥ఏమంటి వేమంటి?॥

ధర చక్రివైతే కుమ్మరవాడవా – కాదే
సిరుల భూమి ధరించినవాడనే
శిరసున భూమి మోచే శేషుడవా – కాదే
అరయ నిన్నియు నేలే హరినే నేను ॥ఏమంటి వేమంటి?॥

వంతులకు హరివైతే వానరమవా – నీ
మంతనపు లక్ష్మీరమణుడ నేను
ఇంతయేల శ్రీవేంకటేశుడ ననగరాదా – తొల్లి
అంతేపో నామారు నీవంటివి గదవే ॥ఏమంటి వేమంటి?॥

ఒక సరస సంభాషణాత్మకమైన కీర్తన చూదాం. అమ్మవారూ అయ్యవారూ కలహించుకున్నారు. పంతాలు పెరిగినవి. అయ్యవారు కోపంగా బయటకు వెళ్ళిపోయారు. తిరిగి ఆయనను లోనికి రానీయకూడదని నిర్ణయించుకుని అమ్మవారు లోపల తలుపు బిగించుకుని కూర్చున్నారు.

కోపం తగ్గి స్వామి రానే వచ్చారు.

"మంగా తలుపు తియ్యి ఏదో ఇందాక తొందరలో ఏదో అనేసేను" .... ఇక కీర్తనలోకి

'ఏమిటేమిటీ నాకేం తెలీదు" (ఏమంటి వేమంటి వెరుగ నేను) – ఇది లోపలనుంచి ఆవిడ జవాబు. నాకన్నీ తెలుసు అనడం అంతరార్థం.

"ఓ కామినీ! నీకిప్పుడైనా నిజం తెలిసింది కదా (నీ కిప్పుడైన కానవచ్చెగా) ఇప్పటికైనా ఆమె ఆలోచించుకుని నిజం గ్రహించి ఉంటుందని ఈయన ఊహ.

లోపల నుంచి సడీ చప్పుడూ లేదు. కొంచెం సేపు చూచి తలుపు తట్టాడు స్వామి.

అయితే ఆయన బుజ్జగించడానికి 'కామినీ' అని సంబోధించినాడు. కానీ ఈమెకు కోపం తగ్గకపోవడంతో ఆ పిలుపు నచ్చలేదు. ఏమన్నదో చూడండి

1. అల : వేలితో తలుపు తట్టిన 'విటు'డెవ్వరో?

కామినుల వద్దకు పోయేవారు విటులని ఎత్తిపొడుపు. ఈ విట శబ్దం కొన్ని కీర్తనలలో పోసిటివ్ గానే వాడాడు అన్నమయ్య. ఇక్కడ మాత్రం నెగటివ్ గానే వాడినాడు.

స్వామి: ఓ క్షమాగుణమా! (తాలిమి = క్షమ, ఓర్పు, ధైర్యం)నేనే మాధవుడను. తాలిమి పదాన్ని సంబోధనగా ప్రయోగించాడు చిత్రంగా. అది క్షమించమని అర్థం స్ఫురింపజేస్తున్నది చక్కగా.

అల: (మాధవుడు = విష్ణువు, వసంతుడు)

వాలు అంటే వంగు, దిగివచ్చు, క్రూరము ఇలాంటి అర్థాలున్నాయి. అంత వంగి వంగి నంగి మాటలాడుతున్నావు. మాధవుడను అంటున్నావు. మాధవుడంటే వసంతుడవా?. అవతలి వాడు నచ్చనప్పుడు మాటలకు విపరీతార్థాలు తీయడం మామూలే కదా!

స్వామి: వసంతుడను కాదే నేను చక్రధారిని అన్నాడు. (గాలింపు చక్రము = వెదికి వెదికి – గాలించి వేటాడే చక్రాయుధం)

2. అల : చక్రి అంటే కుమ్మరివాడివా?

కుమ్మరి కూడా చక్రం తిప్పుతాడు కదా.

స్వామి: “సిరుల భూమి ధరించిన వాడనే” కుమ్మరివాడు అన్న మాటకి స్వామి చిన్నబుచ్చుకున్నాడు. కుమ్మరివాడు చిన్న మట్టి ముద్దతో పనిచేస్తాడు. కొంచెం బుద్ధి వచ్చేలా సమాధానం చెప్పాలనుకున్నాడు. నేను విలువైన భూమినే ధరించినవాడనే. చిన్న మట్టి ముద్దకాదు, మొత్తం భూమండలమే ఎత్తినవాడిని (వరహావతారం) అన్నాడు.

అల: “శిరసున భూమి మోసే శేషుడవా”

మళ్ళీ ఈవిడ రెండవ అర్థం తీసింది. భూమిని ఆదిశేషుడు పడగల మీద మోస్తాడని ప్రతీతి.

స్వామి: “కాదే ఇన్నిటినీ యేలే హరినే’

శేషుడవా అనడం మరీ ఘోరం. ఆ శేషుడు తనకు వాహనం. తెలిసీ తనను తన వాహనంతో పోల్చడం భరించలేక. వాచ్యంగా చెప్పుకున్నాడు. కాదు నేను వీటినన్నిటినీ (శేషుడు లాంటి వాహనాలు ఇంకా ఉన్నాయని ధ్వని) యేలే యజమానుడను అన్నాడు. పాపం!

3. అల: “వంతులకు హరినంటే వానరమా?”

హరి శబ్దానికి విష్ణువుతో పాటు ఇంద్రుడు, కోతి, సింహం ఇలాంటి అర్థాలున్నాయి. ఈవిడ పట్టువదలకుండా కోతి అర్థం తీసుకుని కోతివా అని అడిగింది

స్వామి: “నీ మంతనపు లక్ష్మీరమణుడనే”

మరీ కోతి అని తట్టుకోలేని దెబ్బ కొట్టినదావిడ. అప్పుడు సూటిగా ఎప్పుడూ నీతో మంతనాలాడే లక్ష్మీరమణుడను అన్నాడు. ఇలా అనడంలో గడుసుదనం చూపించాడు. ఆమె పేరుకలుపుకుని ఆవిడగారి భర్తగా

పరిచయం చెబితే – ఆవిడ ఇక వేరే అర్థం తియ్యలేదు. పైగా నేను భార్యావిధేయుడను అన్నప్పుడు ఇంక సాగతియ్యదు.

అల: "ఇంతయేల శ్రీవేంకటేశుడ ననగరాదా"

ఏది యేమైనా పై మాట అనాలనే పట్టు ఆవిడది. అన్నిమాటలెందుకు 'శ్రీ'వేంకటేశుడ ననరాదా? అన్నది. శ్రీ మాత్రం వదలలేదు. ఆభిజాత్యం అంటే ఇదే!

స్వామి: "అంతేపో నామారు నీవంటివి కదవే"

ఊపిరిపీల్చుకున్నాడీయన. హమ్మయ్య నాబదులు నేనెవరో నీవే చెప్పావు కదా! ఆమె చేతే చెప్పించానని ఒక ఆనందం. ఆమె చెప్పి అలుక వీడినదని మరియొక ఆనందం!

ఇంతకీ ఈ సంవాదంలో ఎవరు నెగ్గినట్లు?

ఇలా ప్రశ్నా, జవాబులతో పద్యం / కవిత వ్రాయడం సాంకేతికంగా 'వాకోవాక్య' నిర్మాణం అంటారు.

27. ఒకపరి కొకపరి ఒయ్యారమై

ఒకపరి కొకపరి ఒయ్యారమై
మొగమున కళలెల్ల మొలచినట్లుండె
జగదేకపతి మేన చల్లిన కర్పూరధూళి
జిగిగొని నలువంక చిందగానూ
మొగి చంద్రముఖి నురమున నిలిపెగాన
పొగరూ వెన్నెల దిగబోసి నట్లుండె ॥ఒకపరి కొకపరి॥

పొరి మెరుగు చేతుల పూసిన తట్టుపునుగు
కరగీ ఇరుదెసల కారగాను
కరిగమన విభుడు దనుక మోహమదము
తొరిగి సామజసిరి తొలచి నట్లుండె ॥ఒకపరి కొకపరి॥

మెరయ శ్రీవేంకటేశు మేన సింగారముగాను
తరచైన సొమ్ములు ధరియించగా
మెరుగుబోడి అలమేలుమంగయు తాను
మెరుపూ మేఘము గూడి మెరసినట్లుండె ॥ఒకపరి కొకపరి॥

ఈ కీర్తనలో ఆ జగదేకపతి సౌందర్య వర్ణన చేస్తున్నాడు అన్నమాచార్యులు. వాగ్గేయ కారులలో ఇంతటి సాహిత్య విలువలు కలిగిన కీర్తనలు చేయగలిగిన వారరుదు.

ఆ జగదేకపతి ఒయ్యారము వర్ణింపనలవి కానిది. సాధారణముగా స్త్రీలలో ఒయ్యారము ప్రస్తావనకు వచ్చును. ఇచట వేంకటేశ్వరునిలోని అందము, లావణ్యము అన్నమాచార్యునికి ఒయ్యారమై భాసించినది. అది చూడగా చూడగా మరింత అధికమగుచున్నది. అందుకే ఒకపరి కొకపరి ఒయ్యారమై అన్నాడు. ఒకమాటి కొకమాటికి పెరుగుతున్నదనడం. అది ఆ దేవదేవుని మోమును కళలతో

నింపి పూర్ణచంద్ర సదృశము చేసినది – కళలు మొలిచినట్లున్నదట ఎంతచక్కని అభివ్యక్తి!

తరువాత ప్రతి చరణములోనూ ఒక హేతువు, ఒక ఉపమానము చెబుతాడు. వాటిలోని అందాలు చూద్దాం.

ఆ జగత్పతి శరీరముపై చల్లిన కర్పూరధూళి నాలుగువైపులా మెరయుచు (జిగిగొని) చిందుచున్నది. అది యెట్లున్నది?

ఆయన పూనికతో (మొగిన్) చంద్రానన యైన శ్రీదేవిని వక్షమున నిలిపుకున్నాడు కదా! ఆమె ముఖచంద్రుడు వెలార్చిన పరిమళముతో కూడిన (పొగరు = తీక్ష్ణమైన గంధము) వెన్నల దిగబోసినట్లున్నది. కర్పూరమునకు పరిమళమూ తెల్లనికాంతి రెండూ ఉంటాయి. అందుకే పొగరూ, వెన్నల దిగబోసినట్లు ఉన్నదనడం. చక్కని ఉపమానం.

స్వామివి దృఢమైన (పొరి) మెరిసే చేతులు. వాటికి తట్టుపునుగు పూసుకున్నాడు. ఆ పునుగు ఆయన చేతులనుండి కరిగి చుక్క చుక్క కారుచున్నది. ఈ తట్టుపునుగు పునుగుపిల్లి అను జంతువునుండి లభించు అరుదైన సుగంధద్రవ్యము.

స్వామి కరిగమనవిభుడు. ఏనుగువంటి నడక కలవాడు. ఏనుగు మదజలము స్రవించును. కరి వలె స్వామినడుస్తూంటే ఆ చేతుల నుండి కారే పునుగు ద్రవ్యము ఏనుగుకు స్రవించే (తొరుగు = స్రవించు) ఆ మదజలము కారుతున్నట్లున్నది. ఇక్కడ తొలిచినట్లున్నది అన్నాడు. మనము గిన్నెలను తొలుస్తాము. అనగా గిన్నెను శుభ్రము చేయడానికి ఒకసారి నీటిధారలో ఆడించి తీసెస్తాము. దానికి తొలచుట అని వ్యహారం. తొలిచిన గిన్నెనుండి నీరు ఓడుతుంది. దానిని ఇక్కడ వాడినాడు. మదజలంలో తొలిచినట్లు పునుగు స్రవిస్తున్నదని భావం. ఎంత సరియైన ఉపమానమో!

శ్రీ వేంకటేశ్వరుడు మెరిసిపోయేటట్లు బోలెడు ఆభరణములు (తరచైన =

సాంద్రమైన, సొమ్ములు = భూషణములు) ధరించినాడు. అది యెట్లున్నది? మెరుగుబోడి (మెరుపువంటి స్త్రీ) యైన అలమేలుమంగతో కలిసి మెరుపూ మేఘమూ కలిసి మెరిసినట్లున్నాడు. ఆమెది మెరుపు వంటి పచ్చని వర్ణమూ, స్వామి నీలమేఘశ్యాముడూ కదా!

దీనిలో మరియొక విశేషమున్నది. మొదటి చరణమునా, మూడవ చరణమునా అమ్మవారిని కూడిన స్వామిని వర్ణించినాడు. నడిమి చరణమున ఒక్క వేంకటేశ్వరుని మాత్రము వర్ణించినాడు. అనగానేమి? అటునిటు శ్రీదేవి భూదేవులను కూడి ఉభయదేవేరుల నడుమ నిలిచిన స్వామిని అన్నమాచార్యుడు దర్శించి చెప్పిన కీర్తన యని భావింపవచ్చును.

సొగసైన కీర్తన.

28. ఓ పవనాత్మజ ఓ ఘనుడా

ఓ పవనాత్మజ ఓ ఘనుడా
బాపు బాపనగా పరగితిగా

ఓ హనుమంతుడ ఉదయాచల ని
ర్వాహక నిజ సర్వ ప్రబలా
దేహము మోచిన తెగువకు నిటువలె
సాహసమిటువలె చాటితిగా ॥ఓ పవనాత్మజ॥

ఓ రవి గ్రహణ ఓ దనుజాంతక
మారులేక మతి మలసితిగా
దారుణపు వినతా తనయాదులు
గారవింప నిటు కలిగితిగా ॥ఓ పవనాత్మజ॥

ఓ దశముఖ హర ఓ వేంకటపతి
పాద సరోరుహ పాలకుడా
ఈ దేహముతో ఇన్ని లోకములు
నీ దేహమెకా నిలిచితిగా ॥ఓ పవనాత్మజ॥

హనుమంతుని మీద చేసిన కొన్ని అన్నమయ్య కీర్తనలు ప్రాచుర్యం పొందాయి. కళశాపురం హనుమంతుడు, హంపీ వద్ద కొండమీది పెద్ద హనుమంతుడు అన్నమయ్యచేత కీర్తింపబడ్డారు. తన వద్ద నున్న శ్రీవారి పూజా విగ్రహం పోతే ఆయన హనుమంతుని ప్రార్థిస్తే అవి తిరిగి లభించినట్టు ఒక కథ కూడా ప్రచారంలో ఉంది.

ఓ పవన కుమారుడా! ఓ ఘనుడా!

అందరూ భళి భళీ (బాపు బాపు) అనగా ప్రవర్తిల్లితివి కదా!

1. ఓ తూర్పుకొండను (ఉదయాచల) నిర్వహించువాడా! హనుమంతుడు ఉదయాచల నిర్వాకుడట్లైనాడో?

దీనికి మా గురుతుల్యులు శ్రీ చిర్రావూరి శివరామకృష్ణశర్మగారిట్లు సమన్వయించిరి. దీనిని బహువ్రీహి సమాసముచేసి "ఉదయాచలముచే నిర్వహింపబడినవాడు" అని విగ్రహ వాక్యం చెబితే – హనుమంతుడు సూర్యుని వద్ద విద్యనభ్యసించునప్పుడు ఉదయాచలముపై ఒక పాదము, అస్తాద్రిపై ఒక పాదము వేసి నిలిచి పాఠము నేర్చుకున్నపుడు ఆయనను ఉదయాద్రి నిర్వహించినది (భరించినది) అని అర్థము వచ్చును.

నిజమైన సర్వ బలములు కలవాడా!

దేహము మోచిన తెగువ – విచిత్రమైన మాట. ఏ దేహమైనా ఇంత తెగువ, ఇంత సాహసము ఇట్లా (ఇటువలె) మోచినది అనుదానిని చాటితివి కదా. కొంచెం త్రిప్పి చెవి చూపించినట్టు చెప్పాడన్నమాట. ఇంత తెగువ యింత సాహసము చెయ్యగల జీవి (దేహము) ఒకడు కలడని చాటిన వాడవు నీవే స్వామీ అనడమన్నమాట. నీ తెగింపూ, సాహసమూ మరి యొకరిచే కానివని పిండితార్థము.

2. ఓ సూర్యుని (ఫలమని) పట్టినవాడా! (రవి గ్రహణ), ఓ రాక్షసాంతకా! ఎదురులేని బుద్ధితో ఉద్యమించినవాడా! (మలయు = ఉద్యమించు, ఉద్రేకించు, తిరుగు, పెనగు, తపించు) మలసితివి కదా అనునప్పుడు పై అర్థములన్నీ సరిపోవును. ఇట్లు ఒక పదమునకు గల నానార్థములు అన్నియు సరిపడునట్లు చెప్పుట కవిబ్రహ్మ తిక్కనగారి పద్ధతి. ఇల్లాంటి పట్లలో ఇతని పాండిత్యము బయటపడును.

దారుణమైన వినతాతనయాదులు: వినత కొడుకు (వైనతేయుడు) గరుత్మంతుడు. అతడు మహాబలవంతుడు. భయంకరమైన (దారుణమైన) బలము గల గరుడి మొదలైనవారే నిన్ను మెచ్చుకొనగా (గారవింప)

ఉన్నావుకదా. అనగా గౌరవింపబడినవాడవు కదా అనుట. ఇక్కడ దారుణము ఆను మాట negative గా వాడలేదు అన్నమయ్య.

3. ఓ దశముఖుడైన రావణుని జయించినవాడా! తిరువేంకటేశ్వరుని పాదపద్మముల కడ క్షేత్రపాలకుడా!

ఈ దేహముతో ఇన్ని లోకములు నీదేహమెకా నిలిచితిగా: ఇది విచిత్రమైన అభివ్యక్తి. అన్నిలోకములూ ఈ నీ దేహములో కనిపించుచున్నవి. అనగా సమస్త విశ్వమూ నీ రూపమే కాన్ (నీరూపమె కా) నీ రూపమే కాగా ఈ దేహముతో నిలిచియుంటివి కదా (నిలిచితిగా).

ఈ కీర్తనకు విచిత్రమైన భావవ్యక్తీకరణ అందము తెచ్చినది. చెప్పిన విషయములు సామాన్యమైనవే.

29. అంగనలీరే హారతులు

అంగనలీరే హారతులు
అంగజ గురునకు హారతులు

శ్రీదేవి తోడుత చెలగుచు నవ్వే
ఆదిమ పురుషున కారతులు
మేదినీ రమణి మేలములాడేటి
ఆదిత్య తేజున కారతులు ॥అంగనలీరే॥

సురలకు నమృతము సొరిది నొసంగిన
హరికివే పసిడి హారతులు
తరమిది దుష్టుల దనుజుల నడచిన
అరి భయంకరున కారతులు ॥అంగనలీరే॥

నిచ్చలు కల్యాణ నిధియై యేగేటి
అచ్యుతునకు నివె హారతులు
చొచ్చి శ్రీవేంకటేశుడు నలమేల్మంగ
యచ్చుగా నిలిచిరి హారతులు ॥అంగనలీరే॥

ఇది స్వామి వారి హారతి పాట.

అంగనామణులారా! హారతులీయరే!

మన్మధుని కన్నతండ్రికి (అంగజ గురుడు = భర్త, ఇక్కడి సందర్భంలో మన్మధుని తండ్రి) హారతులీయరే!

1. ఆ మహాలక్ష్మితో చేరి నవ్వులొలుకు ఆ ఆదిపురుషునికి హారతులీయరే. పుట్టిల్లైన పాలకడలిలో మహాలక్ష్మి ఉంటే ఆయన ఆదిశేషునిపై అక్కడే శయనిస్తాడు. ఆయన దగ్గర అమ్మవారుంటే ఆయన వక్షమునందు ఆమె రాణివాసము. వీరిది విడదీయరాని బంధము.

ఆ భూదేవి (మేదిని = భూమి. మేదినీరమణి = భూదేవి) మేలములాడేటి రవితేజునికి హారతులీయరే!

స్వామి సూర్యమండలంలో వసిస్తాడు. ఆయనను చుట్టి అమ్మవారు భూదేవియై నిరంతరము ప్రదక్షిణ చేస్తుంది.

శ్రీదేవికీ భూదేవికీ బేధం లేదు. అదీ ఈ చరణంలో ప్రతిపాదించిన సత్యం.

2. సురలకు (దేవతలకు) అమృతము వరుసగా (సొరిది) ఇచ్చిన ఆ శ్రీహరికి బంగారు హారతులీయరే. ఇక్కడ చిన్న చమత్కారం. దేవతలకు హరి ఇచ్చిన అమృతము తాగిన తరువాతే సురలు (సుర త్రాగినవారు) అని పేరువచ్చింది. అంతకు ముందు వారు "సురలు" కారు. సురలకు అమృతము ఇచ్చాడనడం కొంటెతనం.

శత్రుభయంకరుడై దనుజులను అణచివేసిన శక్తిమంతునకు (తరము = శక్తి) హారతులు.

3. నిత్యకల్యాణమూర్తి యైన అచ్యుతునకు హారతులు.

శ్రీవేంకటేశ్వరుడూ, అలమేలుమంగ ఇచటచేరి (చొచ్చి) ఆదర్శదంపతులై (అచ్చు = ఆదర్శము, గుర్తు, విగ్రహము) నిలిచియున్నారు. ఇక్కడ అన్ని 'అచ్చు'కు గల అర్థాలూ సరిపోతాయి. ఇలా ఒక పదానికి గల అర్థాలన్నీ అన్వయించేలా చెప్పడం కవిబ్రహ్మ తిక్కన గారి పద్ధతి. ఓ అంగనామణులారా హారతులెత్తండి.

౩౦. అంతర్యామీ అలసితి సొలసితి

అంతర్యామీ అలసితి సొలసితి
అంతట నీశరణిదె జొచ్చితిని

కోరిన కోర్కులు కోయని కట్లు
తీరవు నీవవి తెంచక
భారపు పగ్గాలు పాపపుణ్యములు
నేరుపుల బోనీవు నీవు వద్దనక ॥అంతర్యామీ॥

జనుల సంగముల జక్క రోగములు
విను విడువవు నీవు విడిపించక
వినయపు దైన్యము విడువని కర్మము
చనదిది నీవిటు శాంతపరచక ॥అంతర్యామీ॥

మదిలో చింతలు మైలలు మణుగులు
వదలవు నీవవి వద్దనక
ఎదుటనె శ్రీవేంకటేశ్వర నీవదె
అదన గాచితివి అట్టిట్టనక ॥అంతర్యామీ॥

సంసార యాతనలు పడిపడి ఇక పడలేక, వానినుండి విడివడలేక జీవాత్మ చేసే శరణాగతి ఈ కీర్తన.

లోపల నుండే వాడు అంతర్యామి. ఈ జీవుడు బాహ్యావ్యవహారాలలో మగ్నుడై ఆ బంధములను త్రెంచుకొనలేక దీనుడై అలసిపోయినాడు. లోకంలో వాడు అలుపూ సొలుపూ లేకుండా పనిచేస్తున్నాడనడం మనం వింటాం. ఇక్కడ అందుకే అన్నమయ్య అలసితి, సొలసితి అన్నాడు. ఇక బయటి వ్యవహారాలలో అలసిపోయి ఎక్కడికీ పోలేక తనలోపల ఉన్నవాడితోనే మొరపెట్టుకుంటున్నాడు.

అందుకే నీ శరణు 'ఇదె' జొచ్చితిని అనడం. జొచ్చు అంటే లోనికి పోవుట. ఇది సాభిప్రాయ ప్రయోగం.

1. మనసులో కోరుకున్న కోరికలు నన్ను బంధించి కట్టిన కట్లు. కట్టు అనగా బంధనము, ధరించిన వస్త్రము (కట్టు బొట్టు), నియమము (కట్టుబాటు),తినే పదార్థము (పెసరకట్టు వలె), చెప్పు కల్ల (కట్టు కథ), చేసే మాయ (కనికట్టు) ఇత్యాది అర్థములున్నవి. స్వామీ నేను కోరికలకు బందీని. కోరికలను చుట్టుకుని తిరిగెదను. కోరికలే నా నియతి. కల్లలు కోరి చెప్పుదును. కోరి మాయలుచేసి జీవించెదను. ఈ "కట్లు" నేను విడిపించుకొనజాలను. అవి నీవు'తెంచక' తెగవు

   ఈ పాపపుణ్యములు బరువైన పగ్గాలు. తాటి తడపలతో పేనే తాళ్ళు వాటి మందాన్ని బట్టి పలుగులు, పగ్గాలు మొదలైన పేళ్ళతో వ్యవహరించబడతాయి. అతిమందమైన తాళ్ళు పగ్గాలు. పాపపుణ్యములు కూడా నన్ను కట్టిపడవేసే పగ్గములవంటివి. పాపపుణ్యములు వర్తులములు. పాపం చేయుట. దాని ఫలితమనుభవించుట. పుణ్యము చేయుట. ఫలితమునకెదురు చూచుట. ఇవి నీవు"వద్దనక" నన్ను నిను జేరు ఋజుమార్గమున పోనీయవు.

2. దారా పుత్ర బాంధవ సేవకాదులు నాచుట్టూ ఉండు జనులు. వీరి సంగము నుండి నాకై నేను తప్పుకొనజాలను. అట్లే ఈ భవరోగముల నుండీ నా యంత నేను విడివడలేను. విను పదమునకు ఆకర్షణ అని అర్థమున్నది. వీని ఆకర్షణలనుండి నీవు "విడిపించక" నేను బయలుపడలేను.

   ప్రతివాని ముందూ చేతులు కట్టుకొని నిలువ వలసిన దైన్యమునూ, నను వెన్నాడు కర్మబంధములునూ నీవు "శాంతింపజేయక" ఉపశమింపవు.

3. స్వామీ నా మనస్సులో మలినమైన ఆలోచనలు (మదిలో చింతలు మైలలు) మణుగుల కొద్దీ యున్నవి. మణుగు బరువుకు కొలత. ఎనిమిది వీశలు ఒక మణుగని గుర్తు. నీవు "వద్దనక" అవి వదలవు

నా ఎదుట గల ఓ దేవా! (అంతర్యామి శరణాగతి చేసిన తరువాత ఎదుట నున్నట్టు అనుభూతి చెందినాడు) వేంకటేశ్వరా! నను అట్టిట్టనక (అటూ చెప్పక ఇటూ చెప్పక) బ్రోచితివి. పరమాత్మ భాష మౌనము.

అన్నమయ్య క్రియలను చిత్రవిచిత్రములుగా ప్రయోగించును. ఇదివరలో కొన్ని చూపించియున్నాను. ఈ కీర్తనలో తెంచక, వద్దనక, శాంతపరచక, విడిపించక, అట్టిట్టనక ఇత్యాది వ్యతిరేక క్త్వార్థక రూపములు వాక్యముల చివరల ఉపయోగించి పాదములను ముగించుట ఒక సున్నితమైన అందము.

31. కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ

కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ
తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ

వేదములే శిలలై వెలసినది కొండ
యేదెస పుణ్యరాసులే యేరులైనదీ కొండ
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ
శ్రీ దేవుడుండేటి శేషాద్రి యీ కొండ

సర్వదేవతలు మృగ జాతులై చరించే కొండ
నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ
వుర్వితపసులే తరువులై నిలచిన కొండ
పూర్వపుటంజనాద్రి పొడవాటి యీ కొండ

వరములు కొటారుగా వక్కణించి పెంచే కొండ
పరగు లక్ష్మీకాంతు సోబనపు కొండ
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ
విరివైనదిదివో శ్రీవేంకటపు కొండ

కడు + ఎదుర = కట్టెదుర

మనకు అత్యంత సమీపంలో (కట్టెదుర) వైకుంఠమునకు ఆవాసస్థానమైనదీ తిరుమల కొండ. తిరుమలయే వైకుంఠమనడం. దీని మహిమలు తేనెతుట్టెల వలె అలముకొని యున్నవి. (తెట్టెలాయె)

1. ఇచట వేదములే శిలలు. అన్ని దిశలలోనూ పుణ్యరాశులే యేరులు. బ్రహ్మలోకమూ మొదలైన లోకములు ఈ కొండకొనలలో ఉంటాయి. ఇదే శ్రీస్వామి యుండేటి శేషాచలము.

2. ఇక్కడ దేవతలు మృగజాతులై చరిస్తారు. సముద్రములు నిడివిగల కొండచరియలుగా అమరి విధులు నిర్వహిస్తాయి. ఇచ్చట భూమిపై కల తపస్వులు చెట్లుగా అమరియుందురు. పొడవైన ఈ సనాతనమైన (పూర్వపు) కొండ అంజనాద్రి యను పేర నిలచియున్నది.

3. తాను వరములను నిలువచేసే కొటారమునని (కొటారము = కొట్టు) ప్రకటించి (వక్కణించి) మరీ నిలిచిన కొండ. ఇక్కడ ఏ వరములు కావలిస్తే అవి దొరుకుతాయనడం.

లక్ష్మీకాంతునకిది శోభాయమానమగు నివాసము.

సంపదలు వర్షించి ఈ కొండయొక్క గుహలు నిండి యున్నవి.

ఇది వేంకటగిరి అనే పెద్ద కొండ (విరివి యైనది)

శేషాద్రి శిఖరము ఊర్ధ్వలోకములకు నిలయము (బ్రహ్మలోకము కొండకొన. స్వామి స్వయముగా ఇచట నివసించును).

అంజనాద్రి ఆమర లోకము నుండి భూలోక పర్యంతము వ్యాపించినది (ఇక్కడ దేవతలు మృగములు. భూలోకము నందలి ఋషులు చెట్లు. వీరు ఇచ్చట కలిసి యున్నారు).

వేంకటాద్రి సంపదలకు స్థానము (కోశాగారము) మరియు వరప్రదాయిని.

ఇవీ దీనిలో ప్రతిపాదించబడిన విషయాలు.

32. కడలుడిపి నీరాడగా తలచు వారలకు

కడలుడిపి నీరాడగా తలచు వారలకు
కడలేని మనసునకు కడమ యెక్కడిది?

దాహమణగిన వెనుక తత్త్వమెరిగెద నన్న
దాహమేలణగు తా తత్త్వమేలెరుగు
దేహంబు గలయన్ని దినములకును పదార్థ
మోహమేలుడుగు తా ముదమేల కలుగు ॥కడలుడిపి॥

ముందరెరిగిన వెనుక మొదలుమరిచెదనన్న
ముందరేమెరుగు తా మొదలేల మరచు
అందముగా తిరువేంకటాద్రీశు మన్ననల
కందువెరిగిన మేలు కలనైన లేదు ॥కడలుడిపి॥

కడలు అంటే అలలు. కడలి అంటే సముద్రం. అలలు అడగిన తరువాత సముద్రస్నానం చేద్దామనుకోవడం, (నీరాడగా తలచు వారలకు), మనసులో ఆలోచనలు తగ్గిన తరువాత భగవత్ప్రార్థన చేద్దామనుకోవడం అయ్యే పనే? కడలి అలలకు, మనసులో ఆలోచనలకు అంతు ఉన్నదా? (కడమ యెక్కడిది?)

ఇహలోకము నందు పుట్టే దాహములు అణగిన తరువాత ముదిమిలో భగవంతుని తత్త్వ చింతన చేయనెంచితే – ఈ దాహం అణిగేదెపుడు తత్త్వమెరిగేదెపుడు?

దేహమున్నన్నాళ్ళూ పదార్థముల పట్ల మోహమూ తొలుగదు. ముదమూ కలుగదు.

ముందు ప్రాపంచిక సుఖములనెల్ల జూచి పిదప వీటిని మరిచిపోయెద ననిన అది సాధ్యమగునదియేనా?

ఆ వెంకటాద్రిపతిని ధ్యానించి మన్నన పొందుటకన్నా వేరే మేలు కలలో కూడా లేదు.

ఇది మానసబోధా విధానము. సంసారము నందు మునిగి తేలుచునే ఆధ్యాత్మ విద్య సాధింపవలయును. ఇట్టి కీర్తనలు పెక్కులు కూర్చినాడు అన్నమయ్య. అలతి అలతి పదములు. అందరికీ అర్థమగు విధములు.

33. కలలోన ఇరువురము అలిగి

కలలోన ఇరువురము అలిగి వేగ
కలయనుచు తెలిసి నిను కౌగిలించితిరా

అలుగుదురె సతులు పతులనగా వినగ
నలవాటు లేక నేనలుగు చుండుదురా
అలిగితటా వురక నీవంత నాతోను మరి
యలుగులౌనట పూవు లంతలోపలనే ॥కలలోనె॥

చందురుడె సూర్యుడై జరగ మిగుల
కెందమ్ములౌనుర కెంగేలు దోయి
గందమే తోచెనట కస్తూరి యనగ నా
చందమపు డొకలాగు చందమౌనటరా ॥కలలోనె॥

విటవరుడ కోనేటివిభుడ నీ
విటు దొలంగిన దేహ మెట్టు నిలుపుదురా
యిటువలెనె మనలోని నెలమి మరచి
తటుకునను గలయనుచు తలకి తెలిసితిరా ॥కలలోనె॥

ఇది ఒక తమాషా కీర్తన. రాత్రి తనకు వచ్చిన కల గురించి స్వామికి వివరిస్తున్నది అలమేలుమంగమ్మ. సున్నితమైన భావాల సమాహారమిది.

రాత్రి నాకు కల వచ్చినది. కలలో ఒకరిపై ఒకరము అలిగినాము. అంతలోనే మెలుకువ వచ్చినది. ఓహెూ! కలయే కదా అని ఊరడిల్లి వెంటనే నిన్ను కౌగిలించుకొంటిని. కలలో కూడా నీపై అలుకతో దూరము కాలేనని చెప్పడం అన్నమాట.

1. కలలో జరిగిన సంగతులు చెప్పుచున్నది. సతీపతులు ఒకరిపై ఒకరు

అలుగుతూండే ముచ్చటలు ఎవరో చెప్పుకుంటూంటే విన్నాను. అలవాటు లేకపోయినా (!!!) కలలో నీపై అలుగుతున్నానుట. (అలవాటు లేక నే నలుగుచుండుదురా). దానితో నీకూ కోపం వచ్చిందిట. నీవు కూడా ఊరకే అలిగి అక్కడినుండి వెడలిపోయితివట (ఊరక నాతోను నీవలిగితట). నీవు లేక నీపై విరహము కలిగినది. అప్పుడు అక్కడి పూలు బాణాలై పోయాయిట (అలుగు లౌనట పూలు అంతలోపలనే).

2. అప్పుడేమైందో తెలుసా? చంద్రుడు సూర్యునిలా వేడిగా ఐపోయాడు (చందురుడె సూర్యుడై మిగుల జరుగ – వెన్నెల వేడెక్కిపోయి భరించలేకపోయినా ననుట). అసలే నాచేతులు ఎర్రగా ఉంటాయి (కెంపు + కేలు = కెంగేలు. ఏర్రని చేతులు). అవి ఆ వేడికి ఎర్రతామరల వలె మరింత ఎరుపెక్కినవి (కెందమ్మి లౌను. కెంపు + తమ్ములు = కెందమ్ములు = ఎర్ర తామరలు). సూర్యుని రాకతో తామరలు వికసిస్తాయి. చంద్రుడే సూర్యుడనాడు కనుక చేతులు ఎర్రతామలైనాయని సారస్యము.

అంత కందిపోయిన చేతులకు చల్లగా గంధం రాసుకుందామని గంధం తీసుకున్నాను. ఆ వేడికి అది మాడిపోయి కస్తూరి అయిపోయిందిట (గందమే తోచెనట కస్తూరి యనగ). కస్తూరి నల్లగా ఉంటుంది. గంధం ఆ విరహం వేడికి మాడిపోయి కస్తూరి వలె నల్లబడినదని భావము. అప్పుడు నా వాలకము (చందము) అదోలాగ అయిపోయిందిట (ఒకలాగు చందమౌనట).

3. ఓ విటవరుడవగు కోనేటి రాయడా! చిత్రమైన సంబోధన విభుని విటుడా అని పిలవడం. ఓ శృంగారరాయా! అని పిలుపు. దీనిని అన్నమాచార్యుడు చాలా చోట్ల పోజిటివ్ గానే వాడేడు. నీవు ఇలా మన మధ్య మచ్చికలు మరచి (ఇటు వలెనే మనలోని యెలమి మరచి. ఎలమి = మచ్చిక, స్నేహము) విడిచిపెట్టి వెళ్ళిపోతే (ఇటు దొలంగిన) నేను జీవించి ఎలా ఉంటాను? (దేహమెట్టు నిలుపుదు?)

ఇలా అనికోగానే చటుక్కున (తటుకునను) భయము వేసి (తలకి) మెలుకువ వచ్చినది. అపుడు కలయని తెలుసుకున్నాను.

ఎంత చక్కని కూర్పు?

కల గురించి చెప్పడం కదా. అందుకే పలుచోట్ల 'అట' ప్రయోగం చేసేడు. కలలో అలా అయిందిట, ఇలా అయిందిట అని చెప్పడం మామూలే కదా.

విరహావస్థలో చంద్రుడు సూర్యుడవ్వడం, వెన్నెల వేడెక్కడం, చేతులు ఆ వేడికి కందిపోవడం, గంధం కస్తూరి వలె నల్లగా మాడిపోవడం, దేహము నిలుపుట కష్టమవడం ఇన్ని అతిశయోక్తులు ఎంత సరసంగా, సున్నితంగా కల్పించినాడో. ఓహో అన్నమయ్యా నీ భావుకతకు జోహారు!

34. కానవచ్చి కానరాదు కమలాక్ష నీ మాయ

కానవచ్చి కానరాదు కమలాక్ష నీ మాయ
తానె వెంట వెంట తగిలీనిదివో

తొల్లి నీవు గలవు తోడనే నేను గలను
ఎల్లగ ఈ ప్రపంచము ఇంతా గలదు
కొల్ల ఎద్దులప్పటివే గోనేలే కొత్తవైనట్లు
చల్లని నేనొకడనే జన్మములే వేరు

వేదములు నాటివే వినుకులు నాటివే
ఆదినుండి చదివేనదియే నేను
వేదతో వెన్నబట్టి నేయి వెదకబోయినట్లు
దాదాత నా తెలివి ఇతరుల నడిగెను

వైకుంఠము ఉన్నది వరములు ఉన్నవి
ఈకట శ్రీ వేంకటేశ యేలితి నన్ను
కైకొని పువ్వు ముదిరి గ్రక్కన పిందయినట్లు
నీకు శరణన గాను నేనీడేరితిని

ఇది ఒక మంచి తత్త్వబోధకాత్మకమైన కీర్తన.

ఓ కమలముల వంటి కన్నులు గలవాడా! (కమలాక్షా) నీ మాయ తెలిసినట్టుగానే ఉంటుంది. కానీ తెలియలేము (కానవచ్చి కానరాదు). దానిని తెలుసుకోవడం సులభమైన పని కాదు.

1. స్వామీ! ముందు (తొల్లి) నీవుంటివి. పక్కనే (తోడనే) నీవు సృజించిన నేనుంటిని. సరే ఇక్కడే సమస్తమైన (ఎల్ల = అంతా) ప్రపంచమూ ఉంది. ఈ ఎద్దుల సమూహము (కొల్ల = సమూహము) పాతదే. గోనెలే కొత్తవి. అంటే ఏమిటి? గోనెసంచులు ఈ శరీరాలు. ఇవి కొత్తకొత్తగా

పుట్టుకొస్తాయి. కానీ వాటిలోని ఆత్మలు మాత్రం పాతవే అనడం. నేను మాత్రం ఒకడనే (నా లోని ఆత్మ నిత్యమైనది). కానీ జన్మములే వేరు.

నీవూ, ఈ ప్రపంచం అలాగే ఉన్నాయి. నేను మాత్రం జన్మకొక 'సంచి' (గోనె-శరీరము) మార్చుకుంటున్నాను. ఇదే మాయ. ఇదే నేను గుర్తించలేక పోతున్నాను. అదే నీ మాయ.

2. స్వామీ! వేదాలూ ఎప్పటినుంచో ఉన్నవే (నాటివే). వాటిని విని నేర్చుకోవడం (వినికి + లు = వినుకులు = వినడాలు) ఎప్పటినుంచో ఉన్నదే. నేను ప్రతి జన్మలోనూ (ఆదినుండి) అవే చదువుతున్నాను. కానీ అవి చదివే సరికి జన్మ ఐపోతోంది. చదవడమే గాని అవి ప్రతిపాదించిన నిన్ను తెలుసుకోలేక పోతున్నాను. ఇది ఎలా ఉన్నదంటే వేదములు అనే వెన్న చేతపెట్టుకుని నెయ్యి కోసం వెదకినట్లున్నది. (వేద = వేదసముదాయము. వేదనే అనడానికి వేదతో అన్నాడని గమనించాలి. అపుడపుడు ఒక విభక్తికి మరొకటి వాడతాడు అన్నమయ్య గారు). ఇంకొక పోలిక చెబుతున్నాడు. నా తెలివి చూడు స్వామీ! ఎదురుగా నీవుంటే నువ్వెక్కడుంటావని గట్టిగా (దాదాత = గట్టిగా, రూఢిగా) ఇతరులను అడుగుతున్నాను. ఇదే నీ మాయ.

3. వైకుంఠమూ ఉంది. వరాలూ ఉన్నాయి. ఉంటే ఉండనీ. నాకొద్దు. ఎదురుగా (ఈకట) నీవున్నావు. నిన్ను శరణు జొచ్చుచున్నాను. నేను 'పువ్వు ముదిరి గ్రక్కన పిందైనట్టు' ఫలము పొందితిని. పువ్వు కనిపిస్తుంది. అది ఎపుడు పిందెగా మారిందో కనిపెట్టలేము. అదే దైవ మహిమ. అలాగే ఆ భగవంతుని శరణాగతి చేసినవాడు తనకు తెలియకుండానే తరిస్తాడు. ఇదే మాయ.

35. కులుకక నడవరో కొమ్మలాలా

కులుకక నడవరో కొమ్మలాలా
జలజల రాలీని జాజులు మా యమ్మకు

ఒయ్యనే మేను కదలీ నొప్పుగా నడవరో
గయ్యాళి శ్రీపాద తాకు కాంతలాల
పయ్యెద చెరగు జారీ భారపు గుబ్బలమీద
అయ్యో చెమరించె మాయమ్మకునెన్నుదురు ॥కులుకక॥

చల్లెడి గందవొడి మై జారీ నిలువరో
పల్లకి వట్టిన ముద్దు బణతులాల
మొల్లమైన కుందనపు ముత్యాల కుచ్చు లదర
ఘల్లనుచు గంకణాలు గదలీ మాయమ్మకు ॥కులుకక॥

జమళి ముత్యాల తోటి చమ్మాళిగలిడరో
రమణికి మణుల హారతులెత్తరో
అమరించి కౌగిట నలమేలుమంగ నిదే
సమకూడె వేంకటేశ్వరుడు మాయమ్మకు ॥కులుకక॥

అలమేల్మంగమ్మ అమ్మవారిని వేంకటేశ్వరుని సన్నిధికి పల్లకీలో వేంచేపు చేస్తున్నారు. పల్లకీ కొంచెం కుదుపులకు గురియైనది. భక్తాగ్రేసరుడైన అన్నమయ్యకు తల్లికి జరిగిన అసౌకర్యమునకు వేదన కలిగినది. ఆ పల్లకీ మోసే ఆడబోయీలను అజమాయిషీ చేస్తున్నాడు.

ఓ పడుచులారా (కొమ్మలాలా) కులుకు నడకలు మానండి. ఆ కుదుపులకు పల్లకీలోని మా తల్లికి తలలో తురుముకున్న జాజులు జలజలా రాలి పడుచున్నవి.

1. ఓ గయ్యాళి లక్ష్మీ పాదదాసీలారా – చక్కగా నడవండి (ఒప్పుగా నడువరో).

లోపల అమ్మకు కుదుపులకు చిన్నగా మేను కదులుచున్నది. అది అసౌకర్యమనుట.

శ్రీపాద తాకు కాంతలార – అని సంబోధన. శ్రీ పాదములను తాకగల వనితలు అనగా పాద దాశీలు అని అర్థం.

ఆమె కుచసీమ పైనుండి పైట చెంగు జారుచున్నది (పయ్యెద చెరగు జారీని). అయ్యో ఆమె అందమైన నుదురుపై చెమట పడుతున్నది. (చెమరించె నెన్నుదురు).

2. ఈ మృదు పదముల అన్నమయ్య దాసీలను కూడా కొంచెం కటువు పదములతో మందలించలేదు. మొదటి చరణములో గయ్యాళి శ్రీపాద తాకు కాంతలార! అన్నాడు కదా. గయ్యాళి అనే పదమే పరుషంగా ఉన్నదనుకున్నట్లున్నది. రెండవ చరణంలో ఓ ముద్దు పడతులారా! అని సంబోధన మార్చాడు.

పైజల్లు కొనిన గంధపుపొడి జారిపోవుచున్నది. అతిశయించు (మొల్లపు) ఆమె బంగారు చీరకొంగు ముత్యాల కుచ్చులు అదురుచున్నవి. కంకణాలు ఆ అదురుకు ఘల్లుమనుచున్నవి. ఇక ఆ కులుకునడకలు ఆపండి అని హెచ్చరిస్తున్నాడు. మొత్తానికి పల్లకీ ఆగినది.

3. అమ్మవారు కాలు క్రింద పెట్టబోతున్నది. ముత్యాల పావుకోళ్ళు (చమ్మాళిగలు = పాదుకలు, పాదరక్షలు) రెండూ (జమళి = జత) సిద్ధంగా పెట్టండి. ఆమె చక్కనిది (రమణి) కనుక దీటుగా మణి హారతులు ఇయ్యండి.

చివరికి అలమేలు మంగమ్మ శ్రీవేంకటేశ్వరుని కౌగిలి చేరినది. హమ్మయ్య! అన్నమయ్య ఊపిరి పీల్చుకున్నాడు.

36. కైవల్యమునకంటె కైంకర్యమెక్కుడు

కైవల్యమునకంటె కైంకర్యమెక్కుడు
శ్రీవిభుడ నీవు మాకు జిక్కే మర్మమిదివొ

చేపట్టి నీశిరసు పూజించే అహమిక కంటే
నీ పాదాలూ పూజించే నీమ మెక్కుడు
మాపుదాకా నినుగొల్చి మందమేళమౌగంటె
దాపగు నీదాసుల శేషత్వమెక్కుడు ॥కైవల్యమున॥

హరి నీ ప్రసాదజీవినై గర్వించుట కంటే
నరయ నీ దాసుల లెంకౌ టెక్కుడు
వెరపున నీ చెవిలోవిన్నపాలు చేయుటకంటే
ధర నీ వూడిగకాండ్ల తలపించుటెక్కుడు ॥కైవల్యమున॥

జట్టి మిమ్ము ధ్యానించి సాయుజ్యమందుట కంటె
అట్టె నీ నామ ఫలమందుటెక్కుడు
ఇట్టె శ్రీవేంకటేశ యేలితి విందు వంకనే
తిట్టపు మా గురు సందేశమెక్కుడు ॥కైవల్యమున॥

ఈ కీర్తనలో హరిదాసులకు సేవ చేయడం హరిసేవ కన్న మిన్నయను విషయము అన్నమయ్య వివరిస్తున్నాడు.

ఓ లక్ష్మీపతీ! (శ్రీవిభుడ) నిన్ను చిక్కించుకునే కిటుకు (మర్మము) తెలుసుకున్నాను. కైవల్యమునకు పడు పాట్ల కన్న సులువైన మార్గము హరిదాసుల "సేవ" అని తెలిసినది. (కైవల్యమున కన్న కైంకర్య మెక్కుడు).

1. చేతులతో నీ శిరసును పూజించితినను అహంకారము/గర్వము కంటె నీ పాదములను నియమముతో సేవించుటయే ఎక్కువ. నీపాద దాసుడే మిన్న యనుట.

చీకటి పడునంత వరకూ నిన్ను కొలిచి తరువాత సావాసగాళ్ళతో కలిసి నిను ఉపేక్షించుట కన్న, దగ్గరలోని (నీకు దగ్గరవారైన యనుట) నీ దాసుల దాస్యము (శేషత్వము) మేలు.

2. ఓ హరీ! నీ ప్రసాదము గైకొంటినను గర్వము కంటే, నీ దాసులకు సేవకుడ నగుట (లెంక = సేవకుడు) ఎక్కువ.

భయముతో రక్షణకై నీ చెవులలో విన్నపములు సేయుట కంటె నీకు ఊడిగము సేయువారల స్మరించుట మేలు సేయును (తలపించు = స్మరించు).

3. మిమ్ము పట్టుకొని ధ్యానించి సాయుజ్యము సంపాదించు కంటె, మీ నామ స్మరణము మేలు. ఈ వంకనే (నీ దాసుల సేవ చేయుటచే) నన్నేలినావు స్వామీ!

దిట్టయగు మా గురుబోధ వలన దీనిని సాధించితిని.

37. కొనరో కొనరో మీరు కూరిమి మందు

కొనరో కొనరో మీరు కూరిమి మందు
ఉనికి మనికి కెల్లా ఒక్కటే మందు

ధ్రువుడు గొనిన మందు తొల్లి ప్రహ్లాదుడు
చవిగా గొనిన మందు చల్లని మందు
భవరోగములు వీడి పారగ పెద్దలు మున్ను
జవకట్టుకొనిన నిచ్చలమైన మందు ॥కొనరో కొనరో॥

నిలిచి నారదుడు కొనిన మందు జనకుడు
గెలుపుతో కొని బ్రతికిన యా మందు
మొలచి నాలుగు యుగముల రాజులు ఘనులు
కలకాలము గొని కడగన్న మందు ॥కొనరో కొనరో॥

అజునకు పరమాయువై ఒసగిన మందు
నిజమై లోకమెల్లా నిండిన మందు
త్రిజగములు నెరుగ తిరువేంకటాద్రిపై
ధ్వజమెత్తే కోనేటి దరినున్న మందు ॥కొనరో కొనరో॥

రామదాసు గారి కాలానికి అన్నమయ్య కీర్తనలు వెలుగు చూశాయో లేదో తెలియదు కానీ రామదాసు గారు కూడా "రామజోగి మందూ కొనరో ఓ జనులార" అని రామజోగి మందు మార్కెట్ చేశారు. అయితే అప్పటికి కొన్ని శతాబ్దాల ముందే అన్నమాచార్యుడు కూడా అలాగే తిరువేంకట గిరిపై కోనేటి దరిని ధ్వజస్తంభం ప్రాంతంలో ఉన్న మందును కొనరో కొనరో అని ఆ కూరిమి మందును ప్రజలవద్దకు తీసుకుని వెళ్ళారు.

కొనరో కొనరో అనడంలో శ్లేష. తీసుకొనరో అని ఒక అర్థం, ఖరీదు చేయరో అని ఒక అర్థం.

ఇది ఉండడానికి (ఉనికికి) జీవించాడానికి (మనికికి) ఉపయోగపడే మందు.

1. ఈ మందు ఇదివరకు ధ్రువుడు, ప్రహ్లాదుడూ రుచి మరిగి (చవిగా) పుచ్చుకొన్న చల్లని మందు. అంతేకాదు. ఇంతకు ముందు ఎందరో పెద్దలు భవరోగాలు పోవడానికి (పారగా) అనుసంధించుకొన్న (జవగట్టుకొన్న) నిజమైన (నిచ్చలమైన) మందు. రండి మీరు కూడా పుచ్చుకోండి.

2. నారదుడు వాడిన మందిది. జనక మహరాజు జయమని (గెలుపుతో) కొని బ్రతికిన మందు. యుగయుగాలుగా పుట్టిన (మొలిచిన) రాజులు అన్నికాలములలో (కలకాలము) తీసుకొని చిట్టచివర కైవల్యము (కడ గన్న = చివర చూచిన, కట్టకడపటిది కైవల్యమని అన్నమయ్య) పొందిన మందు. మీరు కూడా వాడండి.

3. బ్రహ్మదేవునికి (అజునికి) ఆయువిచ్చినదిది. లోకాలన్నీ నిండినదిది. ముల్లోకాల వారికీ యిది తిరు వేంకటాద్రి మీద కోనేటి దరిని ధ్వజస్తంభము పక్కనే నిలిచియున్నదని తెలుసు. దీనిని మీరు కూడా “సేవించండి”

38. కొమ్మ తన ముత్యాల కొంగు జారగ

కొమ్మ తన ముత్యాల కొంగు జారగ బగటు
కుమ్మరింపుచు తెచ్చుకున్నదీ వలపు
కుమ్మరింపుచు తెచ్చుకున్నదీ

ఒయ్యారమున విభుని ఒరపు కనుగొనిరెప్ప
ముయ్యనేరక మహా మురిపెముననూ
కయ్యంపు కూటమికి కాలు దువ్వుచు నెంత
కొయ్యదనమున తెచ్చుకున్నదీ వలపు
కుమ్మరింపుచు దెచ్చుకున్నదీ ॥కొమ్మ॥

ఎప్పుడూ పతితోడ నింతేసి మేలములు
ఒప్పవని చెలిగోర నొత్తగానే
ఎప్పుడో తిరువేంకటేశు కౌగిట గూడి
కొప్పు కులుకుచు తెచ్చుకొన్నదీ వలపు
కుమ్మరింపుచు తెచ్చుకున్నదీ ॥కొమ్మ॥

అన్నమయ్య ఆలయం లోనికి ప్రవేశించినాడు. కల్యాణోత్సవమునకై అయ్యవారిని, అమ్మవారిని అలంకరించినారు. అపుడు అమ్మవారికి కట్టిన చీర కొంగు కొంచెముగా జారినది. ఆ దృశ్యము అన్నమయ్య కనుల బడినది. ఆ పరమ భావుకాగ్రేసరుడు తలపులలోనికి జారిపోయినాడు. అతని అంతరంగమున ఒక కీర్తన రూపు దిద్దుకొన్నది. ఒక చక్కని శృంగార సంకీర్తన మనకు దక్కినది.

అలమేలు మంగ విభుని ఓరగా చూచినది. స్వామి వారి విలాసము (ఒరపు) ఆమెను ముగ్ధరాలిని చేసినది. ఆమె రెప్ప కూడా మూయుట మరచి (రెప్ప ముయ్యనేరక) ఆ సౌందర్యాబ్ధిలో ఓలలాడుచూ మురిసిపోవుచున్నది. (మహా మురిపెము)కొంగు సవరించుకొనుటయే మరచినది.

ఆ దృశ్యము ఎట్లున్నది?

పగటు అనగా లావణ్యము. అలమేలు మంగ తన ముత్యాల కొంగు జారగా తన లావణ్యమును కుమ్మరించుచు విభుని వలపు కొని తెచ్చుకొన్నట్లున్నది!

అంతియ కాదు. ఆయనతో ఎట్టైన కలయవలయునను కోరికతో "కయ్యంపు కూటమి" కి కాలుద్రవ్వునట్లు ఒకవిధముగా కొంచెము మొరటుదనము (కొయ్యదనము) ప్రదర్శించినట్లున్నది. కట్టలు తెంచుకొనిన భావుకత అన్నమయ్యది.

ఇది చూచి ప్రక్కన యున్న చెలికత్తె ఆమెను పతితో "ఇంతేసి" మేలమాడుటలు తగదు అని మెల్లగా గోరితో గిచ్చినది. అప్పటికే ఆమె ఊహలలో శ్రీవేంకటేశు ని కౌగిలిలో నొదిగి (ఎప్పుడో శ్రీ వేంకటేశు కౌగిట గూడి)

కొప్పుకులుకుచూ మరింత లావణ్యము సంతరించుకున్నది.

కొప్పుకులుకుట అనగా మిక్కిలిగా కులుకుట అని కాబోలు. ఈ పదమునకు శ్రీ రవ్వా వారు తమ నిఘంటువులో ఈ కీర్తనయే పాఠముగా చూపి అర్థము ఈయక ప్రశ్నార్థకము (?) వేసి వదిలివేసినారు.

ఇది అన్నమయ్య భావుకతకు, అలమేల్మంగా వేంకటేశ్వరులను చూడగనే ఆయనకు కలుగు తన్మయతకూ అద్దము పట్టే కీర్తన. ఒక చిన్న విషయముపై వెంటనే స్ఫురించిన భావమును ఒక కీర్తనగా చెప్ప గలిగిన అన్నమాచార్యుని స్ఫూర్తికి ఉదాహరణమీ కీర్తన.

39. కొమ్మలాల ఎంతవాడే గోవిందరాజు

కొమ్మలాల ఎంతవాడే గోవిందరాజు
కుమ్మరించీ రాజసమే గోవిందరాజు

ఉలిపచ్చి నవ్వులతో ఒత్తిగిలి పవళించి
కొలువు సేయించుకునీ గోవిందరాజు
జలజాక్షు లిద్దరును సరిపాదా లొత్తగాను
కొలది మీర మెచ్చీనీ గోవిందరాజు ॥కొమ్మలాల॥

అదె నాభికమలాన అజుని పుట్టించి తాను
కొద లేక ఉన్నవాడు గోవిందరాజు
చెదరక తనవద్ద సేవసేసే సతులకు
గుదిగుచ్చీ వలపులు గోవిందరాజు ॥కొమ్మలాల॥

ఒప్పుగా వామకరము ఒగిచాచి వలకేల
కొప్పు తగ నెత్తినాడు గోవిందరాజు
ఇప్పుడు శ్రీవేంకటాద్రి నిరవై శంఖుచక్రాల
కుప్పె కటారము బట్టె గోవిందరాజు ॥కొమ్మలాల॥

అన్నమయ్య పదాలు పలువిధములు. ఈ కీర్తన చెలికత్తెలు తమలో తాము అనుకుంటున్న ముచ్చట.

ఓ భామినులారా (కొమ్మలాల) ఈ గోవిందరాజు ఎంత గొప్పవాడో/ అందగాడో (ఎంతవాడె) రాజసము ఒలకబోస్తున్నాడు (కుమ్మరించీ రాజసము)

1. ఒకవైపుకు తిరిగి (ఒత్తిగిలి) పవ్వళించినాడు. మోములో ఉలిపచ్చి నవ్వు ఎంత అందముగా ఉన్నదో! కవులు నవ్వులలో అనేక బేధములు వర్ణిస్తారు. మనం సాధారణంగా లేతనవ్వు అంటాం. అంటే లీలగా కనిపించే నవ్వు

అని. దానిని అన్నమయ్య పచ్చినవ్వు అన్నాడు. అంతేకాదు ఉలిపచ్చి నవ్వట. అనగా కొంచెం పచ్చినవ్వు అనిఅర్థం. నులివెచ్చని నీరు వలె.

వెనకటికి ఆంధ్ర శేషగిరిరావు గారనుకుంటాను – తిక్కన గారు వర్ణించిన నవ్వులు ఒక వంద వరకూ ఉన్నాయని ఒక వ్యాసం వ్రాసేరట. తిక్కన గారు కూడా అన్నమయ్య వలెనే అచ్చతెలుగు పదాలు గుదిగుచ్చుతారు.

ఈ గోవిందరాజులు ఉలిపచ్చి నవ్వుతో ఒత్తిగిలి పడుకుని కొలువుదీరినాడు. కాదు కాదు కొలువు చేయించుకున్నాడు. అందమైన అభివ్యక్తి.

దేవేరు లిరువురూ రెండు పాదాలూ ఒత్తుతూంటే (సరిపాదా లొత్తగానూ) ఎంత మెచ్చుకొన వచ్చో అంత (కొలది మీర) మెచ్చుకుంటున్నాడు. పాదము లొత్తినపుడల్లా భేష్ బావుంది అని ఆమోదం తెలుపుతున్నాడన్న మాట! అదీ రాజసం కుమ్మరింపు!

2. అదిగో నాభికమలంలో బ్రహ్మను పుట్టించి కొదవలేకుండా ఉన్నాడు. సృష్టి కర్తను సృష్టించిన వాడికి కొదవేమిటి? కనిపెట్టుకుని (చెదరక) తనకు సేవచేసే పరిచారికలకు నెయ్యపు (వలపులు) ప్రోగులిస్తున్నాడు.

3. తగినట్టుగా (ఒగి) యెడమచేయి (వామకరము) అందంగా చాచి, కుడిచేతితో (వలకేల) కొప్పు పైకెత్తినాడు. అంటే కుడిచెయ్యి తలక్రింద పెట్టుకున్నాడు. అప్పుడు కొప్పు (శిరసు భాగం) పైకి లేచినది.

ఇతడెవరో కాదు. వేంకటాద్రిపై శంఖచక్రములు, కుప్పె గల నందకమను కటారి దాల్చిన ఆ శ్రీవేంకటేశ్వరుడే!

కుప్పె కటారము = గుబ్బ (knob) కలిగిన కత్తి.

40. కొలని దోపరికి గొబ్బిళ్ళో

కొలని దోపరికి గొబ్బిళ్ళో యదు
కులము స్వామికిని గొబ్బిళ్ళో

కొండ గొడుగుగా గోవుల గాచిన
కొండొక శిశువుకు గొబ్బిళ్ళో
దుండగంపు దైత్యుల కెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్ళో ॥కొలని దోపరికి॥

పాప విధుల శిశుపాలుని తిట్టుల
కోపగానికిని గొబ్బిళ్ళో
ఏపున కంసుని యిడుమల బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్ళో ॥కొలని దోపరికి॥

దండి వైరులను తరిమిన దనుజుల
గుండె దిగులునకు గొబ్బిళ్ళో
వెండి పైడి యగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్ళో ॥కొలని దోపరికి॥

ఇది గొబ్బిపాట. ఆడపిల్లలు ముగ్గువేసి మధ్యలో గొబ్బెమ్మ (ఆవుపేడతో కోన్ వలె చేసినది) పెట్టి దానిపై గుమ్మడి, తంగేడు పూలు అమర్చి దానిచుట్టూ తిరుగుతూ ధనుర్మాసంలో పాటలే గొబ్బి పాటలు. గోపికల పాటలే గొబ్బెమ్మపాటలైనాయని కొందరంటారు. ఏదైతేనేమి? గొబ్బీయల్లో గొబ్బీయల్లో అని ముక్తాయిస్తూ కృష్ణుని స్తుతి చేసే పాటలివి.

కొలనును దోచుకున్నవాడికి గొబ్బిళ్ళు. కృష్ణుడు కొలనులో పూచిన పద్మాలను దోచుకున్నాడు. ఆయన పద్మహస్తుడు. పైగా యిల్లాలికి పట్టుకోవడానికీ (పద్మహస్త) కూర్చోవడానికీ (పద్మాసన) కూడా పట్టుకుపోయాడు. శంఖము

కూడా నీటిలోనిదే. అదీ కొల్లగొట్టినాడు. కొలనిలో శోభ కమలములే. ఇంకొక విషయం. శంఖమూ, పద్మమూ నవ నిధులలోని రెండు నిధుల పేర్లు.

యదుకులమును ఏలినవానికి (స్వామికి) గొబ్బిళ్ళు (నమస్కారములు).

1. కొండ (గోవర్ధన పర్వతము) గొడుగు వలె ఎత్తి పట్టి గోవులను రక్షించిన చిన్న (కొండొక) శిశువుకు గొబ్బిళ్ళు. కొండొక అనగా చిన్న అని అర్థము. కొండ పెద్దది. శిశువు అంటేనే చిన్నపిల్లవాడు. అన్నమయ్యకు మరీముద్దు. కొండొక శిశువు అంటున్నాడు. చిన్న చిరుతడు అనుకుందాం. కొండకు కొండొకకు ప్రాసవేసి పరిమాణములో తారతమ్యము చూపించడం ఉత్తమ రచనాశిల్పము.

   దుండగులైన రాక్షసులందరికీ తలగుండు గండడైన క ృష్ణయ్యకు గొబ్బిళ్ళు (నమస్కారములు). నేరంచేసినవాళ్ళకు నెత్తిమీద బరువైన రాయి పెట్టి నడిపించడం ఒక శిక్ష. అలా పెట్టే రాయిని తలగుండు అంటారు. గండడు అంటే బలవంతుడు. కృష్ణుడు దైత్యులకు తలగుండు వంటి వీరుడు. అణిచివేస్తాడన్నమాట.

2. పాపపు పనులు (పాపవిధులు) చేసే శిశుపాలుని తిట్లకు కోపగించిన వానికి గొబ్బిళ్ళు (నమస్కారములు).

   దట్టముగా (ఏపుగ) కంసుని కష్టాల (ఇడుములు = కష్టములు) పాలుజేసిన గోపబాలునికి గొబ్బిళ్ళు (నమస్కారములు).

3. రాక్షసుల గుండెదిగులైన వానికి, బలమైన శత్రువులను (దండి వైరులు) తరిమిన వానికి గొబ్బిళ్ళు (నమస్కారములు).

   వెండి పైడి యగు – వెండికొండ (కైలాసం), బంగారు కొండ (మేరుపర్వతం) లకు సమానమైన యీ వేంకటగిరిపై వెలసిన వాడైన (కొండలయ్య) వేంకటపతికి గొబ్బిళ్ళు (నమస్కారములు).

41. కంటి కంటి నిలువు చక్కని మేను దండలునూ

కంటి కంటి నిలువు చక్కని మేను దండలునూ
నంటు చూపులను చూచే నగుమోము దేవుని

కనకపు పాదములు గజ్జెలూనూ అందెలూనూ
ఘన పీతాంబరముపై కట్టు కట్టారీ
మొనసి వడ్డాణపు మొగపున మొలనూలు
ఒనర నాభికమలం ఉదర బంధములూ ॥కంటి కంటి॥

గరిమ వరదహస్త కటిహస్తములునూ
సరసనటిల శంఖచక్ర హస్తములూ
ఉరముపై కౌస్తుభమూ ఒప్పగు హారములు
తరుణి అలమేల్మంగా ధరణి భామయును ॥కంటి కంటి॥

కట్టిన కంఠసరులు ఘన భుజకీర్తులు
కట్టాణి ముత్యాల శృంగార నామము
నెట్టన శ్రీవేంకటేశ నీకు కర్ణపత్రములు
అట్టే శిరసుమీద అమరే కిరీటము. ॥కంటి కంటి॥

అన్నమయ్య పరమ భావుకుడు. సాధారణంగా వాగ్గేయకారులలో సంగీతం పాలు ఎక్కువ, సాహిత్యం పాలు తక్కువ ఉండడం గమనించవచ్చు. రాగానికి సరిపడ పదములు కూర్చుటయే వాగ్గేయకారుల ప్రధానాశయంగా ఉంటుంది. ఏ కొద్దిమందో సాహిత్య విలువలు కూడా పాటించి ముందు వరుసలో నిలుస్తారు. అట్టి వారిలో అన్నమాచార్యునిది అగ్రతాంబూలం.

ఈ కీర్తనలో వెంకటేశ్వరుని రూపం వర్ణిస్తున్నాడు అన్నమాచార్యుడు. దేవతాస్వరూపములను పాదముల నుండి కేశముల వరకూ వర్ణించడం సంప్రదాయము. అది ఈ కీర్తనలో పాటించబడింది.

నిలువెత్తు చక్కనిమేనువాడైన (నిలువు చక్కని మేను) ఆ వేంకటపతి దండలూ (దండలు అనడంలో బాహువులు అనీ, పూలమాలలు అనీ రెండర్థాలు – బాహువులు మేని అందానికి సంబంధించినవి. పూలమాలలు మేని అలంకారానికి సంబంధించినవి) నగుమోము కలవాడు. ఆ నగుమోము మామూలు మోము కాదు. 'నంటు'చూపులు చూచే మోము. నంటు అంటే స్నేహము అని అర్థము. అలా నిలబడి స్నేహభావంతో చూస్తూ ఉన్న ప్రసన్నమైన నగుమోము వానిని వర్ణిస్తున్నానని పల్లవిలో చెప్పినాడు.

బంగారు పాదాలూ, వాటికి గజ్జెలూ కడియాలు. ఆపై మెరిసిపోయే పసుపు పట్టు పంచా (పీతాంబరము). దానిపై కట్టిన నందకము అనే కటారి. ఆపై పూనికతో (మొనసి) పెట్టుకున్న వడ్డాణము. దాని మొగపున కనబడుతున్న మొలత్రాడు.

మొగపు అంటే బెల్టు పెట్టుకోవడానికి buckle ఉంటుందికదా. అలాంటిది. దానినే మనం clasp అనికూడా అంటాము. మొగపు ఎంత చక్కని పదమో.

ఆపైని నాభిలో కమలమూ, ఉదరానికి బిగించి కట్టుకున్న అదనపు బంధనాలూ తరువాత గొప్పవైన (గరిమ) వరద హస్తమూ, కటి హస్తమూ. ఈ స్వామి వరద ముద్రమాత్రమే పడతాడు. అభయముద్రకు బదులు ఒక హస్తాన్ని ఒయ్యారంగా నడుమున పెట్టుకుంటాడు.

గరిమ అష్టసిద్ధులలో ఒకటి. ఆ స్వామిని దర్శనంచేస్తే చాలు అనుకున్నవి సిద్ధిస్తాయని ధ్వని.

సరసన శంఖచక్రహస్తములు కనిపిస్తున్నవి. ఇక్కడ 'సరసనటిలు' అని ఉన్నది. ("నటిలు" = ? నటించు. కాని ఈ శబ్దము నిఘంటులలో లేదు)

ఉరమున కౌస్తుభమణీ, చక్కని (ఒప్పగు) హారములు. వక్షముపై అల్మేలుమంగ (శ్రీదేవి), భూదేవి కొలువుతీరియున్నారు.

ఆపై కంఠసరులు (ఇవి బంగారు ఆభరణాలు. కంఠసరులు ఒకరకమైన బంగారు గొలుసులు) భుజకీర్తులు.

కట్టాణి ముత్యాల నామము నుదుటన రాజిల్లుచున్నది.

ఆణిముత్యాలు అంటాము. ఆణి అనగా గుండ్రని, శ్రేష్ఠమైన అని అర్థము. ముత్యాలకు ఆణి ఒక విశేషణము. అంతేకాక మరొక విశేషణము వేసేడిక్కడ. కడు అనగా మిక్కిలి, అత్యంత అని అర్థాలు.

కడు + ఆణి = కట్టాణి (ద్విరుక్త టకారసంధి)

అత్యంత శ్రేష్టమైన ముత్యాలతో కూర్చిన నామము అన్నమాట.

అనివార్యముగా (నెట్టన) ఓ వేంకటేశ్వరా నీవు ధరించు కర్ణపత్రములూ (చెవులకు పెట్టుకునే ఆభరణాలు)

ఆ విధముగానే (అట్టే) నీ శిరసున అమరిన కిరీటమూ

కంటి కంటి అని ప్రతి చరణము చివరా క్రియను ఆమ్రేడితముగా వాడినాడు. అనగా ఆ రూపమును చూచినానని నొక్కి చెప్పడమన్న మాట. అంతే కాదు. ఆమ్రేడితము అను పదమునకు స్తుతి అని కూడా అర్థము. కాబట్టి ఒకటికి రెండు సార్లు స్తుతిస్తున్నానని శ్లేష / ధ్వని.

ఈ కీర్తనలో నెట్టన శ్రీవేంకటేశ అను నపుడు వేంకటేశ పదము అన్నమయ్య ముద్రగా వాడలేదు. వేంకటేశుడు అనే అర్థంలోనే వాడేడు. (ఒక్కొక్క వాగ్గేయకారుడు ఒక్కొక్క పదం వారి గేయమును గుర్తు పట్టు ఒక ప్రతీకను వాడుదురు. త్యాగరాజ ముద్ర ఒకరిది. గుహ ముద్ర ఒకరిది. అట్లే వేంకటేశ ముద్ర అన్నమయ్యది). వాగ్గేయకారుడు తన ముద్రను ముద్రగా కాక నామవాచకముగా వాడుట ఒక చమత్కారము.

42. కంటి శుక్రవారము గడియలేడింట

కంటి శుక్రవారము గడియలేడింట
అంటి అలమేల్మంగ వెంటనుండే స్వామిని

సొమ్ములన్నీ కడబెట్టి సొంపుతో గోణము గట్టి
కమ్మని కదంబము కప్పు పన్నీరు
చెమ్మ తోడ వేష్టువలు రొమ్ము తల మొల జుట్టి
తుమ్మెద మైచాయతోనా నెమ్మది నుండే స్వామిని
॥కంటి శుక్రవారము॥

పచ్చకర్పూరమె నూరి పసిడిగిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ దిగ నలది
అచ్చెరుపడి చూడ అందరి కన్నులకింపై
నిత్యమల్లె పూవువలె నిండుగనుండే స్వామిని ॥కంటి శుక్రవారము॥

తట్టుపునుగే కూరిచి చట్టలు చేరిచి నిప్పు
పట్టి కరగించి వెండి పళ్యాల నించి
దట్టముగ మేను నిండ పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియుచుండే బిత్తరి స్వామిని ॥కంటి శుక్రవారము॥

ప్రతి శుక్రవారం స్వామివారికి అభిషేకం జరుగుతుంది. అది చూచి అన్నమయ్య మన కన్నులకు కట్టినట్టు వర్ణిస్తున్నాడు.

ముహూర్తం శుక్రవారం ఏడుగడియలకు. మన తెలుగు లెక్కల ప్రకారం ఒక దినమునకు ఎనిమిది జాములు (అంటే ఒక జాము = 3 గంటలు)

ఒక జామునకు ఏడున్నర గడియలు.

రాత్రి పన్నెండు దాటి ఏడు గడియలు అంటే ఉదయం మూడుగంటలన్న

మాట. ఇప్పటికీ అభిషేకం శుక్రవారం తెల్లవారుజాము (3 గంటలు) ననే జరుగుతున్నది.

అలమేలుమంగ ఆయన వక్షముననే కలదు కదా. అందుకే అంటి అలమేలుమంగ ఉన్నదనడం.

ఆభరణములన్నీ (సొమ్ములన్నీ) ఒక చివర పెట్టేసి (కడబెట్టి) అందంగా గోచీ (గోణము) కట్టినారు. కదంబము అనగా మిశ్రమము. కమ్మని కదంబము అంటే పరిమళ ద్రవ్యాల మిశ్రమము. అనేక పరిమళ ద్రవ్యాలు కలిపి ఆ మిశ్రమము పన్నీటిలో కలిపి నారన్నమాట. ఇక్కడ కప్పు పన్నీరు అన్నాడు. కప్పు అంటే (cup) కాదు. కప్పుట అని అర్థము. ఆపరిమళ ద్రవ్యాలను పన్నీటితో కప్పి(ఆచ్ఛాదించి) – ఆ కదంబాన్ని పన్నీట కలిపినారని పిండితార్థము.

తడి ఉత్తరీయం (వేష్టకము) రొమ్ము మీద, తలపైన, మొల (కటి) పైనచుట్టినారు.

అభిషేకానికి ఏర్పాట్లు పూర్తి అయినవి. అపుడు స్వామి తుమ్మెదమైచాయతో నెమ్మదిగా ఉన్నారట. చాలా చక్కనిమాట. తుమ్మెద నల్లనిది. తుమ్మెదవంటి నలుపు చాయతో ఆయన అందంగా ఉన్నాడు. స్వామి వారి రంగును తుమ్మెద దేహచాయతో పోల్చటం నేనైతే మొదటిసారి చూశాను. ఇది ఎలా పట్టుకువచ్చాడో అన్నమయ్య. ఒక ఆసక్తికరమైన విషయమేమంటే తుమ్మెదకు పర్యాయ పదములలో “కృష్ణదేహము” ఒకటి.

బంగారు గిన్నెలలో నూరిన పచ్చ కర్పూరం నింపినారు. దానిని తల నుంచి పాదాల వరకూ అలదినారు. దిగనలది అనగా పైనుండి క్రిందికి అలదినారని భావము. ఈ దిగ పదము లోకవ్యవహారమున దట్టముగా అని అర్థంలోవాడతాము. ఆభరణలు దిగవేసుకున్నాడు అంటాము. అందుచే దట్టముగా నలది అనికూడ అర్థము చెప్పుకొనవచ్చును. అలా పచ్చకర్పూరం అద్దితే ఆయన కనులకింపుగా నిత్యమల్లె పువ్వులా మెరిసినాడట.

తరువాత తట్టుపునుగు (పునుగు పిల్లి నుండి వచ్చు ఒక పరిమళ ద్రవ్యము. ఆ పిల్లి స్వేదమట) తెచ్చి చట్టలు (ఒక కొలత) చేసి, సెగమీద కరిగించి వెండి పళ్యాలలో నించినారు. దానిని ఒంటికి పట్టించగా మురిసిపోతూ మనోహరమైన (బిత్తరి) స్వామిని చూచినాను (కంటి).

అభిషేక సేవ సమారంభం కన్నులకు కట్టినట్టుగా ఈ కీర్తనలో అద్భుతంగా మనముందుంచాడు సంకీర్తనాచార్యుడు.

43. గాలినే పోయా కలకాలము

గాలినే పోయా కలకాలము
తాలిమికి గొంతయు పొద్దులేదు

అడుసు జొరనే పట్టె అటూనిటు కాళ్ళు
గడుగుకొననే పట్టె కలకాలము
ఒడలికి జీవునికి ఒడయడైనా హరి
తడవగ సుంతయు బొద్దు లేదు ॥గాలినే పోయా॥

కలచి చిందగ బట్టె కడవ నింపగ బట్టె
కలుష దేహపుబాధ కలకాలము
తలపోసి తనపాలి దైవమైన హరి
దలచగా గొంతయు బొద్దు లేదు ॥గాలినే పోయా॥

శిరము ముడువగబట్టె చిక్కుతియ్యగబట్టె
గరిమల గపటాల గలకాలము
తిరువేంకటగిరి దేవుడైన హరి
దరిచేర గొంతయు బొద్దు లేదు ॥గాలినే పోయా॥

మానవ జన్మకు పరమావధి మోక్షము. కానీ మానవుడు ఆ యెరుక లేక జీవితము వృధాగా గడిపివేస్తాడు. కనీసం హరి నామ స్మరణకు కూడా సమయమే కొరవడుతుంది..... ఇది మనందరి కథే.

గాలినే పోవు = గాలికి తిరుగు, వ్యర్థముగా తిరుగు (అ.మాం.ప.కో)

నేను కాలమంతా (కలకాలము) వ్యర్థముగా తిరుగుచున్నాను. కొంచెమైననూ నాకు ఓరిమి (తాలిమి) తో ఆలోచించుటకు సమయము (పొద్దు) దొరకదు.

1. ఎప్పుడూ అడుసు త్రొక్కడమే. కాళ్ళు కడుగుకొనడమే. దీనితోనే పొద్దు పుచ్చుచుందును. ఇక్కడ అడుసు అంటే సంసారమను బురదయే. ఈ శరీరమునకూ (ఒడలికి),దానిలోని జీవునికీ ప్రభువైన (ఒడయడు = ప్రభువు) ఆ హరిని తలచుటకైననూ సమయము లేదు.

2. ఈ దేహము ఒక కుండ. దీనిని పరిశుభ్రమైన భక్తి జలముతో నింపవలె. కానీ దీనిని ఎప్పటి కప్పుడు కొంచెం నీరు చిలకరించి పారబోసి నీటితో నింపుకోవడమే. మనం పూజ అనేసరికి అపవిత్రః పవిత్రోవా అని మొక్కుబడికి సబాహ్యాభ్యంతరశ్శుచిః అనుకోవడమే కాని నిజమైన శుచిని అలవరచుకోము. ఈ దేహము అశుచి కారణంగా బాధలకు లోనగుచున్నది. శుచినై హరిని కొలుచుటకు మాత్రము నాకు సమయము లేదు.

3. జీవితమంతా చక్కగాదువ్వి కురులు ముడుచుట. మరునాటికి అది చిక్కులు పడుట. మరల చిక్కుదీయుట. ఈరీతిగానే గడచిపోవుచిన్నది. ఇదే గొప్ప (గరిమ) యనుకొని ఈ కపటనాటకమునే కలకాలమూ సాగించుచున్నాను.

తిరువేంకటపతిని "నిజముగా" ధ్యానించుటకు నాకు సమయము చిక్కుట లేదు.

జీవుడు తనలో తాను మథనపడు రీతి చక్కని సామెతలతో స్వామికి విన్నవిస్తున్నాడు అన్నమయ్య.

(అ.మాం.ప.కో = అన్నమయ్య మాండలిక పదకోశము)

44. గురుతెరిగిన దొంగ కూగూగూ

గురుతెరిగిన దొంగ కూగూగూ వీడు
గురిలోనె దాగీనె కూగూగూ

నెలతల దోచీని నీళ్ళాడగానే
కొలని దరిని దొంగ కూగూగూ
బలువైన వుట్ల పాలారగించీని
కొలది మీరిన దొంగ కూగూగూ ॥గురుతెరిగిన॥

చల్లలమ్మగ చనుకట్టు దొడకీని
గొల్లెతలను దొంగ కూగూగూ
యిల్లిల్లు దప్పక యిందరి పాలిండ్లు
కొల్లలాడిన దొంగ కూగూగూ ॥గురుతెరిగిన॥

తావుకొన్న దొంగ దగిలి పట్టుడిదె
గోవులలో దొంగ కూగూగూ
శ్రీవేంకటగిరి చెలువుడో యేమో
కోవిదుడగు దొంగ కూగూగూ ॥గురుతెరిగిన॥

ఇది భగవంతుడు భక్తునితో ఆడే దొంగాట. గురుతెరిగిన దొంగ కూగూగూ వీడు గురిలోనె దాగీనె కూగూగూ. ముందు "కూగూగూ" అంటే యేమిటో విచారిద్దాం. ఇది తందనాన తాన లాగా ఒక ఊతపదం. ప్రతి పాదం చివరా వాడడం వల్ల ఒకరకమైనఊపు తెప్పిస్తుందిది. దీనికి అర్థం చెప్పాలంటే కూగు + కూగు అని విడదీయాలి. కూగు అంటే అరుపు (ఆవులు కాసేవారు గో..ఓ...ఓ అని అరిచేమాదిరి). కూగూగూ అంటే ఒకరకమైన కేక. లేదా కూగు + ఊగు అప్పుడు ఒక కేక ఒక ఊపు అవుతుంది, ఆడుతూ పాడేపాట అని పిండితార్థం.

ఇక పల్లవికి సామాన్యార్థం. దీనిలో చిన్ని కృష్ణుని దొంగతనాలు

వర్ణిస్తున్నాడు. దానికి ఉపోద్ఘాతంగా – వీడు గుట్టుమట్లన్నీ తెలిసిన దొంగ (గురుతెరిగిన దొంగ). వీడు యుక్తి (గురి)గా దాక్కుంటాడు.

దీనిలో విశేషార్థం యేమంటే – వీడికి విశ్వస్వరూపమంతా తెలుసు. ఆ విశ్వం వీడే అనడం. వీడు దానికి చిహ్నమైన పరమాణువులో దాగిఉంటాడు. అన్నీ తానైనా కంటికి కనబడ డనడం.

1. నీళ్ళాడడానికి వెళ్ళిన గోపికలను కొలను దగ్గర దోచుకున్న దొంగ. భారమైన ఉట్లలోని పాలు ఆరగించి చెలరేగిన (కొలది మీరిన) దొంగ.

2. చల్లలమ్మే గోపికల చనుకట్టు తడుముతాడు (తొడకు = తొణికిసలాడు). వీడికి ఎప్పుడూ పాలు తాగాలనే రంధే. ఆది చాలక యిల్లిల్లూ తిరిగి వారి పాలిండ్లలో దాచుకున్న పాలు కొల్లగొడతాడు.

   (పాల × ఇండ్లు = పాలిండ్లు. పాలు పెట్టుకునే గదులు. పూర్వం పాడిగల వారిండ్లలో పాలగదులు విడిగా ఉండేవి)

3. అదిగో గోవులమంద మధ్యలో నిలబడి ఉన్నాడే (తావుకొను = నిలచు) వాడే ఆ పాలదొంగ. వెళ్ళి పట్టుకోండి (తగిలి పట్టుడిదె). వీడే ఆ వేంకటాద్రి పైన వెలసినవాడు. వాడు బాగా నేర్పరియైన దొంగ (కోవిదుడౌ దొంగ). జాగ్రత్తగా పట్టుకోవాలి.

   ఏమిటీ పాలదొంగతనం?

మనలో కొన్ని నైపుణ్యాలు ఉంటాయి. కానీ అవి భగవంతుని తెలుసుకొనడానికి చాలవు. అవే పాలు. అవి స్వీకరించి స్వామి వాటికి పదును పెట్టి పాలలో దాగిన పెరుగు, దానినుండి వెన్న, దానినుండి నెయ్యి తయారు చేసినట్టు ఆ నైపుణ్యాలను పుణ్యాలుగా మార్చి భక్తినిచ్చి శరణాగతి సేయించడమే అంతరార్థం. దానికి మనలోని అహమ్ భావం (నేను నాది అను భావన) అంచెలంచెలుగా తొలగించడమే ఆ పాలదొంగ లక్ష్యం. ఆయన గురుతెరిగిన దొంగ.

45. చక్కని తల్లికి చాంగు భళా

చక్కని తల్లికి చాంగు భళా తన
చక్కెర మోవికి చాంగు భళా

కులికెడు మురిపెపు కుమ్మరింపు తన
సళుపు చూపులకు చాంగు భళా
పలుకుల సొంపుల పతితో గసరెడి
చలముల యలుకకు చాంగుభళా ॥చక్కని తల్లికి॥

కిన్నెరతో పతి కెలన నిలుచు తన
చన్ను మెరుగులకు చాంగు భళా
ఉన్నతి బతిపై నొరిగి నిలుచు తన
సన్నపు నడిమికి చాంగు భళా ॥చక్కని తల్లికి॥

జందెపు ముత్యపు సరుల హారముల
చందన గంధికి చాంగు భళా
విందై వేంకట విభు బెనచిన తన
సంది దండలకు చాంగు భళా ॥చక్కని తల్లికి॥

తన ఆరాధ్య దైవమైన అలమేలు మంగమ్మను కీర్తిస్తున్నాడీ కీర్తనలో అన్నమయ్య.

భాషలో ప్రశంశావాచకాలు కొన్ని ఉన్నాయి. చాగు, చాంగు, భళా, భళీ, భళారే, సెబాసు, శహభాష్ ఇత్యాదులు. వీటిలో చాగు (పొదవైన, ప్రశంశ) భళా (సెబాసు) ఇక్కడ ఉపయోగించాడు.

అమ్మ చక్కని తల్లి. ఆమెకు సెబాసు

ఆమె తీయని పెదవులకు సెబాసు

1. ఆమెవి సళుపు చూపులు. (సళుపు = సలుపు) ఆమె చూపులు తాకినచో అవి కూర్చోనివ్వవు. ఆ పారవశ్యం తీయని తీపులు పెడుతుంది. ఆ సళుపు చూపులు కులుకుల మురెపములు కుమ్మరించుచున్నవి. ఆ చూపులకు సెబాసు.

ఆమె కొంచెం పట్టుదలతో (చలములు) చనువుగా స్వామి వారిని గసరెడు సొంపులొలుకు మాటలకు సెబాసు.

2. మీటే కిన్నెర పట్టుకుని శ్రీవారి పక్కన (పతి కెలన) నిలబడిన ఆమె చనుమెరుగులకు సెబాసు.

ఔన్నత్యముతో (ఉన్నతిన్) శ్రీవారిపై ఒరిగి ఆనుకుని నిలబడిన ఆమ్మ సన్నని నడుముకు సెబాసు.

3. జందెము, ముత్యాల సరులు, హారాలు ధరించిన చందన పరిమళములొలుకు తల్లికి సెబాసు.

చక్కగా (విందై) తన విభుడైన శ్రీవేంకటపతిని చుట్టిన (పెనచిన) తల్లి బాహువులకు సెబాసు.

దీనిలోని కవన శిల్పము గమనింపదగినది. ఒక జంట యున్నపుడు వారిలో ఒకరిని వర్ణించుచు రెండవ వారిని వర్ణింపకయే స్ఫురింపజేయుట ఒక కవిత్వ కళ.

ఇక్కడ అలమేలుమంగ శ్రీవారి పక్కన ఆయనపై ఒరిగి నిలుచున్నది. ఆమె చేత కిన్నెర ధరించినది. ఆయన ఏదో సరసపు మాట అనినాడు. ఈమె వేళాపాళా లేదా యని గసరినది. ఈమె ప్రేమతో ఆయన చుట్టూ చేయి వేసినది. ఆయన కన్న ఆమె ఎత్తులో నిలబడినది (ఉన్నతిన్).

ఇపుడు స్వామివారి స్థితి ఊహకు అందును. ఆయన కూర్చుని యున్నారు. (అపుడే ఆయన కన్న ఆమె ఎత్తులో నుండును). ఆమె వైపు ప్రేమతో పైకి

చూచుచున్నారు. (అపుడే ఆయన సరసపు మాట ఆమెకు మాత్రమే వినబడునట్లు చెప్పగలుగును). ఆమె గసురుకు ఆయన నవ్వుచున్నారని ఊహింప వచ్చును. ఆమె నిలబడి అపుడు తన బాహువును ఆయన భుజములపై వేసినది.

ఇలా అమ్మను వర్ణించి అయ్యవారిని ఊహల కందించు ఉత్తమ కవిత్వ కళ ఈ కీర్తనలో ప్రదర్శింపబడినది.

46. చలువకు వేడికి సరికి సరి

చలువకు వేడికి సరికి సరి
కలదిక హరి నీ కరుణే మాకు?

కాయము గలిగిన కలుగు తోడనే
పాయపుమదములు పైపైనే
రోయదు తను గని రుచులే వెదకును
యేయెడ హరి నిను ఎరుగుట యెపుడో?

కడుపు నిండితే ఘనమై నిండును
బడి పంచేంద్రియ పదిలములు
విడువ నాశలును వెలయు బంధములు
కడగని మోక్షము గైకొనుటెపుడో?

పెక్కులు చదివిన పెనగు తోడనే
తెక్కుల పలు సందేహములు
యెక్కువ శ్రీవేంకటేశ నీవె మా
నిక్కపు వేల్పవు నీచిత్తమ్మికను?

జీవితంలో సుఖాలూ కష్టాలూ తప్పవు. చలువకు వేడికి సరి. వాటిలో పడి కొట్టుకునే మమ్ము నీ కరుణ మాత్రమే గట్టెక్కించగలదు.

సరికి సరి: ఇది ఒక తెలుగు నుడికారము. ఒక కొలత కూడా. మా చిన్నప్పుడు ఈతపళ్ళు, వేరుశనగకాయలు గంపలలో తెచ్చి అమ్మేవారు. అప్పుడు సరికి సరి అనే పద్ధతిలో కొనుక్కునే వాళ్ళం. ఒక డొక్కుడు బియ్యం ఇస్తే అదే డొక్కుతో వారి వద్ద సరుకు ఇచ్చేవారు.

1. ఈ శరీరం చిత్రమైనది. ఇది కలిగినది మొదలు (పుట్టుకతోనే అనడం)

మదాన్ని సంతరించుకుంటుంది. తనకన్న గొప్పదేదీ లేదనుకుంటుంది. దేనినీ వదిలిపెట్టదు (రోయదు). పైగా రుచులు వెతుక్కుంటుంది. ఇక హరిని గురించి తెలుసుకొనుట యెప్పుడు. అందుకే స్వామీ! నీ కరుణ కావాలి.

2. ఒక్కసారి కడుపు నిండిందంటే చాలు పంచేంద్రియాలు పదిలపడతాయి. ఆ తృప్తికి అలవాటై ఆ అనుభవాలనే తిరిగి తిరిగి కోరుకుంటాయి. అక్కడినుండి ఆశలు విడిచిపెట్టవు (విడువవాశలు). పైగా కొత్త కొత్త బంధాలు వచ్చి పడతాయి. ఆఖరుకు (కడ గని) మోక్షము కోసం పాటుపడే దెప్పుడు? అప్పటికే సమయము మించిపోతుందనడం.

3. చదువులు సాధించేదేమీ లేదు. ఎంత చదివితే అన్ని సందేహాలు కలుగుతాయి. (తెక్కు = పొంగు). అన్నికినీ పైనగల (ఎక్కువ) ఓ వేంకటేశ్వరా! నీవే మా దేవుడవు. నీ చిత్తం స్వామీ – మమ్ము మోక్షము వైపు నడిపించు.

శరణాగతి. శరణాగతి. అదే మనను కడతేర్చునది.

47. చిత్తజు వేడుకొనరే చెలియలాల

చిత్తజు వేడుకొనరే చెలియలాల
తత్తరించి పతిమీది తలపోతనున్నది

అతివపై మదనుడు అనలాస్త్రమేయబోలు
కతలుగ విరహాగ్ని కాగీనదే
హితవుగా వరుణాస్త్రమేయబోలు నప్పటిని
తతి జెమటవానల దడియుచున్నది ॥చిత్తజు॥

అమరగ నంతలో వాయవ్యాస్త్రమేయబోలు
వుమరబడి నిట్టూర్పు లొగొ రేగెను
జమళి గూడి యట్టె శైలాస్త్రమేయబోలు
భ్రమసి చనుగొండలు బాయిట గాన్పించెను ॥చిత్తజు॥

మునుకొనిపంతాన సమ్మోహనాస్త్ర మేయబోలు
మనసు పరవశాన మరపొందెను
అనిశము రక్షగా నారాయణాస్త్రమేయబోలు
ఘన శ్రీవేంకటేశుడు కాగిటిలో గూడెను ॥చిత్తజు॥

అలమేలుమంగమ్మ హరిని తలపోసి వ్యాకులపడుతున్నది. అది చూసి చెలికత్తెలు ....

ఓ చెలులారా! మన మంగమ్మ పతియైన హరిని తలచుకొని తహతహపడుచున్నది (తత్తరించె). ఎలాగైనా వారిద్దరినీ కలపాలి. ఆ మన్మథుని ప్రార్థించండి (చిత్తజు వేడుకొనరే).

1. చెలులంతా మన్మథుని వేడుకున్నారు. అతడు అమ్ములపొది లోనుండి అస్త్రాలు అలమేలు మంగపై సంధిస్తున్నాడు. ఆమెను చెలులు ఆశ్చర్యంగా పరికిస్తున్నారు.

మదనుడు ఆమెపై అనలాస్త్రం (అనలము = నిప్పు) వేసినట్టున్నాడు. ఎవరో కల్పించినట్టు (కతలుగ) ఆమె విరహాగ్నిలో కాగుచున్నది.

ఆ అగ్నినుండి కాపాడడానికి (హితవుగ) వరుణాస్త్రం (వరుణుడు = వర్షాధిదేవత) వేసినట్టున్నాడు. ఆమె చెమట వానలలో తడిసి ముద్దవుతున్నది

2. ఓహో! మదనుడు ఈమాటు వాయవ్యాస్త్రము (వాయువుకు సంబంధించినది) వేసినట్టున్నాడు. ఆమె కమిలిపోయి (ఉమరబడి), ఆమెలోనుండి వేడి నిట్టూర్పులు వెలువడుతున్నవి (నిట్టూర్పు లొగి రేగెను).

మదనుడు ఈమాటు రతీదేవితోడుపడగా (జమళి గూడి = జంటగా) శైలాస్త్రము (కొండలకు సంబంధించినది) వేసినట్టున్నాడు. అందుకే ఆమె కుచములు స్ఫుటముగా కనబడుచున్నవి (బాయిట కాన్పించెను = వెలువడి కనిపించినవి).

ఇంకొక చమత్కారమున్నదిక్కడ. జమళి గూడియట్టె శైలాస్త్రమేయబోలు అనుదానిని ఇలా కూడా చెప్పుకోవచ్చు. రెండు బాణాలు జంటగా కూర్చి మంత్రించి శైలాస్త్రము వేసినట్టున్నాడు. కుచద్వయముపై బాణద్వయము సంధించినాడని సారస్యము.

3. ఏమిటి ఇన్ని బాణాలు వేసినా ఫలితము రాలేదని పంతగించిన మరుడు (మునుకొని పంతాన. మునుకొను = ప్రయత్నించు, ప్రారంభించు) ఇక సమ్మోహనాస్త్రము వేశాడు. అపుడు ఆమె తనను తాను మరచినది.

అపుడు ఆమెను దరిచేర్చుటకు (రక్షింప) నారాయణాస్త్రము వేశాడు. అపుడామె ఘనుడగు వేంకటేశుని కౌగిటిలో చేరినది.

ఇంత కష్టబడ్డాడు మరుడు పాపం.

అంతరార్థాలు:

1. తలపోత, విరహాగ్ని, చెమరింపు, నిట్టూర్పు, సమ్మోహనము శృంగార రస సామగ్రి. ఇవన్నీ అనుభావములు. ఇవి అనుభవము లోనికి వచ్చిన పిదప రసప్రాప్తి. అందుచే ఈ అనుభావ విభావాదులను మరుని అమ్ముల వలన కలిగిన పర్యవసానములుగా అందముగా అనుసంధానించినాడు అన్నమయ్య.

2. జీవాత్మ పరమాత్మలో లయమగు అనుభూతి కూడా ఇట్టి అనుభావ విభావముల పర్యవసానమై భాసించును. ఇచట అలమేలు మంగ జీవాత్మ. స్వామి పరమాత్మ. జీవాత్మ సాధనా పరిపాకమున తపించి తపించి పరమాత్మలో చేరకుండా ఉండలేని స్థితిని అనుభవించిన పిదపనే విష్ణుసాయుజ్యము కలుగును. దాని చిత్రణము అంతర్వాహిని.

3. జీవాత్మ "నేను" అను స్ఫురణ విడనాడవలె. అదే 'మైమరపు'. ఆ తరువాతి మెట్టు నారాయణ సమ్మేళనము.

చక్కని ఆధ్యాత్మ భావనలనిముడ్చుకొన్న శృంగార కీర్తన.

48. చిన్ని శిశువు చిన్ని శిశువు

చిన్ని శిశువు చిన్ని శిశువు
ఎన్నడూ చూడమమ్మ యిటువంటి శిశువు

తోయంపు కురులతోడతూగేటి శిరసుచింత
కాయలవంటి జడల గములతోడ
మ్రోయుచున్న కనకపు మువ్వల పాదాల తోడ
పాయక యశోద వెంట పారాడు శిశువు ॥చిన్న శిశువు॥

ముద్దుల వేళ్ళతోడ మొరవంక ఉంగరాల
నిద్దపు చేతుల పైడి బొద్దుల తోడ
అద్దపు చెక్కుల తోడ అప్పలప్పలనినంత
గద్దించి యశోద మేను కౌగిలించు శిశువు ॥చిన్న శిశువు॥

బలుపైన పొట్ట మీది పాల చారల తోడ
నులి వేడి వెన్న తిన్న నోరి తోడ
చెలగి నేడిదే వచ్చి శ్రీవేంకటాద్రిపై
నిలిచి లోకములెల్ల నిలిపిన శిశువు ॥చిన్న శిశువు॥

యశోద ముంగిట ఆటలాడు చిన్ని కిష్టయ్యను స్మరిస్తున్నాడు అన్నమయ్య. కృష్ణలీలలు నిత్యనూతనములు.

ఈ చిన్ని శిశువు వంటి వానిని ఎన్నడూ చూడము. ముద్దులకు ముద్దులు. ఆటలకు ఆటలు. అల్లరికి అల్లరి.

1. ఆటలలో తల నీటితో తడిపేసుకున్నాడు. అందుచే ఆ కురులు నీటితో (తోయంపు కురులు) శిరస్సుపై దోగాడుచున్నవి. అమ్మ అందంగా వేసిన జడలు ఆనీటితో చింతకాయల వలె వ్రేలాడుచున్నవి. (జడల గములు =

జడల సమూహములు)

ఆ చిన్ని పిల్లవాడు యశోద వెనకాల పారాడు చున్నపుడు కాళ్ళకు కట్టిన బంగారు మువ్వలు మ్రోయుచున్నవి.

యశోద వెంట పారాడు శిశువు: యశోద వెనుక తిరుగాడే పిల్లవాడు అనీ, వెనుక యశోద తిరుగుచున్న శిశువు అనీ రెండర్థాలు చెప్పుకోవచ్చు. ఎవరివెంట యెవరి తిరుగుచున్నారో – ఇది చమత్కారము.

2. కొంచెం లావైన వేళ్ళకు మొరవంక ఉంగరాలు పెట్టుకున్నాడు. మొరవంక అంటే కొంచెం వంకరకలుగిన అని భావం. ఆ ఉంగరాలను పక్కనుంచి చూస్తే అర్థచంద్రాకారంగా వంగి ఉన్నవనుట.

నున్నని (నిద్దపు) చేతులకు పసిడి బొద్దులు తొడిగేడు. బొద్దు లంటే కొంచెం మొద్దుగా ఉన్న మురుగులు. కలవారి కన్నయ్య కదా. బుగ్గలు అద్దాలలా మెరుస్తున్నాయి. తల్లి "అప్పలప్పలు" అని పిలవగానే ఆనందంతో కేక పెట్టి (గద్దించి) తప్పటడుగులతో వచ్చీరాని పరుగుతో గభాలున యశోదను కౌగిలించుకుంటున్నాడు.

అప్పలప్పలు అనునది ఒక శైశవక్రీడా విశేషం.

3. ఈ చిన్ని శిశువుకు కొంచెం బలిసిన పొట్ట. దాని మీద పాలుతాగినప్పుడు కారిన పాల చారికలు. అప్పుడే చిలికిన వెన్నతిన్న చిన్ని నోరు (అప్పుడే చిలికి తీసిన వెన్నకు చిరు వెచ్చదనం ఉంటుంది. దానినే నులివేడి అన్నాడు అన్నమయ్య). ఎంత అందమైన రూపమో! అటువంటి అందమైన రూపము తోనే ఈ తిరుమలపై వేంకటేశుడై వెలసిన వాడీ దేవుడు. తాను నిలిచి జగములను నిలబెట్టాడు. నిజానికి ఈ జగాలు ఆయన బొజ్జలో ఉన్నాయి. ఆయన నిలబడితే అవి నిలబడినట్టు. ఆయన శయనిస్తే అవి పడుకున్నట్టూ.

49. చిరుత నవ్వులవాడు సిన్నెక

చిరుత నవ్వులవాడు సిన్నెక
వీడు వెరపెరుగడు సూడవె సిన్నెక

పొలసు మేనివాడు, బోర వీపువాడు
సెలసు మోరవాడు సిన్నెక
కొలుసుల వంకల కోరలతో భూమి
వెలసినాడు సూడవే సిన్నెక ॥చిరుత నవ్వులవాడు॥

మేటి కురచవాడు మెడమీది గొడ్డలి
సీటకాలవాడు సిన్నెక
ఆటదాని బాసి అడవిలో
రాకాసి వేటలాడీ జూడవే సిన్నెక ॥చిరుత నవ్వులవాడు॥

బింకపు మోటల పిల్లగోవి వాడు
జింక చూపులవాడు సిన్నెక
కొంకక కలికై కొసరి కూడె నన్ను
వేంకటేశుడు సూడవే సిన్నెక ॥చిరుత నవ్వులవాడు॥

మృదుమధురమైన తెలుగు పదజాలం కావాలనుకుంటే అన్నమాచార్యుని కీర్తనలు వినాలి/చదవాలి. విచిత్రమైన మాండలీక పదాలు, లేత ముంజెల లాంటి పదబంధాలు ఈయన సొత్తు.

దశావతారాలు ఈ కీర్తనలో ఎంత గొప్ప పదాలతో చెప్పేడో చూడండి.

అమ్మవారు చెలికత్తెతో స్వామి గురించి ముద్దు ముద్దుగా చెబుతున్నది.

వీడు చిరుత నవ్వులవాడు. వెరపు (భయము) అన్నది తెలియనివాడు.

చిరునవ్వు అనడానికి చిరుతనవ్వు అన్నాడు. చిరు, చిరుత, చిట్టి ఇవన్నీ కొంచెం చిన్న కొలతలో బేధం సూచించేమాటలు.

పొలసు మేనివాడు : మత్స్యావతారం

బోర వీపువాడు : కూర్మావతారం.

బోర అన్నపదం పెద్ద అన్న అర్థంలో వాడేడు. (బోర తలుపు = పెద్ద తలుపు). బోర అంటే మరొక అర్థము వక్షము.

సెలసు మోరవాడు : వరహావతారము

సెలసు అనగా మాను. మోర అంటే ముట్టె. దృఢమైన మాను వంటి ముట్టె కలిగిన వాడు.

కొలుసుల వంకల కోరలతో భూమి వెలసిన వాడు : నృసింహావతారము.

కొలత గల (పెద్ద) వంపు తిరిగిన (వంకల) కోరలు కలిగినవాడు.

మేటి కురచవాడు : వామనావతారం.

ఇలా అన్నమయ్య మాత్రమే అనగలడు. మేటి (శ్రేష్ఠమైన) కురచవాడు (పొట్టివాడు)

మెడ మీది గొడ్డలి సీటకాలవాడు : పరశురామావతారం.

మెడ మీద గొడ్డలి దాల్చి చోద్యములు (సీటకాలు - చిట్టకాలు - చోద్యములు) చేసినవాడు.

ఆటదాని బాసి అడవిలో రాకాసి వేటలాడీ వాడు : రామావతారం

ఎంత సొగసుగా అన్నాడీ మాట!

బింకపు మోటల పిల్లగోవివాడు : కృష్ణావతారం.

బలిసిన (బింకపు) మ్రాకుల (మోటల) - మద్ది చెట్లను కూల్చే లీల

సూచన. పిల్లగోవి (మురళీ) పట్టుకున్నవాడు. అందమైన మాట ఇది. అంత బలమైన మ్రాకులు కూల్చినాడు. ఇంత తేలికైన వెదురు పట్టుకున్నాడు. ఆయనకు quantity కాదు qualality కావాలనడం.

జింక చూపులవాడు కొంకక కలియై కొసరి కూడె నన్ను : కలికి అవతారము.

జింకచూపుల వాడు అనడంలో సొగసైన కన్నులు కలవాడనడం. భయము లేని వాడై కలికి రూపముతో నన్ను కొసరి కూడిన వాడీ వేంకటేశుడు

(ఎంత సొగసైన వాడో) చూడు.

మెత్తని తెలుగు పదాల గుత్తి ఈ కీర్తన.

50. చూడరమ్మ సతులాల

చూడరమ్మ సతులాల సోబాన పాడరమ్మ
కూడున్నదీ పతి చూడికుడుత నాంచారి

శ్రీమహాలక్ష్మి యట సింగారాల కేమరుదు
కాముని తల్లియట చక్కదనాల కేమరుదు
సోమునితోబుట్టువటసొంపుకళలకేమరుదు
కోమలాంగి యీచూడికుడుత నాంచారి ॥చూడరమ్మసతులాల॥

కలశాబ్ధి కూతురట గంభీరాల కేమరుదు
తలప లోకమాతయట దయమరిఏమరుదు
జలజ నివాసినియట చల్లదన మేమరుదు
కొలది మీర యీ చూడికుడుత నాంచారి ॥చూడరమ్మసతులాల॥

అమరవందితయట అట్టీమహిమకేమరుదు
అమృతముచుట్టమట ఆనందాలకేమరుదు
తమితో శ్రీవేంకటేశు తానెవచ్చి పెండ్లాడె
కొమెరవయస్సుయీచూడికుడుతనాంచారి ॥చూడరమ్మసతులాల॥

ఓ సతులారా! ఇది చెలికత్తెలను సంబోధన. చూడండి. ఇక్కడ పతితో ఈ చూడికుడుత నాంచారి కూడియున్నది. పెళ్ళిపాట (సోబాన) పాడండి.

ఎవరీ చూడికుడుత నాంచారి?

తమిళంలో గోదాదేవిని చూడి కుడుత్త నాచ్చియార్ అంటారట. గోదాదేవి తాను ధరించిన పూలమాలలను స్వామికి సమర్పించి స్వామికే తనను తానంకితము చేసికొన్న ధన్యురాలు. ఆమె తాను పూలమాల ధరించినపుడు ఒక తలవెంట్రుక మాలలోనికి చేరింది. అది చూచి విష్ణుచిత్తుడు (గోదాదేవి తండ్రి) విష్ణువుకు వేరేమాల సమర్పించాడు. కాని విష్ణువు ఆ గోదాదేవి వెంట్రుక గల మాలనే

సమర్పించమని అడిగి మరీ అలంకరించుకున్నాడట. తరువాత ఆమె స్వామి వారిని పెండ్లాడినది.

ఆమె లక్ష్మీస్వరూపం కనుక ఈ కీర్తనలో అన్నమయ్య ఆమెను స్తుతిస్తున్నాడు.

1. ఆమె సాక్షాత్తు లక్ష్మీస్వరూపము. ఇక అలంకారాలకేమి కొరత? (అరుదు = ఆశ్చర్యం, అపురూపం)

ఆమె మన్మథుని కన్నతల్లి. ఇక చక్కదనముల కేమి అరుదు?

ఆమె చంద్రుని (సోముని) తోబుట్టువు. కాబట్టి కళల కాణాచి. సొంపైన కళల కేమి కొదవ?

ఈ గోదాదేవి ఒక్కమాటలో చెప్పాలంటే కోమలాంగి

2. ఆమె పాలకడలికి (కలశాబ్ధి) కూతురు. ఇక గంభీరగుణానికి ఏమి మితి?

ఆమె లోకమాత. ఇక కరుణ (దయ) కేమి తక్కువ?

ఆమెకు పద్మము నివాసం (జలజ నివాసిని) ఇక చల్లదనాని కేమి అపురూపం?

ఈమెకు ఎట్టి పరిమితులూ లేవు (కొలది మీరు).

3. ఆమెముందు అమరులు వంగి నమస్కరిస్తారు (అమరవందిత) ఇక ఆమె మహిమలు కలిగియుందనడంలో ఆశ్చర్యమేమిటి?

అమృతం ఆవిడ పుట్టింటి చుట్టం (అమృతం పాలసముద్రములోనే పుట్టింది) ఇక ఆమె ఆనందస్వరూపం గురించి చెప్పేదేమున్నది?

శ్రీవేంకటేశ్వరుని ఆమె కోరివచ్చి పెండ్లాడినది.

ఇంతకీ ఆమె వయసెంతో తెలుసా? చిన్న వయసే (కొమిరి వయస్సు. బాల్య కౌమార యౌవన వృద్ధాప్యాలు వయసుకు సోపానాలు. యౌవనారంభానికి ముందు దశ కొమిరి వయసు)

విశేషాంశం:

జగత్తు లోని జీవరాశికి వాటివాటి పుణ్యపరిపాకము వలన కొన్ని కొన్ని విభూతులు అమరుతాయి. ఒకరికి ధాన్యం ఎక్కువ పండుతుందనుకోండి. అది ఒక విభూతి. ఒకరికి ప్రతిచోటా విజయం లభిస్తుందనుకోండి. అది ఒక విభూతి. ఈ విభూతులన్నీ లక్ష్మీస్వరూపాలు అని చెబుతారు. ధాన్య సమృద్ధి ధాన్యలక్ష్మి. విజయ లాభం జయలక్ష్మి ఇత్యాదులు.

ఈ కీర్తనలో చూడండి. కాముని తల్లి యగుట వలన ఈమెకు సౌందర్యము, సోముని తోబుట్టువగుటచే సకల కళాసంపద, లోకమాత యగుటవలన దయాసమృద్ధి, కలశాబ్ధి కూతురగుటవలన గాంభీర్యము, జలజవాసిని యగుటచే చల్లదనము, అమరవందిత యగుటచే మహిమ, అమృతపు చుట్టరికముచే ఆనందస్వరూపము సిద్ధించినట్లు చెప్పబడ్డది. ఇది నిజమునకు సరిగా వ్యతిరిక్తము. ఆమె తల్లి యగుటచేతనే కాముడు సౌందర్యవంతుడైనాడు. మిగిలినవన్నియు అట్లే అన్వయించుకొనవలెను. కళాసంపద, దయ, గాంభీర్యము ఇత్యాది గుణములు భగవద్విభూతులు. ఆ విభూతులన్నియు లక్ష్మీస్వరూపములు.

ఇట్లు కార్యకారణములను విపర్యయముగా చెప్పుట ఒక కవిత్వకళ. అట్టి కవన వైచిత్రి అన్నమయ్యకు కూసు విద్య.

ఇంకొక విషయము. ఇట్టి ఉత్కృష్టత ఆమెకెట్లు వచ్చినది? ఆమె స్వరూపమే విభూతుల సమాహారమెట్లైనది? ఆమె ప్రేమతో ఏవిలువయునూ లేని ఒక వెంట్రుక స్వామికి సమర్పించినది. దాని ఫలితమే ఆమెకీ వైభవము. పరమాత్మకు ఏమి సమర్పించితివి యననది ముఖ్యము కాదు. భక్తితో ప్రేమతో ఏ స్వల్పము సమర్పించిననూ లక్ష్మిగా (విభూతిగా) మనకు దక్కును. ఆమె సాక్షాత్తు లక్ష్మీయే యైనది.

51. చేరి యశోదకు శిశువితడు

చేరి యశోదకు శిశువితడు
ధారుణి బ్రహ్మకు తండ్రియునితడు

సొలసి చూచినను సూర్యచంద్రులను
లలి వెదజల్లెడు లక్షణుడు
నిలిచిన నిలువున నిఖిల దేవతల
కలిగించు సురల గనివో యితడు ॥చేరి యశోదకు॥

మాటలాడినను మరి యజాండములు
కోటులు వొడమెటి గుణరాశి
నీటగు నూర్పుల నిఖిల వేదములు
చాటున నూరెటి సముద్రమితడు ॥చేరి యశోదకు॥

ముంగిట బొలసిన మోహన మాత్మల
బొంగించే ఘన పురుషుడు
సంగతి మావంటి శరణాగతులకు
సంగము శ్రీవేంకటాధిపుడితడు ॥చేరి యశోదకు॥

ఈతడు యశోదను చేరిన శిశువు. యశోద ఈ బాలునికి కన్నతల్లి కాదు. పెంపుడు తల్లియని ధ్వని.

శిశువు అనడం వల్ల చిన్నివాడనుకునేరు. ఆయన బ్రహ్మకు కన్నతండ్రి. బ్రహ్మనే ఎందుకు చెప్పడం? బ్రహ్మ సృష్టికర్త. ఈ జగత్తంతా సృష్టించినవాడు. మరి ఈతడో ? సృష్టికర్తనే సృజించినవాడని చమత్కారం.

ఈ దేవుని విషయాలు ఆశ్చర్యకరములు

1. ఈయన పరవశించి (సొలసి) చూచినచో సూర్యచంద్రులకు "లలి"

వెదజల్లగల లక్షణము కలవాడు.

లలి = క్రమము, ప్రేమ, ఉత్సాహము, ఒప్పిదము, వికాసము ఇత్యాది అర్థములున్నవి.

అన్ని అర్థములూ ఈ వాక్యమున సరిపోవును.

సూర్యచంద్రులు స్వామి నేత్రములు కదా. ఆయన చూపు వారికి వికాసము కూర్చును. ఉత్సాహమొదవించును. ప్రేమతో జగత్తును కాపాడు శక్తినిచ్చును. వానికి క్రమవికాసము (ఒకదాని పిదప ఒకటి ప్రకాశించుట) కూర్చును. వానికి ఒప్పిదము కూర్చును. ఇట్లు ఒక పదమునకు గల నానార్థములు ఆ సందర్భమునకు సరిపోవు నట్లు చెప్పుట కవిబ్రహ్మ తిక్కన పద్ధతి. ఇదీ ఈ పదములోని వైచిత్రి.

ఈయన నిలబడిన చాలును. దేవతల నందరిని (నిఖిల దేవతల) సృజించు (కలిగించు) గనివంటి వాడు. ఎంత తవ్వినను తరగనిది గని.

మరియొక చిన్న విషయము. సొలసి చూచినను సూర్యచంద్రు'లను' అని ద్వితీయా విభక్తి వాడినాడు అన్నమయ్య (నిన్, నున్, లన్, కూర్చి, గురించి – ద్వితీయ). సాధారణముగా సూర్యచంద్రు'లకు' అని షష్ఠీ విభక్తి వాడబడును (కిన్, కున్, యొక్క, లోన్, లోపలన్ – షష్ఠి). ఇట్లు ఒక విభక్తికి మరియొక విభక్తి వాడుట లోకవ్యవహారమున నున్నదే.

2. ఈ దేవుడు మాటలాడిన చాలు. కోట్లాది బ్రహ్మాండములు పుట్టుకొని వచ్చును. ఒకమాటలో అజాండములు సృజింప గలడని సామాన్యార్థము. ఆయన యశోదకు మాట్లాడుచూ అన్ని బ్రహ్మాండములూ నోట చూపినాడు కదా. ఆ గాథను ధ్వనింపజేస్తున్నాడిక్కడ.

ఊపిరులలో అందము (నీటు)గా వేదరాశిని విశదపరచే (చాటు) సముద్రమంతటి విశాలుడు. (ఆంగ్లమున neat అనిన శుభ్రత. తెలుగున నీటు అనిన అందము)

3. ముందు ఈతడు కనిపించిన (పొలయు = సంచరించు) ఆత్మలో మోహవివశత కలిగించే వాడితడు.

ఇందులో ఒక చమత్కారముంది. ఈకృతిని శుద్ధ వసంత రాగములోనూ, మోహనరాగము లోనూ స్వరపరచి పాడుదురు. (నాకీ రాగములు గుర్తించుట తెలియదు. ఆయా కీర్తనల పైన సూచించిన రాగములను బట్టి గ్రహించిన విషయమిది). ఆ దేవదేవుడు మనోనేత్రమునకు కనిపించిన చాలును. మోహన రాగము ఆత్మలో నుప్పొంగునని మరియొక అర్థము. అనగా ఈ కీర్తన మోహనములో పాడుటయే అన్నమయ్యకు ఇష్టమని మనకు తెలియుచున్నది.

సంగతి / సంగము – ఈ పదములకు చేరిక కూడిక మొదలగునవి అర్థములు. శరణాగతి చేసి దరిచేరిన మాబోంట్లను దరిచేర్చుకొనువాడీ తిరువేంకటాధీశుడు.

52. చందమామ రావో జాబిల్లి రావో

చందమామ రావో జాబిల్లి రావో
కుందనపు పైడి కోర వెన్నపాలు తేవో

నగుమోము చక్కనయ్యకు నలువ పుట్టించిన తండ్రికి
నిగమములందుండే అప్పకు మా నీలవర్ణునికీ
జగమెల్ల యేలిన స్వామికి చక్కని ఇందిర మగనికి
ముగురికి మొదలైన ఘనునికి మా ముద్దుల మురారి బాలునికి
॥చందమామ॥

తెలిదమ్మి కన్నుల మేటికి తియ్యని మాటల గుమ్మకు
కలికి చేతల కోడెకు మా కతలకారి యీ బిడ్డకు
కులముద్ధరించిన పట్టెకు మంచి గుణములు కలిగిన కోడెకు
నిలువెల్ల నిండబొయ్యారికి నవనిధుల చూపులచూసే సుగుణునకు
॥చందమామ॥

సురల గాచిన దేవరకు చుంచుగరుడు నెక్కిన గబ్బికి
నెరవాది బుద్ధుల పెద్దకు మా నీటుచేతల పట్టికి
విరుల వింటివాని అయ్యకు వేవేలు రూపుల స్వామికి
సిరిమించు నెరవాది జాణకు మా శ్రీ వేంకటనాధునికి
॥చందమామ॥

బుజ్జాయిలకు చందమామ రావె, జాబిల్లి రావె అని పాడి వినిపించి అన్నంపెట్టడం నిద్రపుచ్చడం తెలిగిళ్ళలో నిత్యకృత్యం. అయితే

చందమామ రావె జాబిల్లి రావె
కొండెక్కి రావె కోటిపూలు తేవె

ఇలా ఏమేమి తేవాలో చెప్పి అన్నీ తెచ్చి మా పాపాయికివ్వవే అని పాడతారు తెలుగు తల్లులు.

కానీ అన్నమయ్య ఒక్క వెన్నపాలు మాత్రమే తెమ్మని చెబుతున్నాడు చంద్రునికి. ఎందుకో తెలుసా? ఈ వెన్నలు, పాలు ఈ చిన్ని కృష్ణునికి ఎంత ఇష్టమో. అవి నివేదన చేస్తే చాలు. అవతలి వారికి అడిగినవన్నీ తానే యిస్తాడు.

చందమామా రా, జాబిల్లి రా

కుందనపు పైడి కోర: కోర అంటే గిన్నె. కోరాగిన్నె లనడం కూడా కద్దు. ఇక కుందనము అన్నా బంగారమే. పైడి అన్నా బంగారమే. కుందనపు పైడి గిన్నె అన్నాడు కట్టెపుల్ల, చివరాఖరు అన్నట్టు.

పల్లవి మొదలు పెట్టేసేడు. ఇక చందమామను తెచ్చిమ్మనడానికి ఏమీ అక్కరలేదు. అందుచేత మూడు చరణాలూ చిన్నికృష్ణుని విశేషణాలతో నింపివేశాడు.

ఈ వెన్న పాలు బంగారు గిన్నెలో తెచ్చి

1. నవ్వుమోము వానికి, బ్రహ్మను కన్నతండ్రికి, వేదాలలో ఉండే వానికి, నీల వర్ణునికీ, జగత్తునేలే వానికి, లక్ష్మీదేవి పెనిమిటికీ, ముగ్గురయ్యలలో ఘనునికీ, ముద్దుల మురారికీ

2. తెల్ల పద్మముల వంటి కన్నులు కలవానికీ, తియ్యగా మాటలాడే వానికీ, చక్కని పనులు (కలికి పనులు) చేసేవానికీ, మాటకారి (కతలకారి) బిడ్డడికీ, కులం నిలబెట్టినవాడికీ, మంచి గుణవంతునికీ,

   నిలువెల్ల ఒయ్యారం కలవానికీ, చూపులలో నవనిధులు తొణికిసలాడే వానికీ

3. దేవతలను రక్షించే వానికీ, చిన్న (చుంచు) గరుడుని ఎక్కేవానికీ, బుద్ధి నేర్పరితనం కలవానికీ (నెరవాది = నేర్పరి), నీటు (చక్కని) చేతలవానికీ, మన్మథుని (విరుల వింటివాడు) తండ్రికీ, వేలవేల రూపుల వానికీ, మించిన

శోభలతో జాణతనము చూపేవానికీ, ఇన్నిగుణములు కలిగిన మా శ్రీవేంకటనాధునికీ ఇయ్యి.

మానవుల చందమామ పాటలో చందమామకు ప్రాధాన్యం. దేవుని చందమామ పాటలో స్వామికి ప్రాధాన్యం అని గుర్తించాలి.

మరొక మాట. చిన్నకృష్ణునికి తియ్యని విశేషణాలు కుప్పపోశాడు అన్నమయ్య ఈ పాటలో.

ఇలాంటి కీర్తనలు చిన్నపిల్లలకు నేర్పాలి. దీనిలో ప్రతి విశేషణంలోని విశేషం వారు తెలుసుకోవడానికి వారిలో జిజ్ఞాస పెరుగుతుంది. తద్వారా పురాణ గాథలూ తెలుస్తాయి. తెలుగు పదాలూ తెలుస్తాయి.

53. జూటుదనాలవాడవు సుగ్రీవ నరసింహా

జూటుదనాలవాడవు సుగ్రీవ నరసింహా
పాటించి నిన్ను మేము పంగించేవారమా

మొగము సింహపురూపు మొగి మై మానిసి రూపు
జిగి తొడ మీదట శ్రీమహాలక్ష్మి
తగు నీకు నిటువంటి తగవులెల్లా జెల్లు
యెకసక్కేలాడ మాకు నేలయ్య నిన్నును ॥జూటుదనాలవాడవు॥

కట్టినది పైడికాస కంబములోన ఉనికి
నెట్టుకొన్న నవ్వులు నీలోనివే
ఇట్టివెల్లా నీకమరు ఎన్నిలేవు నీచేతలు
అట్టిట్టని నిన్ను మాకు అడుగనేమిటికి ॥జూటుదనాలవాడవు॥

అమరుల కేలికవు అసురులకు వైరివి
రమణ ప్రహ్లాదునకు రక్షకుడవు
కొమరై శ్రీవేంకటాద్రి కొత్తలు నీ గుణములు
సముకాన పలుమారు సంతసించే మికను ॥జూటుదనాలవాడవు॥

అహెూబల నరసింహునిపై కీర్తన

జూటుదనము = అసత్యము, మోసము

స్వామీ! నీవు మోసపూరితమైన స్వభావము కలవాడవు. (స్తంభము లోనుంచి ఊహకందని రూపంతో వచ్చి దానవ సంహారం చేయడం కొంచెం మోసపూరితమైన కార్యక్రమమనడం). ఓ చక్కని మెడ కలిగిన (సుగ్రీవ) నరసింహదేవుడా!

నీలో ఉన్న అసత్యాలూ, పొందూ పొంతనాలేనిదనం ఎత్తిచూపి (పాటించి) నిన్ను దెప్పిపొడవ గల వారమా? (పంగించే వారమా?) కాము అనడం.

చరణాలలో స్వామిలో గల కొన్ని పొంతన లేని విషయాలు చెబుతున్నాడు.

1. ముఖము సింహపు రూపు. మిగిలిన శరీరము మనిషి రూపు. పైగా తొడపై మెరుస్తూ (జిగి) మహాలక్ష్మి. ఇలాంటి కుదరని విషయాలు (తగువులు) నీకే చెల్లుతాయి. మేము నిన్ను ఎకసక్కేలాడ గలమా? ఆడలేము అనడం.

2. కట్టినది గోచీపోసి కట్టిన బంగారు పంచ (పైడి కాస. కాస = గోచీపోసి కట్టిన పంచ). సింహం పంచ కట్టడమేమిటని. ఉండేది స్తంభములో. సింహపు మోములో అతిశయమైన (నెట్టుకొన్న) నవ్వు. ఇలా నీవు అమరించుకున్న చేతలెన్నో! అదేమిటి ఇదేమిటి (అట్టిట్టని) మేమేమైనా నిన్నడగగలమా? (మాకడగనేటికి?)

3. దేవతలకు ప్రభువువు. రాక్షసులకు శత్రువువు. ఒకరితో మిత్రత్వం మరొకరితో శత్రుత్వం అనడం. ప్రీతితో ప్రహ్లాదుని రక్షించేవాడవు. అతడు దానవుడైనా రక్షించితివనడం. శ్రీవేంకటాద్రిపై అందంగా వెలసిన నీ గుణములు కొత్తలూ వింతలూనూ.

మేము నిన్ను దర్శించి సంతోషించెదము.

మేమేమైనా ఎత్తిపొడవ దగినవారమా? అంటూనే ఎన్ని విషయాలలో ఎత్తిపొడిచాడో! అదీ అన్నమయ్య గడుసుదనం!

54. జో అచ్యుతానంద జోజో ముకుంద

జో అచ్యుతానంద జోజో ముకుంద
రావె పరమానంద రామగోవింద

నందునింటను జేరి నయము మీరంగ
చంద్రవదనలు నీకు సేవ సేయంగ
అందముగ వారిండ్ల నాడుచుండంగ
మందలకు దొంగ మాముద్దు రంగ

పాలవారాశిలో పవళించినావు
బాలుగా మునుల కభయమిచ్చినావు
మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుడై యుండి గోపాలుడైనావు

అట్టు గట్టిన మీగడట్టె తిన్నాడే
పట్టి కోడలు మూతి పై రాసినాడే
అట్టె తినెనని అత్త యడుగ విన్నాడే
గట్టిగా యిది దొంగ కొట్టుమన్నాడే

గొల్లవారిండ్లకును గొబ్బునను బోయి
కొల్లలుగ త్రాగి కుండలును నేయి
చెల్లునా మగవాండ్ర జెలగి యీశాయీ
చిల్లతనములు సేయ చెల్లునటవోయీ

రేపల్లె సతులెల్ల గోపంబుతోను
గోపమ్మ మీ కొడుకు మాయిండ్లలోను
మాపుగానే వచ్చి మామానములను
నీ పాపడే చెరిచె నేమందుమమ్మ

ఒకని యాలిని దెచ్చి ఒకనికడ బెట్టి
జగడములు గలిపించి సతిపతుల బట్టి
పగలు నలుజాములును బాలుడైనట్టి
మగనాండ్ర జేపట్టి మదనుడై నట్టి

అంగజుని గన్న మాయన్న యిటురారా
బంగారుగిన్నెలో పాలుపోసేరా
దొంగ నీవని సతులు పొంగుచున్నారా
ముంగిట నాడరా మోహనాకారా

గోవర్ధనంబెల్ల గొడుగుగా బట్టి
కావరంబున నున్న కంసు బడగొట్టి
నీవు మధురాపురము నేల జేపట్టి
ఠీవితో నేలిన దేవకీ పట్టి

అంగుగా దాళ్ళపాకన్నయ్య చాల
శృంగార రచనగా జెప్పెనీ జోల
సంగతిగ సకల సంపదల నీవేళ
మంగళము తిరుపట్ల మదనగోపాల

ఇది తిరుపట్ల మదనగోపాలస్వామికి అన్నమయ్య పాడిన జోలపాట. తెలుగునాట తల్లులు తమ బిడ్డలను నారాయణ స్వరూపులుగా భావించి పాడే జోల. ఇది తెలుగు జాతికి అన్నమయ్య కానుక.

ఓ ఆనంద స్వరూపా (పరమానంద), అచ్యుతా! ముకుందా! రామా! గోవిందా! జోజో! జోజో!

1. నందుని యింట మేలు (నయము) గా చేరినావు. చంద్రముఖులైన గోపికల సేవలందినావు. వారిండ్లలో ఆటలాడినావు. మా నందవ్రజమునకు (మంద) ముద్దుదొంగవు.

2. పాలసముద్రములో పవ్వళించినావు. చిన్నతనములోనే (బాలుగా) మునులకు అభయమిచ్చినావు (రామావతారం). వసుదేవునకు పుట్టినావు. బాలుడవు, గోపబాలుడవు ఐనావు.

3. పాలపై తెట్టుగట్టిన మీగడ తిన్నావు. కొంచెం మీగడ కోడలు మూతికి రాసినావు. అత్తగారు మీగడ నీవే తిన్నవా యని కోడలిని అడగడం విన్నావు. అవును దొంగ యిదే తిన్నది అనిచెప్పి కోడలిని కొట్టమన్నావు.

4. గొల్ల యిళ్ళకు వేగమే (గొబ్బున) పోయి కుండలలోని నేయి, పాలు మితిమీరి (కొల్లలుగ) త్రాగినావు. ఆ గొల్లల వద్ద అల్లరిపనులు (చిల్లతనములు) సేయుట చెల్లునా ఓ వటపత్రశాయీ! ఈశాయీ అని యున్నది మొదటి 'యీ' చెలగిలోని గి కి ప్లుతరూప మనుకొందును.

5. రేపల్లెలోని గోపికలందరూ కోపంతో యశోదకు ఓ గోపమ్మా! నీ కొడుకు మాయిళ్ళకు చీకటిపడగానే వచ్చి మా మానధనము కొల్లగొట్టుచున్నాడని ఫిర్యాదు చేశారు.

6. ఒకని భార్యను తెచ్చి ఇంకొకడి వద్ద పెట్టి, వారి భర్తలలో తగాదాలు పెట్టడమే (జగడములు కలిపించి) పగలంతా (పగటికి నాలుగు ఝాములు. ఝాముకు 3 గంటలు) ఈ బాలుడి పని. పైగా ఆడవాండ్రను ఆకట్టుకొనే మన్మథుడు.

7. మన్మథుని కన్నతండ్రీ! మా అన్నా! రారా!

బంగారు గిన్నెలో పాలుపోసేను. త్రాగు. నువ్వు దొంగవని గోపికలందరూ అంటున్నారు నాన్నా! మన ముంగిట్లోనే ఆడుకో. ఎక్కడికీ పోకు.

8. గోవర్ధన పర్వతం గొడుగువలె పట్టినావు. పొగరెక్కిన (కావరంబున నున్న) కంసుని పడగొట్టినావు. మధురాపురం గెలుచుకున్నావు. ఠీవిగా దేవకీతనయుడవై వెలసినావు.

9. తాళ్ళపాక అన్నమయ్య చాలా ఒప్పుగా (అంగుగా) ఈ జోలపాట అందముగా (శృంగార రచనగా) సకల సంపదాభివృద్ధిగా చెప్పినాడు.

కొన్ని విశేషములు:

తన కీర్తనలలో తన కర్తృత్వము అన్నమయ్య ప్రకటించదు. "తిరువేంకటగిరి" "వేంకటపతి" వంటి పదముద్రలు చివర వేయును. కానీ ఈ కీర్తనలో తాళ్ళపాక అన్నమయ్య రచనగా చెప్పుకున్నాడు. పైగా శృంగార రచనగా (అందమైన రచనయను భావము. జోల పాట శృంగారరస సంబంధమైనది కాజాలదు కదా) చేసినాని చెప్పుకున్నాడు. పైగా తిరుపట్ల మదనగోపాల ముద్రవేశాడీ కీర్తనలో. ఇది అన్నమయ్య కీర్తనలలో అరుదైన విషయము.

ఈ తిరుపట్ల మదనగోపాలస్వామి ఎవరు? రాయలసీమలో పుదిపట్ల, వెల్లపట్ల గ్రామములున్నవే గాని తిరుపట్ల గ్రామము లేదనీ, ఆ గ్రామమును గుర్తించవలసి యున్నదనీ శ్రీ రవ్వా శ్రీహరిగారు వ్రాసినారు.

సాధారణముగా తన కీర్తనలలో అన్నమయ్య యతిప్రాసలు పాటిస్తాడు. ఈ కీర్తన మొదటి చరణమున "నందునింటను – చంద్రవదనలు" అనుచోట ప్రాస పాటించలేదు.

రెండు చోట్ల "మేలుగా వసుదేవు – కుదయించి నావు" ; "గోపమ్మ నీకొడుకు – మాయింట్ల లోను" ఆను చోట్ల యతి నియమము పాటించలేదు. ఇలాంటి ఈ అక్కడక్కడా సకృత్తుగా కనిపించే విషయాలు.

55. తినరాని కొనరాని దేవలోకపు పండు

తినరాని కొనరాని దేవలోకపు పండు
మనసున దలిచితే మరగించే పండు

పంటకెక్కి పాలవెల్లి పండిన పాలపండు
తొంటి గొల్లెతల మోవి దొండపండు
అంటుకున్న మేనిచాయ అల్లునేరేడుపండు
ముంటి సింహపుగోళ్ళ ముళ్ళపండు ॥తినరాని॥

ఇచ్చల వేదశాస్త్రాలు దెచ్చిన పేరీతపండు
తచ్చిన దైత్యమారి దేవదారుపండు
పచ్చిదేర మెరసిన బండి గురువింద పండు
ఇచ్చవలె నున్నవారి ఇంట నంటిపండు ॥తినరాని॥

తెమ్మగామునులపాలి తియ్యనిచింతపండు
తె (తి)మ్మల సిరివలపు తేనెపండు
ఇమ్ముల శ్రీవేంకటాద్రి నింటింటి ముంగిటి పండు
కొమ్మల పదారువేల గొప్ప మామిడిపండు ॥తినరాని॥

ఈ కీర్తనలో పళ్ళతో స్వామిని అర్చించాడు అన్నమయ్య. కొన్నిచోట్ల పండ్లతో కొన్ని అవతారాలను సూచించాడు. కొన్నిచోట్ల పండు నామాన్ని శ్లేషించాడు. కొన్నిచోట్ల పండు క్రియాపదంగా అన్వయమయ్యేటట్టు ప్రయోగించాడు. ఆ వింతలన్నీ దర్శిద్దాము.

ఈ దేవలోకంలో పండిన పండు (దేవలోకపు పండు) తినరానిది. కొనరానిది.

తినరాని అన్నప్పుడు తినకూడనిది అని నిషేధార్థం కాదు. తినలేనిది అనే వ్యతిరేకార్థంలో వాడాడు. అలాగే కొనరానిది అనగా సంపాదిదించలేనిది అని.

ఆ భగవంతుడు అంతసులభంగా అందేవాడు కాదని భావం.

ఆ పండు అందదు కానీ మనసులో మననం చేస్తే మాత్రం మరిగిస్తుందిట. మరిగించడం అంటే ఆ రుచిని వీడలేకపోవడం. వాడు బాగా రుచిమరిగినాడని అనడం లోకంలో ఉన్నదే. మనసులో తలచితే మరిగించే పండు – అన్నప్పుడు మనసును boil చేస్తుందని మరొక అర్థం. మనసును boil చేసి మలినాలు తొలగించి శుభ్రపరుస్తుందన్నమాట.

ఇక చరణాలలో పళ్ళగుత్తులు ఏరుకుందాం!

1. **పంటకెక్కి పాలవెల్లి పండిన పాలపండు**

దీనిని రెండురకాలుగా చెప్పుకోవచ్చు. ప్రళయం తరువాత పాలవెల్లిలో మర్రాకు మీద పవ్వళిస్తూ తేలినాడు స్వామి. ఈ సృష్టి అంతా బీజప్రాయంగా ఆ పాపడిలో ఉన్నది. ఈ పండు నుండే మరలా సృష్టి అనే పంట పండబోవుచున్నది. అదీ పంటకెక్కడం అంటే. లేదా క్షీరసాగరముపై విష్ణువు శయనించియున్నాడు. ఆయనే దేవలోకపు పండు. అక్కడనుండే సృష్టి పంట పద్మము రూపంలో ఆయన బొడ్డునుండి మొదలైనది.

"పాలపండు" అన్నప్పుడు రెండర్థాలు (శ్లేష). పాలలోపుట్టిన పండు అని ఒక అర్థం. పిల్లలకు మొదట వచ్చే పళ్ళను పాలపళ్ళు అంటారు. అవే దృఢమైన మన్నిక కలిగిన తదుపరి దంతాలకు పునాదులు. అలాగే ఈ శయనరూపం పాలపండు. దానిలోనుండి అనేక దృఢమైన అవతారములు రాబోవుచున్నవని మరొక అర్థం.

2. **తొంటి గొల్లెతల మోవి దొండపండు.**

ఇదివరకు ఆయనయే గొల్లతల పెదవులకు దొండపండైనవాడు. పెదవికీ దొండపండుకూ సామ్యం సాధారణమే. గొల్లెతల పెదవులకు ఎరుపురంగై పెదవులదొండపండైనాడనడం.

3. **అంటుకున్న మేనిచాయ అల్లునేరేడు పండు**

ఆయన మేనిచాయ అల్లునేరేడు పండు అంటుకొనినట్లుండును. నల్లని వాడని అర్థం. కృష్ణావతారము సూచితము. అయితే వరాహమూ, కూర్మమూ కూడా నల్లనివే. అవి కూడా సూచితమగుచున్నవి.

ఈ పదబంధములో మరొక చమత్కారమున్నది. ఆయనను ముట్టుకుంటే (అంటుకున్న) ఆయన మేని నలుపు చాయలో అ ముట్టుకున్న వారిని అల్లివేసే(ఆల్లు = అల్లికవేయు, పాకు, నేయు) నేరేడుపండాయన. అంటే ఆయనను కొలిచినవారిని తనలో కలుపుకుని సాయుజ్యం ఇస్తాడనడం.

4. **ముంటి సింహపుగోళ్ళ ముండ్లపండు**

గోళ్ళే ముళ్ళవలె వెలసిన నృసింహావతారం సూచితము. (ముంటి = ముండ్లకు సంబంధించిన)

5. **ఇచ్చల వేదశాస్త్రాలు దెచ్చిన పేరీతపండు.**

ప్రియమారగా (ఇచ్చలన్) వేదాలు వెదకి తెచ్చిన పేరీతపండు. పేరీతపండు అంటే ఖర్జూరపుపండు. మత్స్యావతార సూచన. చేపను ఖర్జూరంతో పోల్చడమేమిటి? కొంచెం మేనిబంక వలన జిగురుజిగురుగా ఉండడమే సామ్యం అని అనుకుందాం.

పేరీతపండు అనడంలో శ్లేష ఉన్నది. పెద్ద ఈత పండు అని అర్థం. చాలా గజయీతగాడని మరొక అర్థం.

తెనాలి రామకృష్ణుడు "ఈతకాయ రూపై పృధుకర్పరంబున" అని కూర్మావతారాన్ని వర్ణించాడు.

6. **తచ్చిన దైత్యమారి దేవదారుపండు**

దైత్యదమనుడైన స్వామి (దైత్యమారి) తచ్చినాడు. తచ్చు అనగా తగ్గుదల. తగ్గి కురుచయై వామనుడైనాడు. తరువాత విపరీతముగా యెదిగి

దేవదారువంతయైనాడు. ఈ దేవదారు వృక్షములు (మద్దిజాతి చెట్లు) పొడవుగా ఎదుగుతాయి. ఆ తగ్గినవాడే ఎదిగినాడని వామనావతారం సూచన.

దారు పదం ఒక విచిత్రమైనది. దీనిని పేదవాడు, ధనవంతుడూ అని రెండర్థములున్నవి. అందుచే స్వామి వామనావతారంలో పేదవాడు. త్రివిక్రముడై ధనవంతుడు. ఇది దీనిలోని మరియొక అందమైన అర్థం.

7. **పచ్చిదేర మెరసిన బండిగురువిందపండు**

పచ్చిగా ఉన్నపుడే (పచ్చిదేర) మెరసిన బండిగురువింద పండు. మరలా వామనావతార సూచన. వటుడు పచ్చి పింది. అయినా ఆయనను చూచి ఆ తేజస్సుకు “శంభుండో, హరియో, పయోజ భవుడో, చండాంశుడో, వహ్నియో దంభాకారత వచ్చెగాక” అనుకున్నారు బలి సభలోనివారు. అది పిందియైనప్పటి మెరుపు.

కురువిందము నకు మాణిక్యము, అద్దము అని అర్థములున్నవి. ఆయన పెరిగి విశ్వమును అద్దమందు చూపినయట్లు చూపుచూ మాణిక్యకాంతులు వెదజల్లినాడని మరియొక అర్థము.

8. **ఇచ్చవలె నున్నవారి యింట నంటిపండు**

కోరి (ఇచ్ఛ = కోరిక) కొలిచే వారి యింట అరటిపండు (అంటి = అరటి). అంతటి సులభుడు అనడం. అరటి పండు సులభంగా లభ్యమౌతుంది. సులభంగా తినవచ్చు కూడా. పెద్ద కఠినత లేకుండా అర్థమయ్యే కవిత్వాన్ని కదళీపాకం అనికూడా అంటాం.

కోరి కొలిచితే వారిని ఆయన “అంటి”పెట్టుకుని ఉంటాడని సారస్యం. ఇంకొక మంచి అర్థం కూడా సిద్ధిస్తుంది. అంటిపండు అంటే అంటిపెట్టుకుని పడుకుంటాడనడం. కోరి కొలిచేవారి యిల్లు ఆయనకి పాలసముద్రంతో సమానమన్నమాట.

9. **తెమ్మగా మునుల పాలిటి తియ్యని చింతపండు.**

చక్కనిమాట. (తెమ్మ = తేమ) మునుల పాలిటి తియ్యని చింతపండట. తీపి చింతపండు వేరే దొరుకుతుంది. తియ్యగా బావుంటుంది. చింతపండుతో పోలిక గనుక తేమ కూడా చేర్చాడు. చింతపండు కొంచెం తేమతేమగా ఉంటుంది. మునులు కదా అందుకని స్వామి చింతపండు వలె ఆర్ద్రత (తేమ) కలిగి ఉంటాడనడం.

అసలు అర్థం ఏమంటే. మునులు తపస్సు చేస్తారు. అనగా మనసులో భగవంతుని చింతన చేస్తారు. అందుకే మునులవిషయంలో ఆయనను "చింత" పండుతో పోల్చడం.

మునుల ఆర్ద్రమైన "చింత"లో (మననంలో) ఆయన "పండు"తాడని పిండితార్థం. (పండు = పండుకొను, పండు అంటే ధన్యుడౌతాడని కూడా. బ్రతుకు పండింది అని వాడతాము కదా)

10. **తెమ్మల సిరివలపు తేనెపండు.**

ఆర్ద్రమైన అలమేలుమంగ వలపునకు ఆయన తేనెపండు (తీపి పండు). కాదు కాదు ఆర్ద్రమైన అలమేలుమంగ వలపు తేనియలో ఆయన శయనిస్తాడు (పండు – క్రియగా)

తిమ్మల అని మరియొక పాఠం సూచితమైనది కీర్తనలో. తిమ్మ = సుఖము. అప్పుడు కూడా పై అన్వయాలు నిలుస్తాయి.

11. **ఇమ్మల శ్రీవేంకటాద్రి యింటింటి ముంగిటి పండు.**

అందమైన శ్రీవేంకటాద్రిపై ప్రతియింటి లోని (ఇంటింటి) ముంగిటిపండు. ముంగిటిపండు అంటే ఇంటిముంగిటిలో ఉంటాడని ఒక అర్థం. సులభంగా పొందగలవాడని ఒక అర్థం.

12. **కొమ్మల పదారువేల గొప్పమామిడి పండు.**

పదహారు వేల గోపికలకు (కొమ్మ = స్త్రీ) గొప్ప మామిడిపండై తీపిని పంచిన వాడీ వేంకటాద్రీశుడు

లెక్కపెట్టలేనన్ని (పదారువేలు) కొమ్మలకు మామిడిపండై లభించేవాడు. వెదకనక్కరలేకుండా ఎక్కడబడితే అక్కడ కనిపిస్తాడని అర్థం. నీవు చూడగలిగితే నీ చుట్టూ ఉన్న ప్రతి అణువులోనూ ఉన్నాడనడం.

ఈ కీర్తనలో ఎన్ని ఫలాలు మనకందించాడో అన్నమయ్య మనకు. అందుకే ఇది మధురమైన కీర్తన.

56. తెప్పగా మఱ్ఱాకు మీద తేలాడువాడు

తెప్పగా మఱ్ఱాకు మీద తేలాడువాడు
ఎప్పుడు లోకములెల్ల యేలేటివాడు

మోతనీటి మడుగులో యీతగరచినవాడు
పాతగిలే నూతిక్రింద బాయనివాడు
మూతిదోసి పట్టిమట్టిముద్ద పెల్లగించువాడు
రోతయైన పేగుల పేరులవాడు ॥తెప్పగా మఱ్ఱాకు॥

కోడికూత నోరివాని కుఱ్ఱతమ్ముడైన వాడు
బూడిద బూసినవాని బుద్ధులవాడు
మాడవన్నె లేడివెంట మాయలబడినవాడు
దూడల నావులగాచి దొరయైన వాడు ॥తెప్పగా మఱ్ఱాకు॥

ఆకసాన పారేవూరి అతివల మానములు
కాకుసేయు వాడు తురగముపై వాడు
యేకమై వేంకటగిరి నిందిరారమణి గూడి
యేకాలము బాయని యెనలేనివాడు ॥తెప్పగా మఱ్ఱాకు॥

ప్రళయాంతమున జగమంతా జలమయ మైనపుడు ఒక మఱ్ఱియాకు తెప్పపై చిన్ని బాలుడై పరమాత్మ తేలాడు.

తేలాడువాడు అన్నపుడు రెండర్థాలు. తేలియాడు వాడు అని ఒకటి. వాడు తేలాడు (వచ్చాడు, పోయాడు వలె) అని మరియొకటి.

ఇక్కడి నుండి సృష్టి క్రమంలో ఆ చిన్నబాలుడు ఎత్తే అవతారాలూ వరుసగా చెబుతున్నాడు.

1. **మోతనీటి మడుగులోన యీత నేర్చినవాడు :**

ఇది మత్స్యావతారం. బరువు మోస్తూ (మోత) నీటిలో ఈతకొట్టడం. ఇది చాల కష్టమైన పని. ఇది ముందే నేర్చుకొన్నవాడు. అందుచే తరువాత తాబేలై మందరం మోయడం, వరాహమై భూమిని మోయడం విలాసంగా చేయ గలిగినాడనడం.

2. **పాతగిలే నూతి కింద బాయనివాడు**

ఇది కూర్మావతారం. పాతబడిన నూతుల్లో నీటిని శుభ్రపరచడానికి తాబేళ్ళను వదులుతారు. అది ఆనీటిలోని నాచూ చిన్న చిన్న మొక్కలూ తిని నీరు కొంతవరకూ శుభ్రపరుస్తుంది. ఇక్కడ ఆ మాట చెప్పేడు. పాత బావులలో చేరి పాయక ఉండేవాడట.

3. **మూతిదోసి మట్టిముద్ద పట్టి పెళ్లగించువాడు.**

ఇది వరహావతారము. వరాహం మూతితో మట్టిముద్దలు పెళ్ళగిస్తుంది. ఈయనో ఏకంగా భూమినే నీటిలోనుండి ఎత్తి ముట్టె మీద పట్టుకున్నాడు.

4. **రోతయైన పేగుల పేరులవాడు**

ఇది నృసింహావతారం. జుగుప్స కలిగే విధంగా పేగులు మెడలో దండలవలె (పేరులు = దండలు) ధరించినవాడు.

5. **కోడికూత నోరివాని కుర్రతమ్ముడైన వాడు**

ఇది వామనావతారం. కోడికూత నోరివాడు ఇంద్రుడు. అహల్య కోసం కోడికూత కూసినవాడు కనుక. వాడి తమ్ముడు ఉపేంద్రుడు. వాడే వామనుడు.

6. **బూడిదబూసిన వాని బుద్ధులవాడు**

ఇది పరశురామావతారం. బూడిద పూసుకునేవారు తాపసులు. అలాంటి మునికుమారుడే పరశురాముడు.

7. **మాడవన్నె లేడివెంట మాయలబడిన వాడు**

ఇది రామావతారం. మాడ అంటే బంగారు నాణెము. మాడవన్నె అంటే బంగారు రంగు. అలాంటి వన్నెగల లేడివెంట మాయలో పడినవాడు రాముడు.

8. **దూడలు ఆవులు కాసి దొరయైనవాడు**

ఇది కృష్ణావతారం

9. **ఆకసాన పారే వూరిఅతివల మానములు కాకు చేసినవాడు**

ఇది బుద్ధావతారం. ఆకసాన పారే వూళ్ళు త్రిపురాలు. వారి భార్యలను విష్ణువు బుద్ధుడై వచ్చి తన అందమైన రూపంతో వారిలో మోహం కలిగించాడు. అపుడు వారి పాతివ్రత్యం దెబ్బతింది. దానితో త్రిపురాసురులకు వారి అతివల పాతివ్రత్యము వలని రక్షణ తొలగింది. వారిని మహాదేవుడు వధించ గలిగాడు.

10. **తురగముపై వాడు**

గుర్రమెక్కి వచ్చేవాడు కల్కి అవతారం.

11. ఈ అవతారాలన్నీ యేకమై వేంకటగిరిపై లక్ష్మీదేవితోడ శాశ్వతముగా (యే కాలము బాయని) వెలసిన సాటిలేని (యెనలేని) దేవుడు ఈ వేంకటేశ్వరుడు.

ఇది ఒక అవతారంకాదు. పూర్ణమైన విష్ణుస్వరూపం అని నిర్ధారణమన్నమాట.

బాగా ప్రాచుర్యం పొందిన దశావతార కీర్తనలలో ఇది యొకటి.

57. తెలియ చీకటికి దీపమెత్తక

తెలియ చీకటికి దీపమెత్తక పెద్ద
వెలుగు లోపలికి వెలుగేల?

అరయ నాపన్నునికి అభయమీవలె గాక
ఇరవైన సుఖిని గావనేల?
వరదం బోయెడివాని వడి తీయవలె గాక
దరివాని తివియంగ తానేల? ॥తెలియ చీకటికి॥

ఘన కర్మాలంబునికి కట్లు విడవలె గాని
యెనసి ముక్తుని గావనేల?
అనయము దుర్బలునికి అన్నమిడవలెగాక
తనిసిన వానికి తానేల? ॥తెలియ చీకటికి॥

మితిలేని పాప కర్మికి గావలె గాక
హితమెరుగు పుణ్యునికి తానేల?
ధృతిహీను కృపజూచి తిరువేంకటేశ్వరుడు
తటి గావకుండిన తానేల? ॥తెలియ చీకటికి॥

పుణ్యం చేసుకున్న వారికి, జ్ఞానులకు, మంచిమార్గం అనుసరించే వారికీ దైవానుగ్రహం కలగడం సహజంగా మనం భావిస్తాము. అన్నమయ్య ఈ కీర్తనలో నిజానికి దైవం అనుగ్రహించవలసినది పాపులను, అజ్ఞానులను, చెడ్డ మార్గాలను పట్టినవారినీ అని నిష్కర్ష చేస్తున్నాడు. దైవానుగ్రహం నిజానికి వారికే అవసరం.

చీకటి ఉన్న చోట దీపం అవసరం. కానీ పెద్ద వెలుగు ఉన్నచోట దీపం వెలుగు అవసరమేమున్నది?

1. ఆపదలో ఉన్న వాడికి (ఆపన్నునికి) అభయమీయవలెను కానీ, స్థిరముగా (ఇరవైన) సుఖముగా నున్నవానికి అభయమెందులకు?

వరదలో పడి కొట్టుకొనిపోవు వానిని దరిచేర్చవలెను కానీ, దరిచేరిన వానికి సహాయపడుటకు తానేల?

2. సంసారమున కర్మలంపటుడైన వానికి ఆ బంధనముల నుండి వెలువడునట్లు చేయవలయును (కట్లు విడవలె) గాని, పూని (ఎనసి) ముక్తి పొందిన వానిని రక్షింపనేల?

ఎల్లపుడు బలహీనునికి ఆహారమీయవలె గాని, తిని తృప్తి పడినవానికి తాను చేసెడిదేమి?

3. లెక్కకు మిక్కిలి (మితిలేని) పాపములను జేసిన వానికి దైవమవసరము గాని, మంచి మార్గము (హితవు) తెలిసిన వానికి కాదుకదా. ధైర్యము చెడిన వానికి (ధృతి హీనుడు) దయచూపి శ్రీవేంకటేశ్వరుడు అదనెరిగి (తతి) కావకుండినచో ఇక తానేల? అట్టి వారిని రక్షించుటయే దైవమునకు కర్తవ్యమనుట.

58. తెలిసితే మోక్షము తెలియకున్న బంధము

తెలిసితే మోక్షము తెలియకున్న బంధము
కల వంటిది బ్రదుకు ఘనునికిని

అనయము సుఖమేద దవల దుఃఖమేదది
తనువుపై నాస లేని తత్త్వమతికి
పొనిగితే బాపమేది పుణ్యమేది కర్మమందు
వొనర ఫలమొల్లని యోగికిని ॥తెలిసితే॥

తగిన యమృతమేది తలపగ విషమేది
తెగి నిరాహారియైన ధీరునికిని
పగవారనగ వేరి బంధులనగ వేరి
వెగటు ప్రపంచమెల్ల విడిచే వివేకికి ॥తెలిసితే॥

వేవేలు విధులందు వెరపేది మరపేది
దైవము నమ్మినయట్టి ధన్యునికిని
శ్రీవేంకటేశ్వరుడు చిత్తములో నున్నవాడు
ఈవలేది యావలేది యితని దాసునికి ॥తెలిసితే॥

ఈ జీవితం చాలా చిత్రమైనది. జీవి ఈ జగత్తులోనికి ఉత్తిచేతులతో వస్తాడు. ఇక్కడ అనేక బంధాలు కల్పించుకుని వాని చిక్కుముడులలో చిక్కుకుంటాడు. ఇది మాయ అని అతడు తెలుకుంటే అతడు ధీశాలి అవుతాడు. ఆ మాయను తెలుసుకొని అంటీముట్టనట్టు సంసారంలో ఉండడమే మోక్షము. అది తెలుకోలేక పోవడమే బంధము.

"తెలుసుకొనుట" యే బంధమునకూ, మోక్షమునకూ సరిహద్దు.

1. ఈ శరీరము తాను కానని, తాను ఆత్మ స్వరూపుడనని తెలుసుకోవడమే తత్త్వము నెరుగుట. వాడే తత్త్వమతి. వానికి ఎప్పుడూ సుఖమూ లేదు.

ఆవల దుఃఖమూ లేదు. ఆతడు ఆరెంటికీ అతీతుడు.

కర్మను ఫలాపేక్ష లేకుండా చేయడమే యోగం. అట్టి యోగికి ఫలితములు తృణప్రాయములు (పొనుగు = తృణము). వానికి కర్మఫలములైన పాపములు, పుణ్యములు అంటవు.

2. ఉపవసిస్తూ నిరాహారముగా గడిపే ధీరునికి ముందుంచిన అమృతమైనా, విషమైనా ఒకటే.

ప్రాపంచిక విషయాలను విడిచిపెట్టినవానికి బంధువులూ పగవారూ అనే బేధభావాలు ఉండవు.

3. దైవమును నమ్ముకున్న ధన్యమతికి విధి నిర్వహణలో వెరపు మరపులకు తావు లేకుండా చేస్తుంది.

చిత్తములో శ్రీవేంకటేశ్వరుని ప్రతిష్ఠించుకున్న వాడు (చిత్తములో శ్రీవేంకటేశ్వరుడున్న వాడు), ఆ పరమాత్మకు దాసుడైనవానికి ఆంతరము, బాహిరము అను ద్వంద్వములు లేవు. ఆతడెల్లయెడల దైవమును దర్శించగలడు.

59. తెలిసినవారికి దేవు డితడే

తెలిసినవారికి దేవు డితడే
వలవని దుష్టుల వాదము లేలా

పురుషుల లోపల బురుషోత్తముడు
నరులలోన నరనారాయణుడు
పరదైవములకు బరమేశ్వరుడు
వరుస మూఢుల కెవ్వరో యితడు

పలు బ్రహ్మలకును పరబ్రహ్మము
మలయు నీశులకు మహేశు డితడు
ఇల నాత్మలలో నిటు పరమాత్ముడు
ఖలుల కెట్లుండునో కానము యితడు

వేదంబులలో వేదాంతవేద్యుడు
సోదించ కరి గాచుచో నాదిమూలము
యీదెస శ్రీవేంకటేశు డిందరికి
గాదిలి మతులను గైకొన డితడు

దేవుని గురించి చింతన చేసి తెలుసుకోవాలి. అలా తెలుసుకున్న వారికి ఆ భగవత్స్వరూపము అర్థమౌతుంది. ఆతనిని వద్దనుకునే వారితో మనకు వాదమెందుకు? మన చింతన మనది. మన భావన మనది. ఎవరి అనుభూతి వారిది.

1. పురుషులలో అతడు పురుషోత్తముడు.

నరులలో నారాయణుడు.

దైవాలకు ఆతడు పరమేశ్వరుడు.

మరి మూఢులకో? మనకెందుకు. ఎవరో వారికే తెలుస్తుంది. మూఢులకు గోచరించడు అని భావము. లేదా వారి అభిరుచికి తగునట్లే కనబడును అని కూడా చెప్పుకొనవచ్చును.

2. సృష్టిలో చాలామంది బ్రహ్మలు ఉంటారు. వారందరికీ ఈతడు పరబ్రహ్మము.

తిరిగే (మలయు) ఈశ్వరులందరికీ ఈతడు మహేశుడు (మహాలి ఈశుడు). (దేవీ భాగవతంలో పలు బ్రహ్మలకు, ఈశులకూ సంబంధించిన సమాచారం దొరుకుతుంది)

ఇలపై ఆత్మలకు ఈతడు పరమాత్మ.

పాపాత్ములకు ఎలా కనబడునో మనకు తెలియదు. (ఖల్ నాయక్ కు ఖల్ నాయక్ వలెనే ఉంటాడని చెప్పక చెప్పడం)

3. వేదాలలో ప్రతిపాదింపబడిన వాడితడే.

(వేదాంతవేద్యుడు = వేదములచే తెలుసుకొన బడువాడు)

అన్నిటిలోనూ ఉత్తముడనీ, వేదాలు పొగిడేవాడనీ చెబుతున్నామే. ఆతడు అంతటి దయామయుడు కూడా. శోధించి చూస్తే ఒక జంతువు (ఏనుగు) పిలిస్తే పరుగున వచ్చి రక్షించే దయామయుడు.

ఈ విధముగా శ్రీవేంకటేశుడు ప్రేమతో అందరి భావములనూ గ్రహించును.

“గాదిలి మతులను గైకొనడితడు” ఇక్కడ ఏదో పొరబాటున్నట్లున్నదని యనిపించుచున్నది. దీనిలో వ్యతిరేకార్థము లేఖక ప్రమాదమేమో? “గైకొనునితడు” అని యుండవలెనా?. మూలమెట్లున్నదో? పెద్దలు విచారింతురు గాక! లేక వేరే విధముగా సమన్వయమగునా?

౬౦. తొడిబడ సందుసుడిదొంగాడీని

తొడిబడ సందుసుడిదొంగాడీని
వెడగుగొప్పుశిరసు వెన్నముద్దకృష్ణుడు

ఆదిగొని నేరాగా నఅచేతివెన్నముద్ద
పాదుకొన నోర నిండా బావుకొన్నాడు
సాదించీ నామాటాడ దచ్చుమయ్యినగోలవలె
యీదెస జట్టిలో వెన్న యియ్యవచ్చీ జేతికి ॥తొడిబడ॥

కుత్తుకబంటిదాకా గూనలో పాలెల్లా దాగి
యెత్తుకవున్నాడు మొగ మిందుదాకాను
యెత్తుకొన బిలిచితే యెంతైనా గదలడు
వొ త్తిపట్టి వూదుకొనీ నొకచేత నేలను ॥తొడిబడ॥

పెరుగుమీగడలెల్ల పిన్నవాండ్ల కందిచ్చి
దొరవలె లోననుండి తొంగిచూచీని
యెరవు లేక శ్రీవేంకటేశుడని మొక్కితేను
ఇరవైతినని నవ్వీ నిట్టె సెలవులను ॥తొడిబడ॥

వెన్నదొంగ యైన చిన్నికృష్ణుని అద్భుతమైన వర్ణన ఈ కీర్తన.

తొడిబడు = తొట్రుపడు

సందుసుడిమాయలు = సందుచూసుకుని మోసం చేయడం

వెడగు = ఎబ్బెట్టు, కొకిబికి

వెన్న దొంగిలించి ఒక గోపికకు దొరికిపోయాడు కన్నయ్య. తప్పించుకోవడానికి వీలులేదు. అదీ పరిస్థితి. ఇక కీర్తన లోకి........

తొట్రుపడుతున్న (తొడిబడు) మోసం, మాట బాగా నేర్చిన దొంగవాడు

ఆడుతూ (సందుసుడి దొంగాడీని) దొరికాడు. మరి ఏ ఉట్టెలు తియ్యడానికి ఏమి కష్టపడ్డాడో కానీ ఎప్పుడూ చక్కగా ఆకర్షణీయంగా ఉండే కొప్పు కొకిబికిగా తయారైంది (వెడగుకొప్పు శిరసు). చిన్నికృష్ణుడు వెన్నముద్దలా ఉన్నాడట (వెన్నముద్ద కృష్ణుడు). దీనికి రెండర్థాలు చెప్పుకోవచ్చు. వెన్నముద్దలాగా అందంగా ఉన్నాడని ఒక అర్థం. గొల్లలకు వెన్నముద్ద కన్నా గొప్ప పోలిక చెప్పే పదార్థం ఉండదు. అందుకే అందానికి దానితో పోలిక. వంటి నిండా వెన్న పూసేసుకుని వెన్నముద్ద లాగా ఉన్నాడని మరొక అర్థం.

1. ఆదిగొను = ఎదుర్కొను

పాదుకొను = నెలకొను, నాటుకొను

సాదించు = దెప్పు, నిందించు

గోల = అమాయకుడు

జట్టి = బేరము, వెల

గోపిక ఇలా చెబుతున్నది.

దొరికాడు దొంగ అని నేను ఎదురుగా (ఆదిగొను) వచ్చేను. అప్పుడు ఆ దొంగ ఏమి చేసాడో తెలుసా? అరచేతిలో వెన్నముద్ద ఉన్నది. అది నేను తీసేసుకుంటానని దానిని నోటినిండా పాముకున్నాడు! (పాదుకొన నోర నిండా బావుకొన్నాడు). అప్పుడు నేను కొంచెం తీవ్రంగా (సాదించి) మాటలాడేను. ఏదీ నోరు తెరు అని గట్టిగా రొక్కించిందన్నమాట. అపుడు ఎంత అమాయకుడిలా నటించాడో తెలుసా? (అచ్చమైన గోల వలె). ఇంకో చోద్యం చెబుతాను. ఇంకొక చేతిలోని వెన్నముద్ద (ఈ దెస) నాకు లంచంగా (జట్టిలో) ఇయ్యవచ్చినాడు. ఈ చిన్న వెన్నముద్ద తీసుకుని వదిలెయ్యమని బేరం పెట్టాడట చిన్ని కృష్ణుడు! ఎంత చక్కని లీల!

2. కుండలో (గూన = కుండ) పాలన్నీ పీకల వరకూ తాగి (కుత్తుక బంటిదాకా

గూనలో పాలెల్లా తాగి) ముఖం కొంచెం పైకెత్తుకుని కూర్చున్నాడు చిన్నికృష్ణుడు. చిత్రమైన మాట యిది. పాలు పీకలవరకూ తాగినాడు కదా కొంచెం మెడ దించితే అవి బయటకు వచ్చేస్తాయని భయమన్నమాట. అందుకే మెడ నిగిడించి కూర్చోవడం. ఎత్తుకుంటాను రా అని పిలిచితే కొంచెం కూడా కదలడం లేదట. పైగా ఒక చెయ్యి నేలమీద ఆనించి ఊదుకొని మరీ కూర్చున్నాడట. ఈ పాలంటే ఎంత యిష్టమో ఆ చిన్నికృష్ణునికి. పొట్ట నిండిపోయేకా కూడా ఇంకొంచెం తాగేసి ఆపసోపాలు పడే ఇలాంటి చిన్ని కృష్ణుని మధురమైన వర్ణన ఇంకెక్కడా మనకు కనబడదు. ఇలా వర్ణించిన అన్నమయ్య ధన్యుడు.

3. పెరుగు మీగడలను తోటి చిన్నపిల్లల కందించి లోపలనుండి చిన్నకృష్ణుడు దొరలా తొంగిచూస్తున్నాడు. చేసేది దొంగతనం. దొరలా దర్పమూ అనడం. అన్యము (ఎరవు) ఇంక యేమీ లేదని ఆ చిన్నవేంకటేశుని మ్రొక్కితే నేనే స్థిరమైన వాడినని (ఇరవైతినని) సెలవుల వార నవ్వుతున్నాడు.

మధురానుభూతులు పంచే బాలకృష్ణుని వర్ణనం.

61. తొల్లి కలవె యివియు తొల్లి తాను కలడే

తొల్లి కలవె యివియు తొల్లి తాను కలడే
కల్లయును గాదు కడు నిజము కాదు

కను దెరచినంతనె కలుగు యీ జగము
కనుమూసి నంతనె కడు శూన్యమౌను
కనురెప్ప మరుగుననె కలిమియు లేమియును
తన మనోభావముల దగిలి తోచీని ॥తొల్లి॥

తలచినంతనె యెంత దవ్వయిన కాన్పించు
తలపు మరచిన మతికి దట్టమౌ దమము
పొలసి మతి మరుగుననే పుట్టుటలు బోవుటలు
పలుచంచల వికార భావమీ గుణము ॥తొల్లి॥

ముందు తా గలిగితే మూడులోకములు గల
వెందు తాలేకుంటే యేమియును లేదు
అంది శ్రీవేంకటేశు దాత్మలోననె వీడె
కందువల నితని సంకల్పమీ పనులు ॥తొల్లి॥

ఈ ఆధ్యాత్మిక కీర్తనలో ప్రతిపాదించే అంశం కొంచెం ముందుగా అనుకుని అప్పుడు కీర్తన చూద్దాం.

మానవునికి ఐదు జ్ఞానేంద్రియాలున్నాయి (కన్ను, ముక్కు, చెవి, నాలిక, చర్మం). వీటిలో ముఖ్యమైనది కన్ను. ఈ ఇంద్రియాలు వాటివాటి పరిమితులకు లోబడి బాహ్య ప్రపంచమునకు సంబంధించిన సమాచారం మనస్సుకు చేరవేస్తాయి. అవి ఇచ్చిన సమాచారం మేరకు మనస్సు బాహ్యప్రపంచాన్ని చిత్రంగా చూపిస్తుంది. దానినే మనం "చూస్తున్నాము" అనుకుంటాం. కాని బాహ్యప్రపంచం నిజానికి

మన మనస్సుకు సంబంధించిన వ్యాపారం. అంటే ఇది మనోవికారం. ఇక విస్తరించవలసిన పనిలేదు.

ఇంద్రియాలను నిగ్రహించ గలిగిన వాడికి మరొక చిక్కు ఉంది. అతడు బాహ్యజగత్తు నుండి విడివడడం సులువేమీ కాదు. మనసు తనలో దాచుకున్న సమాచారంతో తానే బాహ్య జగత్తును చూస్తున్న అనుభూతిని సృష్టించగలదు. ఇది మనస్సు ప్రత్యేకత.

1. కన్ను తెరిస్తే ఈ జగత్తు కనిపిస్తున్నది. కన్ను మూస్తే ఈ జగత్తు మాయమగుచున్నది. కనురెప్ప మరుగున ఈ జగత్తు కలగడమూ లేకపోవడమూ జరుగుతున్నది. జ్ఞానేంద్రియల్లో కన్ను ప్రధానం కనుక దాని ఆధారంగా తత్త్వం చెబుతున్నాడు అన్నమయ్య.

   కనుమూయు అంటే మరణించడమనీ అర్థం ఉంది. మనుగడ ఉన్నంత వరకూ మాత్రమే ఈ ప్రపంచాన్ని గుర్తించగలగడం. ఆఖరి పాదములో పైన మనం చెప్పుకున్న విషయం చెబుతున్నాడు. నీవు "చూస్తున్నాను" అనుకుంటున్నావే అవి నీ మనస్సులోని భావనలే సుమా. (తన మనో భావముల తగిలి తోచీని). అది నిజమో కాదో నీవెరుగవు

2. ఆలోచనలో (తలచినంతనె) ఎంతటి దూరములో గల వస్తుజాలమైనా దర్శించవచ్చు. ఆలోచన ఆగిపోతే మనసులో చీకటి అలముకుంటుంది (దట్టమౌ తమము). ఈ ఆలోచన మరుగులో జగత్తు ఉన్నట్టూ లేనట్టూ భాసిస్తున్నది. ఇది మనస్సు చేసే కనికట్టు (పలు చంచల మనోవికార భావమిది).

   తేలిన విషయమేమి? ఈ జగత్తు ఇంద్రియ వ్యాపారము లేదా మనోవ్యాపారము.

   అట్లైన ముందు జగత్తులోని వస్తుజీవజాలములు కలవా? కాక తాను ముందుకలడా? (తొల్లి కలవే యివియు తొల్లి తానుకలడే)

ఈ ప్రశ్ననే మరొకలాగున వేసుకుందాము. జగత్తు ఉనికి వలన నేనున్నానని గుర్తించుచున్నానా? నా ఉనికి వలన (నేనున్నాను కావున) జగత్తును గుర్తించుచున్నానా? ఇది ప్రశ్న. ఇది పల్లవిలోని ప్రశ్న. తత్త్వము రెండు చరణములలో వివరించి తన తీర్పు మూడవ చరణంలో చెబుతున్నాడు అన్నమయ్య.

3. ముందు నీవుంటేనే మూడులోకాలు ఉన్నవి. నీవు లేకుంటే ఏమీ లేదు

జీవుడు నిత్యము. జగత్తు మిధ్య అని తేల్చినాడు. ఇంకొక పైమాట చెబుతున్నాడు. జీవుడు ఎవరో కాదు. నీ ఆత్మలో ఉన్న వేంకటేశుడే (పరమాత్మయే). జీవాత్మ పరమాత్మ ఒక్కడే అనడం. "ఆతని" సంకల్పమే ఇదంతా (ఈ పనులు).

పరమాత్మ సత్యము. నీవు పరమాత్మ అంశము. పరమాత్మ సంకల్పమే ఈ సృష్టి.

62. తొల్లియును మఱ్ఱాకు తొట్టెలను నూగెనన

తొల్లియును మఱ్ఱాకు తొట్టెలను నూగెనన
చెల్లుబడి నూగీని శ్రీరంగ శిశువు

కలికి కావేరి తరగలను బాహులతలనే
తలగకిటు రంగమధ్యపు తొట్టెలను
పలుమారు దననూచి పాడగా నూగీని
చిలుపాల సెలవితో శ్రీరంగ శిశువు ॥తొల్లియును॥

అదివో కమలజుని తిరువారాధనంబనగ
అదన కమల భవాండమను తొట్టెలను
ఉదధులు తరంగముల నూచగా నూగీని
చెదరని సిరులతోడ శ్రీరంగశిశువు ॥తొల్లియును॥

వేదములె చేరులై వెలయంగ శేషుడే
పాదుకొను తొట్టెలై పరగగాను
శ్రీదేవితో గూడి శ్రీవేంకటేశుడై
సేద దీరెడి వాడె శ్రీరంగ శిశువు ॥తొల్లియును॥

శ్రీవారి తెప్పోత్సవం జరుగుతున్నది. కోనేటిరాయడు పూలతెప్పపై శ్రీదేవితో సేదతీరుతున్న తీరు వర్ణిస్తున్నాడు అన్నమయ్య.

మొట్టమొదట (తొల్లి) సృష్టి ఆరంభంలో మఱ్ఱియాకు తొట్టెలో తొలిశిశువై ఊగినట్లుగా చెల్లుబడితో తెప్పపై ఊగుతున్నాడు ఈ శ్రీరంగ శిశువు. చెల్లుబడి అనగా అధికార వైభవము.

1. మాటిమాటికీ ఆ కావేరీ దేవి (కలికి కావేరి) తన తరంగములు అను బాహులతలతో తనను యూచుచూ పాడగా భయపడక చలింపక (తలకక)

అప్పుడే తాగిన పాలచారికలు పెదవి వార కనబడుతూండగా (చిలుపాల సెలవి. సెలవి = పెదవి వార) హాయిగా ఊగుతున్నాడీ శ్రీరంగ శిశువు.

2. అదివో సాక్షాత్తు బ్రహ్మగారు చేసే తిరువారాధనం (బ్రహ్మోత్సవం) అన్నట్టుగా బ్రహ్మాండము (కమల భవ + అండము. కమలభవుడు = బ్రహ్మ) అనే తొట్టెలో సముద్రములు (ఉదధులు) తరంగములలో నూగించగా చెదరని వైభవముతో (చెదరని సిరులతో) ఆ శ్రీరంగ శిశువు ఊగుతున్నాడు.

3. శేషుడే తొట్టె కాగా, వేదాలు త్రాళ్ళు/గొలుసులు (చేరులు) కాగా శ్రీదేవి తోడు కాగా ఆ తెప్పపై శ్రీవేంకటేశుడై సేద తీరుతున్నాడదే శ్రీరంగ శిశువు.

అన్నమయ్య వైష్ణవ క్షేత్రాలన్నీ దర్శించినాడు. తిరుమలపై జరిగే ఉత్సవాలలో ఆయా క్షేత్రాలలో తాను చూచిన ఉత్సవాలతో ముడిపెట్టి తలచుకుని ఆనందము అనుభవిస్తాడు. ఇక్కడ శ్రీవేంకటేశ్వరుని శ్రీరంగనాధునిగా భావిస్తూ ఆ విభవాలను చక్కగా కళ్ళకు కట్టించాడు.

63. దిబ్బలు వెట్టుచు తేలినదిదివో

దిబ్బలు వెట్టుచు తేలినదిదివో
ఉబ్బునీటిపై నొక హంస

అనువున కమల విహారము నెలవై
యొనరి యున్నదిదె ఒక హంస
మనియెడి జనముల మానస సరసుల
యునికి నున్నదిదె ఒక హంస ॥దిబ్బలు వెట్టుచు॥

పాలు నీరు వేర్పరచి పాలలో
నోలలాడె నిదె ఒక హంస
పాలుబడిన యీ పరమహంసముల
ఓలి నున్నదిదె ఒక హంస ॥దిబ్బలు వెట్టుచు॥

తడవి రోమరంధ్రమ్ముల గ్రుడ్లను
ఉడుకగ పొదిగీ నొక హంస
కడువేడుక వేంకటగిరి మీదను
నొడలు పెంచెనిదె ఒక హంస ॥దిబ్బలు వెట్టుచు॥

ఈ కీర్తనలో అన్నమాచార్యులు సృష్టి అంతము, పునఃప్రారంభము గురించి వివరిస్తున్నాడు.

ప్రళయం వచ్చి సృష్టి అంతమైనది. సర్వం జలమయ మయినది. అదీ ఈ ఉబ్బునీరు.

ఆ జలములపై వటపత్రశయానుడై విష్ణువు మరల సృష్టి ప్రారంభానికి సన్నాహములు మొదలుపెట్టినాడు. ఆ జలములలో ఏడు పర్వతములు తేలినవి. అవియే ఈ దిబ్బలు. దానిపై నూతన సృష్టి కర్త శ్రీవేంకటేశుడు కొలువుతీరినాడు. ఆతడే ఆ దిబ్బలు వెట్టుచు ఉబ్బునీటిపై తేలిన హంస.

1. హంసలు కమలములలో విహరించును. ఈ వేంకటాద్రి పరమహంస అనువుగా కమల విహారము చేయుచుండును. కమల అను పదమునకు లక్ష్మి, జలము, పద్మమూ అను అర్థములున్నవి. జలములో విహరించును. లక్ష్మితో విహరించును. పద్మములను ధరించును.

   హంసలు మానససరోవరములో నివసించును. ఈ హంసమో - యీ జలములలోనే కాదు. తాను సృజించిన మానవుల మానస సరోవరములందు కూడ విహరించును.

2. హంస పాలు నీరు వేర్పరచి పాలు గ్రహించునని ప్రతీతి. ఈ వేంకటాద్రి పరమహంస పాప పుణ్యములను వేరు పరచి పుణ్యములను స్వీకరించి వాని ఫలములను పంచిపెట్టును.

   కావుననే ఇది పాలుగ్రహించెడు (పాలుబడిన) అసలు హంసలకు పోలికైనది (ఓలి = సమానము)

3. హంస గ్రుడ్లు పెట్టి పొదిగి పిల్లలను చేయును. ఈ వేంకటాద్రి హంస తన శరీరపు కోట్ల రంధ్రములనుండి జీవులను సృజించును (అదియే రోమరంధ్రముల గ్రుడ్ల ను పొదుగుట)

   ఇది వేంకటాద్రిపై శరీరము పెంచి తిరుగాడిన వేంకటాద్రి పరమహంస.

64. దీనుడను నేను దేవుడవు నీవు

దీనుడను నేను దేవుడవు నీవు
నీ నిజరూపమే నెరపుట గాక

మతి జననమెరుగ మరణంబెరుగను
ఇతవుగ నిను నింక నెరిగేనా
క్షితి బుట్టించిన శ్రీపతివి నీవు
గతి నాపై దయ దలతువు గాక ॥దీనుడను॥

తలచ పాపమని తలచ పుణ్యమని
తలపున ఇక నిన్ను దలచేనా
అలరిన నాలో అంతర్యామివి
కలుషమెడయ నను గాతువు గాక ॥దీనుడను॥

తడవనా హేయము తడవనా మలినము
తడయక నీమేలు తడవేనా
విడువలేని శ్రీవేంకట విభుడవు
కడదాక నిక గాతువు గాక ॥దీనుడను॥

తేటమాటలతో అన్నమయ్య జీవునికి శరణాగతి బోధిస్తున్నాడు. తానే ఆ పరమాత్మ సన్నిధిలో నిలబడి శరణాగతి చేసి చూపిస్తున్నాడు.

స్వామీ నేను దీనుడను. (దీనుడు = దరిద్రుడు, దర్పముడిగినవాడు). నీవు దేవుడవు. ఇంతటా వ్యాపించినది (నెరపిన) నీ రూపమే అని తెలుసుకున్నాను.

1. నేనెన్ని పుట్టువులు పుట్టితినో యెరుగను. ఎన్ని మార్లు మరణించితినో యెరుగను. ఈ జన్మమున ఈ జగత్తు (క్షితి) నీవు పుట్టించితివని తెలుసుకున్నాను. నిన్ను శరణాగతి చేస్తున్నాను. ఇక నాపై దయ చూపుము

స్వామీ! (పుట్టించిన వాడే పోషించవలె ననుట).

2. ఇది పాపమని తలచను (తలచ పాపమని), ఇది పుణ్యమనీ తలచను. పాప పుణ్యముల తలంపు లేని బ్రతుకిది. ఇక నిన్ను తలచు నేర్పు తలపు నాకెక్కడిది. నీవు నాలో అంతర్యామివై యున్నావట. నీవే పాపములు తొలగించి (కలుష మెడయ) నన్ను కాపాడు స్వామీ!

3. నాలోని రోతలు (హేయము), దోషములు (మలినము) ఎన్నడూ విచారించుకొనను (తడవను). ఇక ఆలస్యము చేయక (తడయక) నీ మేలు (ఉపకారము) మాత్రము విచారించగలనా? విచారించు నేర్పు లేదనుట. ఓ వేంకటనాథా! నిను విడువలేను – లేదా – నను నీవు విడువలేవు. రెండు రకములైన అన్వయమూ కుదురుతుంది. నన్ను కడవరకూ కాపాడు స్వామీ!

నిజమైన శరణాగతి ఇలాగే ఉంటుంది. ఏ కవిత్వాడంబరాలూ, భేషజాలూ, కల్లలూ, కపటాలూ లేకుండా సాదా రీతిలో ఉన్నది ఉన్నట్లు ఒప్పుకొని కాపాడమని స్వామిని వేడుకొనడమే సరియైన శరణాగతి. నిజానికి రోజూ మనము పడుకొనే ముందు ఆ రోజు చేసిన కర్మల పద్దంతా స్వామికి చెప్పుకుని ఇలాగే నిరాడంబరముగా శరణువేడడమే కర్తవ్యము.

65. దేవ యీ తగవు తీర్చవయ్యా

దేవ యీ తగవు తీర్చవయ్యా
వేవేలకు నిది విన్నపమయ్యా

తనువున బొడమిన తతి నింద్రియములు
పొనిగి యెచ్చటికి పోవునయా
పెనగి తల్లి కడ బిడ్డలు భువిలో
ఎనగొని యెక్కడికేగుదురయ్యా ॥దేవ యీ తగవు॥

పొదుగుచు మనమున పొడమిన యాశలు
అదల నెక్కడికి నరుగునయా
ఒదుగుచు జలములనుండు మత్స్యములు
పదపడి యే గతి బాసీనయ్యా ॥దేవ యీ తగవు॥

కలి నొకటొకటికి లంకెలు నీవే
అలరుచు నేమని అందునయా
పలు శ్రీవేంకటపతి నాయాత్మను
గలిగితి వెక్కడి కలుషములయ్యా ॥దేవ యీ తగవు॥

భగవంతుడు మానవునికి ఇంద్రియములనిచ్చి మోసం చేశాడు. ఈ ఇంద్రియ లంపటం వ్యక్తిని దిగలాగెస్తుంది. వీటిని నిగ్రహించమనడం అన్యాయం.

ఈ విషయమే దేవరవారి సమక్షంలో పంచాయతీ పెడుతున్నాడీ కీర్తనలో. న్యాయం చేసి తగవు తీర్చమంటున్నాడు.

దేవా! ఈ తగవు తీర్చు. నీకు వేవేల విన్నపములు.

దేహములో పుట్టిన ఇంద్రియముల సమూహము ఎలా హరించుకు పోతాయి?

(పొనుగు = కాంతిచెడు, కురచ యగు)

తల్లితో పెనగొనిన బిడ్డలు తల్లి నుండి ఆమెను బాసి (ఎనగొను = కూడిక) ఎక్కడికి పోగలరు స్వామీ?

ఈ మనసు ఆశల కాసారం. ఈ ఆశలు అదిలించిన మాత్రాన ఎక్కడికి పోతాయి? నీటిలో ఒదిగియున్న చేపలు తదుపరి (పదపడి) యే విధముగా నీరుబాసి పోగలవు?

స్వామీ ఈ విషయం నిర్ణయము చేసి చెప్పు. ఈ తగువు తీర్చు. ఘాటుగానే అడిగాడు అన్నమయ్య. భక్తుని ఆర్తి తీర్చుట భగవానుని కర్తవ్యము. ఆర్తితో ప్రశ్నించిన వానికి మనసులో ఆయన సమాధానము స్ఫురింపజేయును.

ఆఖరు చరణములో తన మనస్సులో స్వామి మెదిలించిన సమాధానము జతజేస్తున్నాడు అన్నమయ్య. చూడండి.

అవును స్వామీ ఈ కలికాలములో మేము కారణము లేని కార్యము నమ్మము. ఈ కష్టమునకు ఫలానాది కారణము. దానికి వేరొకటి కారణమని తర్కించెదము. ఈ కార్య కారణములు నీవేనని తెలియనేరము. ఈ కార్య కారణములకు గల లంకెలు నీవే పరమాత్మా! (కలి నొక టొకటికి లంకెలు నీవే). ఇక నేనేమి చెప్పగను? (యేమని అందునయా?). ఆత్మలో నీవున్నావని, నీవే ఈ నాటకము నడిపించుచున్నావనే యెరుక నాకు కలిగినది. ఇక పాపములెక్కడివి స్వామీ! (కలిగితి వెక్కడి కలుషములయ్యా) ఆ యెరుకయే పైన నేపెట్టిన తగువునకు సమాధానము.

లోనివాడే నడిపించుచున్నాడని నమ్మికతో యింద్రియములను అదుపు చేయవలెనని సారాంశము.

కలౌ వేంకట నాయకః!

66. నగవులు నిజమని నమ్మేదా

నగవులు నిజమని నమ్మేదా
ఒగి నడియాసలు ఒద్దనవే

తొల్లిటి కర్మము దొంతుల నుండగ
చెల్లబో యిక చేసేదా
యెల్ల లోకములు యేలేటి దేవుడా!
ఒల్లనొల్ల నిక ఒద్దనవే ॥నగవులు నిజమని॥

పోయిన జన్మము పొరుగున నుండగ
ఛీ యనక యిందు చెలగేదా
వేయి నామముల వెన్నుడా! మాయలు
ఓయయ్యా యిక ఒద్దనవే ॥నగవులు నిజమని॥

నలి నీ నామము నాలిక నుండగ
తలకొని యితరము తడవేదా
బలు శ్రీవేంకటపతి నిన్ను గొలిచి
ఒలుకు చంచలము లొద్దనవే ॥నగవులు నిజమని॥

అద్భుతమైన మానసబోధ ఈ కీర్తన.

ఈ నగవులు నిజమని నమ్మేదా? నమ్మేదా అనగా నమ్మవలెనా? అని అడగడమన్న మాట. నవ్వులు సంతోషాలకు సంకేతాలు. ఈ అల్పమైన సంతోషాలే నిజమైనవని నమ్మవలెనా? కాదని అంతర్గతమైన సమాధానం ఆ ప్రశ్నలోనే ఉన్నది. ఇట్టి నగవులతో సంతోషాలతో ఆశలతో కాలం పుచ్చుతున్న మనస్సును ఇవన్నీ క్రమముగా (ఒగిన్) అడియాశలనీ మిధ్యలనీ హెచ్చరిస్తున్నాడు అన్నమయ్య.

1. ముందు చేసిన కర్మములు (తొల్లిటి కర్మము) దొంతరలుగా పేరుకుని యున్నవి. సరే ఏదో చేసినావు. అయిపోయినది (చెల్లెబో = చెల్లెను పో). ఆ కర్మల ఫలితమే ఈ జన్మ. యికపైనా ఈ పాపకర్మలు చేయడమేనా? (యిక చేసేదా). వద్దు. ఎల్లలోకములూ యేలే స్వామికి – ఇక ఒల్లను ఒల్లను ఒద్దు అని చెప్పవే ఓ మనసా ! 'వద్దు' అనడానికి అన్నమయ్య 'ఒద్దు' అంటాడు. అదొక ముద్దు.

2. పోయిన జన్మము పొరుగున నుండగ : ఎంత చక్కని మాట యిది. నీ ముందు జన్మము నుండి ఈ జన్మమెత్తినావు. ఆ జన్మము ఒక అడుగు ముందుననే (పొరుగున) యున్నది. ఆ జన్మ పాపమే కదా నిన్ను మరల దాని ఫలితము అనుభవించుటకు పుట్టించినది. దానిని రోసి ఛీ కొట్టక మరల దీనిలో కూడా అట్లే నడయాడవలెనా? (ఛీ యనక యిందు చెలగేదా?).

   ఆ వేయినామాల దొరను ఓ దేవుడా (ఓ అయ్యా) ఇక వద్దని వేడుకోవే ఓ మనసా!

3. ఓ వేంకటాచలపతీ! యోగ్యమైన (నలి) బలమైన (బలు) నీ నామస్మరణ నా నాలుకపై యుండగా మరల యితరములను తడవవలెనా (తడవేనా?)

   నిన్ను కొలిచిన వెనుక – ఓ స్వామీ! ఇతర చంచలములైన మార్గములు ఒద్దని వేడుకోవే ఓ మనసా! (ఒలుకు చంచలము లొద్దనవే)

67. నమో నారాయణ నావిన్నప మిదివో

నమో నారాయణ నావిన్నప మిదివో
సమానుడ గాను నన్ను సర్వేశా రక్షింపవే

మనసు నీయాధీనము,మాటలు నీవాడేటివే
తనువు నీ పుట్టించిన ధనమిదీ
మును నీ పంపున నిన్ని మోచుకొన్న వాడ నింతే
వెనక నన్ను నేరాలు వేయక రక్షింపవే ॥నమో॥

భోగములెల్లా నీవి బుద్ధులు నీవిచ్చినవి
యీగతి నా(బతుకు నీకిరవైనది
చేగదీర నీవు నన్ను చేసిన మానిసి నింతే
సోగల నా యజ్ఞానము చూడక రక్షించవే ॥నమో॥

వెలినీవె లోనీవె వేడుకలెల్లా నీవే
కలకాలమును నీ కరుణే మాకు
యిల (శ్రీవేంకటేశ నీవేలుకొన్న బంట నింతే
నెలవు దప్పించక నీవే రక్షించవే ॥నమో॥

ఇది సంపూర్ణ శరణాగతి స్తోత్రము.

ఓ వేంకటేశ్వరా! నమస్కారము తం(డ్రీ! నేను నీ సమానుడ కాను. నీవు రక్షకుడవు. నేను రక్షింపబడువాడను. ఓ సర్వేశ్వరా! రక్షింపవే?!

1. నా మనసు నీ ఆధీనమున నున్నది. ఈ మాటలు లోన నుండి నీవాడుచున్నవే. ఈ శరీరము నీవు పుట్టించి నాకిచ్చిన ధనము. ఇది యంతయు నీ ఆజ్ఞ (పంపు) చేత నేను మోయుచున్నానింతే స్వామీ. తరువాత నేనిట్లంటిననీ, అట్లు చేసితిననీ నన్ను కర్తనుగా జేసి నాపై నేరములు మోపకుండా నన్ను రక్షించు (శ్రీవేంకటేశ్వరా!

2. ఈ భోగములు, బుద్ధులు నీవిచ్చినవే. ఇట్లు నా బతుకు నీకంకితమైనది. నేను నీవు బలముగా (చేగదీర) తయారుజేసిన మనిషి రూపముననున్న బొమ్మను మాత్రమే. నా పొడవైన (సోగల) అజ్ఞానమును గణింపక రక్షింపుము శ్రీవేంకటేశ్వరా!

(సోగకళ్ళు = దీర్ఘమైన కనులు, సోగ = పొడవైన)

3. నా వెలుపలా లోపలా నీవే నిండి యుంటివి. ఈ నా సంతోషములూ నీవే. కలకాలమూ నన్ను కరుణ చూడుము. ఈ యిలపై నేను దేవరవారేలిన బంటును. నా ఉనికి తప్పిపోకుండా నను రక్షించు శ్రీవేంకటేశ్వరా!

68. నల్లని మేని నగవు చూపులవాడు

నల్లని మేని నగవు చూపులవాడు
తెల్లని కన్నుల దేవుడు

బిరుసైన దనుజుల గర్వమడచినట్టి
ఇరుసు కైదువ జోదు దేవుడు
సరిపడ్డ జగమెల్ల చక్క చాయకు దెచ్చి
తెరవు చూపినట్టి దేవుడు ॥నల్లని మేని॥

నీట కలసినట్టి నిండిన చదువులు
తేట పరచినట్టి దేవుడు
పాటిమాలినట్టి ప్రాణుల దురితపు
తీట వాపినట్టి దేవుడు ॥నల్లని మేని॥

గురుతు బెట్టగరాని గుణముల నెలకొన్న
తిరువేంకటాద్రిపై దేవుడు
తిరముగ ధ్రువునికి దివ్యపదంబిచ్చి
తెరచి రాజన్నట్టి దేవుడు ॥నల్లని మేని॥

నల్లని మేను, తెల్లని కనులు, ఆ కనులనుండి నగవు లొలుకు చూపులు కలిగిన దేవుడీ వేంకటపతి. నగవుచూపులు అన్నది వింత ప్రయోగం. నవ్వు పెదవులకు సంబంధించినది. మరి చూపులతో నవ్వుటెట్లు? పెదవులపై హాసమున్నపుడు చూపులలో ఒకరకమైన వికాసముండును. దానిని దర్శించిన స్వామి హాసన్ముఖుడై యున్నాడని గుర్తించగలము. ఇట్టి వింతైన ప్రయోగములు అన్నమాచార్యుని కవిత్వమున కొల్లలు.

1. దృఢమైన (బిరుసైన) రక్కసుల పొగరు (బింకము) అణిచిన చక్రాయుధుడు

ఈ దేవుడు. (ఇరుసున్న ఆయుధము – ఇరుసు కైదువ పట్టిన జోదు – వీరుడు)

సరిపడ్డ –దేవుడు

సరి అను పదమునకు అనేకార్థములు కలవు. ఇక్కడ సరి యనిన అగాథము అని అర్థము. అగాథములో పడిపోయిన జగత్తును చక్కని చాయలోనికి అంటే సరియైన చోటుకు తీసుకుని వచ్చి తిరిగి దానికి దారి చూపించిన వాడీ దేవుడు.

2. నీటిలో కలిసి పోయిన వేదములు (నిండైన చదువులు) వెదకి తెచ్చి తేటతెల్లము చేసినాడు. వృథాఅయినది అనడానికి గంగపాలైంది అని నానుడి. దానినే నీట కలిసిన అని సార్థకంగా వాడేడు ఇక్కడ.

పాటి అనునది ప్రమాణవాచకము. ఈపాటి, ఏపాటి అని వాడతాముకదా. ఇది కొలత, పరిమితిని సూచిస్తుంది. తమ పరిమితులను దాటిన పాపుల తీట (దురద, గుల) తీర్చినవాడీ దేవుడు. దీనికి ఆయన ఎత్తిన అవతారాలన్నీ ఉదాహరణలే కదా.

3. ఈ దేవుని గుణములు ఇట్టివని గుర్తింపలేము (గురుతు బెట్టగరాని గుణములు). ఈయన తిరువేంకటాద్రిపై వెలసినాడు.

ఈదేవుడు ధ్రువునికి స్థిరమైన దివ్యపదము నిచ్చి “తెరచి రాజు” అనినాడు.

ఇక్కడ రెండు విషయాలు ముచ్చటిస్తాను.

1. పై రెండు చరణములలో ప్రసిద్ధమైన అవతార స్మరణ చేసినాడు. అదంతా దనుజ శిక్షణ. ఆగ్రహముతో చేసినపనులు. కానీ ధ్రువునిపై చూపినది అనుగ్రహము. ఆతని తపమునకు మెచ్చి అతనికి స్థిరమైన దివ్యమైన పదవి ఇచ్చాడు పరమాత్మ. ధ్రువ శబ్దమునకు రెండర్థములు. దిక్కులకు కొన (pole) అనియూ, చలనము లేక స్థిరముగా ఉండునది అనియు.

రెండిటికీ సార్థకము కల్పించుచూ ఆ పదవి ఇచ్చెను. ఆ వ్యక్తి నామమూ "ధ్రువ" యే.

పై చరణములలో జగత్తును రక్షించుటకు పరమాత్మ తిరిగినాడు. అనుగ్రహించి ఆ జగత్తంతయూ భక్తుని చుట్టూ తిరుగునట్లు చేసినాడు. (నక్షత్రరాశి సప్తర్షులతో సహా ఉత్తరధ్రువమందు నిలిచిన ధ్రువనక్షత్రమును ప్రతిరోజూ చుట్టి వచ్చును).

ఆగ్రహించెనా బలవంతులనైననూ తరిమి పరువులెత్తించును. అనుగ్రహించెనా బలహీనునైననూ స్థిరపరచును.

2. తెరచిరాజు: ఇది చదరంగమునకు సంబంధించిన మాట. అవతలి ఆటగాని ఆశ్చర్యపరచునట్లు ఒక పీసును అడ్డు తీసి చెక్ చెప్పుటను తెరచిరాజు అందురు. అట్టి ఆశ్చర్యకమైన, గురుతుబెట్టగా రాని గుణములు గలిగిన దేవుడీ వేంకటాద్రినాథుడు.

69. నాకునాకే సిగ్గయ్యీని నన్ను జూచుకుంటేను

నాకునాకే సిగ్గయ్యీని నన్ను జూచుకుంటేను
చేకొని నీవే గాచ చెయ్యొగ్గే గానీ

చేయరాని పాపములు సేసివచ్చి యేనోర
నాయెడ నిన్ను వరములడిగేను
కాయముతో ఇంద్రియకింకరుడనై యేమని
చేయార నీబంటనని చెప్పుకొనేను ॥నాకు నాకే॥

వేగిలేచి సంసార విధులకే వొడిగట్టి
యేగతి కొసరి నీపై నేట వేసేము
ఆగడపు బంగారు ఆతుమనేనమ్ముకొని
భోగపు మోక్షమునెట్టు వొందించుమనేము ॥నాకు నాకే॥

కలుపుట్టుగులబతుకు కాంతలకై వెచ్చబెట్టి
వలసి నేడెట్టు నీవారమయ్యేము
నెలవై శ్రీవేంకటేశ నీవే కరుణించితివి
బలిమి సేసి నీకెట్టు భారము వేసేము ॥నాకు నాకే॥

అన్నమయ్య మన మానవ బలహీనతలను అశక్తతను మన తరపున స్వామి వారికి విన్నవిస్తున్నాడు.

స్వామీ! నను నీవాడననుకొని (చేకొని) నీవే నను రక్షింపమని చేయిచాచినాను (చెయ్యొగ్గిని) కానీ నన్ను చూచుకుంటే నాకే సిగ్గు వేస్తోంది.

1. చేయకూడని పాపములన్నిటినీ చేసి నీముందుకు వచ్చి ఏనోట నిన్ను వరములడగగలను? నేను ఈశరీరము దాల్చి ఇంద్రియములకు దాసోహమని వాటికి కింకరుడనైనాను. నేను చేయిచాచి (చేయార) నీ బంటునని ఎలా చెప్పుకోగలను? సిగ్గు పడుతున్నాను దేవా.

2. ఉదయం లేచినది మొదలు (వేగి లేచి) సంసార సంబంధమైన పనులకే సమయమంతా వెచ్చించి చివరికి (కొసరి) నీ ముందు నేనెలా సాగిలపడేది? (నేటించు = సాగిలపడు). వంచనతో (ఆగడపు) నా బంగారం వంటి ఆత్మను (ఆతుమ = ఆత్మ) అమ్మేసుకుని, మోక్షము అనే భోగమును నాకిమ్మని (వొందిచుమని) ఎలా అడగను స్వామీ! సిగ్గు పడుతున్నాను.

3. ఈ పుట్టుక ఈ బ్రతుకంతా (కలు = బండిచక్రము, రాయి, కల్లు) కాంతలకోసమే వెచ్చించి (వెచ్చబెట్టి) ఇప్పుడు వచ్చి నీవాడను అని ఎలా చెప్పుకోగలను? (బహుశా ఇక్కడ కలు అనుదానిని నా రాయి వంటి బ్రతుకు అని చెప్పుకోవాలేమో)

ఓ వెంకటేశ్వరా! నీవు నాపై కరుణ చూపబట్టి కానీ బలవంతంగా (బలిమి) నా రక్షణ భారము నీపై ఎలా వేసెడివాడను?

నిజానికి రోజూ రాత్రి పడుకోబోయే ముందు మనం దేవుని ముందు నిలబడి ఈ మాటలు త్రికరణశుద్ధిగా అనుకుని పడుకోవాలి. అదే నిజమైన శరణాగతి.

70. నాకున్ జెప్పరె వలపు నలుపో తెలుపో

నాకున్ జెప్పరె వలపు నలుపో తెలుపో
నూకి పోవగరాదు నుయ్యో కొండో

పొలతి మరునికి వెరవ పులియో యెలుగో
వులుకు తుమ్మెదమోత వురుమో మెరుమో
తిలకింప చందనము తేలో పామో
యెలమి కోవిలకూత యేదో పాదో రేకు (యేటో పోటో)
॥నాకుం జెప్పరో॥

పొదలిన చలిగాలి పొగయో వగయో
వదలిన కన్నీరు వాగో వంకో
ఉదరమున పన్నీరు ఉడుకో మిడుకో
యెదుట తలవంచుకొనుట సిగ్గో యెగ్గో ॥నాకుం జెప్పరో॥

అసమశరునిపై పరపు టదనో పదనో
పసగల వాని మోవి పంచదారో తేనో
అసమగతి వాని రాక ఆదో పాదో రేకు (ఆటో పోటో)
రసికు వేంకటేశు పొందు రాజ్యమో లక్ష్మో ॥నాకుం జెప్పరో॥

అలమేలుమంగ విరహవేదన చూచి చెలికత్తె ఆశ్చర్యానికి గురియైనది. ఆమెకు అసలు ఈ వలపేమో దాని పర్యవసానలేమో బొత్తిగా అర్థం కాలేదు. తోటి చెలికత్తెలను వాకబు చేస్తోంది.

నాయిక వలపులో పడింది అని అందరూ అనుకుంటున్నారు. ఆమె చేష్టలు వింతవింతగానూ, అర్థం కాకుండానూ ఉన్నాయి.

అసలు ఈ ప్రేమ ఎలా ఉంటుందో? ఏరంగులో ఉంటుందో? తెలుపా?

నలుపా? నాకు చెప్పండి. తోసివేస్తే పడడానికి (నూకిబోవగ రాదు. నూకిబోవు = త్రోయబడు) అది నుయ్యా? కొండా?

అసలు వలపులూ, విరహాలూ అనుభూతులు. వాటిని black and white లో చూపించడం కుదరని పాపం ఆ చెలికత్తెకు తెలియదు.

1. నాయిక మరుని బారిని పడినది. తుమ్మెదమోత తట్టుకోలేక పోతోంది. చందనం భరించలేక పోతోంది. కోయిల కూత వినలేకపోతోంది.

   చెలికత్తెకు అన్నీ సందేహాలే

   మన్మథునికి వెరచుటకు అతడు పులియా? ఎలుగుబంటా? (పులియో యెలుగో)

   తుమ్మెద ఝుంకారము ఉరుమా?మెరుపా?

   చందనము అలదితే బాధ ఉపశమించక పోగా ఒంటిపై ఏదో పాకినట్టు అల్లలాడి పోతోంది. చందనము ఏమైనా పామా? తేలా?

   కోయిల కూత వినలేక పోవుటకు అది ఏమైనా దెబ్బా (ఏటా) లేక పోడుపా (పోటా)

2. చెలికత్తెకు కలిగిన మరికొన్ని సందేహాలు:

   పెరిగిన (పొదలిన) చలిగాలి తట్టుకొన లేకపోవుటకు అది పొగయా? వగయా (వగ = బాధ)

   ఆమె అంత కన్నీరు మున్నీరౌతున్నదేమి? ఆ కన్నీరు వాగా? వంకా? (వాగు వంకలు నీరు పారు ఏరులలోని రకములు)

   ఆమె కడుపులోని మమత (కడుపులో పన్నీరు) తాపమా ?(ఉడుకో) పరితాపమా?(మిడుకో).

   అతని పేరుచెప్పగానే తలవంచుకోవడం సిగ్గా? కోపమా? (ఎగ్గో)

3. సరే సందేహాలకేమి కానీ

ఆ మన్మధుని (అసమశరుని) పట్టి దండించ గలమా? మా నాయికనిట్లు చేసితివేమని నిలదీయగలమా?(పరపుటకు = దండెత్తుటకు) అట్లు చేయుటకు ఇది అదనా? అనుకూల సమయమా? (అదనో పదునో)

ఆ ఉండుండి వీచే మలయమారుతము ఒకటి. వాని రాక ఆటో? పోటో? (చిరుగాలికి నాయిక వణికిపోవుతున్నదనడం)

ఇన్ని సందేహాలు వృధాగా కలుగుతున్నవి కానీ.......

నిజానికి ఈ నాయిక ఆ వేంకటేశ్వరుని కొరకై ఇంత పరితపించి పోవుచున్నది కదా? ఆయన మోవి (పెదవి) పంచదారయా? తేనెయా?

ఆయన అంత రసికుడా? ఆయన పొందు రాజ్యమా? లక్ష్మియా?

చెలికత్తె సందేహాలూ, అమాయికపు ప్రశ్నలూ అని చెబుతూనే అలమేలుమంగ విరహావస్థను చెప్పక చెప్పుట ఈ కీర్తన లోని చమత్కారము.మంచి కవిత్వ నైపుణ్యం.

ఆఖరున అన్నమాట సరసమైనది. అసలు భాగ్యము, లక్ష్మీ ఈమె. మరి ఈమె ఆయన పొందే రాజ్యమూ, లక్ష్మీ అని పరితపించడమేమిటో?

71. నానాటి బతుకు నాటకము

నానాటి బతుకు నాటకము
కానక కన్నది కైవల్యము

పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్ట నడిమిపని నాటకము
ఎట్ట యెదుట కలది ప్రపంచము
కట్ట కడపటిది కైవల్యము ॥నానాటి॥

కుడిచే దన్నము కోక చుట్టెడిది
నడమంత్రపు పని నాటకము
వొడి గట్టుకొనిన వుభయ కర్మములు
గడి దాటినపుడె కైవల్యము ॥నానాటి॥

తెగదు పాపము తీరదు పుణ్యము
నగి నగి కాలము నాటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరు దేలిక
గగనము మీదిది కైవల్యము ॥నానాటి॥

ఇది చాలా ప్రాచుర్యం పొందిన కీర్తన.

ఇది ఈనాటి బతుకు కాదు. ఈ జీవుడు ఎన్ని జన్మల పరంపరలలో జీవిస్తూ వస్తున్నాడో. అందుచేత ఇది నానాటి బతుకు. ఇది నిజము కాదు కల్ల (నాటకము).

"కానక కన్నది కైవల్యము" - ఇది చిత్రమైన మాట. కానక అనగా చూడక అని అర్థము. దేనిని చూడక? పైన చెప్పిన కల్ల బతుకును చూడక, దానిపై దృష్టి సారింపకపోతే అపుడు కన్నది కైవల్యము. నాటకమైన బతుకుకు

విముఖుడైన నాడు కైవల్యము (ముక్తి) కనిపిస్తుంది అనడం. అంటే ముక్తి చనిపోయిన పిదప వచ్చునది కాదు. జీవించి యుండినపుడే సంసారము పట్ల విరక్తితో కాంచవలెనని భావము.

1. ఈ జీవనప్రయాణములో పుట్టుటయు, పోవుటయు మాత్రమే నిజము. జీవించితిననుకొనునది (వాటి నట్టనడిమి పని) మాత్రము కల్ల. యెట్ట యెదుట కనిపించే ఈ ప్రపంచము కల్ల. కట్ట కడపటి సత్యమే కైవల్యము. తెలుసుకో.

2. అన్నము తినుట (కుడిచేదన్నము), గుడ్డ కట్టుట (కోకచుట్టెడిది) సత్యములు కావు. ఇవి నడమిని చేయు పనులని (నడమంత్రపు పని) తెలియుము. వీటి వలన మూటకట్టు కొనిన (ఒడి కట్టుకొనిన) పుణ్య పాప కర్మములు (ఉభయకర్మములు) నీ చుట్టు పరిధులు సృష్టిస్తాయి. ఆ గోడ (గడి) దాటుటయే ముక్తి.

3. పాపములు చేసి పశ్చాత్తాపముతో తిరిగి పుణ్యములు చేసి వానిని పారదోలదలచివేమో? అది వర్తుల గమనము. ఆ పాపములు సమసిపోవు (తెగదు పాపము). ఆ పుణ్యములు సమకూడవు (తీరదు పుణ్యము). ఇది హాస్యాస్పదమైన కాలగమనము (నగినగి కాలము). మనకు పైన శ్రీవేంకటేశ్వరుడున్నాడు. సర్వోపరి (గగనము మీదిది) యైనది ముక్తి (కైవల్యము).

72. నారాయణ నీ నామమె గతి యిక

నారాయణ నీ నామమె గతి యిక
కోరికలు మాకు కొనసాగుటకు?

పైపై ముందట భవజలధి
దాపు వెనక చింతాజలధి
చాపలము నడుమ సంసార జలధి
తేప యేది ఇవి తెగ నీదుటకు?

పండెను ఎడమ పాపపు రాశి
అండను కుడిని పుణ్యపు రాశి
కొండను నడుమ త్రిగుణరాశి-యివి
నిండ కుడుచుటకు నిలుకడ యేది?

కింది లోకములు కీడు నరకములు
అందెటి స్వర్గాలవె మీద
చెంది అంతరాత్మ శ్రీవేంకటేశ నీ-
యందె పరమపద మవల మరేది?

శరణాగతి ప్రతిపాదకమీ కీర్తన

1. ఓ నారాయణమూర్తీ! మా పరిస్థితి చూడు. మా పైన భవసాగరమున్నది. పైన సాగరమున్నది అంటే దానిలో మేము నిండా మునిగి యున్నామని చెప్పడమన్నమాట.

ఇంకా మా పక్క దుఃఖ సాగరం (చింతా జలధి) ఉంది. మధ్యలో చాంచల్యమే లక్షణమైన (చాపలము) సంసార సాగరమున్నది స్వామీ. ఇలా ఇన్ని సాగరాలలో నేను ఈదలేను. దీనిలో తేలడానికి నాకు తెప్ప (తేప) యేదయ్యా?

ఇక్కడ ఒక విషయం. భవసాగరం, సంసారసాగరం సమానార్థకాలే. మరి అన్నమయ్య వీటిని రెండుగా ఎలా చెప్పాడు? భవసాగరము అనునది కొంచెం విస్తృతార్థంలో వాడినాడనుకుంటాను. సకల జగత్తులోని కష్టాలకూ అది నెలవు అని. ఇక సంసార సాగరమన్నపుడు కేవలమూ తన కుటుంబమూ దాని పరిధిలోని బంధాలనూ ఉద్దేశించినాడు.

2. ఎడమవైపు మాకు పాపాల రాశి. ఏదో కొంచెం అండగా కొద్ది పుణ్యరాశి మరొక పక్క. వీటి నడుమ ఒక కొండవలె సత్వ రజో తమో గుణాల రాశి (త్రిగుణరాశి). ఇవి నిలకడగా అనుభవించడానికి (కుడుచుటకు) మాకు సమయం లేదు. అందుకే మళ్ళీ మళ్ళీ జన్మలెత్తవలసి వస్తున్నది. మేం జననమరణ చక్రంలో బందీలై యున్నాము.

3. మాకు క్రిందిలోకములు (అధోలోకాలు) నరకము మొదలైనది. పైలోకములు స్వర్గము మొదలైనది. సరే ఉంటే ఉండనీ. మాకేమి? నీవు మా అంతరాత్మగా ఉన్నావు కదా. అది తెలుసుకుంటే మాకు ఈ లోకమే వైకుంఠము (పరమపదము). అంతరాత్మ నెరిగిన అదే విష్ణుసాయుజ్యమని ప్రతిపాదించినాడు.

ఓ నారాయణమూర్తీ! అందుచేతనే మాకు నీ నామమే గతి (నారాయణా నీ నామమె గతి యిక). కలిలో నామసంకీర్తనమే మోక్షదాయకము. దానివలననే మా కోరికలన్నీ తీరును స్వామీ!

73. నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు

నిత్యాత్ముడైయుండి నిత్యుడై వెలుగొందు
సత్యాత్ముడైయుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం
స్తుత్యుడీ తిరువేంకటాద్రి విభుడు

ఏమూర్తి లోకంబులెల్ల నేలెడునాత
డేమూర్తి బ్రహ్మాదులెల్ల వెదకెడునాత
డేమూర్తి నిజమోక్షమియ్య జాలెడునాత
డేమూర్తి లోకైక హితుడు
ఏమూర్తి నిజమూర్తి ఏమూర్తియును కాదు
ఏమూర్తి త్రైమూర్తు లేకమైన యాత
డేమూర్తి సర్వాత్మ డేమూర్తి పరమాత్మ
డామూర్తి తిరువేంకటాద్రి విభుడు

ఏదేవు దేహమున నిన్నియును జన్మించె
నేదేవు దేహమున నిన్నియును యణగెమరి
ఏదేవు విగ్రహంబీ సకల మింతయును
ఏదేవు నేత్రంబు లినచంద్రులు
ఏదేవు డీజీవులన్నింటిలో నుండు
నేదేవు చైతన్య మిన్నిటికి నాధార
మేదేవు డవ్యక్తు డేదేవు డద్వంద్వు
డాదేవుడీ వేంకటాద్రివిభుడు

ఏవేల్పు పాదయుగ మిలయు నాకాశంబు
ఏవేల్పు పాదకేశాంతం బనంతంబు

ఏవేల్పు నిశ్వాసమీ మహామారుతము
ఏవేల్పు నిజదాసు లీపుణ్యులు
ఏవేల్పు సర్వేశు డెవేల్పు పరమేశు
డేవేల్పు భువనైక హితమనోభావుకుడు
ఏవేల్పు కడుసూక్ష్మ మేవేల్పు కడుఘనము
ఆవేల్పు తిరువేంకటాద్రి విభుడు

ఎవరు నిత్యుడో ఎవరు సత్యుడో, ఎవరు ఈ ప్రత్యక్షంగా కనబడే బ్రహ్మపదార్థమైన జగత్స్వరూపమో ఆతడే కీర్తింపదగు ఈ శ్రీవేంకటాధీశ్వరుడు.

ఏ మూర్తి లోకములనన్నింటికీ యేలికయో, ఎవ్వని బ్రహ్మాదులు వెదుకుదురో, ఎవరు మోక్షప్రదాతయో, ఎవరు లోకహితుడో, ఎవరు నిజమైయుండియూ అవ్యక్తుడో, ఎవరు మూడుమూర్తుల స్వరూపమో, ఎవరు సర్వజీవుల అత్మ స్వరూపమో, ఎవరు పరమాత్మయో, ఆతడే శ్రీవేంకటాద్రి విభుడు.

అన్ని జీవులూ ఎవరి దేహము నుండి జన్మించెనో, ఎవరి దేహములో లయమగునో, ఈ సకల విశ్వమూ ఎవరి విగ్రహ రూపమో, ఇనచంద్రు లెవరి నేత్రములో, ఈ జీవులన్నింటిలో నున్న దేవుడెవరో, ఎవరి చైతన్య మిన్నింటికీ ఆధారమో, ఎవరు అవ్యక్తుడో, ఎవరికి ద్వంద్వములు లేవో – ఆ దేవుడే తిరువేంకటాద్రీశ్వరుడు.

ఏ వేల్పు పాదములు భూమ్యాకాశములను తాకునో, ఏ వేల్పు పాదములనుండి కేశాంతమూ ఈ అనంత స్వరూపమై యున్నదో, ఏ వేల్పు నిట్టూర్పు మహా మారుత రూపమో, ఈ పుణ్యులందరూ ఏవేల్పు నిజదాసులో, ఏ వేల్పు సర్వేశ్వరుడూ పరమేశ్వరుడు ఐయుండెనో, ఏ వేల్పు మనసులో భువనముల హితము మాత్రమే సంకల్పమై యుండునో, ఏవేల్పు సూక్ష్మము, ఘనమునూ అయి ఒప్పునో ఆవేల్పే శ్రీవేంకటాద్రి విభుడు.

74. నీవనగ నొకచోట నిలిచియుండుటలేదు

నీవనగ నొకచోట నిలిచియుండుటలేదు
నీవనుచు కనుగొన్న నిజమంత నీవే

తనయాత్మవలెనెభూతములయాతుమలెల్ల
ననయంబు కనుగొన్న యతడే నీవు
తన గన్నతల్లిగా తగ నితర కాంతలను
అనఘుడై మతిజూచు యతడే నీవు ॥నీవనగ॥

సతత సత్యవ్రతాచార సంపన్నుడై
అతిశయంబుగ మెలగు నతడే నీవు
ధృతిమాలి ద్రవ్యంబు తృణముగా భావించు
హత కాముకుడైన యతడే నీవు ॥నీవనగ॥

మోదమున సుఖదుఃఖముల నొక్కరీతిగా
నాదరించుచునున్న యతడే నీవు
వేదోక్త మతియైన వేంకటాచలనాథ
ఆదియును నంత్యమును నంతయును నీవే ॥నీవనగ॥

అన్నమాచార్యుల వారు దేవదేవుని ఉనికిని చాటుతున్నారీ కీర్తనలో

ఆ వేంకటేశ్వరుని దర్శిద్దామని అన్నమయ్య వెళ్ళినాడు. ఆయన ఒకచోట నిలిచి యున్నట్లాయనకు కనబడలేదు.

స్వామీ! నీవు అనడానికి నీవు ఒకచోట నిలిచియున్నట్టుగా తోచుటలేదు. నీవు అని చూస్తే అంతటా నీవే కనబడుతున్నావు! ఎంత చిత్రం.

1. తన ఆత్మ వలెనే మిగిలిన జీవుల (భూతముల) ఆత్మలను కూడా (ఆతుమ = ఆత్మ) ఎవడు చూస్తున్నాడో వాడే నీవు. అట్టి యతనిలో నీవు

కనబడుతున్నావు అనడం.

పాపరహితుడై (అనఘుడై) ఇతర కాంతలను తన కన్నతల్లిగా చూచు వాడే నీవు. అట్టివానిలో నున్నావు.

2. అతిశయముగా ఎల్లపుడూ సత్యము పలుకు వానియందు నీవే యున్నావు.

సౌఖ్యములు వలదని (ధృతిమాలి) ధనమును గడ్డిపరకగా (తృణమనుచు) భావించగలుగు కోరికలు చంపుకొన్న వానిలో (హత కాముకుడు) నీవే కనబడుచున్నావు.

సాధారణముగా జితకాముడు (కోరికలను జయించినవాడు) అని వాడడం కద్దు. కానీ ఇచట హతకాముడు (కోరికలను చంపినవాడు) అని వాడినాడిక్కడ.

3. సుఖదుఃఖాలను సంతోషంగా సమదృష్టితో చూచువాని యందు నీవే గోచరించుచున్నావు.

వేదములు ప్రతిపాదించు రూపము కలిగిన ఓ వేంకటనాథా! నీవొక్క చోట నిలిచి కనిపించుట లేదనుకొంటిని. కానీ నిన్ను చూడవలెనను తలంపుతో ఎక్కడచూచిన అక్కడే ధర్మాత్ములలో ఎవరిని చూచిన వారిలో కనబడుతున్నావు .

ఆది అంత్యము అంతా నీవేనని తెలుసుకొంటిని.

75. నీవు తురగము మీద నేర్పు మెరయ

నీవు తురగము మీద నేర్పు మెరయ
వేవేలు రూపాలు వెదజల్లితపుడు

పదిలముగ నిరువంక పసిడిపింజల యంప
పొదల తరకసము లొరపులు నెరపగ
గదయు శంఖము చక్రము ధనుఃఖడ్గములు
పదివేలు సూర్యబింబము లైనవపుడు ॥నీవు తురగము॥

సొరిది శేషుని పెద్దచుట్టు పెనుకేవడము
సిరి దొలక నొకచేత చిత్తగించి
దురమునకు తొడవైన ధూమకేతువు చేత
నిరవైన బల్లెమై యేచెనందపుడు ॥నీవు తురగము॥

కరకజడతో రమాకాంత జయలక్ష్మియై
తొరలి కౌగిట నిన్ను దొడికి పట్టి
చరచె వెను వేంకటస్వామి నిను గెలువమని
మెరుగు కుచకుంభముల మిసిమితోనపుడు ॥నీవు తురగము॥

స్వామి అశ్వవాహనారూఢుడై మాడ వీధులలో వేంచేస్తున్న ద ృశ్యం. మనకళ్ళకు కట్టిస్తున్నాడు అన్నమయ్య.

స్వామీ! నీవు గుర్రము (తురగము) మీద నేర్పరివై యెక్కి వేయివిధముల మెరిసిపోతున్నావు (వేవేల రూపాలు వెదజల్లి తపుడు).

1. అటూ ఇటూ (ఇరువంక) బంగారు పింజలతోడి (బాణం చివర కట్టే ఈకలు. వీటిని పింజలు/పుంఖములు అంటారు) బాణములు కలిగన అమ్ముపొదులు (తరకసములు) జిగేల్ మంటున్నాయి. ఇంకా నీవు చేబట్టిన

శంఖ చక్ర గదా ధనుః ఖడ్గములు పదివేల సూర్యబింబాల వలె కాంతులు వెదజల్లుతున్నవి.

2. ఆపై (సొరిది = క్రమము) శేషుని పెద్దచుట్ట వంటి పెద్ద డాలు (కేవడము) శోభాయమానంగా (సిరి దొలక) నీ చేతిలో కనబడుతున్నది. యుద్ధమునకు భూషణ మనదగిన (దురమునకు తొడవైన) అగ్ని (ధూమకేతువు – బహుశా ఇదీ ఒక ఆయుధము కాబోలు) వెయ్యడానికి తగిన బల్లెము వలె యున్నది.

3. నల్లని జడతో (కరక = నలుపు) రమాదేవి జయలక్ష్మియై వచ్చి నిను కౌగిట ఒడిసి పట్టి తన మెరుగు కుచకుంభముల మిసిమి చెలువార నిను గెలుపుకై వెన్నుతట్టినది.

ఎంత చక్కగా వర్ణించి రూపు కట్టించినాడో. ముందు అయ్యవారి శౌర్యస్వరూపం. ఆపై అమ్మ జత కలవడం.

దీనిలో ఒక విశేషము ఉన్నది. మనవి చేస్తాను. స్వామి తురగమెక్కు గాక. అమ్ముపొదులు దాల్చుగాక. శంఖ చక్ర ధనుః కౌమోదకాగ్నులు పట్టుగాక ఆయనకు తోడు కావలసినది ఆయన శక్తిరూపిణి యగు జయలక్ష్మి. ఆమే వెనుక ఉంటే ఆయనకు ఎదురులేదు. అయ్యవారు మూర్తిస్వరూపుడు. అమ్మవారు ఆ మూర్తికి శక్తి స్వరూపిణి. ఇది మూడవ చరణమున చక్కగా నిరూపించినాడు అన్నమయ్య.

76. నెయ్యములల్లో నేరేళ్ళో

నెయ్యములల్లో నేరేళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో

పలుచని చెమటల బాహుమూలముల
చెలమలలోనా చెలువములే
థళథళమను ముత్యపు చెరగు సురటి
దులిపెడు నీళ్ళ తుంపిళ్ళో ॥నెయ్యములల్లో॥

తొటతొట కన్నుల తొరిగేటి నీళ్ళ
చిటిపొటి అలుకల చిరునగవే
వటఫలంబు నీ వన్నెల మోవికి
గుటకలలోనా గుక్కిళ్ళో ॥నెయ్యములల్లో॥

గరగరికల వేంకటపతి కౌగిట
పరిమళములలో బచ్చెనలే
మరుని వింటి కమ్మని యంపవిరుల
గురితాకు లినుప గుగ్గిళ్ళో ॥నెయ్యములల్లో॥

ఇది ఒక చక్కని శృంగార కీర్తన. ఏకాంతంలో అలమేలుమంగా, స్వామీ పరస్పరము పంచుకున్న తీపి సుద్దులు.

నెయ్యములు = అన్యోన్యతలు, ఆత్మీయతలు

అల్లోనేరేళ్ళు = నమస్కారములు, కృతజ్ఞతలు

ఉవ్విళ్ళు = తహతహలు, తొందరలు.

ఒయ్యన = మెల్లగా

ఈ అన్యోన్యతలకూ, స్నేహాలకూ, దగ్గరితనాలకు కృతజ్ఞతావందనములు

(నెయ్యములల్లోనేరేళ్ళు)

వీటి పుణ్యమా అని మనలో మెల్లమెల్లగా తహతహలూ తమకాలూ ఊరుతున్నవి (వొయ్యన వూరెడి వువ్విళ్ళు).

1. చెలమ = ఊటగుంట

సురటి = గుండ్రని విసనకర్ర

చెలువము = అందము, సౌందర్యము.

ఇవి అలమేలుమంగమ్మ మాటలు. అన్యోన్యాలింగనాదుల వలన కలిగిన అలసట తీర్చుటకు ఆమె కొంగుతో ఆయనకు విసిరినది. అపుడాయనపై నీటి తుంపరలు చక్కగా పడినవి. దానికి కారణం చెబుతున్నది.

అందమైన నా బాహుమూలముల చెలమల యందు ఊరిన పలుచని చెమటలే బిందువులై థళథళా విసిరిన ముత్యాల కొంగు యను విసనకర్ర నుండి దులపబడిన నీటి తుంపురులైనవి. ఇచట బాహుమూలములకు నీటిచెలమలకూ, ముత్యాల కొంగుకూ, సురటికీ చక్కని పోలిక తెచ్చినాడు.

2. తొరుగు = జారిపడు, వర్షించు

గుటకలు = గుక్కిళ్ళు = ఉమ్మి/నీరు ఒకమారు మింగు ప్రక్రియ. దాని వలన పుట్టు ధ్వని.

వారి అన్యోన్యత గురించి ఈమాటు స్వామి ఒక విషయం చెబుతున్నాడు. ఇవి వేంకటేశ్వరుని మాటలు.

నీవు అప్పుడప్పుడు అలుగుతూ ఉంటావు కదా. అపుడు నేను అనునయించగా తొటతొటా కన్నుల నుండి నీరు కారుస్తూ ఇంకా కొంచెం అలుక తాలూకు కోపంతో పాటు నవ్వే చిన్ననవ్వు (చిటి పొటి అలుకల చిరునగవే) నీ మోవిపై విరివిగా పండిన పంట వలె ఎంత ముచ్చటగా ఉంటుందో చూడడానికి.

వటఫలంబు నీ వన్నెలమోవికి : చాలా ఎక్కువ అనే అర్థంలో అన్నమయ్య మఱ్ఱిమాని పంట అని పలుకీర్తనలలో వాడియున్నాడు. దానినే ఇక్కడ వట ఫలంబు అంటున్నాడు. వట = మఱ్ఱిచెట్టు ఫలము = పళ్ళపంట. మఱ్ఱిమాని పంట అంటే మఱ్ఱిచెట్టు ఎంత పెద్దదో అన్ని ఎక్కువ కాయలు కాస్తుందనడం. దీనికే తక్కువ పంట అనే అర్థం కూడా ఉంది. అంత పెద్దమఱ్ఱి చెట్టుకు ఇంత చిన్నకాయ కాయడం అని.

ఆ అలుకతో కూడిన చిరునగవు పంట పండిన నీ వన్నెల మోవిని చూచి నాకు గుటకలలో గుక్కిళ్ళు. ఏదైనా చూచి ఏదో చేయాలనే ఆలోచన వచ్చినప్పుడు మనకు తెలియకుండా నోటిలోని లాలాజలం మింగుతాము. దీన్నే గుటకలు వేయడమనీ, గుక్కిళ్ళు మింగడమనీ అంటారు. ఆ అలుకతో కూడిన చిరునగవు విరిసిన పెదవులను చూచి ముద్దాడాలనే ఆలోచనతో ఆత్రపడి స్వామి గుటకలు వేస్తూ గుక్కిళ్ళు మింగుతాడన్నమాట.

3. గరగరిక = నైర్మల్యము, స్వచ్ఛత.

బచ్చెనలు = రంగులు, ఛాయలు.

గుగ్గిళ్ళు = ఉడికించిన వులవలు/సెనగలు.

మూడవ చరణంలో అలమేలుమంగ అంతరంగము.

స్వచ్ఛమైన వేంకటేశ్వరుని కౌగిలి చక్కని పరిమళములు వెలువరించును. ఆ పరిమళముల చాయలు (shades of fragrance – పరిమళములలో బచ్చెనలు) మన్మథుని వింటినుండి వెలువడు పుష్పబాణములు గురిచూచి వేసిన (అంపవిరుల గురితాకు) దెబ్బలు. పరిమళములలోని చాయలకూ మరుని విరిబాణాలకూ పోలిక. అవి ఇనప గుగ్గిళ్ళు. అవి తట్టుకొనజాలనివి.

ఇనప గుగ్గిళ్లు: గుగ్గిళ్ళు అనగా నానబెట్టిన వులవలు (ఒక ధాన్య విశేషము. నానబెట్టిన ఇతర పప్పు ధాన్యాలను కూడా గుగ్గిళ్ళంటారని కొందరు).

ఇవి గుర్రములకు దానాగా వేస్తారు. ఇనప గుగ్గిళ్ళు అనగా నాననివి. అరిగించుకొన లేనివి. అనగా తట్టుకొనలేనివి, అరాయించుకోలేనివి ఆను అర్థమున దీనిని వాడతారు.

వీళ్ళిద్దరూ ఒకళ్ళకొకళ్ళు అన్నట్టు ద్విత్వ ళకారం అంత్యానుప్రాసగా వాడబడ్డది.

77. నెరబిరుదిన్నిటాను నీ బంటు

నెరబిరుదిన్నిటాను నీ బంటు
వొరసె గగనమదివో నీ బంటు

మించిన చుక్కలు మొలపూసలుగాఁ
పెంచె మేను పెళపెళనార్చి
అంచులు మోవగ నబ్జభవాండము
నించె నార్భటము నీ బంటు

గగనలోకములు గడగడ వణఁకఁగ
నెగసె హుటాహుటి నీ బంటు
మగటిమి మెరయఁగ మందులకొండకు
నిగిడి కోయనుచు నీ బంటు

ఇమ్ముల రఘుపతి హితుఁడై సీతకు
నెమ్మన మలరిన నీ బంటు
క్రమ్మర నిదె వేంకటేశ నీచే
నిమ్మపండైన నీ బంటు

హనుమంతునిపై సంకీర్తన

ఓ స్వామీ ! నీ బంటగు ఆంజనేయుడు సంపూర్ణుడు, సమర్థుడు (నెర బిరుదు). నెర శబ్దము సంపూర్ణ సూచకము. బిరుదు అనగా శూరుడు, సమర్థుడు. ఆతడు ఎంత పెరిగినాడో? ఏకముగా ఆకాశముతో నొరుసుకొనుచున్నాడు.

1. ఒకసారి శరీరము పెళపెళా విరుచుకొని చుక్కల ఆకాశమును ముంచెత్తినాడు. ఆ చుక్కలు ఆతనికి మొలనూలు పూసలవలె కనిపించుచున్నవి. ఆతడు బ్రహ్మాండపు (అబ్జభవ + అండము = బ్రహ్మాండము. పద్మము నుండి పుట్టినవాడు బ్రహ్మ – అబ్జభవుడు) అంచుల

వరకూ విజృంభించి (ఆర్భటము) నిండి పోయినాడు.

2. నీ బంటు ఒక్కసారి గగనసీమకు వేగముగా (హుటాహుటి) ఎగురగా గగన లోకములు వణికినవి. కొంచెం నిక్కి (నిగిడి) కోయని ఒక కేకవేసి నీబంటు మందులకొండ వైపు మగటిమితో సాగినాడు. సంజీవనీ పర్వతమునకు మందులకొండ అనునది చక్కని తెలుగుమాట.

3. నీ బంటు చక్కగా (ఇమ్ముల) రఘురామునికి హితుడై సీతాదేవి మనసును అలరింపజేసినాడు. అలరించిన అనుటకు అలరిన అని వాడినాడని గమనింపవలెను.

ఓ వెంకటేశ్వరా! ఆ హనుమంతుడే మరల (క్రమ్మర) నీ చేతి నిమ్మపండైనవాడు. లోకంలో కరతలామలకము అనడం ఉంది. అనగా అరచేతిలో ఉసిరికాయ అని అర్థం. చాలా సులభమైనది, ఎట్టఎదుట ఉన్నది అన్న అర్థంలో దీనిని వాడతారు. అదే అర్థంలో నీ చేనిమ్మ పండు అని వాడినాడు అన్నమయ్య.

78. నేనెందు వోయె తానెందు వోయే

నేనెందు వోయె తానెందు వోయే
రానీలే రానీలే రానీలే

మీనైన నాటి తన మిడుకెల్ల దిగవలె
కానీలె కానీలె కానీలే

తలచూపే నాటి తన తలపెల్ల దిగవలె
తలచనీ తలచనీ తలచనీవే

కిరియైన నాటి తన కిటుకెల్ల దిగవలె
తిరుగనీ తిరుగనీ తిరుగనీవే

హరియైననాటి తన అదటెల్ల దిగవలె
జరగనీ జరగనీ జరగనీవే

వడుగైననాటి తన వస విడువంగావలే
తడవకు తడవకు తడవకువే

కలుషించేనాటి తన కడమెల్ల దిగవలె
అలుగనీ అలుగనీ అలుగనీవే

సతిబాసే నాటి తన చలమెల్లా దిగవలె
తతిగానీ తతిగానీ తతిగానీవే

ముసలైననాటి తన ముసుపెల్ల దిగవలె
విసుగనీ విసుగనీ విసుగనీవే

మానైననాటి తన మదమెల్ల దిగవలె
పోనీవే పోనీవే పోనీవే

కలికైననాటి తన గజరెల్ల దిగవలె
చెలగనీ చెలగనీ చెలగనీవే

వేడుకతో నాటి వేంకటపతి నన్ను
కూడనీ కూడనీ కూడనీవే

అలమేలుమంగకూ వేంకటేశ్వరునకూ పొరపొచ్చాలొచ్చాయి. మాటలు లేవు. ఎడమొగం, పెడమొగం.

ఈ నేపథ్యంలో అమ్మవారు చెలికత్తెతో ఆతనితో మాట్లాడేది లేదు. పది అవతారాలెత్తానని బాగా గర్వం తలకెక్కిపోయింది. అదంతా దిగాలి అని చెబుతున్నది.

నేనెక్కడికి వెడుతున్నాను? తానెక్కడికి పోతున్నాడు? నా ప్రవర్తన ఏమిటి? తన ప్రవర్తన ఏమిటి అనడం. రానీ రానీ రానీ చెబుతా!

మిట్టి మీనైనాడు కదా. ఆ త్రుళ్ళింత (మిడుకు) అంతా దిగాలి. ఏమైనా కానీ (కానీలే)

ముడుచుకు పడుకునే తాబేలే కదా. ఏదో కొంచెం తలబయటకు పెట్టాడో లేదో (తలచూపె) పెద్ద తెలివితేటలొచ్చేసేయి కాబోసు. ఏమైనా అనుకోనీ (తలచనీ)

కిటి (కిరి = వరాహం) అయిననాటి కపటం (కిటుకు) అంతా దిగిపోవాలి. తిరగనీ ఎక్కడ తిరుగుతాడో! (తిరగనీ)

సింహం అయిననాటి పొగరు (అదటు) దిగాలి. అలాగే కానీ (జరగనీ)

వటువు ఐనప్పటి కొవ్వు (వస) విడవాలి. తన గురించి అసలు అడగకు (తడవకు)

పేద్ద కోపం చూపించాడే (కలుషించు = కోపించు. పరశురాముడు) ఆ మిగిలిన రుసరుసంతా (కడమ = శేషము) దిగాలి. కోపించుకోనీ (అలగనీ)

నన్ను వదిలిన నాటి పట్టుదల (చలము) అంతా సడలాలి. (రామావతారం). ఆ సమయం రానీ (తతిగానీ)

ముసలి (బలరాముడు) అయినప్పటు పెద్దరికం (ముసుపు) అంతా పోవాలి. విసుక్కోనీ ఏంఫరవాలేదు (విసుగనీ)

చాలా అందగాడినని (కృష్ణావతారం) (మాను = మనోజ్ఞం) మదమెక్కి పోయింది. అదంతా తొలగాలి. పోతే పోనీ (పోనీవే)

కలికి ఐనాననే ఉదుటు (గజరు) ఎక్కింది. అదంతా తొలగాలి. చెలరేగితే రేగనీ (చెలగనీ)

అవన్నీ దిగినాక సంతోషంతో ఆ వేంకటేశుడు నా దగ్గరకు రానీ. అప్పుడే అతనితో కలిసేది (కూడనీ)

ఏమి కీర్తన. దశావతారాలను ఈ రకంగా చెప్పడం ఒక్క అన్నమయ్యకే చెల్లింది. పది నెపాలు వేసి ఆఖరుకు ఒక చరణంలో కథ సుఖాంతం చెయ్యడమూ అతనికే వచ్చు. అద్భుతం.

79. పిడికిటి తలంబ్రాల పెండ్లికూతురు

పిడికిటి తలంబ్రాల పెండ్లికూతురు కొంత
పెడమరలీ నవ్వీని పెండ్లికూతురు

పేరు కల జవరాలె పెండ్లికూతురు పెద్ద
పేరుల ముత్యాల మెడ పెండ్లికూతురు
పేరటాండ్ర నడిమి పెండ్లికూతురు విభు
పేరుకుచ్చ సిగ్గుపడీ పెండ్లికూతురు ॥పిడికిటి తలంబ్రాల॥

బిరుదు పెండెము వెట్టె బెండ్లికూతురు
బిరుదు మగనికంటె బెండ్లికూతురు
పిరుదూరి నప్పుడె పెండ్లికూతురు పతి
బెరరేచీ నిదివో పెండ్లికూతురు ॥పిడికిటి తలంబ్రాల॥

పెట్టెనే పెద్ద తురుము బెండ్లికూతురు నేడె
పెట్టెడు చీరలు గట్టే బెండ్లికూతురు
గట్టిగ వేంకటపతి కౌగిటను వడి
బెట్టిన నిధానమైన పెండ్లికూతురు ॥పిడికిటి తలంబ్రాల॥

అలమేలుమంగమ్మ మన తెలుగింటి కొత్తపెళ్ళికూతురు. ఆ కొత్త పెళ్ళికూతురి విలాసాలు వర్ణిస్తున్నాడు ఈ కీర్తనలో అన్నమయ్య.

పిడికిట తలంబ్రాలు పట్టుకొన్నది మంగమ్మ. స్వామి ఆమె మోము వంక చూస్తూ ఆమె తలపై తలంబ్రాలు పోసేటపుడు యేమి సైగ చేసినాడో కాని ఆమెకు నవ్వు వచ్చింది. ఆమె కొంచెం పక్కకు తిరిగి (పెడ మరలి) ముసిముసి నవ్వు నవ్వుకొనుచున్నది. సుందరమైన దృశ్యం.

1. ఆమె చాలా పేరున్న జవరాలు. పేరు అన్నప్పుడు శ్లేష. పేరునకు నామము, హారము అని రెండర్థములు. ఆమె పెద్దపెద్ద ముత్యాల హారములు

మెడయందు ధరించినది. అందుచే ఆమె పెద్ద పేరుగల జవరాలని చమత్కారము.

పేరటాండ్రు వధూవరులను గృహప్రవేశానికి తీసుకువస్తున్నారు. ఆమె వారందరి నడుమా ప్రత్యేకముగా కనబడుతున్నది. పెండ్లికొడుకునూ, పెండ్లికూతురుని ఒకరి పేరొకరు చెప్పి లోపలకు రమ్మన్నారు. భర్త (విభు) పేరుచెప్పుటకు (పేరుకుచ్చ = పేర్కొనుటకు) పెండ్లికూతురు సిగ్గుపడుతున్నది.

2. ఆమె కాలికి శ్రేష్ఠమైన కడియము ధరించినది. (బిరుదు పెండెము = శ్రేష్ఠమైన గండపెండేరము). ఆయన కూడా కాళ్ళకు గండపెండేరములు ధరించాడు. అవి శౌర్యసంబంధమైనవి. ఆ బిరుదు (శూరుడు) మగడుపెట్టుకున్న వాటికంటె అమ్మవారు పెట్టుకున్నవే బాగున్నవి (బిరుదు మగని కంటె బిరుదు పెండెము పెట్టె పెండ్లికూతురు).

అప్పుడే కొత్త పెండ్లికూతురు పతి వెనుక దూరినది (పిరిదూరు = వెనుకదూరు; పిరిదూరి నప్పుడె పెండ్లికూతురు). వెనక దూరడమేకాదు పతిని ప్రేరేపించుచున్నది (పెరరేచు = ప్రేరేపించు). అప్పుడే అమె వెనుక నిలిచి చెప్పి ఆ పని ఆయన చేయునట్లు ప్రేరేపించు నెరజాణ అయినదనడమన్నమాట.

3. ఇక కొత్త పెండ్లికూతురు ముస్తాబులు. ఆమె ఇపుడు పెద్ద కొప్పు (తురుము) చుట్టుకున్నది. తురుము అంటే కొప్పు అనీ, కొప్పులో పెట్టుకునే పూలనీ కూడా అర్థాలు. పెద్ద కొప్పు ముడిచినదనీ లేదా కొప్పులో పెద్ద దండ (తురుము) ముడిచినదనీ చెప్పుకోవచ్చు. పెళ్ళిలో కానుకలుగా వచ్చినవీ, పెళ్ళికి కొనుక్కున్నవీ ఒక పెట్టెడు చీరలు కట్టుకుని ఒయ్యారాలు పోతున్నదట మంగమ్మతల్లి.

ఆమె వేంటపతి కౌగిటి నిధానము.

ఈ కీర్తనలో కొత్త పెండ్లికూతురు పతి వద్ద కొంచెం కొంచెంగా కొత్తలు

సదలి దగ్గరవ్వడం రమ్యంగా తెలుగింటి పెళ్ళి ఆచారాలతో ముడిపెట్టి చూపించాడు అన్నమయ్య.

తలంబ్రాలు పోసుకోవడం, గృహప్రవేశమపుడు భర్త పేరు చెప్పడానికి సిగ్గు పడడం, నెమ్మదిగా మగనివెనుక చేరడం, మగనికి ప్రేమతో చెప్పి పనులు చేసేటట్టు చేసుకోవడం, ఆభరణాలూ, చీరలూ, వింత వింత కేశవిన్యాస ధారణలూ చేసుకుని మురిసిపోవడం, పతిని మురిపించడం ఇవన్నీ మనం చూసేవే.

ఈ కీర్తన మన తెలుగు పెళ్ళిళ్ళలో తలంబ్రాల వేడుకప్పుడు సీతారాముల తలంబ్రాల పాటతో పాటు సన్నాయి వారు వాయించడం ఈ మధ్య రివాజుగా మారింది.

80. పొలితి జవ్వనమున బూవక పూచె

పొలితి జవ్వనమున బూవక పూచె
యెలమి విందుకు మనమేమి జేసేదే

సతి చింతాలతలలో సంపెగ పూవులుపూచె
మతి విరహపు మేన మల్లెలు పూచె
అతనుని తలపోత నడవి జాజులు పూచె
హితవు తెలియదిక నేమి చేసేదే ॥పొలితి॥

తొయ్యలి చెమటనీట దొంతెతామెరలుపూచె
కొయ్యచూపు కోపముల గుంకుమ పూచె
కయ్యపు వలపుల జీకటిమాకులు పూచె
నియ్యెడ చెలియ భావమేమి జేసేదే ॥పొలితి॥

మగువ రతులలోన మంకెనపువ్వులుపూచె
మొగి కొనగోళ్ళ మొగలి పూచె
పొగరు శ్రీవేంకటేశు పొందుల కప్రము పూచె
ఇగురుబోండ్ల మిక నేమి జేసేదే ॥పొలితి॥

ఈ కీర్తనలో నాయిక అలమేలుమంగ యౌవనవతి యైనది. ఆమె సంతరించుకున్న నూత్న యౌవన శోభలు ఆమె చెలికత్తెలను అబ్బురపరచినవి. నాయిక అంగవైభవములూ, ఆలోచనా ప్రకటనములూ, శృంగార చేష్టితములూ పుష్పసదృశములై వికాసమునందినవి. ఆమె యౌవనము పూలవనమై శ్రీవేంకటపతిని అలరించినది.

పొలతి యౌవనమున పూవక పూచినది. పూవక పూచుట మంచి అభివ్యక్తి. అప్పటి వరకు పూయక (పూవక) ఒక్కసారిగా పూచిన వనుట. వసంతారంభమున ఒక్కబిగిని తీవలు పూవుల దాల్చినట్లు యౌవనారంభమున అప్పటివరకు లేని

నూత్న తనూవిలాసములొక్క మాటే గోచరమగుట ప్రకృతిలోని ఇంద్రజాలము.

కీర్తన చదివినాము కదా. చర్విత చర్వణమే కాని ఏ విలాసమే పుష్ప సదృశమైనదో ఒకసారి స్మరించుదము.

1. తలపు (చింత) లనెడు లతలకు సంపెగలు

2. విరహముతోడి మేనికి మల్లెలు

3. మన్మథ (అతనుని) స్మరణకు అడవిజాజులు

4. స్వేదమునకు మెట్ట (దొంతె) తామరపూలు

5. మంకుపట్టు (కొయ్యదనము) తోడి అలకలకు కుంకుమపూలూ

6. విరసపు (కయ్యపు) వలపులకు తమాల వృక్షపు (చీకటిమాకులు) పూలూ

7. రతులలో మంకెనపూలూ

8. కొనగోళ్ళ వాడిలో మొగలిపూలూ

9. వేంకటేశుని పొందులో కర్పూరపుష్పాలూ

పూచినట్లు భాసిల్లినది.

తలపుతో మొదలై (శ్రీవేంకటేశుని) పొందుతో ముగిసిన నాయిక విలాసములు శృంగార రససామాగ్రి (విభావ, అనుభావ, సాత్త్వికభావ, సంచారిభావములు, శృంగారచేష్టాదులు) రతిస్థాయీభావము నందుట యని గ్రహించిన చాలును. అంత కన్న లోతగు విచారణ ఆవశ్యకము కాదు.

మరియొక విషయము. ప్రతి జీవీ జీవనాయికయే. మనమందరము 'జీవనాయిక'లమే. పరమాత్మ యొకడే 'పురుషుడు'. ఆ పరమాత్మలో ఐక్యము కావలెనను ఆశ పొడముటయే యౌవనారంభము. అది బలపడుటయే కాంక్ష. ఆయనలో కలియుటయే పొందు (సాయుజ్యము). ఈ అర్థమే అన్నమయ్య శృంగారకీర్తనలలో అంతర్వాహిని.

ఈ కీర్తనలో మరియొక కవిత్వాంశ గమనింపదగినది యున్నది. అది చెలికత్తెల అబ్బురపాటు.

మొదటి చరణాంతమున వారికి ఈ నూత్నవిలాసములకు ఏమి ప్రియములు (హితవు) చేయవలెనో తోచలేదన్నాడు.

రెండవ చరణాంతమున వారికి ఆ కొత్తభావములేమో తెలియలేదన్నాడు.

మూడవ చరణాంతమున దానికి కారణం చెబుతున్నాడు.

"ఇగురుబోండ్లమిక నేమి జేసేదే?" అన్నాడు.

ఆమె చెలువములు పూవుల వలెనుండుట వలన నాయిక "పూబోడి" ఐనది.

వీరు ఇగురుబోండ్లట. ఇగురుబోడి = చిగురుబోడి. చిగురువంటి మనోజ్ఞమగు స్త్రీ అని అర్థము. చిగురుబోడి పరిణతి చెంది పూబోడి యగును. నాయిక ఆ స్థాయి చేరుకున్నది. కాని చెలికత్తెలు ఇంకా ఇగురుబోండ్లు గానే యుండుటచే ఆమె విలాసములను వీరు అర్థముచేసుకొనలేక పోయినారని సారస్యము.

ఇట్టి చమత్కారములు ప్రబంధకవుల పద్యములలో కానవచ్చును. అన్నమయ్య వారికి తీసిపోడనుటకు ఈ కీర్తన ఉదాహరణము.

81. బండి విరిచి పిన్నపాపలతో నాడి

బండి విరిచి పిన్నపాపలతో నాడి
దుండగీడు వచ్చె దోబూచి

పెరుగు వెన్నలు ప్రియమున వే
మరు ముచ్చిలించు మాయగాడు
వెరపున తన విధము దాచుకొని
దొరదొంగ వచ్చె దోబూచి ॥బండి విరిచి॥

పడుచు గుబ్బెత పరుపుపై పోక
ముడికొంగు నిద్ర ముంపునను
పడియు తా వద్ద పవ్వళించినట్టి
తొడుకు దొంగ వచ్చె దోబూచి ॥బండి విరిచి॥

గొల్లపల్లెలో యిల్లిల్లూ చొచ్చి
కొల్లలాడిన కోడెగాడు
యెల్లయిన వేంకటేశుడు ఇదె
తొల్లిటి దొంగ వచ్చె దోబూచి ॥బండి విరిచి॥

దోబూచి పసిపాపలతో ఆడే తెలుగింటి ఆట. తల్లి తన మోమునకు చేతులు అడ్డం పెట్టుకుని ఒక్కసారి చేతులు తొలగించి "దోబూచి" చెబితే పసివాడు విస్మయానికి గురి అవుతాడు. అమ్మ తనముందు ఒక్కసారిగా ప్రత్యక్షమైన అనుభూతి పొందుతాడు.

దోబూచి అంటే కనిపించీ కనిపించకుండా ఉండడం. చందమామ మేఘాలలో దాగి దోబూచులాడుతున్నది అంటాం కదా.

ఇక్కడ వెర్రి యశోద పరమాత్మను పసిబిడ్డ అనుకుని దోబూచులాడు

తున్నది. నిజానికి ఆయన తన తత్త్వాన్ని మరుగుపరచి పసివాడై తనతో దోబూచులాడుతున్నాడని ఆ తల్లికి తెలీదు. ఇది పరమాత్మ లీలావినోదం.

ఇక కీర్తన లోకి.......

బండి విరిచి, తోటి చిన్నవారితో ఆడుకునే దుండగీడు (అల్లరివాడు) వీడు. "దోబూచి".

శకటాసురుని ఏమీ తెలియని బాలుని వలె కాలితో తన్నితే ఆ బండి రూపంలో ఉన్న రాక్షసుడు ముక్కలైనాడు. ఆ గొల్లలు ఇంత చిన్నవాడు 'బండిని' విరిచాడని వెరగుపడ్డారు.

1. గోపికల ఇళ్ళలోనికి చొచ్చి పలుమార్లు (వేమరు) పెరుగు, వెన్న దొంగిలించినవాడు వీడు. దండిస్తారనే భయంతో (వెరపున) తాను చేసిన దొంగతనం తనలోనే దాచుకుని (తన విధము దాచుకుని) దొరలాగా వచ్చిన ఈ దొరదొంగకు "దోబూచి". దొరదొంగ - చాలా చక్కని మాట. దొరికితే దొంగ. దొరకక పోతే దొర. వీడు దొరకడు, దొరకుతాడు కూడా. అందుచేత దొరదొంగ, దొంగదొర!

2. ఈ చరణం కొంచెం క్లిష్టాన్వయం కలిగినది.

   ఓ పడుచు గొల్లెత కృష్ణయ్యను నిద్రపుచ్చాలని తన గుండెలమీద పడుకో బెట్టుకొన్నది. ఇక్కడ గుబ్బెత సాభిప్రాయంగా వాడిన మాట. పెద్ద వక్షము కలిగిన పడుచు అని అర్థం. అయితే ఆ గుబ్బెత పరుపుపై పడుకోకుండా (పడుచు గుబ్బెత పరుపుపై పోక) క్రిందికి జారినాడు.

   తాను (తా = తాన్) ఆమె ముడి కొంగు (మునికొంగు = ముందుపరిచిన కొంగు. లేదా ముడికొంగు అనే చెప్పుకుంటే ముడివేసి పడుకోవడానికి అసౌకర్యంగా ఉన్న కొంగు అని అర్థం చెప్పుకోవచ్చు.) ఆ మునికొంగు వద్ద నిద్ర ఆపుకోలేక (నిద్రముంపునను) పడి నిద్రపోయినాడు. అలా నిద్రించిన తెగువ కలిగిన (తొడుకు దొంగ) దొంగకు "దోబూచి"

ఇక్కడ కృష్ణయ్య చేసిన దొంగతనమేమీ లేదు. అసౌకర్యంగా పడుకున్నాడని దొంగకన్నయ్య అని యశోద ముద్దు చేసిందన్నమాట.

నివ్వరి ముల్లుపై నొవ్వకుండా నిశ్చలంగా నిలువగలిగే పరమాత్మ గొల్లెత పాలిండ్లపరుపుపై పవ్వళించక అసౌకర్యమగు మునికొంగుపై పడుకోవడానికి చకితయైనది పిచ్చితల్లి!

3. గొల్లపల్లెలో ఇల్లిల్లూ దూరి దొంగతనాలు చేసిన (కొల్లలాడిన) ఆ పసివాడే (కోడెవాడు), ఆ ముందు చెప్పుకున్న దొంగవాడే (తొల్లిటి దొంగ) ఇక్కడ గురుతుగా (ఎల్లయైన) వేంకటేశ్వరునిగా వచ్చినాడు. వానికి "దోబూచి".

ఇది పిల్లల దోబూచి ఆటలో వేంకటపతి భక్తిపాట.

82. బ్రహ్మ కడిగిన పాదము

బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము తానే నీ పాదము

చెలగి వసుధ గొలిచిన నీపాదము
బలి తల మోపిన పాదము
తలకక గగనము తన్నిన పాదము
బలరిపు గాచిన పాదము ॥బ్రహ్మ కడిగిన॥

కామిని పాపము కడిగిన పాదము
పాము తలనిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము ॥బ్రహ్మ కడిగిన॥

పరమ యోగులకు పరిపరి విధముల
వరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమ పదము నీ పాదము ॥బ్రహ్మ కడిగిన॥

అన్నమాచార్య కీర్తనలలో చాలా ప్రాచుర్యం పొందిన కీర్తన ఇది. ఇది వినని తెలుగువారు ఉండరేమో.

స్వామివారి పాదమును వర్ణిస్తున్నాడీ కీర్తనలో

బ్రహ్మ కడిగిన పాదమిది. సాక్షాత్తు బ్రహ్మమే నీ పాదము.

అద్భుతమైన ఎత్తుగడ. కొంచెం లోతుగా చూద్దాం. వామనుడు త్రివిక్రముడై బ్రహ్మాండమంతా తన పాదముతో ఆక్రమించాడు. విష్ణువు సర్వవ్యాపకుడనీ, తనలోనే అన్నీ ఉన్నాయని, అన్నిటిలోనూ తానున్నాననీ – ఆ బ్రహ్మపదార్థానికి యితరమైనది ఏదీ లేదనే అద్వైత భావాన్ని చూపరులకు అనుభవం కలిగించాడు

(బ్రహ్మము తానే నీ పాదము). ఇపుడు ఆ దృశ్యాన్ని నలు ముఖములతో ఉండే బ్రహ్మ గారు మాత్రమే ఒకే సారి వీక్షించగల వ్యక్తి. తానే "బ్రహ్మము"నందు కలడో ఆ బ్రహ్మమును ఒకే సారి నలువైపుల ఒకేసారి దర్శింపగలవాడాయనొక్కడే. వెంటనే బ్రహ్మ ఆ పాదము నందు పుట్టిన గంగతోటే ఆ పాదమును కడిగినాడు. ఆపాదమునకు భిన్నమైనదేదీ లేదు కనుక. ఈ అద్భుతమైన భావన రెండు చిన్నపాదముల పల్లవిలో చెప్పినాడు.

1. మొదటి పాదములో వామనావతారం, కాదు కాదు, త్రివిక్రమావతారం వర్ణిస్తున్నాడు.

   చెలగి వసుధ కొలిచిన నీ పాదము: దీనిలో రెండు అర్థాలున్నాయి.

   ఉత్సాహముతో (చెలగి) నీ పాదము భూమిని కొలిచినది (ఇంత మేర అని కొలత వేయడం). కాదుకాదు –

   సంతోషముతో (చెలగి) ఆ భూదేవి నీ పాదమును పూజించినది (కొలచినది)

   బలి తల మోపిన పాదము: దీనిలోనూ రెండర్థాలు.

   ఇది బలి చక్రవర్తి తలపై మోపిన పాదము.

   కాదు కాదు

   తన మాట నిలుపుకోలేక బలిచక్రవర్తి తల వంచి ఏపాదముపై మోపినాడో ఆ పాదము.

   తలకక (నదురూ బెదురూ లేకుండా) గగనమును తన్ని ఇంద్రుని (బలరిపుడు = ఇంద్రుడు) కాచినది ఈ పాదము. బలిని అణచి బలరిపునికి వైభవము ఇచ్చిన పాదము. బలరిపుడు సాభిప్రాయమైన మాట. బలము కలిగిన బలిని తొక్కి బలరిపుడైన వానిని గద్దెనెక్కించిన పాదమని ధ్వని.

2. అహల్య యొక్క పాపమును (కామిని పాపము) కడిగివేసిన పాదమిది.

కామిని సాభిప్రాయంగా వాడబడినది. ఆమె యింద్రునితో భోగించినది కనుక కామిని.

పాము తలనిడిన పాదము:

కాళియ సర్పము యొక్క తలపై ఉంచిన పాదము. కాదు కాదు

ఆదిశేషుడు తన తలపై నిడుకొన్న పాదము.

ప్రేమతో లక్ష్మీదేవి (శ్రీసతి) ఒత్తేటి పాదము. డబ్బుకు లోకం దాసోహమంటే ఆ ధనలక్ష్మి నీ పాదమునకు దాసోహమంటున్నదని ధ్వని.

గరుత్మంతుడు (పామిడి = పాములను లేకుండా చేయువాడు = గరుడుడు) వాహనముగా (తురగము = గుర్రం) కలిగిన పాదమిది.

ఇక్కడ పామిడి సాభిప్రాయంగా వాడినాడు. ఏ పాదము వద్ద ఆదిశేషుడు తలవంచుతున్నాడో ఆపాదము వద్ద గరుత్మంతుడూ అణగి ఉంటున్నాడు. ఆ పాదము వద్ద జీవులు తన ఉనికి కోల్పోయి పరమాత్మ భావములో ఉంటారనడం (బ్రహ్మము తానే నీ పాదము)

3. యోగులకు వివిధములైన (పరిపరి విధముల) వరములిచ్చేది నీ పాదము.

తిరువేంకటగిరి తిరమని చూపెడి పరమ పదము నీ పాదము:

ఈ తిరు వేంకటగిరి స్థిరముగా భూమిపై ఉంటుందని నీ పాదము సూచిస్తున్నది.

కాదు కాదు –

ఈ కలియుగ వైకుంఠమైన (పరమపదము = వైకుంఠము) శ్రీవారి పాదము స్థిరమైనదని ఈ వేంకటగిరి చూపించుచున్నది.

ఆ పాదమునకు మొక్కుదాము.

చక్కని శ్లేషలు, ధ్వనులూ నింపి భగవంతుని పాదము యొక్క గొప్పదనము కుమ్మరించిన కీర్తన.

83. భారమైన వేపమాను పాలుపోసి పెంచినాను

భారమైన వేపమాను పాలుపోసి పెంచినాను
తీరని చేదేగాకది తియ్యనుండీనా

పాయదీసికుక్కతోక బద్దలువెట్టి బిగిసినాను
చాయకెంత గట్టినాను చక్కనుండీనా
కాయపువికారమిది కలకాలము చెప్పినాను
పోయిన పోకలే కాక బుద్ధి వినీనా ॥భారమైన॥

ముంచిముంచి నీటిలోన మూల నానబెట్టు కొన్నా
మించిన గొడ్డలి నేడు మెత్తనయ్యీనా
పంచ మహాపాతకాల బారిపడ్డ చిత్తమిది
దంచిదంచి చెప్పినాను తాకి వంగీనా ॥భారమైన॥

కూరిమితో తేలుదెచ్చి కోకలోన బెట్టుకున్న
సారెసారె గుట్టుగాక జక్కనుండీనా
వేరులేని మహిమల వేంకటవిభుని కృప
ఘోరమైన ఆస మేలుకోర సోకీనా ॥భారమైన॥

చక్కని సామెతలతో తత్త్వబోధ చేస్తున్న అన్నమయ్య కీర్తన యిది.

పాలుపోసి ఒక భారమైన వేపమాను పెంచిననూ (పెంచినాను) అది చేదుగానే ఉంటుంది గాని తియ్యబడుతుందా?

1. కుక్కతోక వంకర పోయేటట్లు చేసి (పాయదీసి) బద్దలు కట్టి బిగదీసిననూ (బిగిసినాను) యెంత చక్కగా కట్టిననూ (చాయకెంత కట్టినాను) తిన్నగా అవుతుందా?

కుక్కతోక ఎంత వంకరో మనిషి బుద్ధీ అంతే వంకర. అది శరీరంతో

వచ్చిన వికారము (కాయపు వికారము). కలకాలం చెప్పినా ఆ బుద్ధి సన్మార్గంలో నడవదు. అది ఇదివరకు నడిచినదారినే (పోయిన పోకలే) నడుస్తుంది.

2. ఒక మూలన నీటిలో ఎంత ముంచి ముంచి నానబెట్టినా సరే. గొడ్డలి మెత్తబడుతుందా?

ఆ గొడ్డలి వలెనే పంచ మహాపాపాలకు అలవాటు బడ్డ ఈ మనస్సు ఎంత కొట్టినట్లు చెప్పినా (దంచిదంచి చెప్పినాను) కొంచెం కూడా వంగదు. (పంచ మహాపాతకములు : స్వర్ణము దొంగిలించడం, సురాపానము, బ్రహ్మహత్య, గురుపత్నీగమనము, మహాపాతక సహవాసము)

3. ఎంతో ప్రేమతో (కూరిమితో) తేలును తెచ్చి కొంగులో దాచుకుంటే (కోక లోన బెట్టినాను) అది కుడుతుందే గాని బుద్ధిగా ఉంటుందా?

ఘోరమైన కూడని ఆశలు గలవానికి ఆ వేంకటవిభునికృప మేలుకోరి సోకుతుందా? ఆ ఆశావికారముల వైపుకే మనసు పోతుంది కానీ మేలైన దైవకృప తనకు సోకనీయదనడం.

అలతి అలతి పదాలతో తెలుగు సామెతలు రంగరించి మానవనైజం ఎలా ఉంటుందో చక్కగా వివరించాడు.

84. మనసిజ సముద్ర మథనమిదే

మనసిజ సముద్ర మథనమిదే
కనుగొను మింతట కాంతుడవీవు

సతి చింతామతి జలనిధి తరవగ
అతి గరళపు విరహము వొడమె
తతి నా పిమ్మట తమకపు కోర్కులు
లతల కల్పకపు లాకలు వొడమె ॥మనసిజ॥

పొలతి కూటములు పొంగులు పొంగగ
పులకల తారలు పొడమెనవి
ఫలమై సాత్త్విక భావము చంద్రుడు
నిలువుగ పొడమగ నేరుపు లలర ॥మనసిజ॥

సుదతి తానెనీ చొక్కపు కౌగిట
నదుమన నిందిరయై పొడమె
కదిసిన శ్రీవేంకటపతి నీదెస
అధరామృతమా యతివకు వొడమె ॥మనసిజ॥

ఈ కీర్తనలో రూపకాలంకారాల పోహళింపుతో సాగరమథనం సాగించాడు అన్నమయ్య. ఇది మన్మథసాగర మథనం..

స్వామీ! ఇది మన్మథ సాగర మథనము. నీవు కాంతుడవు కనుక వీక్షింపుము.

క్షీరసాగర మథనంలో స్వామి మందర పర్వతం వీపుమీద పెట్టుకుని సముద్రమున మునిగి యున్నాడు. పాపం ఆ సాగరమథన దృశ్యం సరిగా చూడనే లేదు. అందుకే కాబోలు. అన్నమయ్య మరల సాగరమథనం చేయించుచు నాయకుడగు వేంకటేశ్వరునకు చూడమని వినతి చేస్తున్నాడు.

1. నాయిక యైన అలమేలుమంగ ఇచట తన మనసులోని శృంగార భావనల సముద్రమును (చింతామతి జలనిధి) తరచుచున్నది. అపుడు అతి విరహము అను గరళము పుట్టినది (విరహపు గరళము పొడమె). ఇది హాలాహల ఆవిర్భావము. గరళము లోకమును దహించును. విరహము విరహిణి మానసమును దహించును. అందుచే విరహపు గరళము సార్థకమైన రూపకము.

ఆపై మోహముతో కూడిన కోరికల (తమకపు కోర్కెల) కల్పవృక్షపు తీవియలు మొలకెత్తినవి (కల్పకము = కల్పతరువు. లాకలు = మొలకలు). మరియొక మాట. లాక శబ్దమునకు కర్ర ఆను అర్థమూ ఉన్నది. అపుడు మోహపు కోరికల కల్పవృక్షపు మానులు పుట్టినవి అనవచ్చు. కల్పతరువులు కోరికలు తీర్చునవి. మరి యిచటనో? కోరికలు కల్పతరువులైనవి. అదీ చమత్కారము.

2. నాయిక ఊహలలో పతితోడి పొందులు పొంగులువారినవి (పొలతి కూటములు పొంగులు పొంగగ). మంథనమున సాగరము పొంగుచున్నదని ధ్వని. అపుడు పులకల తారలు పుట్టినవి. తారలు అను పదమునకు పలు అర్థములున్నవి. అప్సరసలు, మౌక్తికములు, నక్షత్రములు వానిలో కొన్ని. నిజముగనే సముద్రమున కౌస్తుభమూ అప్సరసలూ పుట్టిరి. ఇచట నాయిక పరముగ పులకలు నక్షత్రములు నింగిలో ఒక్కొక్కటి కనిపించు తారకల వలె శరీరమున పొడమినవి. తారలకు కల అర్థములన్నియూ సమన్వయింపబడినవి. ఇది కవిబ్రహ్మ తిక్కన గారి పద్ధతి.

అపుడు ఆమెలోని సాత్వికభావములకు ఫలమా యనునట్లు చంద్రుడు నిలువుగా పొడమినాడు. ఇలా ఆమె మనసులో మన్మథ సముద్రము మథనము జరుగుచుండగా చీకటి పడి చంద్రుడుదయించినాడు. ఆ చంద్రోదయము ఆమెలోని సాత్వికభావముల ఫలమువలె యున్నదట.

ఏమి ఊహ. శృంగార రస సామాగ్రి గురించి చర్చకిట తావు లేదు. కాని శృంగార రసమున స్తంభ ప్రళయ రోమాంచ స్వేద వైవర్ణ్య వేపథు అశ్రువులు సాత్వికభావముల అని రసప్రస్థాన కారుల నిర్వచనము. నాయికలో కలుగు భావములివి. దాని ఫలితమే రసస్థాయీభావ ప్రాప్తి. ఆ భావప్రాప్తి పూర్ణముగ సిద్ధించినదను సంకేతమై పూర్ణచంద్రుడు ఫలము వలె పుట్టినాడు. సాగర మంథనము నందే చంద్రుడు పుట్టినది అని సమన్వయము.

3. అపుడు నీవు ఆమెను బిగికౌగిట నదుముకొంటివి (చొక్కపు కౌగిలి = మనోహరమైన కౌగిలి). అప్పటి వరకూ ఆమె ఆలోచనల సముద్రములో నున్నది. నీ స్పర్శకు ఆమెకు 'తెలివి' వచ్చినది. ఆమె తాను ఇందిరను అని గుర్తించినది. దీనినే అద్భుతముగా సముద్రమథనమున ఇందిర (లక్ష్మి) జన్మించుటగా అన్నమయ్య అనుసంధానించినాడు (ఇందిరయై పొడమె).

అపుడు నీవామెను ముద్దాడుటచే నీ అధరామృతము ఆమెకు దక్కినది. సాగర మంథనమునకు అంతిమ లక్ష్యమైన "అమృతోత్పాదనము" కూడ జరిగినది.

ఇట్టి కల్పనలు చేయగల మొనగాడు తెలుగు సాహిత్యమున ఒక రామరాజభూషణుడు మాత్రమే నని నా యభిప్రాయము. ఆతనికి దీటుగా ఈ కీర్తనను అన్నమయ్య వెలయించాడు.

85. మనుజుడై పుట్టి మనుజుని సేవించి

మనుజుడై పుట్టి మనుజుని సేవించి
అనుదినమును దుఃఖమందనేల

జుట్టెడు కడుపుకై చొరనిచోట్లు జొచ్చి
పట్టెడు కూటికై బతిమాలి
పుట్టిన చోటునె పొరలి మనసుపెట్టి
వట్టి లంపటము వదలనేరదు గాన ॥మనుజుడై॥

అందరిలో బుట్టి అందరిలో బెరిగి
అందరి రూపములటు దానై
అందమైన శ్రీ వేంకటాద్రీశు సేవించి
అందరాని పదమందె నటుగాన ॥మనుజుడై॥

మానవుని దేవుడు సృష్టించాడు. సృజించిన వానికి విధేయుడై యుండడము చేయవలసిన పని. నారు పోసినవాడే నీరు పోస్తాడని కదా సామెత. కానీ ఈ విషయంలో మానవ నైజం వేరు. మనుగడకు దేవునిపై ఆధారపడకుండా తన వంటి మరొక మానవుని నమ్ముకుంటాడు. దాని వలన దుఃఖము మూట కట్టుకుంటాడు.

దీనిని నిరసిస్తూ ఇంకా ఇలా చెబుతున్నాడు.

1. జుట్టెడు కడుపు కోసం తిరగరాని తిరుగుళ్ళు. చొరరాని చోట్లలో సంచారం చేయడమెందుకు? పరులను వేడుకోవడమెందుకు?

 జుట్టు అంటే వెంట్రుకలు, పిలక అని అర్థాలూ. పిలక అంటే చిన్నది అనే అర్థంలో జుట్టెడు కడుపు అన్నాడు. అంటే చిన్న పొట్ట అనడం. ఈ చిన్న పొట్టకోసం ఇంత వెంపర్లాట లెందుకు నాయనా అని పిండితార్థం.

ఈ భూమి మీద పుట్టినాడు మానవుడు. పుట్టిన చోటే పొరలాడి లంపటాలలో చిక్కుకుని వాటినుండి బయట పడలేక పోతున్నాడీ మానవుడు.

2. ఈ స్థితిని తప్పించుకోవడం ఎలా?

ఆ పరమాత్మ అందరి జీవులలో తానేయై పుట్టి అందరి రూపములూ తానేయై వేంకటేశ్వరుని అవతారములో చక్కగా (అందముగా) వెలసి యున్నాడు. వానిని సేవించి ముక్తిపదము (అందరాని పదము) అందవలె.

పదమందెను అటు గాన: భూతకాల సమాపక క్రియలను భవిష్యర్థకం గావాడినాడిచ్చట. ఇలాంటి క్రియా ప్రయోగాలు చాలా కనబడతాయి అన్నమయ్య కవిత్వంలో.

ఈ కీర్తనలో ఒక వైరుధ్యం ఉంది. మొదట పల్లవిలో మనుజుడై పుట్టి మనుజుని సేవించడం నిరసించాడు.

రెండవ చరణంలో అందరిలోనూ పరమాత్మ ఉన్నాడు. అన్ని రూపాలలోనూ అతడే ఉన్నాడని చెబుతున్నాడు. తోటి మానవులందరిలోనూ పరమాత్మ ఉంటే వారిని సేవించుటలో తప్పేముంది?

బహుశా పురుషులందు పుణ్య పురుషులు వేరయా – అనుకుని తదితరులను సేవించరాదని అన్నమయ్య మతమని సరిపెట్టుకోవాలంతే!

86. మరలి మరలి జయ మంగళము

మరలి మరలి జయ మంగళము
సొరిది నిచ్చలును శుభమంగళము

కమలా రమణికి కమలాక్షునకును
మమతల జయజయ మంగళము
అమర జననికి అమర వంద్యునకు
సుముహూర్తముతో శుభమంగళము

జలధి కన్యకును జలధి శాయికిని
మలయుచు శుభమంగళము
కలిమి కాంతకా కలికి విభునికి
సులువుల హారతి శుభమంగళము

చిత్తజు తల్లికి శ్రీవేంకటపతికి
మత్తిల్లిన జయమంగళము
ఇత్తల నత్తల యిరువుర కౌగిటి
బొత్తుల రతులకు శుభమంగళము

మరలా మరలా ఇద్దరికీ మంగళమగుగాక!

క్రమముగా (సొరిదిన్) ఇరువురికీ నిత్య మంగళమగు గాక!

1. కమలములో నివసించు లక్ష్మికీ, కమలముల వంటి కనులు గల విష్ణువుకూ మమతల మంగళము.

అమరులకు తల్లియైన జగన్మాతకూ, అమరులు వంగి నమస్కరించు (అమర వందితుడు) స్వామికీ సుముహూర్తములో శుభమంగళము.

2. పాలకడలి కూతురైన (జలధికన్య) లక్ష్మికీ, పాలకడలిలో పవళించు (జలధి శాయి) స్వామికీ వెలయు (మలయుచు) శుభమంగళము.

కలిమి రూపైన కాంతామణికి, ఆమె కాంతుడైన స్వామికి సులువుగా శుభమంగళము.

3. మన్మథుని కన్నతల్లికి, శ్రీవేంకటేశ్వరునికీ మత్తు కలిగించు జయమంగళము.

ఇచ్చటా అచ్చటా (ఇత్తలనత్తల) అనగా అంతటా వీరిద్దరి కౌగిటి పొత్తులకు వారి పరస్పరాసక్తికీ (రతులకు) శుభమంగళము.

జగత్తుకు మాతాపితరులైన వారిద్దరికీ మంగళములనగా వారి సంతతి యైన మనందరికీ మంగళమే. అందరికీ శుభములగు గాక!

87. మాపులే మరణములు రేపులే పుట్టువులు

మాపులే మరణములు రేపులే పుట్టువులు
చాపలాలు మాని విష్ణు శరణను మనసా

చాలునంటే యించుకంతే చాలును జన్మమునకు
చాలకున్న లోకమెల్ల చాలదు
వీలిన యీ ఆశా వెఱ్ఱివాని చేతిరాయి
చాలునింక హరినిట్టే శరణను జీవుడా ॥మాపులే॥

పారకున్న పశుబాలై బడలదు మనసు
పారితే జవ్వనమున పట్టరాదు
మీరిన నీరు కొద్ది తామెర యింతె యెంచి చూడ
జారవిడిచి దేవుని శరణను జీవుడా ॥మాపులే॥

సేయకున్న కర్మము శ్రీపతి సేవనే ఉండు
సేయబోతే కాలమెల్ల సేనాసేనా
వోయయ్య యిదియెల్లా ఉమినాకే చౌతాలు
చాయల శ్రీవేంకటేశు శరణను జీవుడా ॥మాపులే॥

మానవుని జీవితం నీటిబుడగ. ఎప్పుడు ఏమౌతుందో తెలీదు. అంతెందుకు? రాత్రి పడుకున్నవాడు ఉదయమే లేస్తాడనే రూఢి లేదు. అందుకే అన్నమయ్య మానవాళికి బోధ చేస్తున్నాడు.

రాత్రి పడుకోవడం మరణంతో సమానం (మాపులే మరణాలు). ఉదయం లేవడం పునర్జన్మ యెత్తడమే (రేపులే పుట్టుకలు). ఇంత అశాశ్వతమైనదీ బతుకు. ఈ చపలత్వం మానుకుని ఓ మనసా! విష్ణువును శరణు వేడు.

1. నీ కెంత కావాలి? తృప్తి పడు. చాలునని తృప్తి పడితే ఎంత కొంచెం సంపాదనైనా సరిపోతుంది. చాలదనుకుంటే లోకమంతా నీ చేతిలో

పెట్టినా చాలదు. ఈ ఆశ వెర్రివాని చేతిలోని రాయి వంటిది. వాడు విసురుతాడో, విసరడో, విసిరితే తగులుతుందో, అసలు దేనిమీదికి విసురుతాడో – అలాగే నీవాశించిన ఫలితాలూ అనిశ్చితాలు. ఇకచాలు. ఓ జీవుడా విష్ణుని శరణు వేడు.

2. మనసును పరుగు పెట్టకుండా చూసుకోగలిగితే పసిదూడలాగా పడుకుంటుంది. (పశుబాలై = అప్పుడే పుట్టిన దూడ, బాలయైన పశువు). యౌవన గర్వంతో పరిగెత్తించావా దానిని పట్టుకోలేము (పారిన పట్టరాదు). అది ఎంత పరుగు పెట్టినా ఆశ దానిని నిలువ ఇవ్వదు. నీటికొలది తామర అన్నట్టు ఆశ ఆ పరుగుకు అందదు. ఎప్పుడూ దాని పైమెట్టు మీదే ఉంటుంది. ఇక ఈ ఆశ విడిచి పెట్టు. ఓ జీవుడా దేవుని శరణు వేడు.

3. కర్మలంపటం తెంచుకుంటే మనసు శ్రీపతి సేవలో ఉంటుంది. కర్మలు చేయడంలో చిక్కుకున్నావా? – ఈ కాలం చాలదు.

కాలమెల్ల సేనాసేనా: చక్కని పలుకుబడి. సేనా = శానా = చాలా అని అర్థం. శాన్నాళ్ళు అంటాం కదా చాలా రోజులు అనడానికి. కాలము చాలా చాలా అయినా (ఎంతైనా) చాలదనడం.

కర్మ చేయడం – దానివల్ల ఇంకొక కర్మ చేయడం – ప్రారబ్ధం అనుభవించడం – ఇలాగే కాలం గడుస్తుంది. ఇది ఎలాంటిదంటే ఉమ్మివేసి మళ్ళీ దానిని నాకడమంత చెత్తపని (ఉమి నాకే చౌతాలు. చౌతాలు = చెత్తలు)

ఇక చాలు శ్రీవేంకటేశుని శరణు వేడు.

శరణాగతి, శరణాగతి, శరణాగతి ఇది మాత్రమే ఓ మనసా! నిన్ను గట్టెక్కించేది.

ఈ కీర్తనలో అద్భుతమైనది పల్లవి.

“మాపులే మరణాలు రేపులే పుట్టువులు”

88. మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా

మిన్నక వేసాలుమాని మేలుకోవయ్యా
సన్నల నీయోగనిద్ర చాలు మేలుకోవయ్యా

ఆవులు పేయలకుగా నరచీ పిదుకవలె
గోవిందుడా యింక మేలుకోవయ్యా
ఆవలీవల పడుచులాటలు మరగీ వచ్చి
త్రోవగాచుకున్నారు ప్రొద్దున మేలుకోవయ్య ॥మిన్నక॥

వాడల గోపికలెల్ల వచ్చి నిన్ను ముద్దాడ
గూడియున్నారిదే మేలుకోవయ్య
తోడనే యశోద గిన్నెతో బెరుగు వంటకము
యీడకు దెచ్చిబెట్టే నిక మేలుకోవయ్య ॥మిన్నక॥

పిలిచీ నందగోపుడు పేరుకొని యదె కన్ను
గొలకులు విచ్చి మేలుకోవయ్యా
అలరిన శ్రీవేంకటాద్రి మీది బాలకృష్ణ
ఇల మామాటలు వింటివిక మేలుకోవయ్య ॥మిన్నక॥

గోపికలు బాలకృష్ణుని మేలుకొలుపుతున్నారు. ఆయన యోగనిద్ర నటిస్తున్నాడు. అది నటన అని గోపికలకూ తెలుసు. నిద్రపోయే వానిని లేపవచ్చును కానీ నిద్రనటించు వానిని లేపలేమని సామెత. ఇది వ్రేపల్లె గొల్లపడుచులతో రోజూ బాలపరమాత్మ ఆడే ఆట.

ఇక వేసిన వేసాలు చాలుకానీ (మిన్నక వేసాలు మాని) మేలుకోవయ్యా! నీవు నటిస్తున్న (సన్నలు = సంకేతములు, సంజ్ఞలు) యోగనిద్ర ఇక చాలించు. స్వామి లేవలేదు.

1. ఆ బాలగోపాలుడికి ఇష్టమైన పనులు కారణంగా చూపి లేపాలని ప్రయత్నిస్తున్నారు.

ఆవులు పెయ్యలకోసం అరుస్తున్నాయి. (ఆవు దూడలు కోడెలు–మగవి, పేయలు – ఆడవి). లేగదూడలకు పాలివ్వడానికి ఆవులు అరుస్తున్నాయి. పాలు కూడా పిదకాలి. ఓ గోవిందా మేలుకోవయ్యా. ఇక్కడ గోవింద శబ్దం సాభిప్రాయంగా వాడబడినది. (గోవిందుడు = గోవులకు ప్రభువు)

ఆటలకోసం కుర్రకారంతా (ఆవలీవలీ పడుచులు) కాసుకుని కూర్చున్నారు ఇక లేవయ్యా. పడుచులు అంటే ఆడపిల్లలు అని కాదు. పడుచు వయోవిశేషణం. ఆడ మగలకు ఇరువురికీ వర్తిస్తుంది. వయసులో ఉన్న అని అర్థం. స్వామి లేవలేదు.

2. వాడలోని గొల్లెతలందరూ నిన్ను ముద్దాడాలని వేచి యున్నారు ఇక లేవయ్యా.

అదిగో యశోదమ్మ నీకిష్టమైన పెరుగువంటకం (దధ్యోదనము కాబోలు) చేసి నీకు పెట్టడానికి పట్టుకుని వస్తోంది లేమ్మా! స్వామి లేవలేదు.

3. ఈమాటు కొంచెం పెద్ద అస్త్రం వేస్తున్నారు. అదిగో నాన్నగారు (నందగోపుడు) నిన్ను పేరుపెట్టి మరీ (పేరుకొని) పిలుస్తున్నారు. పిల్లలకు అమ్మ దగ్గర లేని భయం నాన్న దగ్గర ఉండటం సామాన్యం. అయినా లేవలేదు బాలస్వామి.

ఇక ఇప్పుడు చిట్టచివరి మేలుకొలుపు విన్యాసం. బ్రతిమిలాడడం. శ్రీవేంకటాద్రి మీద వెలసిన బాలకృష్ణా! ఇంక మామాట విని లేమ్మా!

ఇవన్నీ మన యిళ్ళలో చిన్నపిల్లలను మేలుకొలిపే చిట్కాలే. ఆటలు, తోటిపిల్లల నెపం, ఇష్టమైన పెట్ జంతువుల నెపం, ఇష్టమైన వ్యక్తుల నెపం, ఇష్టమైన తినుబండారాల నెపం, నాన్నగారు పిలిచేరన్న బెదిరింపూ, చివరికి బ్రతిమాలడం. వీటిని చక్కగా ఉపయోగించుకున్నా డన్నమయ్య యీ కీర్తనలో.

89. ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు

ముద్దుగారే యశోద ముంగిటి ముత్యము వీడు
దిద్దరాని మహిమల దేవకీసుతుడు

అంతనింత గొల్లెతల అరచేతి మానికము
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూడులోకాల గరుడపచ్చపూస
చెంతల మాలోనున్న చిన్నికృష్ణుడు ॥ముద్దుగారే యశోద॥

రతికేళీ రుక్మిణీకీ రంగుమోవి పగడము
మితి గోవర్ధనపూ గోమేధికము
సతమై శంఖచక్రాల సందుల వైడూర్యము
గతియై మమ్ము గాచు కమలాక్షుడూ ॥ముద్దుగారే యశోద॥

కాళింగుని పడగలపై కప్పిన పుష్యరాగము
యేలేటి శ్రీవేంకటాద్రి యింద్రనీలము
పాలజలనిధిలోన పాయని దివ్యరత్నము
బాలునీ వలె తిరిగీ పద్మనాభుడూ ॥ముద్దుగారే యశోద॥

సుప్రసిద్ధమైన అన్నమాచార్యుని నవరత్న కృతి ఇది.

దీనిలో నవరత్నాలు పొదగబడ్డాయి. అవి ఎంత అందంగా పొదగబడ్డాయో పరికిద్దాం.

ఈ నవరత్నాల పేర్లు ఈ కీర్తనలో కొన్నిచోట్ల తెలుగునానుడులలో ఒదిగించబడ్డవి. కొన్నిచోట్ల శ్లేషింపడి రెండవ అర్థము ప్రతిపాదింపబడ్డది. కొన్నిచోట్ల కేవలము నామసామ్యమున వాడబడ్డవి.

దీనిలో నల్లనయ్య నవరత్నశోభతో తళతళలు వెలార్చుచున్నాడు.

ఈ దేవకి కన్న పిల్లవాడు దిద్దరాని మహిమలు కలవాడు. తప్పిదములుంటే దిద్దవలసివచ్చును. స్వయముగా భగవంతుడు చూపిన మహిమలను దిద్దగలవారెవ్వరు? తిద్దరాని అని మరియొక పాఠము కలదు. తిద్దు, దిద్దు సమానార్థకములే. ఇట్టి దేవకీనందనుడు యశోద ముంగిట ముద్దులొలుకు ముత్యమై నాడు.

ముంగిట ముత్యాలముగ్గు వేయుట ఒక ఆచారము. అట్లే యశోద ముంగిట వెలసిన ఈ ముత్యమును దర్శించుటకే యశోద యింట ఎంతో మంది బారులు తీరెడివారు.

"ముత్యపుచిప్ప వలన విడువబడునది" (ముచ్యతే శుక్తి సంపుటాదితి ముక్తా, ముక్తైవ మౌక్తికం, ముచ్ మోక్షణే) అని ముత్యము నకు వ్యుత్పత్తి. తరువాత అది ఎవరి చేతికి చిక్కునో తెలియదు. ఇచట ఈ చిన్నవాడు దేవకీగర్భ శుక్తిముక్తాఫలము. ఆమె నుండి విడివడి యశోద ముంగిటికి ప్రయాణించెను. అందుచే యశోద ముంగిటిముత్యము అనునది సార్థక ప్రయోగమైనది.

ఈ మాటలు నందవ్రజములోని ప్రజలవి. వారంటున్నారూ...

మాలో మా చెంతన యున్న ఈ చిన్నికృష్ణుడు -

1. అంతనింత గొల్లెతల అనగా వారి వయసుతో నిమిత్తములేక అందరికీ అరచేతి మాణిక్యము. అరచేతిలోని మాణిక్యము అనునది ఒక తెలుగు నుడికారము. చాలా సులభముగా గ్రాహ్యమగుదానిని అరచేతి లోని మాణిక్యము అందురు. ఈ గొల్లెతలు తెలివి లేని వారు. అందుచే అట్టి వారిని దరిచేర్చుటకు చిన్నికృష్ణుడు వారికి అరచేతి మానికమయ్యెను.

   మరియొక అర్థము కలదు. "స్తోత్రము చేయబడునది" అని మణికి వ్యుత్పత్తియట (మణ్యతే స్తూయత ఇతి మణిః). స్తోత్రము అనగా పొగడ్త. మా నల్లనయ్య ఎంత అందగాడో అని వీరు పొగడడమే వీరు చేయు స్తుతి. దానికే ఆతడు వారిని తరింపజేసెను. అందుచే మానికము తెలుగు

నానుడిలో భాగముగనూ, సార్థకమైన వ్యుత్పత్తిగను అన్నమాచార్యుడు వాడినాడు.

2. పంతమాడే కంసుని పాలి వజ్రము. వజ్రమునకు రెండర్థములు (ఒక జాతి రత్నము, వజ్రాయుధము). ఇచట వజ్రాయుధము అను అర్థమున వాడినాడు. కంసునికి ఈతడు వజ్రాయుధము వంటివాడు.

3. మూడులోకములకూ కాంతులు వెదజల్లు ఈతడు గరుడపచ్చపూస. ఇది గొల్లలు చెప్పుచున్నారు కదా. అందుకే వీరు గరుడపచ్చను 'పూస' అనినారని సారస్యము. గరుడపచ్చను బుధరత్నము అందురు. ముల్లోకములలో శ్రేష్ఠుడు అని ధ్వని. ఇచట గరుడపచ్చను అన్నమాచార్యుడు శ్రేష్ఠవాచకముగా వాడినాడు. మరియొక అర్థము కలదు. గరుడుని వలన పుట్టినది కావున దీనిని గరుడపచ్చ అందురు. ఇది ధరించిన మరణమును జయింపవచ్చునని ప్రతీతి. ముందు చెప్పిన వజ్రము చంపునది. ఈ గరుడపచ్చ చావును దరిచేరనీయనిది. ఆతడు దుష్ట శిక్షకుడూ, శిష్ట రక్షకుడూ అనడమన్నమాట.

మాకెల్లరకూ గమ్యమై (గతియై) కాచు యీ కమలాక్షుడు –

1. రతికేళి రుక్మిణికి రంగుమోవి పగడము.

పెదవికి పగడముతో సామ్యము చెప్పుట సుప్రసిద్ధము. రతికేళిలో రుక్మిణికి ఇతడు పగడము వంటివాడు. ఇతని ముద్దాడుట వలననే ఆమె పెదవులు ఎర్రబడినవనుట. లేదా ఆమె పెదవులకూ ఈ 'పగడము' నకూ సరిపడినదనుట.

2. కృష్ణుడు గోవర్ధనమెత్తినాడు. దాని క్రిందికి వచ్చిన గోవులనూ, మనుషులనూ వర్షము బారినుండి రక్షించినాడు. తన పరిధి (మితి = కొలత, హద్దు) లోనికి వచ్చినవారిని రక్షించుట అతని నైజము. ఇచట గోమేధికము అనుట కేవలము గోవర్ధన గిరిలోని గోసామ్యము మాత్రమే కాదు. 'మేధి' శబ్దమునకు పశువులను కట్టు కొయ్య అని అర్థమున్నది.

'గోమేధి'కము అనుటలో ఆతడు గోవర్ధనగిరినెత్తి పశువులకు నిట్రాట అయ్యెనను వింత అర్థము స్ఫురించును. ఇట్టివి మహా కవులే చేయగలరు.

3. సతమై శంఖచక్రాల సందుల వైడూర్యము –

ఇది యొక వింత ప్రయోగము. ఇది కూడా అన్నమాచార్యుడు మాత్రమే చేయగలడు. ఎల్లపుడూ (సతము) ఇతడు శంఖచక్రముల సందులో (అనగా మధ్యన గల చోటులో) కనబడునట. వైడూర్యమునకు 'పిల్లి కంటి రత్నము' అని పేరు. చీకటిలో పిల్లి కళ్ళు వింతగా మెరియును. అట్టి మెరుపు కలుగుటచే దీనికా పేరు వచ్చినది. పిల్లి కూడా ఏదో మూలనుండో, ఏదో సందులోనుండో పిల్లికళ్ళు చీకటిలో మెరిసి గగుర్పాటు కల్పించును. దానిని ఎంత చమత్కారముగా పట్టుకుని వచ్చినాడో చూడండి. తిరుపతిలో స్వామి దర్శనము చేసుకునే ప్రతివారికీ ఇది అనుభవమే. దూరము నుండి శంఖము, చక్రమూ వాటి నడుమ నామము ధరించిన స్వామిమోము తళుక్కుమనును. శంఖచక్రముల సందులోనుండి స్వామి వైడూర్యము (పిల్లికంటి రత్నము) వలె మెరయునట.

బాలుని వలె మామధ్య తిరుగాడు యీ పద్మనాభుడు సామాన్యుడు కాదు.

1. కాళింగ సర్పము పడగలపై కప్పిన పుష్యరాగము. కృష్ణుడు కాళీయుని పడగలపై నిలబడి మర్దించినాడు. అపుడు ఆ పాము పడగపై పుష్యరాగమైనాడు. సర్పముల పడగలలో మణులు ఉండునని ప్రతీతి. అందుచే పడగలపై మణి అనడం. పుష్యరాగం తెల్లగా ప్రకాశించునట. కాళీయుడు నల్లత్రాచు. స్వామి స్వతహాగా నల్లనివాడైననూ ఆతని కాంతి ఆ నల్లని పడగలపై సాపేక్షముగా తెల్లనై ఒప్పెనని అన్నమయ్య భావము.

2. ఈతడు శ్రీవేంకటగిరి నుండి జగములనేలు 'ఇంద్రనీలము' వంటి నల్లని వాడు. ఇంకొక విశేషమున్నది. నీలమునకు వ్యుత్పత్తి "నిరంతరము కొనియాడ బడునది" అనియుట (నితరాం ఈడ్యతే నీలః) కాబట్టి ఈయన

వేంకటగిరి నిలయుడై జగమునేలుచూ నిరంతరము శ్లాఘనీయుడైనాడని భావము.

3. అసలు విషయము ఆఖరున చెబుతున్నాడు. ఈయన పాలజనిధిలో నిరంతరమూ కొలువుండు "శ్రీమహావిష్ణువు". దివ్యరత్నము అన్నాడు. ఇది శ్రేష్ఠవాచకము. అంతియ కాదు. రత్నమునకు "దీనియందు మనసు రమించును" (రమన్తే స్మిన్నితి రత్నం) అని వ్యుత్పత్తి. అందుచే మనమసులు రమింపజేయు సాక్షాత్తు శ్రీమహావిష్ణువే ఈతడని చెప్పడమన్నమాట.

కొసమెరుపు:

కీర్తనలో కృష్ణుని ముత్యము,మానికము, వజ్రము, గరుడపచ్చ,పగడము, గోమేధికము, వైడూర్యము, పుష్యరాగము, ఇంద్రనీలము గా సమర్థించినాడు. ఇవి నవ రత్నములు. ఆఖరుకు పాలజలనిధి లోని దివ్య రత్నమును పేర్కొన్నాడు. కనుక పై తొమ్మిది పేళ్ళు గల జాతిరాళ్ళు ఈ దివ్యరత్నము (విష్ణువు) లో పర్యవసించును అని తేల్చినాడన్నమాట.

అద్భుతమైన కీర్తన యిది.

90. ముద్దులు మోమున ముంచగను

ముద్దులు మోమున ముంచగను
నిద్దపు కూరిమి నించీని

మొలచిరుగంటలు మువ్వలు గజ్జెలు
గలగలమనగా కదలగను
ఎలనవ్వులతో ఈతడు వచ్చి
జలజపు చేతులు చాచీనీ

అచ్చపు గుచ్చు ముత్యాల హారములు
పచ్చల చంద్రాభరణములు
తచ్చిన చేతుల తానె దైవమని
అచ్చట నిచ్చట ఆడీని

బాలుడు కృష్ణుడు పరమపురుషుడు
నేలకు నింగికి నెరి పొడవై
చాల వేంకటాచలపతి తానై
మేలిమి చేతల మించీని

చిన్నికృష్ణుని రూపు వర్ణిస్తున్నాడీ కీర్తనలో

ముద్దులొలికే మోము స్నిగ్ధమై కూరిమి నించుచున్నది.

1. మొలలో కట్టిన చిరుగంటలు, గజ్జెలు గలగలలాడుతూ కదులుతుండగా లేతనవ్వులతో ఈ చిన్నిపాపడు వచ్చి తామరలవంటి చేతులు చాచుచున్నాడు. ఎత్తుకోండి.

2. చక్కగా గుచ్చిన ముత్యాలసరులు, పచ్చల తాపిన చంద్రవంకలు (ఒక ఆభరణ విశేషము) ధరించి, చేతులు చూపిస్తూ (అభయ వరద

హస్తములవలె అభినయిస్తూ) తచ్చి అనగా హెచ్చి తానే దైవము అన్న అనుభవమిస్తూ అంతటా (అక్కడ నిక్కడ) ఆడుతున్నాడు. దర్శనం చేసుకోండి.

3. ఈ బాలకృష్ణుడే పరమముపురుషుడై నేలనుండి నింగికి అందముగా (నెరి) పొడవు గలిగి త్రివిక్రముడై వేంకటగిరి నాథుడై గొప్పపనులు (మేలిమి చేతలు) చేయుచున్నాడు. చేతులు జోడించండి.

చిన్ని కృష్ణునిలో త్రివిక్రముని క్రమముగా ఆవిష్కరించిన కీర్తన యిది.

91. మూసిన ముత్యాలకేలే మొరగులు

మూసిన ముత్యాలకేలే మొరగులు
ఆసల చిత్తానికేలే అలవోకలు

కందులేని మోముకేలే కస్తూరి
చిందు నీ కొప్పునకేలే చేమంతులు
మందయానమున కేలే మట్టెల మోతలు
గంధమేలే పైకమ్మని నీ మేనికి ॥మూసిన॥

భారపు గుబ్బలకేలే పయ్యెద
బీరపు చూపులకేలే పెడమోము
చీరల బుజాలకేలే చెమటలు నీ
గోరంట గోండ్లకేలే కొనవాళ్ళు ॥మూసిన॥

ముద్దులమాటలకేలే ముదములు నీ
అద్దపు చెక్కులకేలే అరవిరి
ఒద్దిక మాటలకేలే ఊర్పులు నీకు
అద్దమేలే తిరువేంకటాద్రీశు గూడి ॥మూసిన॥

అమ్మవారి అందమును వర్ణిస్తూ ఒక ఒడుపైన పదవిన్యాసంతో వ్రాసిన కీర్తన యిది. ఈ వాక్యాలకు సమర్థనా, నిషేధమూ (positive and negative meanings) కూడా అర్థాలుగా చెప్పుకోవచ్చు.

మూసిన ముత్యానకేలే మొరగులు:

దేనినైనా దాచిపెడితే దానిని మూసిన ముత్యం అంటారు. మొరగు అంటే పొంచు, దాగు అని అర్థం. అమ్మవారి అందం మూసిన ముత్యం. "దానికే దాపరికం (మొరగు) కావాలి". దానికేలే దాపరికం అనడం

ఇక్కడ మూసిన ముత్యానికే లే (ముత్యానికే లెమ్ము) అని చెప్పుకుంటున్నాం.

అలా కాక మూసిన ముత్యానికి + ఏల + ఏ (ఏలే?)అని విడదీస్తే మూసిన ముత్యానికి ఏలనే అని అవుతుంది. అపుడు "మూసిన ముత్యానికి దాపరికమెందుకు?" అని వ్యతిరేకార్థం వస్తుంది. ఇలాగే అన్నిచోట్లా భావించుకోవాలి.

ఇక్కడనుండి మిగిలిన వాక్యాలకు వలసిన చోట్ల అవసరమైనంత మేరకు positive లేదా negative లేదా రెండర్థాలూ వ్రాస్తాను,

ఆశలున్న మనసుకేలే తహతహలూ ఉబలాటాలూ (అలవోకలు). మీది ఆశల చిత్తము కనుక దానికి తహతహ లెక్కువ.

1. **కందులేని మోముకేలే కస్తూరి.**

మచ్చ (కందు) లేని మోముకే కస్తూరి బొట్టు పెట్టుకోవాలి. అపుడు అది దిష్టి చుక్కలా అందగిస్తుంది. నీ మోమునకు కస్తూరి చుక్క కావాలి. అది మచ్చ లేనిది కనుక.

చిందు నీ కొప్పునకేలే చేమంతులు:

అందాలు చిందు నీ కొప్పునకు చేమంతులు కావాలి. మరింత అందం చేకూరుతుంది. నిషేధార్థమూ బాగానే ఉంటుంది. అసలు నీ కొప్పే అందమైనది. దానికిక చేమంతులు ఎందుకు?

మంద యానమునకేలే మట్టెల మ్రోతలు:

మెల్లమెల్లగా నడిచే నడకలకు (మందయానము) మట్టెల మ్రోతలు తోడైతే ఆ నడకల అందం ఇనుమడిస్తుంది. కనుక నీ మందయానము నకు మట్టెల మ్రోతలు కావలెను.

వ్యతిరేకార్థము

మెల్లమెల్లగా నడిచే నడకకు మట్టెల మోతలు ఎందుకు? గబగబా నడిస్తే ఘల్లుఘల్లు మంటాయి కానీ. ఇంకొక లా కూడా చెప్పవచ్చు. మందయానములో మట్టెల మ్రోయవు. అందుచేత ఈ మట్టెల మోతలెందుకు? మోత దండగ అనడం!

గంధమేలే పై కమ్మని నీ మేనికి:

నీది కమ్మని పరిమళము గల మేను. దానికి ఇక గంధమెందులకు? వలదనడం. నీ కమ్మని మేనికి సహజగంధమేలే (గంధమేలే)అని మరియొక అన్వయం.

2. **భారపు గుబ్బలకేలే పయ్యెద.**

మీది భారమైన వక్షము. దానికి పయ్యెద కావాలి.

బింకపు చూపులకేలే పెడమోము:

నీ చూపులు బింకమైనవి (పౌరుషముతో కూడినవి) కనుక నీవు మోము త్రిప్పుకొన నవసరము లేదు

చీరల బుజాలకేలే చెమటలు:

నీవు చీరకొంగు భుజములపై కప్పుకొందువు. అందుచేతనే భుజములు చెమరించును.

గోరంట్ల గోళ్ళకేలే కొనవాళ్ళు:

గోరింటచే పండిన ఎఱ్రని నీ గోళ్ళ కొనలు వాడిచేయుట తగును. దానివలన అందము ఇనుమడించును. వ్యతిరేకార్థము కూడ సమంజసమే. గోరింటచే ఎఱ్రగా పండిన గోళ్ళు అందముగానున్నవి. ఇక వాటి కొనలను వాడిచేయనవసరమేమున్నది? వలదనుట.

3. **ముద్దుల మాటలకేలే ముదములు:**

నీ ముద్దు మాటలే ముదము కలిగించును.

అద్దపు చెక్కులకేలే అరవిరి:

అరవిరి అనగా వికసించీ వికసించని పూవు. దీనితో ఇచట చక్కని అన్వయము కుదురుట లేదు. బహుశా ఇది ఆవిరి యైయుండునని నాఊహ. నీ అద్దము వంటి చెక్కిళ్ళకే నాథుని ఊర్పుటావిరి కావలెను. అద్దమును ఆవిరి పెట్టి శుభ్రపరచుట లోకవిదితము. పెద్దలు ఈ విషయమున సూచనలేవైన చేతురుగాక!

ఒద్దిక మాటలకేలే ఊర్పులు:

ఒద్దికగా మాటలాడు నీమాటలను ఊపిరితో అనుసంధానించుచుందువు. అది మిక్కిలి తగియున్నది. కొందరు గడగడ ఊపిరి తీయకుండా మాటలాడుదురు. అట్లు చేయుట తగదనుట.

అద్దమేలే తిరువేంకటాద్రీశు గూడి:

నీవు ఇన్ని సొబగులతో విభుని గూడిన పిదప అద్దము కావలెను. తనివితీర ఆతనితో కూడిన నిను చూచుకొనుటకు.

కానీ వ్యతిరేకార్థమే అందమైనది. చూచుదము. నీవు నాథుని కూడిన పిదప అద్దము అవసరము లేదు. నీవాతనిలో లయమైన పిదప అది అద్వైతానుభవము. తద్భిన్నమైన దేదియూ నపుడు ఉండజాలదు. అద్దమూ లేదు. పరిసరములూ లేవు. ఉన్నది ఒకటే బ్రహ్మపదార్థము.

92. మేడలెక్కి నిన్నుజూచి కూడెననే ఆశతోడ

మేడలెక్కి నిన్నుజూచి కూడెననే ఆశతోడ
వాడుదేరి వుస్సురందురా వెంకటేశ
యాడనుంటి విందాకానురా

పిక్కటిల్లు చన్నులపై చొక్కపు నీఉంగరము
గక్కన నేనద్దుకొందురా - వెంకటేశ
లక్కవలె ముద్రలంటెరా

దప్పికొంటివని నీకు గప్పురము పొరమిచ్చి
ముప్పిరి నీ విరహానమా - వేంకటేశ
నిప్పునుచూ బ్రమసితిరా

కందువ మైచమరించి గందవొడి చల్లుకొని
పొందనిన్ను దలచితిరా - వేంకటేశ
అంది చొక్కు మందులాయెరా

బొందుమల్లె పానుపుపై నుండినన్ను బాడి పాడి
నిందు జాగరములుంటిరా - వేంకటేశ
యెండలాయె వెన్నెలలురా

మల్లెపువ్వు గొనదాకి ఝల్లనను బులకించి
వుల్లము నీకొప్పించితిరా - వేంకటేశ
కల్లగాదు మమ్ము గావరా

ఉన్నతి శ్రీవేంకటేశ మన్నించి కూడితినిదే
నన్ను నెంత మెచ్చు మెచ్చేవు - వేంకటేశ
కన్నుల పండువలాయెరా

మిన్న కేళాకుళీలో వున్న తమ్మి విరులునీ
కన్నులంటా జేరబోగానూ – వేంకటేశ
పన్ని మరునమ్ములాయెరా

నిద్దిరించి నీవునాకు వొద్దనుండ కలగంటి
చద్దివేడి వలపాయెరా – వేంకటేశ
సుద్దులింకా నేమి సేశేవో

జోడుకూడి నీవునేను నాడకొన్న మాటలెల్ల
గోడలోన చిత్తరువులై – వేంకటేశ
యాడా నా మతి బాయవురా

అన్నమయ్య వ్రాసిన ఒక చక్కని యాలపాట ఒకటి చూద్దాం. ఏల (యాల) పాటలు నాయికా నాయకుల మధ్య జరిగే శృంగార సంభాషణలు. ఇవి జానపదగీతాలు. కొన్ని సరస సంభాషణలు, కొన్ని వివాదాలు, కొన్ని నిష్ఠురాత్మకాలు ఇలా పలు రకాలుగా ఉంటాయివి.

దీనిలో నాయిక జీవాత్మ. నాయకుడు పరమాత్మ. జీవాత్మ పరమాత్మలో కలియడానికి పడే ఆరాటం యీ గీతాలలో అంతర్వాహిని. అదే అద్వైత బోధన. అన్నమయ్య మామూలుగా వ్రాసిన శృంగార కీర్తనలు కూడా నిజానికి ఇలాగే అన్వయించాలి. ప్రతీ శృంగార సంకీర్తన ఈ కోణం లోనించి చూడాలి.

ముందు సామాన్యార్థం వ్రాసి ఆధ్యాత్మిక భావాన్ని ప్రతి చరణానికి క్రింద బ్రాకెట్లలో వ్రాస్తాను.

ఇక కీర్తనలోనికి వద్దాం. ఇది నాయిక అంతరంగం.

మేడలెక్కి నిన్ను చూచి నీతో కూడవలెననే (కూడేననే) ఆశతో వచ్చాను. నీవు కనిపించలేదు. నిరాశతో (వాడుదేరు = మ్లానమగు) ఉస్సురన్నాను. ఇప్పడి వరకూ ఎక్కడున్నావురా (ఇందాకాను = ఇంతవరకు).

(మేడలెక్కడం అంటే ఆధ్యాత్మిక సాధనలో మెట్లెక్కడం. అయినా పరమాత్మ కనిపించడం లేదని జీవుని వేదన)

1. నిండైన (పిక్కటిల్లు) నా చనుదోయిపై పరవశించి నీ ఉంగరం ఆత్రంగా (గ్రక్కన = వెంటనే) నేనద్దుకున్నాను. ఓ వేంకటేశా! లక్కమీద వేసిన ముద్రలాగా ముద్రపడింది చూడు.

(వైష్ణవులు భుజాలమీద శంఖచక్ర ముద్రలు వేయించుకుంటారు. అలా ముద్రలు వేయించుకుని నీకై తపిస్తున్నా నీ దయ రావడం లేదనడం)

2. నీవు శ్రమపడి పోయితివని (దప్పిగొంటివని) నీకు చక్కగా కర్పూరము నర్పించితిని (పారమిచ్చు = మర్యాదచేయు). నీ విరహము వలన ఓ వేంకటేశా! నేను కూడా నిప్పులలో నున్నట్లే యుంటిని. (ఇక్కడ అన్వయం అంతగా అతకలేదు. దప్పిగొను అంటే దాహము వేయు అని అర్థం చెబితే దాహానికి కప్పురం పారమివ్వడం అతకదు. శ్రమపడు అని చెప్పుకున్నా సరిగా అన్వయం కాలేదు. కప్పురము పారమిచ్చు అన్నదానికి మరేదైనా అర్థం ఉందేమో విజ్ఞులు వివరింతురు గాక)

(నిన్ను చేరుటకు నీవలెనే నేనూ ఆతృతగా ఉన్నాననడం)

3. మేను చమరించినదని అందంగా (కందువ) గంధం పొడి చల్లుకున్నాను. నిన్ను పొందాలని చూస్తున్నాను. ఓ వేంకటేశా! ఇది మత్తుమందు (చొక్కుమందు) చల్లినట్లుంది. ఇక రారా!

(స్వామీ భక్తితో మేను చమరించినది. నీ కర్పించిన గంధం ధరించాను. నీవు కనరావేమి?)

4. బొందు మల్లెల పాన్పు మీద నిన్ను తలచుకుని తలచుకుని (పాడి పాడి) పూర్తి జాగరము చేసితిని. ఓ వేంకటేశా! ఈ వెన్నెల యెండవలె వేడిగా అనిపించినది.

(భక్తితో జాగరం చేయడం. పరమాత్మను తలచి తలచి తపించడం)

5. మల్లెపూవు కొనతాకి పులకించి పోయి ఈ మనస్సును నీకోసం ఒప్పించాను. ఓ వేంకటేశా! ఇది నిజం. నన్ను చేరదీయి.

(భక్తి పరంగా కూడా ఇది అన్వయం అవుతుంది.)

6. నీ గొప్పదనం (ఉన్నతి) మన్ననజేసి నిన్ను కూడితిని. నీ మెప్పు పొందితిని (మెచ్చు మెచ్చేవు). ఓ వేంకటేశా! కన్నుల పండుగైనది.

(భక్తితో కూడిన అన్వయము – ఆధ్యాత్మికముగా)

7. చక్కటి క్రీడాసరస్సు (కేళాకుళి)లో నీవు ఈదుతూంటే నీ కన్నులూ కమలాలూ కలసి ఓ వేంకటేశా! మన్మథబాణాల్లా అనిపించాయి. నీ కన్నులకూ పద్మాలకూ తేడా తెలియలేదు. చక్కని అభివ్యక్తి.

(నీ చూపులు నన్నాకట్టుకున్నవనడం)

8. నీవు నావద్దనే ఉన్నావని నిద్రలో కలగన్నాను. ఓ వేంకటేశా! ఏమి చేసినావో కాని (సుద్దులింకా ఏమి జేసేవో?) ప్రొద్దుటా (చద్ది) మధ్యాహ్నమూ (వేడి) నీ వలపే. రోజంతా నీ వలపు ఊహలే అనడం.

(కలలో నిన్ను గని నీ భక్తిలో మునిగితిననడం)

9. నీవూ నేనూ జంటగా ఆడుకొన్న మాటలన్నీ గోడమీద వ్రాసుకున్న చిత్తరవుల వలె నా మనసులో చెరిగిపోకుండా ఉన్నవి. మాటలను చెరిగిపోని చిత్తరవులతో పోల్చడం మంచి కవిత్వపు పసందు.

(మనసులో భగవంతునితో సంభాషణలు జీవ నాయిక చెరిగిపోని చిత్రాలవలె భావించడం – భావించుకుని భావించుకుని మురిసి పోవడం భక్తికి తారాస్థాయి)

(ఇలా ఈ కీర్తనలో దాదాపు పాతిక పైచిలుకు చరణాలు వ్రాసేడు అన్నమయ్య.)

93. మేలుకో శృగారరాయ మేటి మదనగోపాలా

మేలుకో శృగారరాయ మేటి మదనగోపాలా
మేలుకోవే నాపాల నించిన నిధానమా

సందడించే గోపికల జవ్వనవనము లోన
కందువ దిరిగే మదగజమవు
ఇందుముఖి సత్యభామ హృదయపద్మము లోని
గంధము మరిగినట్టి గండుతుమ్మెదా! ॥మేలుకో॥

గతిగూడి రుక్మిణి కౌగిటిపంజరములో
రతిముద్దు కురిసేటి రాజిలుక
సతులు పదారువేలు జంటకన్నుకలువలకు
హితవై బొడమిన నా ఇందుబింబమా ॥మేలుకో॥

వరుస కొలనిలోని వారి చన్నుకొండలపై
నిరతి వాలిన నా నీలమేఘమా
సిరినురమున మోచి శ్రీవేంకటాద్రి మీద
గరిమ వరాలిచ్చే కల్పతరువా! ॥మేలుకో॥

మేలుకొలుపు గీతాలూ, సుప్రభాతాలూ చాలా ప్రసిద్ధమైనవే. ఈ కీర్తనలో అన్నమాచార్యుడు ఆ వేంకటపతిని మేలుకొలుపుతున్నాడు. ఇది భక్తుని మేలుకొలుపు.

వేంకటేశ్వర సుప్రభాతం 'ఉత్తిష్ఠ నరశార్దూలా కర్తవ్యం దైవమాహ్నికం' అంటుంది. చేయవలసిన విధులను గుర్తుచేస్తూ లేపుతుంది. కానీ ఈభక్తుడు ఎంత ముద్దుగా లేపుతున్నాడో చూడండి.

ఓ శృంగారరాయా మేలుకో! ఓ మదనగోపాలా మేలుకో! నా పాలిటి పెన్నిధీ మేలుకో!

స్వామీ! గోపికల యౌవనము అను వనములో యధేచ్ఛగా విహరించే మదపుటేనుగు వంటివాడా! మేలుకో!

చంద్రవదన యైన సత్యభామాదేవి హృదయమను పద్మము లోని సుగంధమును మరిగి మత్తులో తూగు గండుతుమ్మెదా! మేలుకో.

ఇచట ఒక విషయము చెప్పుకొనవలెను. సత్యభామ ముఖము చంద్రబింబము (ఇందుముఖి = చంద్రునివంటి మోము కలది). ఆమె హృదయము పద్మము. చంద్రుని రాకతో పద్మము ముకుళించును. అందుచే దానిపరిమళము కొరకు పద్మములో ప్రవేశించిన వేంకటపతి యను తుమ్మెద ఆ పద్మములో రాత్రి యంతయు చిక్కినదని సారస్యము. ఇట్టి యూహలలో ప్రబంధ కవులకు తీసిపోడు అన్నమయ్య.

రుక్మిణీ దేవి కౌగిలి యను పంజరములో రతి సంభ్రమమున కూడిన ఓ రాచిలుకా! మేలుకో!

పదహారు వేల గోపిల జంట కలువకళ్ళకు (ముప్పదిరెండువేల కనులు) వికసింపజేయుటకు (హితమై) ఉదయించిన ఓ చంద్రబింబమా! మేలుకో!

ఇచ్చట మరల ఒక విశేషము చెప్పుకొనవలెను. సత్యభామ ఆయనను తన హృదయ పద్మమున, రుక్మిణి తన కౌగిటి పంజరమున బంధించినారు. కానీ స్వామి మాత్రము తాను చంద్రబింబమై ఉదయించి గోపికల కన్నులను కలువలకు వికాసము కలిగించెను. ఆయనకు గోపికల పట్ల గల అనురాగము ఒకింత ఎక్కువ యని ధ్వని.

అందుకే కాబోలు కీర్తన ప్రారంభమే గోపికా జవ్వన వనముతో ప్రారంభించి మరల రెండవ చరణమున వారి ప్రసక్తి తీసుకుని వచ్చాడు.

కొలనులో స్నానము చేయుచున్న గోపికల కుచములను కొండలపై వాలిన ఓ నీలమేఘమా! మేలుకో! లక్ష్మిని (సిరిని) వక్షమున మోయుచూ ఈ వేంకటాద్రిపై

వెలసి పెద్దపెద్ద వరములిచ్చే ఓ కల్పవృక్షమా! మేలుకో!

మూడవసారి మరల గోపికల ప్రసక్తి తెచ్చాడు. వారియందు స్వామి వారికి ప్రీతి మెండని అన్నమయ్య కనిపెట్టినాడు. ఇప్పుడు చూడండి. తనకు ప్రీతి యగు విషయము చెప్పుచూ మేలుకొలుపు చెప్పినచో స్వామి ఎంత ప్రసన్నుడై నిద్ర లేచునో అన్నమయ్యకు తెలియును. ఆఖరున కోరిన వరాలిచ్చే కల్పతరువా అనినాడు. ఇతని కోరికలను స్వామి తప్పక తీర్చుననుటలో సందేహమేమైన కలదా?!

ఇట్టి చక్కని మేలుకొలుపు పాడిన అన్నమాచార్యునికి స్వామివారు ఒక అపూర్వమైన వరము నొసగినారు. అన్నమాచార్యుని వంశము వారు మేలుకొలుపు పాడిన పిదపనే మేల్కొందునని స్వామివారు అన్నమయ్యకు వరమిచ్చినారు. తిరుపతిలో "సుప్రభాతసేవ" చూచుటకు వెళ్ళువారు చూడవలసిన విషయమిది. సన్నిధి గొల్ల కాగడాతో అర్చకస్వాములను తీసుకుని వచ్చి గుడి తాళములుతీసి లోపలికి ప్రవేశించును. వీరితో పాటు తంబురా పట్టుకొని ఒక మహానుభావుడు కూడా వారితో ఆలయములోనికి పోవును. అతడే అన్నమాచార్య వంశసంజాతుడు. ఆతడు స్వామివారి యెదుటనిలిచి మేలుకొలుపు పాడును. ఇది అన్నమయ్య చేసుకొన్న పుణ్యఫలము.

"కులము లోన నొకడు గుణవంతుడుండిన
కులము వెలుగు వాని గుణము చేత"

94. మొల్లలేలెనాకు తన్నె ముడుచుకొమ్మనవే

మొల్లలేలెనాకు తన్నె ముడుచుకొమ్మనవే నే
జెల్లపూల కొప్పు తావి చెంచుదాననే

పట్టుచీరేటికే నాకు పారుటాకులే చాలు
కట్టుకొమ్మనవే తన మొలను
పట్టెమంచమేలే నాకు పవ్వళించుమనవే నే
జెట్టుకింద బొరలాడే చెంచుదాననే ॥మొల్లలేలె॥

సందిదండలేలే నాకు సంకుగడియమే చాలు
యిందవే యెవ్వతికైనా యిమ్మనవే
గందమేలె నాకు చక్కని తనకే గాక
జిందువందు చెమట మై చెంచుదాననే ॥మొల్లలేలె॥

కుచ్చుముత్యాలేలే నాకు గురువిందలే చాలు
కుచ్చి తన మెడ కట్టుకొమ్మనవే
కచ్చుపెట్టి కూడె వేంకటగిరీంద్రుడు నను
చిచ్చి నేనడవిలో చెంచుదాననే ॥మొల్లలేలె॥

చాలా సరసమైన కీర్తన యిది. నృసింహస్వామి ప్రహ్లాదవరదుడై అవతరించి హిరణ్యాక్షుని వధించి చివరకు ఒక చెంచెతను పెండ్లాడి శాంతించి కల్యాణ నృసింహుడైనాడు. నృసింహుడు ఆ చెంచులక్ష్మికి కొన్ని కానుకలు పంపాడు. ఆ చెంచులక్ష్మి ఆకానుకలను తిరస్కరిస్తూ దానికి కారణమేమిటో అవి తెచ్చిన పరిచారికకు వివరిస్తున్నది.

ప్రతీ వాక్యంలో చక్కని శ్లేష నిర్వహించినాడు అన్నమయ్య. అమ్మవారు అయ్యవారిపై చిన్నచిన్న హాస్యభరితమైన విసుర్లు విసురుతున్నదీ కీర్తనలో. ఇక కీర్తన లోనికి...

స్వామి మొల్లపూలు పంపినారు. నాకు ఈ మొల్లలెందుకు? ఇవి స్వామినే ముడుచుకొమ్మని చెప్పు (తన్నె ముడుచు కొమ్మనవే). నేను చెల్లపూలు కొప్పులో పెట్టుకునే చెంచెతను.

చెల్లపూలు చిన్నచిన్న తెల్లని గడ్డిపూలు. తనకు విలువైన మొల్లలు వద్దంటున్నది.

నేను చెంచెతను. నాకు గడ్డిపూలు చాలు మొల్లలవంటి విలువైన పూలు అక్కరలేదు. ఇవి ఆయన్నే ముడుచుకొమ్మను. స్వామి నృసింహుడు కదా. పెద్ద జూలు కలవాడు. ఆ జూలు (జుట్టు)లో ముడుచుకొమ్మని హాస్యం చెయ్యడమన్నమాట.

స్వామివారు అలంకార ప్రియులు. కావున ఆయన అలంకరించుకొనుట ఉచితము. నాకు చెల్లపూలు చాలును. ఇది అంతరార్థము.

1. స్వామివారు పట్టుచీర కానుకగా పంపినారు. నాకు పట్టుచీర లెందుకు. నేను మొలకు ఆచ్ఛాదనగా పారుటాకులు (పండి రాలిన ఆకులు) కట్టుకునే చెంచెతను. ఈ చీర ఆయనను మొలకు పంచె (దట్టి) వలె కట్టుకొమ్మను

   స్వామి మృగరూపుడు. కటికి అచ్ఛాదన నుంచుకొను అలవాటు మరచినాడేమో. ఈ చీర తననే మొలకు చుట్టుకొనుమనుము అని హాస్యం.

   స్వామివారు పీతాంబరధారి. ఈ నరమృగావతారమున పాపం పట్టుబట్ట కట్టుచున్నారో లేదో. ఆయనను పట్టుదట్టి కట్టుకొమ్మనుము అనుట – లోని భావము.

   మరియొక కానుక పట్టెమంచం. పట్టెమంచం నాకెందుకు? ఆయననే పడుకొమ్మను. నేను చెట్టుకింద పొరలాడే చెంచుదానను.

   స్వామి వారు సింహస్వరూపుడు. సింహాలు నేలమీద గుహల్లోనూ చెట్ల క్రిందా పడుకుంటాయి. ఆయనను మంచం మీద పడుకోవడం అలవాటు

చేసికొమ్మని హాస్యం.

స్వామివారు శేషశయానుడు. పాపం ఈ అవతారంలో ఆయనను మంచం మీదనైనా పడుకోమని చెప్పు అనడం – లోపలి అర్థం.

2. సందిదండలు అనునవి చేతులకు పెట్టుకొను ఆభరణములు. ఇవి నాకెందుకు? ఇంద తీసుకో. ఆయనకే ఇవ్వు. ఎవ్వతికైనా ఇమ్మను. నాకు శంకు (సముద్రం ఒడ్డున దొరికే గవ్వలూ, శంఖాలు) లతో గుచ్చిన దండలు చేతులకు పెట్టుకోవడమే అలవాటు.

స్వామి బహుభార్యత్వము తెలిసినదే. ఈ అవతారంలో కూడా ఎవ్వతెనో ఈపాటికి దరితీసే ఉంటాడు. దానికి యిచ్చుకొమ్మను.

దీనిలో రెండవ అర్థం చెప్పడం కష్టమే. మహా చెబితే ఏ భక్తురాలికైనా ఇమ్మను అని చెప్పాలి. కాని అతికినట్లు లేదు.

తరువాతి కానుక గంధము. నాకు గంధమేల? ఆయనకే యియ్యి. నేను చెమటలలో దోగే చెంచెతను.

ఈ నరసింహుడు ఉగ్రమూర్తి. చందనం పూసుకుని చందనం ముద్దలో కూర్చుంటాడు. (సింహాచలేశుడికి మణుగుల కొద్దీ చందనం పూస్తారు). ఆయనకే ఇచ్చేసి రాసుకొమ్మను.

స్వామివారు విలాసపురుషుడు. కస్తూరి చందనం తట్టుపునుగు ఇత్యాదులు ఆయనకు ఇష్టం. వారికి సమర్పించమని అభ్యర్థన – లోని మాట.

3. ఇక కీర్తనలోనికి వేంకటేశ్వరుడు వచ్చేసేడు. ఈ ముత్యాలకుచ్చులు (కుచ్చు = గుచ్ఛము) నాకెందుకు? దండ గుచ్చుకుని (కుచ్చి) తన మెడలో వేసుకొమ్మను. నాకు గురివింద పూసలు చాలు.

పనిబట్టి (కచ్చువెట్టి = పంతము బట్టి) నాకు దగ్గరైనాడీ వేంకటగిరినాథుడు. ఛీ ఛీ (చిచ్చి) నేను అడవిలో చెంచుపిల్లను.

రెండు విషయాలు చెప్పుకోవాలి

1. స్వామి అనుగ్రహించడానికి వ్యక్తిగత విషయాలు (కులం, పుట్టుక మొదలైనవి) చూడదు అనేది ఒకటి

2. అమ్మ స్వయంగా లక్ష్మి. ఆమెయే సంపద. ఆమెకు కానుకలు ఇయ్యడం సూర్యుని ముందు దివిటీ చూపడం అనేదొకటీ

ఈరెంటినీ కొంచెం హాస్యం జోడించి చేసిన కీర్తన యిది.

95. రామ రామచంద్ర రాఘవ రాజీవలోచన రాఘవ

రామ రామచంద్ర రాఘవ రాజీవలోచన రాఘవ
సౌమిత్రి భరత శత్రుఘ్నులతోడ జయమందు దశరథ రాఘవ

శిరసు కూకటుల రాఘవ చిన్నారి పొన్నారి రాఘవ
గరిమల వయసున తాటకి జంపిన కౌసల్య నందన రాఘవ
అరిది యజ్ఞము గాచు రాఘవ అట్టె హరివిల్లు విరిచిన రాఘవ
సిరులతో జనకుని యింటను జానకి చెలగి పెండ్లాడిన రాఘవ
॥రామ రామచంద్ర॥

దేవతలు చూడ రాఘవ నీవు దేవేంద్రు రథమెక్కి రాఘవ
రావణాదులను జంపి విభీషణు రాజ్యమేలించిన రాఘవ
వేవేగ మరలి రాఘవ వచ్చి విజయపట్ట మేలిన రాఘవ
శ్రీవేంకటగిరి మీద అభయము చేర మాకిచ్చిన రాఘవ
॥రామ రామచంద్ర॥

రామాయణం తడవని తెలుగు కవి ఉండడు. ఏదో సందర్భంలో ఒక రామాయణ ఘట్టమైనా ప్రస్తావించని తెలుగు కవిత్వం ఉండదు. అది ఆ కథ వ్రాయడానికి వాల్మీకుల వారు పెట్టిన ముహూర్తబలమది.

అన్నమాచార్యులు వాల్మీకి రామాయణాన్ని తెనిగించినాడని పెద్దలు చెప్పగా విన్నాను. కాని అది లుప్తమై పోయినదట.

అయితేనేమి? కొన్ని మధురమైన కీర్తనలు రామపరంగా వ్రాసినవి ఉన్నవి. వానిలో ఇదొకటి. ఒక కీర్తనలో సంక్షిప్త రామాయణమిది.

ప్రతి పాదంలో రెండు పర్యాయాలు రామనామ స్మరణ.

కీర్తన భావం సుబోధకమే. అయినా రామకథ కదా. “మరియొక సారి” చెప్పుకుందాం.

రామా, రామచంద్రా, రాజీవలోచనా, రాఘవ

సౌమిత్రి భరత శత్రుఘ్నులతో జయమునందే రామా!

1. చిన్ని జులపాలజుట్టు (శిరసు కూకటి) కలిగిన చిన్నారి బాలరామయ్యా!

ఇక్కడ ఒక మాట చెప్పాలి. పూర్వ కవుల ప్రయోగాలు తరువాతి కవుల మీద ప్రభావం చూపితీరుతాయి. "చిన్నారి పొన్నారి చిరుత కూకటినాడు" ఇది శ్రీనాథుని ప్రయోగం. అది ఇక్కడ శిరసు కూకటుల రాఘవ చిన్నారి పొన్నారి రాఘవా అయింది. పదాలు తారుమారు అయ్యాయి. చిరుతకూకటి శిరసు కూకటి అయింది.

2. గొప్పగా (గరిమల) ఆ చిన్న వయసున తాటకి ఈ చంపిన రామా
యాగరక్షణ చేసి హరివిల్లు విరిచిన రామా
జనకుని యింట సీతను పెళ్ళాడిన రామా
దేవతలంతా చూస్తూండగా దేవేంద్రుని రథమునెక్కిన రామా
రావణుని చంపి విభీషణునికి రాజ్యమిచ్చిన రామా
వేగమే అయోధ్యకు వచ్చి పట్టముకట్టుకొని రాజ్యమేలిన రామా!
శ్రీవేంకటగిరిపై వెలసి మాకభయ మొసగిన రామా!

96. రామునికి శరణంటే రక్షించీ బ్రతుకరో

రామునికి శరణంటే రక్షించీ బ్రతుకరో
యేమిటికి విచారాలు యిక దైత్యులాల

చలమున తాటకి జదిపిన బాణము
లలి మారీచసుబాహులపై బాణము
మెలగి పరశురాము మేట్లేసిన బాణము
తళతళ మెరసీని తలరో అసురులు

మాయామృగము మీద మరి వేసిన బాణము
చేయిచాచి వాలి నేసిన బాణము
తోయధిమీద నటు తొడిగిన బాణము
చాయలు దేరుచున్నది చనరో దైత్యేయులు

తగ కుంభకర్ణుని తల ద్రుంచిన బాణము
జిగి రావణు పరిమార్చిన బాణము
మిగుల శ్రీవేంకటేశు మేటిపొదిలోనున్నది
పగ సాధించీ నిక బారరో రాకాసులు

రామబాణం, రామనామం తిరుగులేనివి. వాటి ధాటి అసురులకు బాగా తెలుసు. రామవిజయం తరువాత ఆసురీశక్తులు తొలగిపోయినవి. మరల కలికాలంలో ఆసురీ శక్తులు పొడసూపుచున్నవి. యుగాలు గడిచి పోయినవి కదా, రాముడు ఇకరాడు కదా అని వాటి ఆలోచన. అందుకే ఈ కీర్తనలో వాటికి హెచ్చరిక జారీ చేస్తున్నాడు అన్నమయ్య. ఓ వెర్రి రాకాసులారా! రాముడే కలియుగమున వేంకటేశ్వరుడై యున్నాడు. ఆ రామబాణములు ఈయన పొదిలో ఉన్నవి. రామునికి శరణు అనండి. రక్షిస్తాడు (రక్షించీ). బ్రతికిపొండి. ఓ రాక్షసులారా! ఇంకా యేమిటి ఆలోచిస్తున్నారు?

1. పంతంతో (చలము = పంతము) తాటకిని చంపిన (చదుపు = చంపు) బాణము, మారీచు సుబాహులపై సొగసుగా (లలిన్) వేసిన బాణము, జాగ్రత్తగా (మెలగి) పరశురామునిపై కుప్పలుగా (మేటులు) వేసిన బాణము తళతళా మెరుస్తున్నాయి. ఆలోచించుకోండి (తలరు = తలపోయు, చింతించు).

నిజానికి పరశురామునిపై రాముడు బాణం సంధించనే లేదు. కేవలం నారాయణ చాపం తాకి పరశురామునికి సత్యం అవగతమయ్యేలా చేశాడు. ఇది కేవలం అతిశయోక్తి మాత్రమే. పైగా కుప్పలుగా వేసిన బాణాలు అంటున్నాడు. దీనిలో ఒక విషయం ఉంది. రావణాసురుడు అసురులకు అరాధ్యుడు. వానిని కార్తవీర్యార్జునుడు బందీగా పట్టుకున్నాడు. ఆ కార్తవీర్యార్జునుని పరశురాముడు నిర్జించాడు. ఆ పరశు రాముని రాముడు జయించాడు. అందుచేత పరశురాముని విషయంలో కొంచెం అతిశయోక్తి వాడి రాకాసులను మరీ భయపెట్టాడనుకోవాలి.

2. మాయలేడి మీద వేసిన బాణము, చేయిచాచి వాలిని కొట్టిన బాణము, సముద్రము (తోయధి) మీద తొడిగిన బాణము (సంధించినాడంతే వెయ్యలేదు. దానికే సముద్రుడు లొంగిపోయాడనడం) మెరుస్తున్నవి (చాయలుదేరె) ఓ రాక్షసులారా! (దైత్యేయులు = దితి సంతానం) వెళ్ళిపొండి.

3. కుంభకర్ణుని తల తెంచిన బాణము, ఓజస్సు (జిగి)తో రావణుని చంపిన బాణము శ్రీవేంకటగిరి రాముని మేటి పొదిలో ఉన్నాయి. ఇంక ఆలస్యం వద్దు. కోపం వస్తే సంధిస్తాడు. ఓ రాక్షసులారా! (రాకాసులు) పారిపొండి.

వాళ్ళకు అర్థమయ్యే బాణాల గురించి చెప్పి తొలగిపొమ్మంటున్నాడు అన్నమయ్య!

97. రారా చిన్నన్న రారా చిన్నన్న

రారా చిన్నన్న రారా చిన్నన్న
రారోరి చిన్నవాడ రారా ముద్దులాడ
రారోరి బాలకృష్ణ రారా కృష్ణ రారా

రారా చిన్నన్న రారోరి చిన్నవాడ
రారా ముద్దులాడ రారోరి బాలకృష్ణ

కింది చూపుల గిలిగించి ఆల
మంద గొల్లెతల మరగించి
సందడి వలపించి జవరాండ్ర ఊర
విందవైనయట్టి వేడుక కాడ ॥రారా చిన్నన్న॥

కొదలు మాటలనె గొణుకుచు భూమి
సుదతుల సిగ్గులు చూరాడి
చిదుకు చేష్టలనె చెణుకుచూ ముద్దు
పెదవి చవులు చూపిన జాణకాడ ॥రారా చిన్నన్న॥

కలికి తనముననె కరిగించీ కాచి
చెలుల కాగిటనె చెలగి
లలనామణి యైన లక్ష్మిమమ్మ
గలసుక శ్రీవేంకట నాథుడైనవాడ ॥రారా చిన్నన్న॥

ఓ చిన్నన్నా! ఓ చిన్నవాడా! ఓ బాలకృష్ణా!

ఓ ముద్దులాడా! రారా. ఓరోరి రారా.

చక్కని ఎత్తుగడ. చిన్ని పిల్లలను నా కన్నవాడనీ, చిన్నవాడనీ,ముద్దులాడ

ఈ పిలవడం తెలుగింటి పలుకుబడులు. ఓరి ఓరోరి లాంటి అభివ్యక్తులు ఆత్మీయవాచకాలు.

ఇంకొక విశేషం: రారా ముద్దులాడ అన్నది ఒక సంబోధన మాత్రమే కాదు. నేను ముద్దులాడెదను రారా! అనియూ నన్ను ముద్దులాడుటకు రారా అనియూ కూడ అర్థములు స్ఫురించును.

1. కిందికి ఓరచూపులు చూసి ఆ బాలకృష్ణుడు ఆలమందలనూ గొల్లెతలనూ కూడా మరిగించుకున్నాడు. ఎన్నో సందడులు చేసి గొల్లజవరాండ్రను వలపించుకున్నాడు. ఇన్నిచేసి ఆ బాలపరమాత్మ ఊరివారందరికీ విందైనాడు. అనగా ప్రీతిపాత్రుడైనాడు. అట్టి వేడుకకాడా! చిన్నన్నా రారా!

   ఊరివిందు ఒక జాతీయం. ఊరివారందరినీ పిలిచి విందు యిస్తే దానిని ఊరివిందు అంటారు.

2. కొదల మాటలు చక్కని ప్రయోగం. మాట పూర్తిగా అనకుండా కొంచెం అనీఅనకుండా విడిచిపెట్టడం. ఇంకా మాటలో కొంచెం కొదవ ఉంచడం. అలా గొణుగుతూ మాటాడి భూమి మీద ఉన్న స్త్రీలందరి సిగ్గులూ కొల్లగొట్టినాడీ కృష్ణుడు (చూరాడు = కొల్లగొను).

   చిన్నచిన్న చిప్పిల్లే (చిదుకు) వింతపనుల (చేష్టల) తో పెదవి రుచులను పంచిన నెరజాణ! బాలకృష్ణా! రారా!

3. మనోజ్ఞమైన నీ మాటలతో (కలికి మాటలు) కరిగించి, వారిని కాచి, వారి కౌగిట నిలిచినవాడా. స్త్రీలలో రత్నమైన (లలనామణి) లక్కిమమ్మను కలిసి శ్రీవేంకటనాథుడు అన్న పేరును గొన్న వాడా!

   ముద్దులాడా! రారా!

   లక్ష్మీదేవిని ముద్దుగా లక్కిమమ్మ అంటున్నాడు అన్నమయ్య.

98. రావే కోడల రట్టడి కోడల

రావే కోడల రట్టడి కోడల
పోవే పోవే అత్తయ్య పొందులు నీతో చాలును

రంకెలు వేయుచు రాజులెదుట నీవు
కొంకు గొసరు లేని కోడల
పంకజముఖి నీవు బహు దొడ్డవారిండ్ల
అంకెల దిరిగేవు అత్తయ్య ॥రావే కోడల॥

ఈడాడ నలుగురు ఏగురు మొగలతో
కూడి సిగ్గులేని కోడల
వాడకు బదుగురి వలపించుకుని నీవు
ఆడాడ దిరిగేవు అత్తయ్య ॥రావే కోడల॥

బొడ్డున పుట్టిన పూపనికే నిను
గొడ్డేరి తెస్తినే కోడల
గుడ్డము పైనున్న కోనేటిరాయని
నడ్డగించుకుంటి వత్తయ్య ॥రావే కోడల॥

తెలుగు జానపద సాహిత్యంలో బావామరదళ్ళు, వియ్యపురాళ్ళు, వదినా ఆడపడుచులు, అత్తాకోడళ్ళు – వీరి సంవాదాలు తరచుగా కనపడేవే. వీటిలో బావామరదళ్ళ సంవాదాలు శృంగారం పండిస్తే అత్తాకోడళ్ళ సంవాదాలు ఘాటైన కలహంతోడి హాస్యం పండిస్తాయి. ఇలాంటి సంవాదాలు అన్నమయ్య పదాలలో ఉన్నాయి. ఈ అత్తాకోడళ్ళ సంవాదం ఎంత ఘాటైనదో చూద్దాం.

అత్త అలమేలుమంగ (లక్ష్మి), కోడలు చదువులమ్మ సరస్వతి. ఒకరిది అధికారం. ఒకరిది వైదుష్యం.

అత్త: రావే కోడలా! ఓ గయ్యాళి (రట్టడి = నింద్యమైన) కోడలా!

కోడలు: పోవే పోవే అత్తయ్యా! నీతో నాకు పొత్తులేమిటి?(పొందులు నీతో చాలును)

1. అత్త: రాజసభల్లో అందరి యెదుటా నీవు జంకు, సంకోచం (కొసరు) లేకుండా రంకెలు వేస్తావు

నీవు రాజ సభలలో నిర్భయంగా వ్యవహరిస్తావు. అక్కడ జరిగే సాహిత్య గోష్ఠులు నీ విలాసమే. ఇది అంతరార్థం.

కోడలు: ఓ పద్మముఖీ! (ఇది లక్ష్మికి అందగత్తెనని గర్వం కనుక ఎద్దేవాగా చేసిన సంబోధనగా గ్రహించాలి) నీవు పెద్దపెద్ద వారింట్లో అంకెలలో తిరుగుతావు.

అంకెల తిరుగు: మంచి ప్రయోగం. దీనికి వశమై తిరుగు అని అర్థం. లక్ష్మి డబ్బు స్వరూపం కదా. వందలు,కోట్లు ఇలా లెక్కపెడతాం కదా. ఆ అంకెలలో ఆమె ఉన్నదని మరొక అర్థం.

నీవు పుణ్యం చేసుకున్న వారి (బహుదొడ్డ వారింట) వశమై ఉంటావు అని అనడం అంతరార్థం.

2. అత్త: ఇక్కడ అక్కడ (ఈడ + ఆడ – ఈడాడ) నలుగురైదుగురు (ఏగురు = ఐదుగురు) మొగుళ్ళతో సిగ్గులేకుండా ఉంటావు. ఇది చాలా ఘాటైన మాట.

నీవు కృతికర్తకు కూతురివి. ఆతడు ఎవరికి కృతి అంకితం చేస్తే వాడు కృతిపతి (భర్త) ఔతాడు. కావ్యం చేకొని దానిని అజరామరం చేసే వ్యక్తిని వలచి వెళ్ళడానికి నీవు సంకోచించవు. ఇది అంతరార్థం.

కోడలు : ఔను మరి నీవో? పేటకు పదిమందిని వలపించుకుని అక్కడక్కడే తిరుగుతావు. తనని నలుగురైదుగురితో తిరుగుతావన్నది అత్తగారు.

అందుకు ఆవిడ పేటకు పదిమందితో ఉంటుందన్నది అని జవాబు. దెబ్బకు దెబ్బ. లౌకికంగా ఘాటు కాదు ఘోరమైన జవాబు.

అత్తా! నాదేముంది చదువుకుని ఆ చదువు నాస్వాదించే వాళ్ళు తక్కువే. డబ్బుకు దాసోహం అనే వాళ్ళే లోకంలో ఎక్కువ. కాబట్టి నా ప్రాబల్యం కన్నా నీ అధికారమే ఎక్కువ. ఇది అంతరార్థం.

3. అత్త: బొడ్డున పుట్టిన లేతపింది మా అబ్బాయి. వాడికి మోసపోయి (గొడ్డేరి) నిన్ను తీసుకవచ్చి కట్టబెట్టేను.

నిజమే. మా వాడికి ఏమీ తెలీదు. వాడు వేదాలు చదివేడంటే అది నీ సహవాస ఫలమే (చదువు నీవే కదా అనడం) ఇది లోపలి మాట .

కోడలు: ఔను. పొలములో ఉన్న (గుడ్డము = పొలము) ఆ కోనేటిరాయణ్ణి అడ్డం పెట్టుకుని నాటకం ఆడతావు నువ్వు.

నిజమే. మీ అబ్బాయికి నేను చదువు నేర్పించాను అంటివి. ఆ శ్యామలాకారుని నీవు అడ్డముగా నిడుకొంటివి. అనగా ఏజన్మలోనో విష్ణునామస్మరణా భాగ్యము లేనివానికి నీవు కనరావు. (విష్ణుభక్తునకే నీ అండ – భాగ్యం – లభిస్తుందనడం)

చక్కని సంవాదం. పైకి మాత్రం వివాదం.

99. లెండో లెండో మాటాలించరో

లెండో లెండో మాటాలించరో
కొండలరాయనె పేర్కొన్నదిదే జాలి

మితిమీరె జీకట్లు మేటి తలవరులాల
జతనము జతనము జాలో జాలి
ఇతవరులాల వాయించే వాద్యాలకంటె
నతి ఘోషముల తోడ ననరో జాలి ॥లెండో లెండో॥

గాములు వారెడి పొద్దు కావలికాండ్లాల
జాము జాము దిరుగరో జాలో జాలి
దీమసపు పరితాస దివపంజాలు చేబట్టి
యేమరక మీలో మీరు యియ్యరో జాలి ॥లెండో లెండో॥

కారుకమ్మె నడురేయి గడిచె కట్టికవారా
సారెసారె బలుకరో జాలో జాలి
యీరీతి శ్రీవేంకటేశు డిట్టె మేలుకొన్నాడు
గారవాన నిక మానగదరో జాలి ॥లెండో లెండో॥

ఇది అన్నమయ్య జాలిపాటగా ప్రసిద్ధికెక్కినది. రాచరికాలున్న రోజులలో రాజనగరు వీధులలోనూ, పొలిమేరల్లోనూ రాత్రిళ్లు కాపలా కాసే వ్యవస్థ ఉండేది. ఆ కాపలాదారులను పహరాలనీ, తలవరులనీ, తలారులనీ, కటిక వారనీ వ్యవహరించేవారు. ఈ పదాలు ఆ కావలికాండ్ర హోదాలలో కొంచెం బేధాలను సూచించే మాటలు. వారు డప్పులవంటి వాద్యాలు మ్రోయించి రాజుగారికి మధ్యమధ్య బరాబరులు చేస్తూ నిద్రలో ఉన్న ప్రజలను అప్రమత్తం చేసేవారు.

పైకి ఇది వేంకటేశ్వరుడు నిద్రిస్తూంటే కావలి వారిని హెచ్చరిస్తున్నట్లు

అన్నమయ్య చెబుతున్నా దీనిలో మంచి ఆధ్యాత్మిక తత్త్వము దాగియున్నది.

ముందు ఈ ఆధ్యాత్మిక ప్రబోధానికి నేపథ్యం చెబుతాను. మానవదేహం పురము. దీనిలో పరమాత్మ కొలువున్నాడు. దానిని మరచి మానవులు అజ్ఞానము అనే మత్తులో జోగుతున్నారు. బయట కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలనే దొంగలు లోనికి దూరడానికి సిద్ధంగా ఉన్నారు. మరియొక ప్రక్క ప్రాయమనే పొద్దు గూకుచున్నది. ఇప్పటికైనా మేలుకొమ్మని తలవరులు హెచ్చరిస్తున్నారు. ఈ తలవరులెవరు? మేలుకొని జాగరూకులై హరిని గుర్తించిన ఆచార్యులు. వీరు తంబురలు మీటి తత్త్వాలు పాడి మనపై జాలితో మనచుట్టూ తిరిగి ఈ "చీకటి"లో కావలికాచి మనను జాగృతులను చేస్తున్నారు.

ఇపుడు కీర్తన చూద్దాం.

లేవండి లేవండి (లెండో లెండి).మాట వినండి. ఇది కొండలరాయడైన వేంకటేశ్వరుని పేర చెబుతున్న మాట. (కొండలరాయనె పేర్కొన్నదిది)

1. చీకట్లు మితిమీరినవి. ఓ తలవరులారా!

   జాగ్రత్త జాగ్రత్త (జతనము జతనము) దయతో అందరినీ అప్రమత్తం చేయండి (జాలో జాలి). ఓ హితవరులారా (మంచి చెప్పే వారికి సంబోధన) మీరు వాయించే వాద్యాలకన్నా ఇంకా గట్టిగా దయతో మేలుకొలపండి.

2. చీకటి పడే సమయమౌతున్నది (పొద్దు గాములు వారెడి) ఓ కావలి కాచేవారలారా (కావలి కాండ్లాలా) జాము జాము తిరగండి. దయతో మేలుకొమ్మని చెప్పండి (జాలో జాలి).

   ధైర్యంతో (దీమసము = ధైర్యము) అంతటా (పరితస్ = అంతటా) దివిటీలు (దివపంజులు) చేబట్టి మీరు ఒకరినొకరు హెచ్చరించుకుంటూ యేమరుపాటు పడకుండా మేలుకొలపండి (జాలో జాలి)

3. అర్ధరాత్రి అయింది. పైగా ముసురుపట్టింది (కారు కమ్మె). ఓ కటికవాళ్ళలారా! మాటి మాటికీ (సారె సారె) పహరా ఇయ్యండి.

చాలా బాగా కావలి కాసినారు. స్వామి శ్రీవేంకటేశుడు మేలుకొన్నాడు. గౌరవంతో ఇక పహరా ఇయ్యడం మానండి!

ఇలా మనకొరకు మన అజ్ఞానాంధకారం పోగొట్టి మనలోని దైవము మేలుకొనగా మనకు చూపించి మన మనుగడ కొరకు పరితపించి కాపలా కాచి మనను చైతన్య పరచిన ఆచార్యుడు అన్నమయ్య. అందుకే మనం ఆయనను "అన్నమాచార్యుడు" అంటాం. ఆయనకు మనమమంటే ఎంత "జాలో".

100. వలచి వచ్చితి నేను వానికి గాను

వలచి వచ్చితి నేను వానికి గాను
నెలవై మీ గొల్లవాడనే తానుండునంట

చెందమ్మి కన్నులవాడు చేతి పిల్లగోవివాడు
ఇందు వచ్చే కంటిరా ఏమిరే అమ్మా
మందల పశువులవాడు మకరాంకముల వాడు
ఎందున్నాడు చెప్పరే యేల దాచేరమ్మా ॥వలచి వచ్చితి॥

నెమలి పింఛమువాడు నీలమేఘకాంతి వాడు
రమణుడాతడు మొక్కేను రమ్మనరమ్మా
జమళి చేతులవాడు సంకుచక్రముల వాడు
ఆమర మీపాల చిక్కునట చూపరమ్మా ॥వలచి వచ్చితి॥

పచ్చపైడిదట్టి వాడు పక్షివాహనపు వాడు
ఇచ్చినాడు నాకుంగరము ఇదివో అమ్మా
చెచ్చెర కోనేటివాడు శ్రీవేంకటేశ్వరుడు
వచ్చినన్ను కూడినాడు వాడు ఓయమ్మా ॥వలచి వచ్చితి॥

ఒక సాయం సంధ్యా సమయంలో యమునా పులినతలముల నుండి వాయుతరంగములు ఒక మధురాతిమధురమగు మురళీ నాదమును మోసుకొని వచ్చినవి. వ్రేపల్లె లోని వనితల ఉల్లములు తబ్బిబ్బయినవి. ఉన్నవారున్నట్లు ఆ నాదపు తీపి తీగల నసరాగా యమునా పులిన తలములు చేరి కృష్ణునికి తమ సర్వస్వమర్పించిరి. వారి నా తీపిడోలికల నోలలాడించిన పరమాత్మ అకస్మాత్తుగా అంతర్థానమైనాడు. అపుడు గోపికలు ఆ నల్లనయ్యను వెదకుచూ ఆ యమునాతీర గహనాటవులలో తిరుగాడినారు.

ఇచట తద్వ్యతిరిక్తముగా వేంకటాద్రి గోపిక ఆ పరమాత్మను వెదుకుటకు గొల్లవాడల వీధులను చేరినది.

నేనాతనినికై వలచి వచ్చితిని. ఆతడీ గొల్లవాడలోనే యుండునని వినికిడి.

1. ఆతడెవరు? గుర్తులు చెబుతున్నది.

   అందమైన పద్మముల వంటి (చెన్ను తమ్మి = చెందమ్మి) కన్నులవాడు. పోతనగారు పద్మనయనమ్ముల వాడు అన్నారు. చేతిలో పిల్లంగ్రోవి ఉండేవాడు. ఇక్కడికే వచ్చినాడట చూచినారా అమ్మలారా? పశువుల మందలు కాస్తాడు. చెవులకు మకరాంకాలు (మొసలి ఆకారం గల కుండలాలు) ఉంటాయి. ఎందుకు దాస్తున్నారు? ఎక్కడున్నాడో చెప్పరా?

2. నెమలి పింఛము వాడు, నీలమేఘ శ్యాముడు, చాలా అందగాడు (రమణుడు). వానికి మొక్కుతాను రమ్మనరే?. రెండుచేతులవాడు (జమళి చేతుల వాడు). శంఖుచక్రాల వాడు. లేదా ఇలా కూడా చెప్పుకోవచ్చు. రెండు చేతులలోనూ శంఖచక్రాలు వాడువాడు. వాడు అనుదానిని క్రియారూపం చేస్తే ఇలాఅర్థం వస్తుంది. ఆతడు మీకే చిక్కి యుంటాడట. చూపించరా?

3. పచ్చని బంగారురంగు పంచె (పైడిదట్టి) కట్టుకుంటాడు. పక్షివాహనం ఎక్కుతాడు. నేను చెప్పేది అబద్ధం కాదు. నాకు ఉంగరం ఇచ్చాడు. ఇదిగో చూడండి. ఆ కోనేటి పక్కనే ఉంటాడు.

   ఆవేంకటేశ్వరుడు వచ్చి నన్ను కూడినాడు. కథ సుఖాంతమైంది.

   ఇది సరిగ్గా పోతనగారి (నల్లని వాడు పద్మ నయనంబుల వాడు) గోపికాగీతలను పోలిన కీర్తన. ఇంచుమించు అవే పదాలూ. భావనలు.

101. వలపులు వలపులు వయాళి

వలపులు వలపులు వయాళి
చలమరి మరుడును సమేళి

నెలత మోమునకు నీ కనుచూపులు
నిలువున ముత్యాల నివాళి
కొలదికి మీరిన గురుకుచములకును
తొలకు నీ మనసు దువాళి ॥వలపులు వలపులు॥

వనిత నిండు జవ్వన గర్వమునకు
ఘనమగు నీ రతి కరాళి
వెనక ముందరల వెలది మేనికిని
పెనగు గోరికొన పిసాళి ॥వలపులు వలపులు॥

పడతి కోరికల భావంబునకును
కడు కడు నీ తమి గయ్యాళి
చిడిముడి వనితలు శ్రీవేంకటపతి
విడువని కూటపు విరాళి ॥వలపులు వలపులు॥

ఈ కీర్తనలో అలమేలు మంగా సహిత వేంకటేశ్వరుల వలపు విహారములు వర్ణించబడుతున్నవి.

ఇవి వలపు విహారములు (వయాళి = విహారము). ఈర్ష్యాళువైన (చలమరి) మదనుడు కూడా కలిసి బయలుదేరినాడు. (సమేళి = కలయుట). వలపు విహారములు ఎక్కడ ఉండునో మదనుడు అచటనే యుండుననడం.

1. ఆమె మోమునకు నీ చూపులు ముత్యాల హారతి నిచ్చుచున్నవి. (నివాళి = హారతి). నీ చూపులు ఆమె మోము చుట్టూ తిరుగుచున్నవనడం.

కొలతకు అందని (కొలదికి మీరిన) ఆమె కుచములకు చలించిన (తొలకు) నీమనసు దౌడు తీయుచున్నది. (దువాళి = గుఱ్ఱపు పరుగు విశేషము).

2. ఆమె నిండగు జవ్వన గర్వమునకు నీవు చేయు ఉద్ధృతమైన రతివిన్యాసము సరిపడియున్నది. (కరాళి = ఉగ్రము)

ఆమె తనువు ముందు వెనుకల తళతళలు పెనగు కోరికలు పుట్టించుచున్నవి. (పిసాళి = తళతళ).

3. పడతి కోరికలు ఆమె హావభావముల లో వ్యక్తమగుచుండగా నీ వలపు నిన్ను నిలువనిచ్చుట లేదు. (గయాళి = ధిక్కరించునది)

వనితలందరూ – ఓ వేంకటనాథా! నీ కలయికలు విడువలేక విరహము పాలగుచున్నారు. (విరాళి = విరహము).

కీర్తనలో పెద్ద విశేషములు లేవు కాని, ళికారాంతమగు సొగసైన పదములు అంత్యానుప్రాసగా ప్రయోగించినాడు.

102. వాడల వాడల వెంట వసంతము

వాడల వాడల వెంట వసంతము
జాడతో జల్లేరు నీపై జాజర జాజర జాజ

కలికి నవ్వులె నీకు కప్పుర వసంతము
వలచూపు కలువల వసంతము
కులికి మాట్లాడినదె కుంకుమ వసంతము
చలమున చల్లె నీపై జాజర జాజర జాజ ॥వాడల వాడల॥

కామిని జంకెన నీకు కస్తూరి వసంతము
వాముల మోహపు నీటి వసంతము
బూమెల సరసముల పుప్పొడి వసంతము
సామజ గురుడ నీపై జాజర జాజర జాజ ॥వాడల వాడల॥

అంగన అధరమిచ్చె అమృత వసంతము
సంగడి శ్రీవేంకటేశ సతి గూడితి
ముంగిటి రతిచెమట ముత్తేల వసంతము
సంగతాయె నిద్దరికి జాజర జాజర జాజ ॥వాడల వాడల॥

వసంతోత్సవము వర్ణిస్తున్నాడు అన్నమయ్య ఈ కీర్తనలో. ఇది ఈనాటి హెూలీ వంటిది. కస్తూరీ,కర్పూరం లాంటి సుగంధ ద్రవ్యాలూ, పుప్పొడి కుంకుమ లాంటివీ పొడిపొడిగా గానీ, నీటిలో కలిపి కానీ ఒకరిపై ఒకరు జల్లుకోవడమే వసంతమాడడమనీ, జాజర జల్లడమనీ అంటారు.

వాడవాడలా వసంతము జల్లుకుంటున్నారు. అందరూ గుర్తుపట్టి (జాడతో) నీపై వసంతము జల్లుతున్నారు

జాజర జాజర జాజ: ఇది పాటలో ఊతపదం. ఈ ఊతపదం ఉన్న పాటలను జాజర పాటలు అంటారు. కొంతమంది శ్రీనాథుడు వర్ణించిన జర్జరీ

గీతములే జాజర పాటలని చెబుతున్నారు. నిజానికి జాజర శబ్దానికి కొంచెం నెగెటివ్ అర్థం ఉంది. దీనికి వంచన అని అర్థం. బహుశా అవతలి వారికి తెలియకుండా దొంగచాటుగా వారిమీద వసంతం జల్లడం వల్ల యిది వంచనతో కూడిన ఆటగా జాజర జల్లడం అని వాడుక వచ్చి యుండవచ్చు.

1. స్వామీ ! నీకు అలమేలుమంగ హాస హావభావ విలాసములే జాజరలు.

   ఆమె మనోజ్ఞమైన నవ్వులు (కలికి నవ్వులు) నీకు కర్పూర వసంతము. అనగా కర్పూరపు పొడి జల్లడముతో సమానము. ఆమె

   నేర్పు చూపులు లేదా ఆనుకూల్యమైన చూపులు (వలను = నేర్పు, అనుకూలము. వలను + చూపు = వలచూపు. వృత్తిలో నుకారం లోపిస్తుందని సూత్రం) నీకు కలువల వసంతము.

   ఆమె కులుకు మాటలే నీకు కుంకుమ వసంతము.

   అయినా అందరూ నీపై పంతముతో జాజరలు చల్లుచున్నారు.

2. అలమేలుమంగ సరసమైన బెదిరింపే (జంకెన = బెదరింపు) నీకు కస్తూరి వసంతము.

   ఆమె బంధుత్వమే (వాము) నీకు మోహముతో చల్లే నీటి వసంతము.

   కపటపు సరసములే (బూమెల సరసములు) పుప్పొడి వసంతము.

   ఏనుగువంటి ఠీవికలవాడా (సామజగురుడా – దీనికి నేను చెప్పిన అర్థము సరియైనదేనని తలచుచున్నాను. మరేదైన విశేషమున్నచో పెద్దలు వివరింపగలరు) నీపై జాజర చల్లుచున్నారు.

3. అలమేలుమంగ అధరము నీకు అమృత వసంతము నిచ్చినది.

   నీవామెను స్నేహముతో జతగూడితివి (సంగడి = జంట, జత, స్నేహము) మీకు రతి చెమటలే ముత్యాల వసంతము. మీ యిరువురికీ సాంగత్యము కలిసినది (సంగతాయ నిద్దరికి).

103. వాడల వాడల వెంట వాడెవో వాడేవో

వాడల వాడల వెంట వాడెవో వాడేవో
నీడ నుండి చీరలమ్మే నేత బేహారి

పంచభూతము లనెడి పలువన్నె నూలు
చంచలపు గంజివోసి తోడ చరిజేసి
కొంచెపు కండెల నూలుగుణముల నేసి
మంచిమంచి చీరలమ్మే మారుబేహారి ॥వాడల వాడల॥

మటమాయముల తన మగువ పసిడినీరు
చిటిపొటి యలకల జిలికించగా
కుటిలంపు జేతలు కుచ్చులుగా కట్టి
పటవాళి చీరలమ్మే బలుబేహారి ॥వాడల వాడల॥

మచ్చిక కర్మమనేటి జీవుల పెద్దమైలసంత లోన
వెచ్చపు కర్మధనము విలువజేసి
పచ్చడాలుగా కుట్టి బలువేంకటపతి
ఇచ్చ కొలదుల నమ్మే యింటిబేహారి ॥వాడల వాడల॥

ఇది ఒక చిత్రమైన కీర్తన. స్వామిని బట్టల వ్యాపారిగా చేసి ఆయన చేసే వ్యాపారం వర్ణిస్తున్నాడు అన్నమయ్య.

వాడవాడలా ఆ నేత బట్టలవ్యాపారి ఏచెట్టు నీడలోనో దుకాణం తెరుస్తాడు. ఆ వ్యాపారానికి బజారులో చాలా గిరాకీ ఉంది. ఎక్కడ చూచినా అతడే (వాడెపో వాడేపో)

(బేహారి = వర్తకుడు = వ్యాపారి)

1. పంచభూతాలు అనే రంగురంగుల (పలు వన్నెల) నూలు చంచలత్వము

అనే గంజితో చరిచేస్తాడు. నూలు దారాలు పొడవుగా పరిచి వేడిగంజి వాటిపై పోసి ఒక పెద్ద బ్రష్షు లాంటిది అటొకరూ ఇటొకరూ పట్టుకుని ఆ నూలు దారాలపై లాగుతూ ఆ గంజిని నూలుకు పట్టిస్తారు. ఆ ప్రక్రియను చరిచేయడం అంటారు. ఆ దారాలను కర్రముక్కలకు చుడతారు. వాటిని కండెలు అంటారు. ఆ కండెల నూలును మగ్గాలకు నిలువుగానూ అడ్డంగానూ నెరపి (వీటినే పడుగు పేక అని వ్యవహరిస్తారు) వాటితో మగ్గం మీద బట్టగా నేస్తారు.

పంచభూతములు నూలు. చంచలత్వము అనే గంజితో చరిచేసి కండెలు చుట్టి ఆ నూలుగుణములతో మంచిమంచి చీరలు నేసి అమ్ముతాడట ఈ బేహారి. ఇక్కడ గుణములు అన్నపుడు శ్లేష. గుణములకు త్రాళ్ళు అని ఒక అర్థం. నూలుతాళ్ళతో నేయడం అని. గుణములు అంటే స్వభావములు అని మరియొక అర్థం. చంచలత్వం ఒంటపట్టించుకున్న పంచభూతాలకు కొన్ని మంచి కొన్ని చెడు గుణములు కలిపి నేసిన చీరలే (చీరలు = గుడ్డలు) ఈ దేహాలు. అదీ సంగతి.

ఇక్కడ ఒక చమత్కారం ఉంది. ఇలా తయారు చేసిన చీరలూ గుడ్డలూ ఇతడు మారుబేరానికి అమ్ముతాడట. అందుకే ఇతనిని మారుబేహారి అన్నాడు. మారుబేరం అంటే రెటైల్ మార్కెట్ అని అర్థం. (Wholesale price at retail outlet!) భగవంతుడైనా అన్ని మార్కెటింగ్ విధానాలూ అవలంబించ వలసినదే.

ఇంకొక సారస్యం ఉంది ఈ మారుబేహారి అనడంలో. ఈ చీరలూ, గుడ్డలూ ఇతడు మారునికి (మన్మధునికి) అమ్మేస్తాడన్నమాట. ఇక ఈ గుడ్డలతో (శరీరాలతో) అతడు చేసే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. ఇది ధ్వని

2. తరువాత ఆచీరల మీద ఆ వ్యాపారి భార్య కొంచెం విసుగుతో మాయ పసిడి నీరు పోస్తుంది. ఆనీట ముంచి ఆరవేసిన తరువాత పాపపు పనులు

(కుటిలంపు చేతలు) అనే కుచ్చులు ఆ చీరలకు కాడతారు. నేత పూర్తి అయిన తరువాత అంచుల వెంబడి మిగిలిన నిలువు దారాలు కుచ్చుల లాగా చక్కగా ముడులు వేస్తారు. చీరమడత పెట్టి ఆ మడతలలో సుగంధ భరితమైన పుప్పొడి (పౌడరు) చల్లుతారు. వీటిని పటవాసకములు అంటారు. అలా తయారైన చీరలనే పటవాళీ చీరలు అంటున్నాడు అన్నమయ్య. అమ్మకానికి చీరలు తయారయ్యాయి.

పంచభూతాల గుడ్డ. చంచలత్వమూ గుణములూ కలిపి నేసినాడు. పాపపు పనుల కుచ్చులమర్చినాడు. పసిడి మాయ నీట తడిపి ఆరవేసినాడు. మడతలలో సుగంధం జల్లినాడు. చీరలు తయారైనవి.

ఇంకొక మాట చెప్పాలి. ఆ వ్యాపారి యిల్లాలు (అమ్మవారు) మటమాయముల మగువ. జీవికి అసలు దైవస్వరూపము కనబడకుండా ఆమె మాయ కల్పిస్తుంది. అపుడు జీవికి పరమాత్మ బదులు రంగురంగుల సృష్టి కనిపిస్తుంది. జీవుడు దానిలో పడి కొట్టుకుంటాడు, ఈ మాయ నుండి బయట పడాలంటే అమ్మవారిని పట్టుకోవాలి. అపుడు ఆమె మాయను తొలగిస్తుంది. అపుడు జీవికి సృష్టి బదులు పరమాత్మ స్వరూపం కనబడుతుంది. ఇది వేదాంతులు చెప్పే మాట. ఇక్కడ అది అన్వయం చేసినాడు అన్నమయ్య.

3. ఎంతో అందమైన జీవుల పాపాల సంత (మైల సంత) జరుగుతుందట. ఆ పాపాల సంతలో జీవులు తమతమ పూర్వ కర్మ ఫలములు అనే ధనం వెచ్చించి తమకు సరిపడు సైజు పచ్చడములుగా ఆ వ్యాపారి వద్ద చీరలు (గుడ్డలు) కొని దుస్తులుగా కుట్టించుకుని పట్టుకవెడతారట.

ఇక్కడ మరియొక విషయం. పైన చెప్పిన సంతలో కొనుక్కోలేని వాళ్ళ కోసం ఆ బేహారి యింటికి పట్టుకొని వచ్చి మరీ అమ్ముతాడట. అందుకే ఈ చరణాంతంలో అతనిని యింటిబేహారి అన్నాడు.

104. విన్నపాలు వినవలె వింతవింతలు

విన్నపాలు వినవలె వింతవింతలు
పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా

తెల్లవారె జామెక్కె దేవతలూ మునులు
అల్లనల్ల నంత నింత నదిగో వారె
చల్లని తమ్మిరేకుల సారసపు కన్నులు
మెల్లమెల్లనే విచ్చి మేలుకొనవేలయ్యా ॥విన్నపాలు॥

గరుడ కిన్నర యక్ష కామినులు గములై
విరహపు గీతముల వింతాలాపాల
పరిపరి విధముల పాడేరు నిన్నదివో
సిరిమొగము దెరచి చిత్తగించవేమయ్యా ॥విన్నపాలు॥

పొంకపు శేషాదులు తుంబురు నారదాదులు
పంకజభవాదులు నీ పాదాలూ చేరీ
అంకెలనున్నారు లేచి అలమేలుమంగను
వేంకటేశుడా రెప్పలు విచ్చిచూచి లేవయ్యా ॥విన్నపాలు॥

ఇది స్వామివారి మేలుకొలుపు కీర్తన. అన్నమయ్య తన మధురగానంతో స్వామికి సుప్రభాతాన మేలుకొలుపు విన్నపం చేస్తున్నాడు.

వింత వింతలైన విన్నపములు వినవలసిన సమయమైనది. స్వామీ మేలుకొనుము. ఆదిశేష తల్పమునకు కట్టిన దోమతెర పైకెత్తవయ్యా. లేదా శేషుడను దోమతెరను పైకెత్తవయ్యా.

ఈ దోమలు, దోమతెరలు ఎంత పురాతనమైనవో చూడండి. ఆకాలానికే దోమతెరలు వాడుకలో ఉన్నవన్నమాట.

1. తెల్లవారుచున్నది. జామెక్కినది. జాము అంటే మూడుగంటల సమయమునకు కొలత. అర్ధరాత్రి దాటి మూడుగంటలు గడచినది (తెల్లవారు జామున మూడుగంట లైనది). అదిగో దేవతలూ మునులూ నీ దర్శనార్థమై వచ్చియున్నారు.

అల్లనల్ల నంత నింత అదిగో వారే: చూచినంత మేర (అల్లనల్ల) సర్వమూ (అంతానింతా) నిండియున్నరనాడం. నీ పద్మముల వంటి కనులు (సారసపు కన్నులు) రేకులు విచ్చినట్లు మెల్లమెల్లగా రెప్పలు విచ్చి లేవవయ్యా.

కనులు తామరలు, రెప్పలు తామరరేకులు. చక్కని పోలిక తెచ్చాడు.

2. నిను గూర్చి యక్ష కిన్నర గరుడ (ఇవి దేవతలలో తెగలు. వీరు జంత్రగాత్ర విద్యా నిపుణులు) కాంతామణులు (కామినులు) నీమీది విరహగీతాలు వింతవింత రాగాలాపనలతో (వింతాలాపాల) రకరకములుగా (పరిపరి విధముల) గానంచేస్తున్నారు. నీ కన్నులు తెరచి చిత్తగించు స్వామీ.

సిరిమొగము తెరిచి: ఇక్కడ సిరి శ్రేష్ఠవాచకం. మొగము తెరచుట వింత ప్రయోగం. ఈ సందర్భంలో కనులు తెరచి అనే అర్థం. ఈ ప్రయోగం నేనిదివరకెప్పుడు వినలేదు.

3. బలవంతులైన శేషుడూ మొదలైన వారూ, తుంబురుడు, నారదుడూ మొదలైన వారూ, బ్రహ్మ (పంకజ భవుడు) మొదలైన వారూ నీ పాదముల చెంత చేరి నీకు విధేయులై యున్నారు (అంకెల నున్నారు). అలమేలుమంగ ఇక్కడే యున్నది. రెప్పలు తెరిచి ఆమెను చూచి మేలుకోవయ్యా.

దీనిలో ఒక గడుసు పోకడ ఉన్నది. మనవి చేస్తాను.

మొదటి చరణమున దేవతలు మునులూ వచ్చి వేచినారనినాడు. స్వామి కనులు తెరువలేదు.

రెండవచరణమున దేవతాస్త్రీలు పాడుతున్నారనీ అందునా నీమీద

విరహగీతికలు పాడుతున్నారనీ అన్నా స్వామి కన్నులు తెరవలేదు.

మూడవ చరణమున శేషుడు,నారద తుంబురులు,ఆ పైన కొడుకైన బ్రహ్మ పక్కనే ఉన్నారన్నా లాభం లేకపోయింది.

ఇక లాభం లేదని బ్రహ్మాస్త్రం వేశాడు. పక్కనే "అలమేలుమంగ" ఉంది రెప్పలు విచ్చి చూచి లేవయ్యా అన్నాడు. అంతే. స్వామి లేచినాడు. దానికి తార్కాణ మరియొక పదం అక్కరలేకుండా మేలుకొలుపు కీర్తన పూర్తయింది.

105. విశ్వ ప్రకాశునకు వెలియేడ లోనేడ

విశ్వ ప్రకాశునకు వెలియేడ లోనేడ
శాశ్వతున కూహింప జన్మమిక నేడ

సర్వ పరిపూర్ణునకు సంచారమికనేడ
నిర్వాణ మూర్తికిని నిలయమిక నేడ
ఉర్వీధరునకును కాలూద నొక చోటేడ
పార్వతీ స్తుత్యునకు భావమిక నేడ ॥విశ్వప్రకాశునకు॥

నానా ప్రభావునకు నడుమేల మొదలేడ
ఆనన సహస్రునకు నవ్వులివనేడ
మౌని హృదయస్థునకు మాటేడ పలుకేడ
జ్ఞాన పరిపూర్ణునకు గాన వినవేడ ॥విశ్వప్రకాశునకు॥

పరమయోగీంద్రునకు పరులేడ తానేడ
దురిత దూరునకు సంస్తుతి నిందలేడ
తిరువేంకటేశునకు దివ్య విగ్రహమేడ
హరికి నారాయణున కౌగాములేడ ॥విశ్వప్రకాశునకు॥

స్వామి విశ్వమును ప్రకాశింప జేయువాడు. లోవెలుగూ తానే. బయటి వెలుగూ తానే. ఇక ఆ పరమాత్మకు వెలుపల బయట అను తేడా ఏముంది. పరమాత్మ శాశ్వతుడు. ఆయనకు జన్మ పునర్జన్మల జంజాటము లేదు.

1. పరమాత్మ సర్వ సంపూర్ణుడు. అంతటా నిండిన వాడు. తనకు వేరే సంచరిచు తావులేమిటి?

   సర్వబంధనములకు అతీతుడు (నిర్వాణ రూపుడు) ఆతనికి ఉండుటకు ఒక నెలవెందుకు?

భూమిని ధరించినవానికి కాలూనుటకొక చోటేమిటి?

జగన్మాత పార్వతీదేవి నుతించినవాడికి ఒకభావమని ఎలా చెప్పడం (భావాతీతుడనడం)

2. సర్వశక్తిమంతునికి (నానా ప్రభావుడు) నడిమి, మొదలు ఏమిటి?

వేయి ముఖములున్న వానికి ఆవల ఈవల యెక్కడుంటుంది?

మునుల (మౌనవ్రతము దాల్చిన వారు) హృదయములలో ఉన్నవాడికి మాటలాడు లంపటములేమిటికి?

పరిపూర్ణ జ్ఞానికి ఇక వినవలసినదీ చూడవలసినదీ ఏముంటుంది?

3. పరమ యోగీంద్రుడైన వానికి స్వపర బేధములు ఉండవు కదా.

పాపరహితుడైన వాడు స్తుతి నిందలకు అతీతుడు కదా.

ఆ శ్రీవేంకటేశ్వరుడు ఆ దివ్యవిగ్రహములోనే ఉన్నాడనలేము కదా (హరి సర్వ వ్యాపకుడనడం)

ఆ హరినారాయణునకు ద్వంద్వములు ఉండవు. (అగుట, కాకుండుట = ఔగాములు)

ఇంతకూ తేలినదేమి.

ఆనన సహస్రుడైన నారాయణుడు (సహస్ర శీర్షాః పురుషాః) సంపూర్ణుడు. ఆయనకు మనకున్న పరిమితులు లేవు. అట్టి పరమాత్మ శ్రీవేంకటాద్రిపై వెలసియున్నాడు.

ఈ కీర్తనలో విష్ణుతత్త్వము సులభముగా గ్రహించుటకు వీలుగా ప్రతిపాదించినాడు అన్నమాచార్యుడు.

106. వీడు కదే శేషుడు శ్రీవేంకటాద్రి శేషుడు

వీడు కదే శేషుడు శ్రీవేంకటాద్రి శేషుడు
వేడుక గరుడనితో పెన్నుద్దైన శేషుడు

వేయి పడిగెల తోడ వెలసిన శేషుడు
చాయ మేని తళుకు వజ్రాల శేషుడు
మాయని శిరసులపై మాణికాల శేషుడు
యేయెడ హరికి నీడై యేగేటి శేషుడు ॥వీడు॥

పట్టపు వాహనమైన బంగారు శేషుడు
చుట్టు చుట్టుకొనిన మించుల శేషుడు
నట్టుకొన్న రెండువేల నాలుకల శేషుడు
నెట్టన హరి పొగడ నేరుపరి శేషుడు ॥వీడు॥

కదిసి పనులకెల్ల గాచుకున్న శేషుడు
మొదల దేవతలెల్లా మొక్కే శేషుడు
అదె శ్రీవేంకటపతి కలమేలుమంగకూనూ
వదరక యేపొద్దూ పానుపైన శేషుడు ॥వీడు॥

అన్నమయ్య స్వామివారినీ అమ్మవారినీ మాత్రమే కాకుండా వారి వాహనాలమీద కూడా కీర్తనలు చేశాడు.

ఈ కీర్తనలో స్వామివారి వాహనమైన శేషవాహనమును వర్ణిస్తున్నాడు. ఈ శేషవాహనం మీద స్వామివారు మాడవీథులలో విహరిస్తారు.

సాధారణంగా స్వామి గరుడవాహనుడు అని అందరూ అనుకుంటారు. అందుకే మొదటే చెబుతున్నాడు. ఈ వేంకటాద్రి శేషుడు మామూలు వాడు కాడు. ఆ గరుడినితో బలములో పెద్ద ఉజ్జీ యైనవాడు (పెన్నుద్ది = పెను ఉద్ది. ఉద్ది అంటే ఉజ్జీ, సాటి, పోలిక అని అర్థం)

1. ఈ శేషుడు వేయి పడగలు (పడిగెలు) కలిగినవాడు. మేనిచాయ వజ్రములవలె తళుకులీనుతుంది.

ఇతని మాయని శిరసులపై మాణిక్యములు ఉంటవి.

మాయని శిరసులు: ఇది చిత్రమైన పలుకుబడి. జుట్టు పెరిగి క్షురకర్మ చేయించుకొన వలసి వస్తే తలమాసినది అని వాడకం. భార్య గాని, భర్తగాని గతిస్తే వారిని తలమాసిన వారనడం కూడా ఉన్నదే. ఇక్కడ దానికి వ్యతిరేకంగా మాయని శిరసులు అంటున్నాడు శేషుని. ఆ రెండవస్థలూ లేనివాడు అనడంకాదు సుమా. ఆదిశేషుని రంగు తెల్లని తళతళల తెలుపు. అది మాయనిరంగు (మాపు లేనిది). మాయని తెల్లని రంగు గలిగిన తలలు కలవాడని చమత్కారం.

ఈయన ఎక్కడికైనా సరే (యేయెడ) హరికి నీడయై వెడతాడు. నీడగా యుండు అంటే వెన్నంటి ఉండుట అని అర్థం. ఇది శేషుని విషయంలో మాత్రం సార్థకం. తన పడగలతో ఎల్లప్పుడూ స్వామికి నీడ కల్పిస్తాడు.

ఇలా తెలుగు పలుకుబడులను సార్థకంగానో వ్యతిరేకంగానో వాడడం ఒక కవిత్వ కళ.

2. ఈ శేషుడు పట్టపువాహనము. పట్టపు వాహనం కనుక కొన్ని అలంకరణల వంటి కొన్ని సదుపాయాలూ (మన అధికారులకు ఎర్రబుగ్గ, సైరను వలె) , సాగే మార్గంలో కొన్ని రాయితీలు ఉంటాయి. ఆయనకు బంగారు తొడుగు ఉంటుంది (బంగారు శేషుడు). చుట్టలు చుట్టుకొని కూర్చునే వెసులుబాటు కలవాడు (చుట్ట చుట్టుకొనిన మించుల శేషుడు – ఇది పార్కింగ్ ప్రివిలేజ్). మించుల శేషుడు అనడంలో ఒక అందం ఉంది. మించు అనగా మెరుపు. తళతళ లాడుతూ ఉంటాడు. మించు అన్నది పరిమాణ వాచకం. చాలా పెద్ద ఆకారం అని చెప్పడం. మన రాజకీయ నాయకులకే పెద్ద మెరిసిపోయే కార్లుండగా అఖిలాండకోటి

బ్రహ్మాండనాయకుని వాహనం బంగారు తొడుగుల మిలమిలలతో అతిపెద్దగా ఉండి ఒకచోట ఉండాలంటే చుట్ట చుట్టుకుంటే కాని పట్టనంత పెద్దదిగా ఉండడంలో వింత ఏముంది?

ఈ శేషునికి రెండువేల నాలుకలున్నవి (నట్టుకొను = నెలకొను). ఎప్పుడూ హరిని స్తుతిస్తూ ఉంటాడు. రెండునాల్కల ధోరణి కాదని చెప్పడానికి రెండువేల నాలుకలున్నవి అన్నాడు.

3. స్వామికి దగ్గరగా (కదిసి) ఏ పని చెబుతారో అని (పనులకెల్ల) కాచుకుని కూర్చుంటాడట శేషుడు. మొదట స్వామి వద్దకు పోయే దేవతలంతా ఈయనకు మొక్కుతారట. ఇంకొక ముఖ్యమైన పని కూడా యీ శేషుడు చేస్తాడు. ఎల్లపుడూ (ఏపొద్దూ) కిమ్మనకుండా (వదరక) స్వామికీ అలమేల్మంగకూ పానుపుగా అమరియుంటాడు. 'వదలక' అని మరియొక పాఠం. వదిలిపెట్టకుండా అని చెప్పుకోవాలి.

107. వెగ్గలమింతా వృధా వృధా

వెగ్గలమింతా వృధా వృధా
తగ్గి పరులతో దైన్యములేలా

పెంచగ పెంచగ పెరిగీనాశలు
తుంచగ తుంచగ తొలగునవి
కంచము కూడును కట్టిన కోకయు
వంచన మేనికి వలసినదింతే ॥వెగ్గలమింతా॥

తడవగ తడవగ తగిలీ బంధము
విడువగ విడువగ వీడునవి
గుడిశ లోన నొక కుక్కిమంచమున
నొడలు సగమునకు వుండెడిదింతే ॥వెగ్గలమింతా॥

మరవగ మరవగ మాటలే యింతా
మురహరు దలిచితే మోక్షము
నిరతి శ్రీవేంకట నిలయుడే కాయపు
గరిమల నిలిచిన కాణాచింతే ॥వెగ్గలమింతా॥

వెగ్గలము = అధికము.

మానవుడు తనకు కావలసిన దానికంటే ఎక్కువ వస్తు, ధన సంచయం చేసి నిలవ జేసుకుంటాడు. భావి తరాలకు కూడా అవసరానికి మించి దాచడం కూడ మానవ నైజం. ఈ అవసరానికి మించినదే “వెగ్గలము”. ఇది వృధా వృధా అని అన్నమయ్య ఒకటికి రెండు మార్లు నొక్కి చెబుతున్నాడు.

ఇలా సంపాదించాలంటే విలువలు వదులుకోవాలి. కాని వారి ముందు తలవంచాలి. అలా పరుల వద్ద దైన్యముతో నిలవడం ఎందుకు?

1. ఈ ఆశలు తీరేవి కావు. వాటిని తీర్చుకునేందుకు ప్రయత్నిస్తే పెరుగుతూనే ఉంటాయి. కాబట్టి వాటిని పెంచకుండా తుంచే ప్రయత్నము చెయ్యాలి.అలా ప్రయత్నించి వాటిని నిరోధించాలి.

   నిజానికి మానవుడికి ఏమి కావాలి? కంచంలో కూడు, కట్టుకోవడానికి కోక (గుడ్డ), మేను వాల్చడానికి సదుపాయం ఇవే కావలసినవి. ఇక్కడ వంచన అను పదము మోసం అనే అర్థంలో కాక వంచుట అనే అర్థంలో వాడినాడు.

2. ఈ బాంధవ్యాలూ అంతే పెంచుకుంటే పెరుగుతూనే ఉంటాయి (తడవగ తడవగ తగిలీ బంధము). వాటిని కూడా ప్రయత్న పూర్వకంగా వదిలించుకోవాలి (విడువగ విడువగ వీడునవి) వయసు ఉడిగిపోయిన చివరి దశలో ఊహించుకో– ఒక గుడిశలో కుక్కిమంచంలో పడుకుంటే ఈశరీరం దానిలో సగానికే వస్తుంది. ఇంతమాత్రం శరీరాన్ని పోషించడానికి ఇన్ని లంపటాలా? ఇంత యావా?

3. ఈ ధనం దస్కం విడిచిపెట్టి చూడు. అవి ఒట్టి మాటలవంటివనీ వాటికి విలువలేదనీ నీకే అర్థం అవుతుంది (మరవగ మరవగ మాటలే యింతా). కనుక వాటిని విడిచిపెట్టి ఆ మురారిని వేడుకో. ఈ జనన మరణ వలయం నుండి ముక్తి పొందు (మురహరు దలిచితే మోక్షము)

   చూడు – మనమందరము చేరవలిసిన వాసస్థానమై (కాణాచి = నిలయము) మనను రక్షింపవలెనను ఆసక్తితో (నిరతిన్) నిలువెత్తు విగ్రహముగా (కాయపు గరిమన్) ఆ వేకటాద్రి పై స్వామి నిలిచియున్నాడు.

108. వెట్టి వలపు చల్లకూ విష్ణుమూరితి నాతో

వెట్టి వలపు చల్లకూ విష్ణుమూరితి నాతో
వెట్ట దీర మాటాడు విష్ణుమూరితి

వినయము సేసేవు విష్ణుమూరితి
వెనకటి వాడెవెకా విష్ణుమూరితి
వినవయ్యామామాట విష్ణుమూరితి మమ్ము
వెనుగొని పట్టకుమీ విష్ణుమూరితి ॥వెట్టి వలపు॥

వెరపు గలవాడవు విష్ణుమూరితి నేడు
వెరగైతి నిన్నుజూచి విష్ణుమూరితి
విరివాయె నీమాటలు విష్ణుమూరితి నాకు
విరులిచ్చే వప్పటికి విష్ణుమూరితి ॥వెట్టి వలపు॥

వెలసె నీచేతలెల్ల విష్ణుమూరితి మా
వెలుపల లోన నీవె విష్ణుమూరితి
వెలలేని శ్రీవేంకట విష్ణుమూరితి కూడి
విలసిల్లితివి నాతో విష్ణుమూరితి ॥వెట్టి వలపు॥

ఈ వేంకటాద్రి కృష్ణుడు వనితామానస చోరుడు. వేనవేల గోపికలతో ప్రణయం సాగించిన దిట్ట. మరులు గొనిన వనితను విడిచి పరకాంతల వెనుక తిరిగి మరల విచ్చేసిన స్వామిని ఆ గోపిక నిలదీస్తున్నదీ కీర్తనలో. కొంచెం కోపం, కొంచెం నిష్ఠూరం, మనసు నిలుపుకోలేని మోహం అన్నీ తొణికిసలాడతాయి ఈ కీర్తనలో. పదండి చూద్దాం.

ఇంకొక విషయం. ఈ కీర్తనకు కోలాటం పాటగా వ్రాసినాడు అన్నమయ్య. పల్లవిలో ద్విత్వ టకార ప్రాస కోలాటం కోలల తాకిడి లాగా ధ్వనిస్తుంది.

ప్రతి పాదం చివర విష్ణుమూరితి అని ముక్తాయింపు. స్వామిని పేరుపెట్టి పిలవడం గోపిక విముఖత తెలియజేస్తుంది.

వెట్టి వలపు – ఆహా ఎంత చక్కని పదం. వెట్టి అంటే ప్రయోజనంలేనిది, వృధాయైనది అని అర్థం. వెట్టిచాకిరీ అంటాం. వృధాశ్రమ అన్నమాట. దానికి ఫలితం ఉండదు. రాక రాక వచ్చి ఇచ్చకపు వలపు మాటలు చెప్పి గోపికను బురిడీ కొట్టించాలనుకున్నాడు స్వామి. ఆమె అంటున్నది.

బూటకపు వృధా వలపు నావద్ద చూపవద్దు (వెట్టి వలపు చల్లకు). నాకు నీపై చాల కోపంగా ఉన్నది. ఈ వేడి తగ్గించేలా మాటాడు (వెట్ట = వేడి, తాపము). అంటే సరిగ్గా మాటాడమని హెచ్చరిక అన్నమాట.

1. ఆహా! వినయాలు చూపిస్తున్నావు. ఇదివరకు ఇవి నేను చూచినవే కదా (వెనకటి వాడవే కా – ఇంతకు ముందు కూడా ఇలానే చేశావు కదా అనడం). మామాట విను. ఆయనను నీవు అని సంబోధిస్తున్నది. తనను తాను మేము అంటున్నది. స్వాతిశయమన్నమాట. వెనుక నుండి (వెనుగొని) పట్టడం మానుకో. వెనక పట్టు అంటే దొంగపట్టు. ముందు నుంచి సాధించలేనివాడు చేసే కపటాన్ని వెనకపట్టు అంటారు. నీ కపటం చెల్లదని నిష్కర్ష అన్నమాట.

2. వెరపు/వెరగు అంటే భయము, ఆశ్చర్యము. ఏమిటలా ఆశ్చర్య పోతున్నావు. భయం నటిస్తున్నావు. (వెరగు గల వాడవు). నిన్ను చూస్తే నాకు భయం వేస్తోంది ఎక్కడ మెత్తబడి పోతానోనని (వెరగాయె నిన్నుచూడ). చాలా కబుర్లు చెప్పగలవు (విరివాయె నీ మాటలు. విరివి = అధికము). ఇప్పటికెన్ని పూలు పెట్టావో (విరులిచ్చేవు). పూలు పెట్టవద్దని పెట్టినా చెల్లదని బెదిరింపు.

3. నీవు చేసిన పనులన్నీ వెల్లడయ్యాయి (వెలసే నీ చేతలెల్ల). ఎందుకిలా చేస్తావు? ఇక బింకము ఆగడంలేదు. నన్ను గురించి ఆలోచించావా?

నాకు వెలుపలా లోపలా నీవే. నీతోనే ప్రపంచమనడం. ఇక ఆమె మనసు ఓపలేక కరిగిపోయింది. స్వామి దరి చేరినది. నీవు నాతో కూడి విలసిల్లితివి అన్నది చివరికి.

ఇదో చిత్రం. ఆమె స్వామిని కూడి ప్రకాశించినదా? ఆమెను కూడి స్వామి ప్రకాశించెనా?. ఇక ఆ ప్రశ్న అప్రస్తుతం!

109. వెనకేదో ముందరేదో వెర్రి నేనూ

వెనకేదో ముందరేదో వెర్రి నేనూ, నా
మనసు మరులు దేర మందేదోకో?!

చేరీ మీదటి జన్మము సిరులకూ నోమెగానీ
యేరూపై పుట్టెదనో యెరుగనేనూ
కోరీ నిద్రించ బరచుకొన నుద్యోగింతుగాని
సారె లేతునో లేవనో జాడ తెలియ నేనూ ॥వెనకేదో ముందరేదో॥

తెల్లవారినప్పుడెల్ల తెలిసితీననే గాని
కల్ల యేదో నిజమేదో కాన నేను
వల్ల జూచి కామినుల వలరించే గానీ
మొల్లమై నామేను ముదిసిన దెరుగ ॥వెనకేదో ముందరేదో॥

పాపాలూ చేసి మరచి బ్రతుకుచున్నాడగాని
వైపుగ చిత్రగుప్తుడు వ్రాయుటెరుగ
యేపున శ్రీవేంకటేశు డెక్కడో వెదకే గానీ
నాపాలీ దైవమని నన్ను గాచుటెరుగ ॥వెనకేదో ముందరేదో॥

నేను ముందేదో వెనకేదో తెలియని వెర్రివాడిని. మోహమున చిక్కుకున్న నా మనసుకు మందేమిటో? (మందు + యేది + ఒకో = మందేదొకో)

మీదటి అన్న పదం భూతకాలాన్ని సూచించడానికీ, భవిష్యత్తును సూచించడానికీ కూడావాడతారు. ఇక్కడ మీదటి అన్నది ఇంతకు ముందు జన్మము మంచి చేసుకొనుట వల్ల (సిరులకున్ + ఓమె) నాకీ మానవ జన్మ కలిగినది. ముందేమి జన్మ కలుగునో నాకు తెలుయదు.

పడుకోవడానికి మెత్తనిపరుపు పరుచుకొని పడుకొనుటకు ప్రయత్నితునేకాని

(ఉద్యోగము = ప్రయత్నము) తిరిగి ఉదయమే లేతునో లేవనో నాకు తెలియదు.

తెల్లవారి వెలుగు రాగానే తెలివివచ్చి చూచుటయే కాని కల్ల యేదో నిజమేదో నేను తెలియలేను.

చూచిన కామినులను వలచుటే కాని (వలరించు ?) పెరిగి (మొల్లమై) నేను ముదుసలి నైతినని ఎరుగలేను.

పాపములు చేసి, అవి మరిచి బ్రతుకుటే కానీ ఒడుపుగా(వైపుగ) చిత్రగుప్తుడు చిట్టా వ్రాయుచున్నాడని తెలియనేరను.

ఎక్కడో ఏదో తరుణోపాయమని వెదకులాటే గానీ నను రక్షించు దేవుడు శ్రీవేంకటేశ్వరుడని యెరుగను.

ఇది భువి పైనున్న ప్రతి "జీవి" యొక్క స్థితి. వేంకటేశుని శరణాగతి సేయుటయే శరణ్యమని ఈ కీర్తన సారాంశము.

110. వేడుకుందామా వెంకటగిరి వెంకటేశ్వరుని

వేడుకుందామా వెంకటగిరి వెంకటేశ్వరుని

ఆమటి మ్రొక్కులవాడే ఆదిదేవుడే వాడు
తోమని పళ్యాలవాడె దురితదూరుడే ॥వేడు॥

వడ్డీకాసుల వాడే వనజనాభుడే పుట్టు
గొడ్రాండ్రకు బిడ్డలిచ్చే గోవిందుడే ॥వేడు॥

ఎలమి కోరిన వరాలిచ్చే దేవుడే వాడు
అలమేల్మంగా శ్రీ వేంకటాద్రి నాథుడే ॥వేడు॥

భక్తులు శ్రీవారి కొండ యెక్కేటపుడు హరినామస్మరణ చేస్తారు. శ్రమ తెలియకుండా పాడుకునే పాటగా ఈ కీర్తన చేశాడు అన్నమయ్య.

వేంకటగిరి వేంకటేశ్వరుని వేడుకుందామా?

1. ఆతడు ఆమటిమొక్కుల వాడు. దీనిని కొందరు ఆపద మొక్కులవాడు అని అర్థం చెప్పారు. 'ఆమ' అనేది మనం ఎవరైనా ప్రశ్నించినపుడు "ఔను" అని చెప్పే సమాధానం – లేదా – వారు చెప్పినదానిని విన్నాననడానికి చేసే అంగీకార వాచకం. ఆమటి మొక్కుల వాడు అంటే మనము చేసే మొక్కులను వినితీర్చే వాడని నా ఊహ. వేరే సముచితమైన అర్థం ఉంటే పెద్దలు సూచింతురు గాక.

   వాడే ఆదిదేవుడు.

   "తోమని పళ్యాలవాడు" : దీని వెనుక ఒక కథ ఉంది. కుమ్మరి కురువనంబి స్వామికి మట్టి మూకుడులో పెరుగు అన్నం నివేదనం చేస్తే స్వామి ఎంతో ఇష్టంగా భుజించేవారట. అందుకే ఇప్పటికీ స్వామివారికి ఎన్ని నివేదనలు చేసినా అవి కులశేఖరపడి (స్వామి వారి ముందు ఆఖరి గడప)

వెలుపలినుండే చేయబడతాయి. ఒక్క 'ఓడు నైవేద్యం' అనే మట్టిమూకుడులో పాలు, మీగడ, మజ్జిగ కలిపిన అన్నపు నైవేద్యం మాత్రం కులశేఖరపడిని దాటి స్వామివారి ముందు ఉంచి నివేదిస్తారు. మరునాడు మళ్ళీ ఒక కొత్త మట్టి మూకుడుతో నివేదనం సిద్ధం చేస్తారు. అందుకే స్వామిని తోమని పళ్యాలవాడు అనడం. తోమిన పళ్ళెంలో నైవేద్యాలు ఆయన స్వీకరించరు.

ఆ పాపాలను దూరంచేసే వాడిని వేడుకొందామా?

2. వాడు వడ్డికాసులవాడు : పెళ్ళికి చేసిన అప్పు తాలూకు వడ్డీకాసులు చెల్లించడానికే స్వామి వారు మననుంచి ముడుపులు స్వీకరిస్తారు. అట్టి వడ్డీకాసులవాడైన వనజనాభుని వేడుకొందాము.

ఆయన పుట్టు గోఁద్రాంద్రకు బిడ్డలు ఇచ్చేవాడు. ఆయనను వేడుకొందామా?

పుట్టుగుడ్డి వలె పుట్టుగొౘ్రాలు పదం వాడినాడు.

3. కోరిన వరాలను సంతోషంగా (ఎలమిన్) ఇచ్చే దేవుడతడు. వాడే అలమేలుమంగ పెనిమిటి యైన వేంకటపతి.

వేడుకుందాం రండి.....

111. వైష్ణవులుగానివారలెవ్వరు లేరు

వైష్ణవులుగానివారలెవ్వరు లేరు
విష్ణుప్రభావమీ విశ్వమంతయు గాన

అంతయు విష్ణు మయంబట మరి దేవ-
తాంతరములు కలవననేలా
భ్రాంతి బొంది యీ భావము భావించి-
అంతనే పుణ్యులవుట తప్పదుగాన

యెవ్వరి గొలిచిననేమి కొరత మరి
యెవ్వరి దలచిన నేమి
అవ్వలివ్వల శ్రీహరిరూపుగానివా-
రెవ్వరు లేరని యెరుకదోచిన జాలు

అతిచంచలంబైన ఆతుమ గలిగించు-
కతమున బహుచిత్తగతులై
యితరుల గొలిచిన యెడయక యనాథ-
పతితిరువేంకటపతి చేకొనుగాక

ఈ విశ్వం విష్ణువు సృష్టి. ఆయన నాభి కమలము నుండి ఆవిర్భవించినది. కనుక విశ్వములోని వారంతా వైష్ణవులే. వైష్ణవులు కానివారు ఇచట ఎవ్వరూ లేరు.

1. సర్వం విష్ణుమయం జగత్ అంటాం. మరి ఈ జగత్తు అంతా విష్ణుమయం ఐతే ఈ దేవతాంతరములు (ఇంత మంది దేవతలూ వారి మధ్య వ్యత్యాసములూ) ఉన్నాయనడం ఎలాకుదురుతుంది? ఈ బేధం భావించడం భ్రాంతి. దాని నుండి తేరుకోవడం పుణ్యులు చేసే పని.

2. అందరూ విష్ణుస్వరూపాలే అని తేలినది కదా. ఇక ఎవరిని కొలిచితేనేమి? ఎవరిని తలచితేనేమి? ఏమీ కొరత లేదు. కానీ ఒక విషయం జాగ్రత్తగా గుర్తించాలి. సదా మనసులో ఎక్కడా (అవ్వల నివ్వల) హరిస్వరూపులు కానివారెవ్వరూ లేరనే ఎరుక కలిగియుండాలి.

3. ఈ చిత్తం బహు చంచలమైనది. సకలమూ విష్ణుస్వరూపమే అనే ఎరుకనుంచి మాటిమాటికీ పక్కకు లాగేస్తూంటుంది. అయినా విడువకుండా (యెడయక) ఇతరులను ఆ దృష్టితోనే కొలవాలి. అప్పుడు ఆ అనాథరక్షకుడైన హరి నిన్ను తప్పకుండా చేకొంటాడు (చేకొను గాక)

112. శరణు శరణు సురేంద్ర సన్నుత !

శరణు శరణు సురేంద్ర సన్నుత ! శరణు శ్రీసతి వల్లభా!
శరణు రాక్షస గర్వసంహర! శరణు వేంకటనాయకా!

కమలధరుడును కమలమిత్రుడు కమలశత్రుడు పుత్రుడు
క్రమముతో మీ కొలువు కిప్పుడు కాచినా రెచ్చరికయా ॥శరణు శరణు॥

అనిమిషేంద్రులు మునులు దిక్పతు లమర కిన్నెర సిద్ధులు
ఘనతతో రంభాది కాంతలు కాచినా రెచ్చరికయా ॥శరణు శరణు॥

ఎన్నగల ప్రహ్లాద ముఖ్యులు నిన్ను కొలువగ వచ్చిరీ
విన్నపము వినవయ్య తిరుపతి వేంకటాచలనాయకా ॥శరణు శరణు॥

రాజాస్థానాలలో వైతాళికులూ, వందిమాగధులూ ఇత్యాది ఉద్యోగులుండేవారు.

నిద్రలేపేవారిని వైతాళికులు/ప్రబోధకులు అంటారు.

నిద్ర లేవగానే అభివాదం, వందనం చేసేవానిని వంది అంటారు.

వంశస్తోత్రం చేసేవారిని మాగధులు అంటారు.

ఈ ఉద్యోగాలన్నీ జమిలిగా నిర్వహిస్తున్నాడీ కీర్తనలో అన్నమయ్య.

స్వామిని స్తోత్రంతో నిద్ర లేపడం. ఎవరెవరు దర్శనానికి వేచియున్నారో నివేదించడమూ జరుగుతున్నది.

ఓ సురేంద్ర సన్నుతా! ఓ శ్రీసతి వల్లభా! శరణు. ఓ రాక్షస గర్వసంహారా! ఓ వేంకటనాయకా! శరణు.

1. కమలధరుడూ, కమలములకు మిత్రుడూ అయిన సూర్యుడు (ఏకపద్మధరుడు సూర్యుడు), కమలాలకు శత్రువైన చంద్రుడూ, మీ పుత్రుడైన

బ్రహ్మ గారూ వరుసలో (క్రమముతో) మీ కొలువులో కాచుకుని యున్నారు. హెచ్చరిక స్వామీ! (హెచ్చరిక = సూచన, జాగ్రత్త, సావధానము)

ఈ క్రమమునకు అర్థమేమి?. మొదట సూర్యుడు ఉదయించడానికి అనుజ్ఞ తీసుకోవాలి. వెనువెంట చంద్రుడు విధినుండి శలవు తీసుకోవడానికి అనుజ్ఞ సంపాదించాలి. క్రొత్త దివసంలో సృష్టి క్రమము బ్రహ్మ నివేదించి అనుజ్ఞ వేడాలి. అప్పుడు లోకాలలో నూతన సుప్రభాతం మొదలౌతుంది.

2. అనిమిషులు అంటే దేవతలు. వారిలో శ్రేష్ఠులు (ఇంద్ర శబ్దం ఇక్కడ శ్రేష్ఠవాచకము) అనిమిషేంద్రులు. దేవతాశ్రేష్ఠులకూ, మునులకూ తొలి దర్శనం. తరువాత దిక్పాలకులకు అనుజ్ఞ.

తరువాత మిగిలిన దేవతలు (అమరులు), కిన్నెరులు, సిద్ధులు మొదలైన వారికి దర్శనం.

తరువాత రంభాదులకు ప్రవేశం.

ఇదీ ప్రోటోకాల్.

3. తరువాత మిమ్ములను మీ తత్త్వమును గ్రహించి వెల్లడించగల (ఎన్నగల) ప్రహ్లాదుడు మొదలగు భక్తులు వేచియున్నారు. వారి వారి విన్నపములు వినవలసియున్నది. హెచ్చరిక స్వామీ!

స్వామిని నిద్రనుండి లేపడమూ, అధికారిక విధులు నిర్వర్తింపజేయడమూ కూడా పైన వేసుకుంటాడీ భక్తుడైన అన్నమయ్య.

చక్కని కీర్తన.

113. షోడశ కళానిధికి షోడశోపచారములు

షోడశ కళానిధికి షోడశోపచారములు
జాడతోడ నిచ్చలిను సమర్పయామి

అలరు విశ్వాత్మకునకు ఆవాహనమిదే సర్వ
నిలయునకు ఆసనము నెమ్మినిదే
అలగంగాజనకునకుఅర్ఘ్యపాద్యాచమనాలు
జలధిశాయికిని మజ్జనమిదే ॥షోడశ॥

వరపీతాంబరునకు వస్త్రాలంకారమిదే
సరి శ్రీమంతునకు భూషణములివే
ధరణీధరునకు గంధపుష్ప ధూపములు
తిరమిదే కోటి సూర్యతేజునకు దీపము ॥షోడశ॥

అమృత మథనునకు అదివో నైవేద్యము
గమి చంద్రనేత్రునకు కప్పురవిడెము
అమరిన శ్రీవేంకటాద్రి మీది దేవునకు
తమితో ప్రదక్షిణాలు దండములు ఇవిగో ॥షోడశ॥

పరమాత్మ సంపూర్ణుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడు. ఆతడే మనకు ప్రకృతిలోని వనరులు సమకూర్చినవాడు. నిజానికి ఆతడిచ్చిన విభూతి తప్ప మనవద్దనేమున్నది. అతడిచ్చినదే ఆతనికి భక్తితో సమర్పించడం తప్ప పూజలో చేయగలిగినదేమున్నది?

మన పూజలో భగవంతునికి షోడశోపచారములు (16 ఉపచారములు) చేసే పద్ధతి ఉన్నది. ఆ పూజ మనందరి తరపున స్వామికి చేస్తున్నాడు అన్నమయ్య ఈ కీర్తనలో.

పదహారు కళలు కలిగిన సంపూర్ణుడైన భగవంతునికి (షోడశ కళానిధికి) పదహారు ఉపచారముల పూజ నిత్యము గుర్తెరిగి (జాడతోడ) సమర్పించు చుంటిని.

1. విశ్వమంతా నిండియున్న వానిని (విశ్వాత్మకుడు) ఒకచోటికి "ఆవాహన" చేయుచున్నాను

2. అన్నిటా నిండిన (సర్వనిలయుడు) వానికి ప్రేమతో (నెమ్మి = ప్రేమ) "ఆసనము" వేయుచున్నాను.

3,4,5 : పవిత్రమైన గంగ – పాదములందు జన్మించిన వానికి "అర్ఘ్యము", "పాద్యము", "ఆచమనము" సమర్పించుచున్నాను.

6. సముద్రము నందు పవ్వళించు వానికి (జలధిశాయికి) "మజ్జనము" అనగా స్నానము చేయించుచున్నాను.

7. శ్రేష్ఠమైన పసుపు పచ్చని పట్టువస్త్రము ధరించు వానికి (వర పీతాంబరునికి) కట్టుకొను వస్త్రము సమర్పించుచున్నాను.

8. లక్ష్మీసహితుడగు వానికి (శ్రీమంతునకు) ఆభరణములు సమర్పించు చున్నాను.

9, 10, 11 : భూదేవిని ధరించిన వానికి (ధరణీధరుడు) "గంధము" "పుష్పము" "ధూపము"లు సమర్పించుచుంటిని. దీనిని వివరింతును. గంధము గంధపు చెట్లనుండి, పుష్పములు పూల మొక్కలనుండి, ధూపము వేయుటకు వాడు ద్రవ్యములు – ఇవన్నీ భూమినుండి ఉత్పత్తియైనవే. ఆ భూమినే ధరించిన వానికి ఇవి ఇచ్చుచున్నానని భావము.

12. కోటి సూర్యుల తేజము కలవానికి నిలకడ (తిరము) గా దీపము సమర్పించుచున్నాను.

13. జలధి మథించి అమృతమును ఉత్పాదనము చేయగలవానికి ఇదిగో "నైవేద్యము" సమర్పించుచున్నాను.

14. సూర్యుడు చంద్రుడు కనులైన వానికి (గమి చంద్రనేత్రుడు, గమి = సమూహము. ఈ గమిశబ్దము ఇచట అంత పొసగుట లేదు. అందుచే రవిచంద్ర నేత్రునకు అని వేరు పాఠముతో కొందరు పాడుచున్నారు. కానీ అపుడు ప్రాస భంగమగుచున్నది) కర్పూర తాంబూలము నిచ్చుచున్నాను. దీనికి కూడా వివరణ అవసరము. చంద్రకాంతి (వెన్నెల)కి ఓషధీవృక్షములు వృద్ధిచెందును. కనుక చంద్రుడు ఔషధములకు మూలము. తాంబూలము నందలి దినుసులు (ఆకు, వక్క, సున్నము, కర్పూరము మొదలగు సుగంధ ద్రవ్యములు) ఓషధులే. అందుచేత వేనివలన ఔషధములు లభించుచున్నవో ఆ చంద్రనేత్రునికి తాంబూలము సమర్పించుచున్నానని భావము.

15, 16 : ఈ వేంకటాద్రి పై వెలసిన (అమరిన) శ్రీవేంకటేశ్వరునకు ఆపేక్షతో (తమి = ఆపేక్ష, కుతూహలము) "ప్రదక్షిణ" "నమస్కారములు" సమర్పించుచున్నాను.

ఆఖరుకు తేలినదేమి? మనను, ప్రకృతిని, జగత్తును సృజించినవానికి మనము కృతజ్ఞులమై యుండవలెను. అంతే కాని వానికి కానుక లిచ్చుటకు మన వద్ద "నాది" యనునదేమియునూ లేదు. వాడిచ్చినవే వానికి సమర్పణచేయుట మనము వాని పట్ల వినయము, కృతజ్ఞత చూపుట మాత్రమే యని గ్రహించవలెను. ఈ శరణాగతి పూజ వ్యాజమున ఈ కీర్తనలో అన్నమయ్య ప్రతిపాదించినాడు.

114. సందెకాడ పుట్టినట్టి సాయల పంట

సందెకాడ పుట్టినట్టి సాయల పంట యెంత
చందమాయె చూడరమ్మ చందమామపంట

మునప పాలవెల్లి మొలచి పండిన పంట
నినుపై దేవతలకు నిత్యపంట
గొనకొని హరి కన్ను కొనచూపుల పంట
వినువీధి నెగడిన వెన్నెలల పంట ॥సందెకాడ॥

వలరాజు పంపున వలపు విత్తిన పంట
చలువై పున్నమనాటి జాజర పంట
కలిమికామిని తోడి కారు కమ్మిన పంట
మలయుచు తమలోని మగ్రిమాని పంట ॥సందెకాడ॥

విరహుల గుండెలకు వెక్కసమైన పంట
పరగ చుక్కలరాశి భాగ్యము పంట
అరుదై తూరుపుకొండ ఆరగ పండిన పంట
ఇరవై శ్రీవేంకటేశు యింటిలోని పంట ॥సందెకాడ॥

ఈ కీర్తనలో అన్నమయ్య చందమామను వర్ణిస్తున్నాడు. కేవలం ప్రకృతి వర్ణనలు చేసే అలవాటీయనకు లేదు. తన కవిత్వమంతా వేంకటేశునికీ, అలమేలుమంగకీ కుదువ పెట్టిన ఘనుడు అన్నమయ్య. మరి చందమామను వర్ణించడమేమిటి? చంద్రుడు అమ్మవారికి సోదరుడు. మేనమామ వరుస. పైగా ఈ చందమామ వేంకటేశునికి నేత్రము. అందుచేత వర్ణిస్తున్నాడు.

చందమామలో అమృతం పండుతుంది. అది దేవలకు ఆహారం. ఇక కీర్తన లోనికి....

ఈ చందమామ పంట సాయంసంధ్యా కాలంలో (సందెకాడ) పుట్టిన అనేక ఛాయలు – shades లేదా – కళలు – (సాయల =చాయల) కలిగిన పంట.

1. పూర్వం (మునుపు) పాలసముద్రములో మొలిచి పండిన పంట ఇది (చంద్రుడు పాల సముద్రంలో పుట్టాడు క్షీరసాగర మథనంలో – దానిని ఇలా చమత్కారంగా చెప్పడం)

   దేవతలకు ఇది నిండైన/ సమృద్ధియైన (నినుపై) నిత్యపంట. మామూలు పంటలు పండడానికి కొంతసమయం పడుతుంది. కానీ ఈ చందమామ పంట నిత్యపంట. నిత్యపంట అనడంలో శ్లేష. ప్రతిరోజూ అని ఒక అర్థము. తప్పకుండా పండే పంట అని ఒక అర్థము.

   ఈ పంట అతిశయించి (గొనకొని) హరి కొనచూపులలో పండుతుంది. చక్కని మాట. వేంకటేశునికి సూర్యుడొక కన్ను, చంద్రుడొక కన్నూ. అందుచేత ఆయన కొనచూపులో సమృద్ధిగా పండేదీ చందమామ పంట. అనగా స్వామి కొనచూపులలో అమృతం పండుతుందని చెప్పక చెప్పడమన్నమాట.

   ఇది ఆకాశమున (వినువీధి) వర్ధిల్లిన పంట (నెగడు = వర్ధిల్లు).

2. మన్మథుడు (వలరాజు) చందమామను వలపుల విత్తనములు (ప్రజల మనసులలో) జల్లమని పంపినాడట. అందుచే ఈ పంట పండిన వెంటనే వలపు విత్తనాలు జల్లినది.

   ఇది పున్నమనాడు చలువదనము వెదజల్లు జాజరపంట. జాజర శబ్దానికి కొంచెం నెగటివ్ అర్థం ఉంది. ఇది విరహులను బాధ పెడుతుంది కదా. వేధించే లక్షణాన్ని జాజర అని సంకేతించాడు.

   లక్ష్మీదేవి (కలిమి కామిని) తో ఈ చందమామ పంట జతగూడి వ్యాపించినది (కారుకమ్ము = వ్యాపించు). లక్ష్మి, చంద్రుడూ పాలవెల్లిలో

కలిసి పుట్టినారు. వీరు ప్రపంచమంతా వ్యాపించినారు. ఒకరు ధనం, ఒకరు వెలుగు.

ఈ చందమామ రాత్రి (తమ = రాత్రి, చీకటి) కాలమున తిరుగుతుంది. ఇక్కడ ఒకటి రెండు విషయాలు చెప్పుకోవాలి.

మఱ్ఱిమాని పంట : మఱ్ఱి చెట్టు ఎంతో పెద్దది. దాని పండు చాలా చిన్నది. దీనిని రెండు రకాలుగా అన్వయం చేస్తారు. అంత పెద్ద చెట్టుకు చిన్న పండు కాబట్టి చాలా తక్కువ పంట అనే అర్థంలో వాడతారు. ఎంత పెద్ద చెట్టైతే అన్ని ఫలాలనిస్తుంది. కనుక సమృద్ధి యైన పంట అనే అర్థంలో కూడా వాడతారు. పెద్ద తమస్సుకు చిన్నపండు చంద్రుడు. లేదా ఇంత పెద్ద తమస్సుకు వెలుగునిచ్చే పెద్ద వెన్నెల పంట చంద్రుడు. ఎలా అయినా చెప్పుకోవచ్చు.

ఇంకొక విషయం "తమలోని మఱ్ఱిమాని పంట" ఈ పదబంధం విచిత్రమైనది. దీనితో స్ఫురింపజేసే దేమిటంటే – చంద్రుడు మనస్సుకు సంకేతం. తమలోని అనగా మానవులలోపల మనసు (చందమామ) అనే మఱ్ఱిమాని పంట వంటివాడు అనడం.

3. ఈ చందమామ విరహుల గుండెలకు భరించరానిది.

చుక్కలకు భాగ్యము.

తూర్పు కొండకు నిండుగా (ఆరగ) అమరునది (ఆర పదము కన్నార, కడుపార ఇలా ఉపయోగిస్తాము. తూర్పు కొండార పండినది)

ఇది శ్రీవేంకటేశ్వరుని ఇంటిపంట. వేంకటేశుడు పాల సముద్రములో శయనిస్తాడు. ఆయింటి బిడ్డ చంద్రుడు. ఆకాశము మాత్రము స్వామివారిది కాదాయేమి?

అందమైన కీర్తన.

115. సిగ్గరి పెండిలి కూతుర సీతమ్మ

సిగ్గరి పెండిలి కూతుర సీతమ్మ
దగ్గరి సింగారబొమ్మ తలవంచకమ్మ

అల్లనాడే రాఘవుడు హరువిల్లు విరిచెను
ఎల్లినేడే పెండ్లాడే నదివో నిన్ను
యెల్లగా జనకుడు నిన్నిచ్చీనట వీడె
వెల్లివిరి నీమాట నమ్మవమ్మ ॥సిగ్గరి॥

అదె పెండ్లి తెరయెత్తీ రండనె వశిష్టుడుండి
చదివీ మంత్రాలు సేస చల్లవమ్మా
మొదల రామునికంటే ముంచి తలంబ్రాలు పోసి
సుదతి ఆతని మోము చూడవమ్మ ॥సిగ్గరి॥

కంకణదారాలు కట్టి కాలు దొక్కితివి మీరు
పొంకాన బువ్వమందరో పొత్తుల నమ్మ
ఉంకువ వావిలిపాట నుండి శ్రీవేంకటగిరి
తెంకుల నిన్నుగూడి తిరమాయెనమ్మ ॥సిగ్గరి॥

అన్నమయ్యకు అమ్మవారంటే ఎనలేని ప్రీతి.

వావిలిపాడు (వాయల్పాడు, చిత్తూరుజిల్లా) గ్రామంలో సీతాకల్యాణం జరుగుతున్నప్పుడు అన్నమయ్య చెప్పిన కీర్తనిది.

సిగ్గుల మొగ్గైన పెండ్లికూతురా సీతమ్మా! పెండ్లికుమారుని సమీపించి (దగ్గరి) మరీ అలా తలవంచేసుకోకమ్మా!

1. అంత సిగ్గైతే యెలా తల్లీ! రాముడు విల్లు విరిచి చాలా రోజులైంది (అల్లనాడె విల్లు విరిచీ) ఈవాళ రేపు (అనతికాలంలో) నిన్ను జనకుడు

సమస్త లాంఛనములతో (ఎల్ల = సర్వము) రామునికి యిచ్చి పెళ్ళిచేస్తాడు. ఈమాట వ్యాపించింది (వెల్లవిరి = వ్యాపించు). నమ్ము.

ఎల్లి = రేపు. నేడు = ఈ రోజు. ఎల్లినేడు ఇలా ఈవాళరేపు అని వాడడం లోకంలో ఉంది. ఆ పదబంధానికి తొందరలో అని అర్థం.

2. అదిగో అటుచూడు. వశిష్టులవారు పెళ్ళి వేడుకలకు తెరతీశారు. రమ్మని మంత్రాలు చదువుతున్నారు. పద. అక్షింతలతో పూజ మొదలుపెట్టు (సేస చల్లవమ్మ). సిగ్గుపడకింక. రాముని కన్నా ముందే ముంచి తీసి తలంబ్రాలు పొయ్యి. పోసి ఓ సుదతీ! అతనివైపు చూడు.

మన తెలుగు పెళ్ళిళ్ళలో ఇదొక వేడుక. పెళ్ళికూతురి తరుపు వారూ పెండ్లికొడుకు తరుపువారూ దగ్గరచేరి హెచ్చరికలు చేస్తూ వధూవరుల చేత తలంబ్రాలు పోయిస్తారు.

ఇక్కడ సీతమ్మను సుదతీ అని సంబోధించాడు. ఇది సాభిప్రాయమైనది. సుదతి అంటే మంచి పలువరుస గలిగినది అని. తలంబ్రాలు పోసి అతనివైపు నీ అందమైన పలువరుస కనబడేలా నవ్వుతూ చూడమనడమన్న మాట.

3. పెళ్ళితోరాలు (కంకణ దారాలు) కట్టుకున్నారు. కాలు తొక్కడమైంది. ఇదికూడా పెళ్ళి వేడుకే. వధూవరులచే కాలు తొక్కించడం. ఇంక సంరంభంగా (పొంకాన) భోజనాలు చేయండి. బువ్వము అంటే వధూవరుల బంధువులు వెటకారాలాడు కుంటూ చేసే పంక్తిభోజనము. ఇప్పుడంటే బుఫేలు వచ్చాయి కానీ, మొన్నమొన్నటి వరకూ ఈ బువ్వపుబంతులు ఉండేవి. ఇదికూడా ఒక వివాహపు వేడుకే. ఆ బువ్వము మరీ సరసం యెక్కువై విరసం లోకి దిగకుండా స్నేహపూర్వకంగా (పొత్తుల తోడ) నిర్వహించాలంటున్నాడు. ఇదివరలో పెళ్ళిళ్ళలో అసలు తగువులు ఈ భోజనాల్లోనే వచ్చేవి!

ముక్తాయింపులో వేంకటాద్రి ముద్ర. నిన్నిక్కడ వావిలిపాడు అనే స్థలంలో (ఉంకువ = స్థానము) పెళ్ళాడి శ్రీవేంకటాద్రి మీద నీతో స్థిరపడ్డాడమ్మా ఆయన!

అమ్మవారి తరపున వకాల్తా పుచ్చుకుని పెళ్ళి ముందు నుంచీ ఆవిడతో ఉండి పెళ్ళి వేడుకలు యధావిధి జరిపించి, వధూవరులను వావిలిపాడు నుంచి తిరువేంకటాద్రికి తీసుకవచ్చి కాపురం పెట్టించాడు అన్నమయ్య!

116. క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని

క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయమునకు నీరాజనం

జలజాక్షి మోమునకు జక్కవ కుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
నిలువు మాణిక్యముల నీరాజనం ॥క్షీరాబ్ధి॥

చరణకిసలయములకు సకియరంభోరులకు
నిరతమగు ముత్తేల నీరాజనం
అరిది జఘనంబునకు అతివ నిజనాభికిని
నిరతి నానా వర్ణ నీరాజనం ॥క్షీరాబ్ధి॥

పగటు శ్రీవేంకటేశు పట్టపురాణియై
నెగడు సతి కళలకును నీరాజనం
జగతి నలమేలుమంగ చక్కదనములకెల్ల
నిగుడు నిజ శోభనపు నీరాజనం ॥క్షీరాబ్ధి॥

ఈ హారతిపాట తెలుగునాట బహు ప్రాచుర్యము పొందినది. హారతి సమయమున పెండ్లిండ్లలోనూ, దేవాలయముల లోనూ సన్నాయిమేళము వారు దీనిని వాయించుట ఆచారముగా రూపు దిద్దుకొనుచున్నది.

ఇది అలమేల్మంగకు అర్పించే నీరాజనము.

పాలసముద్రమున పుట్టిన పడతికి (క్షీరాబ్ధి కన్యకకు) ఆ శ్రీమహాలక్ష్మికి హారతి (నీరాజనం). పద్మము ఆలయముగా గల (నీరజాలయము) మహాలక్ష్మికి హారతి.

1. ఆమె పద్మము వంటి కన్నులు గల మోమునకు (జలజాక్షి మోమునకు), జక్కవ పిట్టల వంటి కుచములకు అమరిన కర్పూర హారతి యిది.

ఆ నల్లని తుమ్మెదలబారు వంటి జడ కలిగిన (అలివేణి) ఆమె తురుమునకూ, కర కమలములకూ నిలువునా మాణిక్య హారతి.

2. ఆమె చిగుళ్ళవంటి పాదములకూ (చరణ కిసలయములకు), ఆ సతి అరటిబోదెల వంటి ఊరువులకూ (రంభోరులు) ఆసక్తితో/ ఎల్లపుడూ(నిరతము) ముత్యాల హారతి.

అపురూపమైన (అరిది) ఆమె పిరుదులకు (జఘనంబునకు), ఆమె నాభిభాగమునకూ భక్తితో (నిరతి) నానా వర్ణముల హారతి.

3. లావణ్యాతిశయముతో (పగటు) శ్రీవేంకటేశ్వరుని పట్టపు రాణియై విరాజిల్లు ఆమె కళాస్వరూపమునకు హారతి. జగతిలో ఎన్నికగన్న అలమేల్మంగ చక్కదనములకు నిలువునా శోభలనొసగు హారతి.



ప్రతులకు
డా. డి.యస్. గణపతిరావు
వైట్ల వేంటేజ్, ఫ్లాట్ నెం. 202
పెదవాల్తేరు జంక్షన్
విజయనగర పేలస్ లే అవుట్
విశాఖపట్నం - 530 017.
ఫోన్ : 0891-2539917
9849129917

డా. డి.యస్. గణపతిరావు

జననీ జనకులు:
దేవగుప్తాపు సూర్యవిజయలక్ష్మి
కూటంరాజు గార్లు

జననము :
14-07-1961

స్వగ్రామము :
కాట్రావులపల్లి, తూర్పుగోదావరి జిల్లా

విద్య :
MBBS కాకినాడ రంగరాయ వైద్యకళాశాల
M.D. (Radiology) PGI, చండీఘర్

ఉద్యోగము :
కన్సల్టెంట్ రేడియాలజిస్ట్,
విజయ మెడికల్ సెంటర్, విశాఖపట్నం.

ఇతర గ్రంథములు :

త్రివేణి
అలమేల్మంగ, శివ, శారదాంబ శతకములు.

దివ్యలోచన శతకములు
రవి, చందమామ శతకములు

మకుటం లేని మహారాజులు
అద్దిరభన్న శతకము, మకుటంలేని మహారాజులు

చిరుజల్లు
ఖండకావ్యం.

పద్మవ్యూహం
దశావతార బంధ ప్రబంధము

పాండురంగ మాహాత్మ్యం (రసజ్ఞవ్యాఖ్య)
తెనాలి రామకృష్ణకవి ప్రణీతము